భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

నవంబరు 1979

సంపుటము : 56 సంచిక : 11

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

నవంబరు 1979

దీపావళి

ఇంద్ర ధనువు ముక్కముక్కలై
    ఇరులలో కలిసిపోతున్నాది;
శతకోటి ఉల్కాపాతాల
చంక్రమణం సంచలనం
ఆకాశం మూలమూలలా
అలముకొంటున్నాది !

నైకార్తవ నవశోభా
నీకోజ్వల సుమ నిచయం
నిశా కబరీ భరంలో
నిగనిగలాడి భగభగమండి
చీకటి పొగల తెరలచాటున
మూకగా చేరింది
ముక్కలైపోయింది
భువికి జలజలా రాలింది !

మెరుపులూ చుక్కలూ
వింగలూ వెన్నెలలూ
పరుగెడుతూ చీకటో
సరసాలాడు కుంటున్నాయి !

అన్ని ప్రాంగణాలలోనూ
అలంకృతాలైన దివ్వెలు
అమావాస్య చీకట్లకి
ఆరతులందిస్తున్నాయి !

వైహాయశ మహాసౌధం
వైశ్వానర శిఖాజ్వాలల
బడి భస్మం ఔనప్పుడు
వెడలుచున్న వేమోయస్
వినిపించుచు నున్న వెన్నో
వింత వింత శబ్దంబులు

*   *   *

వెలుగులూ చీకట్లూ
చెలగాటాలాడుతున్నాయా ?
కాదు ... కాదు ...
ఆనందాశ్రువులకీ
వ్యధాక్షుధా బాష్పాలకీ;
నిజం నీతి నియమాలకీ
నిరంకుశ దురంతాలకీ;
మంచికీ చెడ్డకీ;
మానవతకీ దానవతకీ;
మధ్యసాగుతూన్న
మహా సంగ్రామం ఇది !

రావణాసురుడి కాష్టంలా
రాజుకుంటూనే ఉంటుంది !

పురవీధి

శత సహస్ర కోటి శబ్దనిర్ఘాతముల్
  యంత్రధూత కాలికాంబుదములు
ప్రళయ పూర్వ చిహ్నభంగురముల్ పట్ట
ణములు కలిమి కలికి నాగరములు !

శరవేగంబున కారులున్ శకటముల్
    సైకిళ్లు సాగన్ నిరం
తర భాం బాం టకుటిక్ కణక్వణన
    శబ్దంబుల్ బజారంత దు
ర్భర రీతిన్ శ్రవణమ్ములం దుపల
    సంపాతమ్ములై సోకగా
పురవాసుల్ చరియించు చుందురు
    లవంబున్ వాని బాటింపకే !

సిగలందు దురిమిన చిన్నారి పువ్వుల
　　బంతులు క్రొంగ్రొత్త వన్నెలీన
అప్రయత్నంబుగా ఆనన సీమల
　　దరహాస రేఖలు విరియబార
బిగియించి కట్టిన పొగరు టురమ్ము వం
　　పులు పైటలందు దోబూచులాడ
చెలువంపు వలిపంపు చీరల చాటున
　　తొడలయందములు దుందుడుకుచూప
తనువులం దలందిన సుగంధములు చుట్టు
ప్రక్కలన్ గ్రమ్ముకొన నాగరప్రపంచ
నవ్య చిహ్నముల్ కామినుల్ నగరవీధు
లందు దిరుగుచు నున్నా రమంద గతుల!

బరువగునట్టి వక్షమున
　　బల్చని పయ్యెదజార, కన్నులన్
సురుచిర కాంతులూర, మృదుశోభలు
　　చెక్కుల జేరగా బర
స్పరముగ నెక్కసక్కెముల బల్కుచు,
　　బంగరు మువ్వ మ్రోతలన్
మరువగజేయ నవ్వెదరు
　　మాటికి మాటికి పౌర భామినుల్!

నవ్వులాడుకొనెడి నవలా మనోహర
హావభావ విధము లబ్బురముగ
దిరిగి తిరిగి చూచు పురుషులపై ద్రపా
పొంగ దృష్టి పరచు నంగనాళి!

వారు నవ్వులందు బరియాచకములందు
మునిగి పరిసరముల గనరు, వినరు;
చింతలేని వారి చెవులకు సోకవు
కరము చాచు బిచ్చకత్తె మొరలు!

కనులు చూడలేవు క్రమ్మెడి యంత్రాల
యాల పొగల, పథములందు రేగు
ధూళిఁ; జెవులు వినగ జాలవు శకట యం
త్ర ప్రభూత వివిధ రావములను!

రత్నగర్భయైన వసుంధరా సవిత్రి
ప్రకృతి నియమమ్ములకుఁ గట్టువడియె యుండు;
ప్రాణములు వోయలేని విజ్ఞానశాల
లందు నిర్మించెదరు మారణాయుధములు!

అచట కమనీయ రుచిర మృష్టాన్నశాల
లిచ్చట క్షుధార్తులై యేడ్చు బిచ్చగాండ్రు;

తనువునకు ప్రాముకొన్న అత్తరవులచట
కాలువలనుండి వీచు దుర్గంధ మిచట;

హాయి శకటాల దిరుగు వారచట, నెత్తి
బరువుగల గంపలన్ మోయువారలిచట;

విద్యుదుజ్జ్వల దీపికా వితతి యచట
ఘోర నీరంధ్ర నిబిడాంధకారమిచట;

అచట శరదిందు చంద్రికా హాసరేఖ
ప్రావృషాంబర విగత బాష్పంబు లిచట;

నగర వీధులయందు ద్వంద్వముగ నతిశ
యించుఁ బూర్ణిమామావాస్య లేకమగుచు!

శ్రీ పఝ్ఝల కాళిదాసు



కానుక

శ్రీ దుగ్గిశెట్టి వేంకట రమణయ్య

వియద్గంగా తరంగాల్లో
 రసాస్వాదన పారవశ్యంలో
విచ్చల విడిగా విహాయసంలో
విహరించే మబ్బుకామిరె

విభ్రమ విలాసాలు
నటనా విన్యాసాలు
నేత్రాంచల విద్యుల్లతలు
కరాంగుళీ కిమ్మీరప్రభలు
వికసన హాసన్ముఖద్యుతులు
చెఱగని ముద్రలు

మబ్బు కొమిరె
గన్దవహ ప్రణయ ప్రసార సంచలనార్ద్ర.

ఆమె
స్వరూప మధురిమ
తువ్వర తువ్వరయ్యె
చినుకు చినుకులై
జడియై పెన్జడియై

జాల్వారె
వియోగ జ్వాలాక్షుభితాంబరం
ఉరిమి నిప్పులనుమిసె
గంధవహుడు ప్రభంజనుడాయె.

ప్రళయాభీల పతన ద్రుతమైన
మబ్బుకొమిరె ఉరవడి
భయోత్పాతము – రసతరంగితము.

మబ్బు కొమిరె కౌగింటిలో
పంటవలంతి రసస్ఫురితమై
పులకరించె
సస్యశ్యామలమై విరిసె
పద్మాక్షుల విప్పి నగవుల వెదజల్లె
అనురాగవల్లరి కెంగేలుచాపి
పరిమళ భరిత ప్రసవమును
వచ్చిన నెచ్చెలి, కర్పించె.

ఆ పూవుపై ఆనందాశ్రువొకటి
మౌక్తికమై మెరిసె.

అల

శ్రీ నందిని సిధారెడ్డి

ఎంత సిగ్గులేనిది !
 ఆడుకుని, వాడుకుని
నేలకి కసిరికొట్టినా ఈ కాయితం –
మళ్లా గాలి పిలవగానే
గాల్లో లేచిపోతుంది

ఊహల్లో ఎగిరే మనసూ
అంతే !
ఎంత
సి
గ్గు
లేనిది ? ? ?

గో సత్యాగ్రహం

శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్

గోవు సత్యాగ్రహం చేస్తున్నది
  తనకు పడేస్తున్న ఎండిపోయిన క్రుళ్ళిపోయిన
గడ్డికి వ్యతిరేకంగా కాదు —
పచ్చని మెత్తని పచ్చిక కోసం కాదు —
జనుప కట్టల కోసం అసలే కాదు —
చివరి బొట్టువరకు పాలు పితికి
రక్తపు బొట్టును పిండటానికి
ప్రయత్నిస్తున్న పాలికాపును తన్నినందుకు
వాడు వేసిన బడితె బాదులకు!
వ్యతిరేకంగా కాదు —
ఇరువది నాల్గు గంటలు తనను
ఇనుప సంకెళ్ళతో బంధిస్తున్నందుకు
నిరసనగా కానే కాదు —

గోవు సత్యాగ్రహం చేస్తున్నది !
కానీ —
దూడకు పాలివ్వటం మానలేదు
ఆసామికి ప్రతిపూటా పాలివ్వటమూ మానలేదు —
పచ్చగడ్డి తినకుండా
కుడితె నీళ్ళు త్రాగకుండా
గోవు సత్యాగ్రహం చేస్తున్నది !
సత్యాగ్రహం ప్రక్రియను పరమార్థాన్ని
ప్రజలకు తెలియజేస్తున్నది !

గోవు సత్యాగ్రహం చేస్తున్నది
నరమేధం ఆపాలని -
మానవునికి మానవుని ప్రాణం తీసే
హక్కు లేదు — అని
గోవు సత్యాగ్రహం చేస్తున్నది ! !

పొడుచు కొచ్చేవి...

ఖద్రమొద్దీన్

కళ్ళను కలల్లోకి ఈడ్చుకెళ్ళే
  కారు చీకట్లు కావు -
ఎక్కుపెట్టిన నా కలంలోంచి
పొడుచు కొచ్చేవి
కలల చీకట్లో
కలవర పడుతున్న కళ్ళను
వాస్తవానికి చేరపిలిచే
పొద్దు పొడుపులు !

+ * +

నేను

శ్రీ జి. పురుషోత్తం

రాలిపోతున్న
  వెంట్రుకలను లెఖ్ఖపెట్టుకుంటూ
ఏడ్పు కొండలమీద
ఎక్కి కూర్చున్నాయి రాళ్ళు
వెలుగు నీడల మధ్యన
వేసియున్న ఒంటి త్రాటి వంతెనపై
కాలిపోతున్న
జీవిత కాలాన్ని గణించుకుంటూ నేను.

+ * +

మా వూరి పెద్దలు

శ్రీ కే. కిశోర్‌బాబు శ్రీ కే. అశోక్‌బాబు

మా వూరి పెద్దలు
లేపాక్షి బసవన్నలు !
అండదండన వసిస్తున్న దీనజనావళిపైన
కడగండ్ల వడగండ్లు కురుస్తున్నా
కదలరు మెదలరు
ఉలకరు పలకరు – అదే వారి గంభీరత !
వారు మహా మహులకే గాని
మామూలు వ్యక్తులకు రవంతగూడా అందని
గోమతేశ్వర మూర్తులు ! – అదే వారి త్రివిక్రమత !
తరాలు దొరలుతున్నా
తమ పదవులు అజంతా చిత్రాలవలె
చెక్కు చెదరనివని గర్వం – అదేవారి ప్రత్యేకత !
పలుకులు హంపీ కళలు
పనులు శిథిల శిల్పాలు–అదే వారి నైపుణ్యత !
ఆకలేసి అరచిన అమాయకపు మేకల
కసాయి కత్తులకు బలివ్వటం – అదే వారి చతురత!
గాండ్రించిన గండుపులుల అడుగుల
మడుగులొత్తి
ఏకశిలా రథాలమీద ఊరేగించటం
అదే వారి నడత !
అసలు - మా వూరే ఒక జీర్ణ దేవాలయం
అందు జేగంట మ్రోగించే నాధుడే కరువు
అరుదుగా ఎవడైనా మ్రోగించినా
మరునాడే వాడు భూమికి బరువు
అదే మా వూరి పెద్దల ఘనత !

1x0=0

సాంధ్యశ్రీ

ఇంద్ర సుఖంలో
జారిన కణం
ఈ జీవార్ధం
వలయంలో బంధించబడిన మరుక్షణం నుండి
అంతశ్చేతన
నమస్క్రియలో ...
ప్రాణం
ప్రాణం
కలిసి పోసిన మరో ప్రాణం
చేతులు జోడిస్తూ నిద్ర
కృతజ్ఞతా ముద్ర ...
సుఖం కోసం
అవ్యక్త బలీభూత జీవి
ఏమాశించి
ఈ వలయంలో కీడ్వబడిన ఈవి ... ?
ఇంద్రియాలను జయించిన
క్షణమొక ఇంద్రియమై
జీవితాన్ని
ఓడించిన చరిత్రలో
గెలుపు ఎవరికి...?

[అపనమ్మకంలోని నమ్మకాన్ని నమ్మిన బైరాగి కోసం.]


శ్రీ కేతవరపు వేంకట రామకోటిశాస్త్రి

కావ్యముయొక్క సాపేక్ష విలువ సిద్ధాంతం

కావ్యముయొక్క విలువను గురించిన సంగతి ఏమిటంటే అన్నింటి విలువల్లాగానే అది తయారుకావటానికి పట్టిన శ్రమకాలాన్ని చెప్పాలి. కావ్యం తయారుకావడంతో ముగిసిన శ్రమకాలం ఆ తరువాత కావ్యవస్తువుగా వుంటుంది. అంటే కావ్యము యొక్క స్వరూపంగానూ స్వభావంగానూ ఉంటుంది. కవియొక్క అనుభవజ్ఞానం భాషారూపాన కావ్యవస్తువుగా వ్యక్తమైందన్నమాట. వ్యక్తం కావటానికి కవి శ్రమచెయ్యాలి. కవిచేసే శ్రమంత తన అనుభవ జ్ఞానాభివ్యక్తికి భౌతికంగా తగిన భాషారూపాన్ని సిద్ధం చెయ్యటంగానే వుంటుంది. భాషారూపమనగానే భాష నాశ్రయించుకొని ఉన్న గుణాలంకార వ్యాకరణాలూ, రీతి వక్రోక్తులూ, ధ్వనీ—ఇవన్నీ వస్తాయి. ఈ అన్నింటిమయంగావున్న భాషతో సంబంధించిందిగా తన అనుభవ జ్ఞానాన్ని వాస్తవికమైన ఉనికిని సమకూర్చే కవి ప్రయత్నం వల్ల కావ్యవస్తువు సిద్ధమవుతున్నది. అందువల్ల కావ్యముయొక్క విలువను నిర్ణయించటానికి కవి తన అవసరం కొరకు భాషలో సమకూర్చిన గుణాలంకారాదులను పట్టుకోవలసి వచ్చింది. ఆవిధంగానే ఆలంకారికులు ఒకరి తరువాత ఒకరుగా వస్తూ కావ్యముయొక్క విలువ గుణమనీ, అలంకారమనీ, రీతి అనీ, వక్రోక్తి అనీ, ధ్వని అనీ పూర్వపక్ష సిద్ధాంతరూపంగా నిరూపణ చేసుకొంటూపొయ్యారు. అంటే కావ్యముయొక్క విలువను ఆయా ఆలంకారికులు అన్ని రకాలుగా విస్తరింపజేసినారని యర్థం. అంటే ఈ అలంకారికులువచ్చి కావ్యాలను చూచి వాని విలువలకు కారణం ఆయా కవులు గుణాన్ని సమకూర్చటానికి శ్రమించటమని ఒకరూ, అలంకారాలను కూర్చటానికి శ్రమించటమని ఒకరూ, రీతి కొరకు పాటుబడటమని ఒకరూ, వక్రోక్తికై పని చెయ్యటమని ఒకరూ, ధ్వని సంపాదనకై కృషిచేయటమని ఒకరూ ప్రతిపాదించారన్నమాట. వీళ్ళంతావచ్చి ఈ ప్రతిపాదనలు చెయ్యకముందుకూడా ఇవన్నీ కావ్య వస్తువును చేస్తున్న భాష నాశ్రయించుకొని ఉన్నవి. అంటే కవులు మొదటినుండీ ఈ శ్రమలు చేస్తూనే వున్నారు. అయితే అప్పుడు అన్నీ కలిసి కావ్యరచనా రూపమైన శ్రమగానే వుండేవి. ఈ ఆలంకారికులు వచ్చి వాటిని విడదీసి స్వతంత్రమైన పనితనాలుగా గుర్తించి, ఎవరు గుర్తించినది వారు ప్రధానమని భావించి అదే కావ్యాత్మ అనీ కావ్యజీవితమనీ సిద్ధాంతీకరించారు. అయితే కావ్యముయొక్క విలువ ఇప్పుడేది? గుణమా? అలంకారమా? రీతియా? వక్రోక్తియా? ధ్వనియా? ఏ ఒక్కదానితో మాత్రమేకాక ఈ అన్ని రూపాలతోనూ కావ్యముయెక్క విలువ వ్యక్తమవుతున్నది. అంటే అర్థం కావ్యముయొక్క విలువను గుణంగా ఒకరు, అలంకారంగా ఒకరు, రీతిగా ఒకరు, వక్రోక్తిగా ఒకరు, ధ్వనిగా ఒకరు గుర్తించటానికి ముందుకు రావటంచేత, ఆ విలువరూపం విస్తరించిందని. అందుకనే కావ్య వస్తువు విలువ అనేక రూపాలతో కన్పిస్తున్నది. ఇవన్నీ కావ్యవస్తువు విలువ రూపాలు గనుక, ఇవి తమలో తాము సమానమైన విలువలు కలిగివున్నాయా అంటే లేవు. లేవన్న విషయం పూర్వపక్ష సిద్ధాంత వాద ప్రతిపాదనవల్లనే తెలుస్తున్నది. అందువల్ల వీటి విలువలను కూడా నిర్ణయించాల్సిన అవసరమున్నది. దేన్నైనా వస్తువు కిందికి మారిస్తేనే కానీ విలువ కట్టటానికి యోగ్యంకాదు. క్షేమేంద్రుడనే ఆలంకారికుడు వచ్చి కావ్యవస్తువుకు విడివిడిగా ఉన్న ఈ విలువ రూపాలన్నింటికీ రెలిటివ్ విలువ రూపంగా ఔచిత్యాన్ని నెలకొల్పాడు. ఇప్పుడు అన్నింటి విలువలూ ఒక్క ఔచిత్య రూపంతోనే వ్యక్తం కావాలి. సాహిత్య ప్రక్రియా రూపాలయిన కావ్యవాఙ్మయమంతటికీ ఈక్వివలెంటుగా ఔచిత్యాన్ని నిలబెట్టాడు క్షేమేంద్రుడు. సాహిత్యంలో ''జనరల్ వాల్యూసిష్టమ్'' ప్రామాణిక విలువ పద్ధతిని ప్రవేశపెట్టిన ఆలంకారికుడాయన.

కావ్యానికి గుణాలంకారాదులన్నీ విస్తృత విలువ రూపాలు. వాటన్నింటికీ జనరల్ విలువ రూపం ఔచిత్యం. ఆవిధంగా కావ్యంలోగల ప్రతి విస్తృత విలువ రూపం కూడా తాను తనను ఔచిత్యమనే జనరల్ విలువ రూపంతోనే వ్యక్తం చేసుకొంటుంది. అంటే గుణాలంకారాదుల్లో కవిచేసే పనితనమంతా సమానమే. అలంకారాలను సమకూరిస్తే ఎక్కువనిగానీ, వక్రోక్తిని సాధిస్తే తక్కువనిగానీ, రీతికంటె ధ్వని గొప్పదని కానీ — ఇలాంటిదేమీ లేదు. ఎందుకంటే అవన్నీ జనరల్ విలువ రూపమైన ఔచిత్యంద్వారానే తమను తాము చెప్పుకొంటున్నాయి కదా! అంటే అన్నీ ఔచిత్య లక్షణం కలిగివుండటమే లక్షణంగా భావిస్తున్నాయి గనుక - సమాన లక్షణ లక్షితాలనే అర్థం. కాబట్టి కావ్య రచనలో కవి గుణాలంకారాల మీద పని చేయవలసిందే. అవన్నీ ఔచిత్యం ద్వారా వ్యక్తం కావలసిందే. ఆ విధంగా కావ్యమూ ఔచిత్యమూ విస్తృత విలువలకు మొదలుగానూ, జనరల్ విలువకు చివరి గమ్యంగానూ ఉన్నాయి. గుణాలం

కారాది కావ్యం విలువయొక్క విస్తృతరూపమంతా పరిమాణాత్మకం. అక్కడి నుండి జనరల్ విలువకు అభిముఖంగా అభివృద్ధి చెందటం గణాత్మకం. అంటే కావ్యముయొక్క విలువ మొదట కొంతవరకూ పరిమాణాత్మకంగానూ ఆ పిమ్మట గుణాత్మకంగానూ మార్పును పొందుతుంటుందని అర్థం. గుణాత్మకమైన మార్పు ఎప్పుడూ పూర్వదశలోవుండే దోషాలను రూపుమాపుకొంటూ కొనసాగుతుంది.



కావ్యంలో గుణాత్మకమైన మార్పుకు స్థాయి ఔచిత్యం. కావ్యముయొక్క విలువలు పరిమాణాత్మకంగా గానీ, గుణాత్మకంగా గానీ మారటానికి కారణం కవులు కావ్యాలను ఉత్పత్తి చెయ్యటంలో మార్పులను అవలంబించటమే. ఒక మార్పు ఒక స్థాయికి చేరిన తరువాత మరొక క్రొత్త మార్పుకు సహజంగా జరిగే దోహదాన్ని బట్టే మార్పులు జరగటంలో విశేషం కనిపిస్తుంది. మార్పుకు నిదర్శనంగా ఉత్పన్నమైన విలువ రూపాలన్నీ చిట్టచివరకు ఏ విలువ రూపంతో అభివ్యక్తం కావలసివస్తుందో అది జనరల్ విలువరూపం. అదే అన్నింటి విలువలను నిర్ణయించేది. క్షేమేంద్రుడు సాహిత్య ప్రపంచంలో ప్రవేశపెట్టిన ఔచిత్య సిద్ధాంతం జనరల్ ఈక్వివలెంటు పాత్రను నిర్వహించేదిగా చేసి చేశాడు. ఔచిత్యానికి కావ్యంలోని ప్రతి అంశంతోనూ సంబంధమున్నది. అంటే రీతికి వక్రోక్తితో, వక్రోక్తికి గుణంతో సంబంధంలేనట్లు గుర్తించగలం. సాహిత్య ప్రపంచంలోని ప్రతి అంశంతో విలువ సంబంధాన్ని నెలకొల్పు కొనగలిగిన ఔచిత్యం సామాజిక బాధ్యతనూ, ప్రయోజనాన్నీ నిర్వహిస్తున్నదన్నమాట. ఇక్కడ సామాజిక శబ్దాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అది అటు వ్యక్తికీ ఇటు సమాజానికీ సంబంధించి ఉభయతారకంగా ప్రవర్తించగలదు. కావ్యంలోని ప్రతిఅంశం విలువనూ ఔచిత్యంతో కొలవగలగడం — సహృదయులయిన సామాజికులు దాన్ని బాధ్యతగా నిర్వహించడంలో ఉన్నది — మరియు సామాజిక జీవితాభివృద్ధి క్రమంలో ప్రయోజనాపేక్షయా ప్రవర్తించడంలో ఉన్నది. వ్యక్తికీ, సమాజానికీ ఉన్న సంబంధ బాంధవ్యాల గురించిన శాస్త్రీయదృక్పథంతో ఈ విషయాన్ని ఇంకా వివరించవలసి ఉన్నది. కావ్యంలో పాత్రల పరస్పర సంబంధాలతో తయారైన ఒక సమాజమున్నది-ఆ కావ్యం ఉత్పత్తి అయిన దేశకాలాలలో రచయిత నివసించిన సమాజ మొకటి ఉన్నది. కావ్యం పఠింపబడుతున్న దేశకాలాలలో పాఠకులు నివసిస్తున్న సమాజ మింకొకటి ఉన్నది. దీనిది మరీ విశ్వరూపం. ఔచిత్యం కావ్యం విషయంలో సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నదంటే ఇన్నిరకాల సమాజాలకు కావ్యముయొక్క విలువను తన ముఖంగా వ్యక్తీకరిస్తున్నదని అర్థం. కావ్యగతమైన సమస్త రచనా శిల్పంతోనూ, సమస్తమైన దేశకాల పరిస్థితులతోనూ ఔచిత్యం విలువ సంబంధాన్ని ఏకకాలికంగా చూచుకోగలుగుతున్నదన్నమాట.

11 ఔచిత్యం జీవితంలోని ప్రతి అంశాంశానికీ కూడా తాను కొలమానంగా నిలువగల చేవగల నీటికొలది తామగగా ఉండగల సిద్ధాంతం. కావ్యానికి విలువ నిర్ణయ స్థానానికి జనరల్ ఈక్వివలెంటుగా మొదటి నుండీ ఔచిత్యమే లేదు. ఔచిత్యమాస్తికి చేరుకొన్న తరువాత దాన్ని త్రోసిరాజనగలిగిన మరొకటి రాలేదు. అయితే అంతకు ముందున్న గుణాలంకారాదులు ఎందువల్ల ఒకదాన్ని కాదని మరొకటి త్రోసుకవచ్చాయి? అంటే లోపాలు పూరించగల దాని వల్లనే లోపాలున్నది త్రోసివేయబడుతుంది. ఉదాహరణకు ధ్వని సిద్ధాంతమే సిద్ధాంతంగావుందనుకొందాం. అంటే కావ్యాంశాల మొత్తానికి అదే జనరల్ ఈక్వివలెంటు స్థానంలో ఉందనుకొందాం. అప్పుడు దానితోనే అన్ని రకాల కావ్యాంశాలనూ విలువ కట్టాలికదా! చిరుసాన బట్టించి చికిలి సేయించిన గండ్రగొడ్డలి నిశాగహనలతకు — ఇత్యాదిగా సాగిన కాశీఖండము నందలి (1-121) పద్యములో గానీ, అలాంటి పద్యాల మొత్తంలో గానీ ధ్వని స్పర్శ ఏమీలేదు. ఉండదు. నిజానికి అలాంటి పద్యాల సంఖ్యే కావ్యాలలో ఎక్కువ. ధ్వన్యర్థం లేదుగనుక అది కవిత్వం కాదనవలసి వస్తుంది. దాన్ని కవిత్వంగా అనుభవిస్తూ కాదనటమేలాగా? మన మనుభవించే కవిత్వమేమిటందులోనంటే ఔచిత్యమనే చెప్పాలి. నిశను గహనంగా రూపకల్పన చేయుటంద్వారా సూర్యుని గండ్రగొడ్డలిగా ఊహించటం సమర్థింపబడి కార్య కారణ సంబంధ ఔచిత్య స్ఫూర్తివల్ల ఆ వాక్యం కవిత్వంగా వున్నది. కొద్దిపాటి ఆలంకారిక రచనా విధానంచేత వ్యంగ్యస్పర్శ ప్రధానంగా లేకపోయినా కవిత్వమవుతున్నదంటే అక్కడ అది ఔచిత్యం కొలతకు నిలబడటంవల్లనే. ధ్వనే గనుక జనరల్

ఈక్వివలెంటు స్థానంలో ఉంటే తానీ పద్యంలోని కవిత్వం విలువను చెప్పలేదు. ధ్వని సిద్ధాంతం ఎక్కువ తక్కువలను కొలవటానికి పనికిరాదు. మా పరీక్షకు పెట్టిన కవిత్వం విలువను చెప్పటానికి దానిస్థాయికి ఎక్కగల, దిగగల విలువగల కావ్యసిద్ధాంతం ఉండాల. ఆ అవసరాన్ని తీర్చటానికి ఔచిత్యం సిద్ధాంతంగా వచ్చింది. అంటే ఇది అన్నిరకాల, అన్నిస్థాయి భేదాల కవితలకూ విలువలు కట్టడంలో జనరల్ ఈక్వివలెంటుగా ఆవిర్భవించింది. అది ప్రతి కవితాంశ గర్భంలోనూ దాని జీవచైతన్యంలాగా కదలాడుతుంటుంది. అంతకు ముందున్న కావ్యాత్మ సిద్ధాంతాల్లో దేని విలువకూడా కావ్యము యొక్క మొత్తం విలువకంటే ఎక్కువ విలువ కలిగిందికాదు. అందువల్ల పరిమిత వ్యాప్తిగల విలువరూపంతో అధిక వ్యాప్తిగల విలువను కొలవడం సాధ్యంకాదు. దానికి తగిన అపరిమితవ్యాప్తి గలిగిన ఔచిత్య సిద్ధాంతమందువల్ల వచ్చింది. అన్నిస్థాయుల్లోనూ అందుకు తగినట్లుగా ఔచిత్యం వామన విశ్వరూపాలను ధరించ గలదు. అంతగా అవసరాన్నిబట్టి అనువుగానూ, ఖచ్చితంగానూ అక్కరకువచ్చే కావ్యముయొక్క విలువ సిద్ధాంతమది. అందువల్ల అంతకు మునుపటినుండీ వున్న కావ్యాత్మ సిద్ధాంతాలన్నీ తమ తమ విలువలను ఔచిత్యం సిద్ధాంతంగా వచ్చినప్పటినుండి దానిద్వారానే చెప్పకొని బ్రతకవలసి వస్తున్నది. విడివిడిగా చూస్తే శమవిలువ— ఉపయోగపు విలువ—మారకపు విలువ అని మూడు రకాలుగా కని పించే విలువలమొత్తంగా వుంటుంది ఏ వస్తువుయొక్క విలువైనా. కావ్యవస్తువులో శ్రమవిలువ అంతా రచనా శిల్పాన్ని బట్టుకొనీ, ఉపయోగపు విలువ అంతా అది తయారైన దేశకాల పరిస్థితుల మెరుగు పడటానికి అది ఎటునుండీ ఎటుగా ప్రవర్తించటాన్ని సమర్థించుకొంటూ పోయినదన్నదాన్ని బట్టుకొనీ, మారకపు విలువ మారిన దేశ కాల పరిస్థితులలో వచ్చే ప్రతి తరంతోనూ అది ఏ విధంగా సంపదిస్తున్నదన్నదాన్ని బట్టుకొనీ వుంటుంది. ఈ విలువల విలువ లక్షణాన్ని ఔచిత్యం తనద్వారా ధర్మకాటాలోలాగా చూపిస్తుంది. కావ్యాన్ని చేస్తున్న సమస్త విషయాల విలువలను చూపించటం మాత్రమే ధర్మంగావున్న జనరల్ ఈక్వివలెంటన్న మాట అది. మరొక దానివిలువ రూపంగా కాక దానికి కావ్యంలో ప్రత్యేకమైన ఉనికిలేదు. అంటే అదే కావ్యముయొక్క ఆత్మగా—జీవితంగా—విలువగా ఉన్నదన్నమాట. అప్పుడు కావ్యవస్తువూ, జీవితానుభవమూ, ఔచిత్యమూ ఇవన్నీ కలిసిపోతున్నట్లర్థం. కావ్యముయొక్క స్వరూప స్వభావాలకున్న అన్యోన్యమే ఔచిత్యమంటే, అన్యోన్యాన్ని సంపాదించే శిల్పమర్యాదనే ఔచిత్యమన్నట్లవుతున్నది. చెప్పబడు తున్న దానికీ, దాన్ని చెప్పటాని కుపయోగిస్తున్న రచనా శిల్ప విధానానికీ తగివుండటంవల్లనే కావ్యం అనన్యంగా ప్రకాశిస్తున్నది.

అవును. దానికే అనురూపమని పేరు. అదే ఉచితం. కావ్యానికి అనురూప్యంవల్ల ఔచిత్యపు విలువ కలుగుతున్నదంటే అందులో ఏది దేని కనురూపంగా వుండాలో తెలియాలికదా! దేనికైనా స్వభావమూ, స్వరూపమూ వుంటేనే అది గ్రాహ్యమవుతుంది. లేకపోతే కాదు. ఎందుకంటే స్వభావానికి రూపముండదు. అది ఆత్మ పదార్థానికి సంబంధించి అనుభవంలో తెలుస్తుంటుంది కానీ, అభివ్యక్తికి తేవాలంటే—దానికి ఇం దియాలచేత గ్రహించటానికి వీలయిన భౌతిక రూపాన్ని సంతరించాలి. భౌతికమైన శరీరంతో వ్యవహరించేమనిషి, తన అనుభవ జ్ఞానానికి వ్యవహార యోగ్యతను కలిగించాలంటే దానికి వాఙ్మయ రూపమైన భౌతిక భాషా శరీరాన్ని సమకూర్చాలి. అమూర్తమైన అధ్యాత్మిక స్వభావానికి అనురూపమైన వాఙ్మయ శరీరం స్వరూపమవుతుంది. వ్యవహార యోగ్యత అనే ఉపయోగపు విలువ ఏకకాలికంగా వస్తుగతంగానూ, వస్తురూపంగానూ ఉంటుంది. కావ్యం విషయంలో కావ్యవస్తు స్వభావానికి అనురూపంగా కావ్య శరీరాన్ని సంతరించాలి. ఈ ఆనురూప్యతవల్లనే కావ్యానికి ప్రౌఢి వచ్చి ఔచిత్యపు విలువ ఎక్కువగా వుంటుంది. కవులకు అనురూపతను గురించిన ఆలోచన మందగించినకొద్దీ వట్టి రూపసౌష్ఠవం మాత్రమే ప్రధానమై కూర్చున్నది. ఏ రెండింటికైనా కనీస సంబంధం సముచితంగా ఉండటాన్నే ఔచిత్యమంటాం. సముచిత సంబంధాలే సమైక్యతకు మూలం. కావ్యవస్తువుకు అంతర్గతంగా వుండే సంబంధాలూ, కావ్యానికీ దేశకాల పరిస్థితులకూవుండే సంబంధాలూ, కావ్యవస్తువుకు కాలాంతరంలో ఏర్పడుతున్న సంబంధాలూ అన్నీ సముచితంగా వుండటాన్నే ఔచిత్య సిద్ధాంతం కొలిచి ఏది ఎంతలో వుందో చూపిస్తుంది ఇక్కడ ఒకసంగతి గుర్తుంచుకోవాలి. మన మెంతసేపూ కావ్యవస్తువనే అంటున్నాం. కావ్యమనే వస్తువు అని దాని అర్థం. ఇలా చెప్పటంవల్ల కావ్యంలో కథ వుండటంవల్లగానీ, లేకపోవటంవల్లగానీ మన యీ విమర్శన విలువ సిద్ధాంతానికి ఏవిధమైన ఇబ్బందీ ఉండదు. కావ్యవస్తువులో కథ ఇముడగలదు కానీ, కథా వస్తువులో కావ్యవస్తువు ఇముడదు. మరి దేనితోనూ నిమిత్తం లేకుండా కవిత్వంయొక్క స్వరూప స్వభావ సమష్టి లక్షణ లక్షితంగా వుంటుంది కావ్యవస్తువు. కావ్య వస్తువును తయారు చేయటంలో కవిపడుతున్న శ్రమ అతని ఆవేశాన్నీ, అన్వేషణనూ, ఆలోచననూ, నిజాయితీనీ, గతిశీలాన్నీ—ఈ అన్నింటి సమిష్టిగాఉన్న దృక్పథాన్నిబట్టి గదా ఉంటుంది. మరి దాని విలువను దేనితో కొలిచేటట్లు? ఔచిత్యంతోనే కొలవాలి. ఆ విధంగా పూర్వాపర సందర్భాల లోతు పాతుల్ని అవగాహన అవుతున్నకొద్దీ తమ విలువలను ఔచిత్యంద్వారానే వ్యక్తమవుతాయి. అంతేకాదు. కావ్యవస్తువుయొక్క ప్రచార ప్రబోధ ఉపదేశాత్మకతల విలువలను కూడా ఔచిత్యమే తన ముఖంగా తెలియజేస్తుంది. ఇక్కడ క్షేమేంద్రుడు ఔచిత్య స్థానాలుగా నిర్దేశించిన ఇరవైఏడింటిలోనూ పూర్తిగా పన్నెండు కావ్యశరీరమైన వాఙ్మయ రూపానికీ, మిగిలిన పదిహేనూ కావ్యాత్మమైన వస్తువుకూ సంబంధించి వున్నాయి. స్వరూప స్వభావాలయొక్క అనురూపతను మనస్సులో పెట్టుకొనే ఆలోచించాడు క్షేమేంద్రుడు. అందువల్లనే కవియొక్క దృక్పథానికి కూడా అతని కావ్యంద్వారా విలువ కట్టగలుగుతున్నాం. నిజమే కానీ ఒక్క విషయంమాత్రం గుర్తుంచుకోవాలి. కావ్యముయొక్క స్వరూప స్వభావాలు సాపేక్షికాలు అనటంకంటె సాపేక్షిక

స్వాతంత్ర్యం కలిగివున్నవనటంలో సామాంజస్యమున్నదని. ఆ దృష్ట్యా ఈ ఔచిత్య విలువ సిద్ధాంతంకూడా సాపేక్షికమే.

III. జనరల్ ఈక్వివలెంటు అంటే కొలమానం పరిమాణాన్ని గానీ విలువనుగానీ చెప్పకోటానికి—కాదు—చెప్పించుకోటానికి సిద్ధమై నిలబడ్డ వస్తువు నుండి వేరుగా వుండవలసిందే. కావ్య వస్తువు విలువను కొలిచే కొలమానం కావ్య శరీరం నుండి పూర్తిగా వేరై తనకొక ఉనికి కలిగి ఉండటమన్నది ఔచిత్య సిద్ధాంతంతోనే మొదలయింది. ధ్వని సిద్ధాంతంతో సహా అంతకు పూర్వమున్న విలువ కొలమానాలన్నీ కావ్య శరీరాన్ని ఏదో విధంగా అంటిపెట్టుకొని ఉన్నవే. అందువల్లనే రచనా శిల్పానికి ప్రాధాన్యం పెరిగింది. తన శరీర నిర్మాణ సౌష్ఠవంచేతనే కావ్యం వస్తువుతో విడివడి తిరగటం మొదలు పెట్టింది. రసధ్వని సిద్ధాంతాలు కూడా కావ్యం యొక్క ఆ తిరగటాన్ని అరికట్టలేకపోయినయి. ఎందువల్లనంటే ధ్వని సిద్ధాంతం కూడా కావ్య శరీరమైన శబ్దాన్ని దాని అర్థాన్ని మాత్రమే పట్టుకొని వుంది. ఇక్కడవున్న లోపాలను సవరించటానికే రసధ్వని సిద్ధాంతాన్ని అభినవ గుప్తుడధికమైన అభినివేశంతో నిరూపణం చేసింది. ఆయన శిష్యుడయిన క్షేమేంద్రుడంతకంటే మరొక ముందడుగువేసి నిర్దుష్టమైన ఔచిత్య సిద్ధాంతాన్ని నిరూపణం చేశాడు. ఇప్పుడు కావ్య శరీర నిర్మాణ సౌష్ఠవం తనంతట తాను విలువయినదిగా నిలబడలేదు. తన విలువను చెప్పమని ఔచిత్యాన్ని అడగవలసిందే. తానేపాటి ఉచిత మర్యాదా సంబంధంతో వస్తువుకు రూపంగా ఉన్నదో ఆపాటి విలువ మాత్రమే ఉంటుంది శిల్పానికి. అంటే కావ్యలక్షణ ప్రపంచం మొత్తానికి తాను విడిగా నిలబడి వాటి వాటి విలువలను ఖచ్చితంగా చూపించగలిగిన సామర్థ్యంతో వున్నది ఈ ఔచిత్యమనే సాహిత్యం విలువకున్న ఏకైక కొలమానం.

అయితే ఇంత మహనీయమైన సాహిత్యపు విలువలను కొలిచే కొలమానం కవినీ కావ్యాన్నీ వదలిపెట్టి విడిగా ఎక్కడున్నదీ అంటే సహృదయులయందున్నది. పాఠకుల యందున్నది. శ్రోతలయందున్నది. వీళ్ళంతా ప్రజలు. సాహిత్యాన్ని చర్చించి అనుభవించే ప్రేక్షకులు. అనుభవించటమన్న లక్షణం వాళ్లల్లో ఉన్నది గనుకనే సాహిత్యం విలువలను కొలవటానికి వాళ్ళు కొలమానంగా నిలబడగలుగుతున్నారు. సామాజికుల ఈ అనుభవ లక్షణాన్ని అభినవ గుప్తుడు నిర్ద్వంద్వంగా స్థాపించిన తరువాత ఆయన శిష్యుడైన క్షేమేంద్రుడు సామాజికులే సాహిత్యం విలువకు కొలమానమని ఔచిత్య సిద్ధాంతాన్ని క్రొత్తగా నెలకొల్పాడు. దాన్ని తొలగించి దాని స్థానంలోఅంతకంటె మంచిగా వ్యవహరించగల కావ్యవిలువ సిద్ధాంతమిప్పటికి మరొకటి రాలేదు. అందువల్లనే అది స్థిరంగానూ, రసానికి కూడా జీవిత భూతంగానూ మనగలుగుతున్నది.

కావ్య జీవితం ఔచిత్యపు విలువను యెంతగా కలిగివుంటే అంతగా అది స్థిరంగా వుంటుంది. వక్రోక్తి విలువను మాత్రమే కలిగివుంటే ఆ కావ్య జీవితం స్థిరం కాదు. కావ్య జీవితమంటే కావ్య వస్తువుగా మలచబడిన మానవ సంబంధాలతో ఉన్న జీవనమే. అదికాదు. కావ్య జీవితమంటే కావ్యముయొక్క జీవితమనీ, కవితాశక్తియే కావ్య జీవితమనీ వాదించవచ్చు. కవితాశక్తి అంటే రూపకల్పనకవసరమైన శబ్ద సంయోజన శక్తి మాత్రమే అని అర్థం చేసుకోటంవల్ల అలాంటి వాదన వస్తున్నది. నిజానికి కవితా శక్తి అంటే : భావనారూప సంస్కార విశేషంవల్ల మానవ జీవన ప్రకార యథార్థ జ్ఞానానుభవాన్ని తన జాతి జనావళికి కలిగించాలన్న తపన చేత వాళ్లవల్ల సమష్టిగా ఉత్పన్నమైన భాషను సాధనంగా చేసుకొని పనిచేయటానికి ప్రేరకమవుతున్న మనిషియొక్క ఆత్మగుణం. ఆ ప్రతిభాగుణమే రూపం ధరించి కనిపిస్తున్నది గనుక కృతి అవుతున్నది. కృతిలో కవితాశక్తి రూపమైన తపన, అది ఈడేరటానికి శబ్దార్థాలతో చేసే వ్యాపారం రెండూ సమైక్యం చెందివున్నాయి. తపన అంటే కంటెంటు. వ్యాపారమంటే పాఠం. దానికొరకిది. ఇలా తయారవుతున్నది కావ్యం. శబ్ద సంయోజన శక్తినే కవితా శక్తి అనుకోటమంటే రూపాన్నిబట్టే కవిత్వాన్ని పోల్చుకొనే దశలో ఉన్నామన్నమాట. అందువల్ల కావ్య జీవితమంటే కావ్య వస్తువైన మానవ జీవన ప్రకార యథార్థజ్ఞానం. ఈరకమైన యథార్థ జీవిత ప్రకారాన్నిచెప్పే కవికంటే సమాజానికి ఆప్తులు మరెవ్వరుంటారు? నిజమే కవులకంటే సమాజానికి ఆప్తులు మరెవ్వరునూ లేరు. లేరన్నది సిద్ధాంతం. వాస్తవంలో ఆప్త శబ్ద వాచ్యత కర్తృతలేని కవులు కూడా వుండవచ్చు ఆ విషయాన్ని హెచ్చరించటం ఈ ఔచిత్య విలువ సిద్ధాంతాన్ని ప్రతిపాదించటంలో క్షేమేంద్రుని ఒక ప్రయోజనం కావచ్చు. ఎందుకంటే కవులు మేము నిరంకుశులమని బయలుదేరారు కదా! నిరంకుశలమంటే యథార్థాలకు మేము కట్టుబడమని బరితెగించటమే అవుతుంది. యథార్థం చెప్పటానికి ఎదురు తిరిగిన వాడు అప్తుడు ఎప్పుడూ కాడు. యథార్థమనే దెక్కడ వున్నది? లోకంలో వున్నది. లోకులు తమ అనుభవంలో యథార్థాలను తెలుసుకొంటునే వుంటారు. కావ్యంలో యథార్థం చెప్పబడుతున్నదోలేదో అనటానికి లోకులు తమ అనుభవంతో ప్రమాణంగా నిలబడతారు. వాళ్లే సహృదయులు. పాఠకులు. శ్రోతలు. ప్రేక్షకులు. విమర్శకులు. అనుభవానికి సరిపోవటమే ఉచితం. కావ్యంలోని ప్రతి అంశమూ అలా ఉచితంగా ఉండటం వల్లనే కావ్యానికి ఔచిత్యపు విలువ వస్తున్నది. కావ్యముయొక్క విలువే ఔచిత్యమైనప్పుడు, అది ప్రజల అనుభవం వల్ల నిర్ణయింపబడుతున్నప్పుడు—కవి లోకజ్ఞుడు కావాలని నన్నయ్యగారెందుకు చెప్పారో అర్థం చేసుకోవచ్చు. క్షేమేంద్రుని ఔచిత్య సిద్ధాంతం సామాన్య కావ్య పాఠకులను సాహిత్య ప్రపంచంలో తీర్పరులుగా చేసి సమున్నత స్థానంలో కూర్చోబెట్టింది. కవి యొక్క పాండిత్య వైభవంమీద అంతవరకూ నిలబడ్డ కావ్యము యొక్క విలువ అందులో వర్ణించబడ్డ మానవ జీవిత ప్రకార యథార్థ దృశ్యాల ఉచితానుచితాలమీదికి మళ్లించబడింది. అక్కడి ఉచితానుచితాలను నిర్ణయించే బాధ్యత పాఠకుల లోకజ్ఞత్వంమీద పడింది.

దీంతో పాఠకునకు కావ్యపువిలువను నిర్ణయించే హక్కును దాఖలు పరచటం జరిగింది. ఇందువల్ల తమ లోకజ్ఞత్వాన్ని ఎప్పటికప్పుడు సముచితస్థాయికి పెంచుకొంటూ వుండవలసిన బాధ్యత ఒకటి కావ్య పాఠకులమీద అనుకోకుండా పడింది. ఆ బాధ్యత విషయంలో వారే మాత్రం అజాగ్రత్తగా వున్నా అది వారి విలువకు భంగం కలిగిస్తుంది. ఈ విధంగా క్షేమేంద్రుని ఔచిత్య విలువ సిద్ధాంతం కవి సహృదయుల నిద్దరినీ అర్ధనారీశ్వరంగా చేసి లోకంవైపు తిప్పి నిలబెట్టింది. లోకాని కియ్యటానికి వస్తువును పరిష్కరించినవాడు కవి. లోకం పక్షాన స్వీకరించటానికి కొలమానంతో నిలబడ్డవాడు సహృదయుడు. కవి సృష్టించిన విలువలను కొలిచి లోకంలోకి రానిస్తున్నాడు సహృదయుడు. అంటే కవి సహృదయులకు సంబంధాన్ని కల్పిస్తున్నది విలువను చెప్పకోటానికి సిద్ధమైన కావ్య వస్తువు. మానవుల మధ్యగల నిజమైన సంబంధాలన్నీ వస్తు సంబంధాలే. కవి సహృదయులదీ వస్తు సంబంధమే. శిల్ప సంబంధం కాదు. శిల్పమున్నా వస్తువు విలువకు లోబడే.

ముఖ్యంగా ఉపకరించిన గ్రంథాలు

1 **Karl Marx-Capital&Theories of Surplus-Value. The Poverty of Philosophy.**

2 రంగనాయకమ్మ — కేపిటల్ 1.

3 మాధవరామ శర్మ - ఔచిత్య విచార చర్చ.

అలలు

శ్రీ గంధం వేదవేశ్వరరావు

కడలి గర్భంలోకి చొచ్చుకొనిపోయి
కడగండ్లెన్నైనా అధిగమించి
అలల ఉనికి ఎక్కడుందో కనుక్కొంటాను
అక్కడ అలల్ని ఆరాధిస్తాను
నా చిరకాల కలల మాలల్ని
వాటి కంఠంలోవేసి పూజిస్తాను
అలలంటే నాకెంతో యిష్టం
అలల్లో కాలుష్యం ఉండదు
అలల అంతరంగంలో ద్వేషభావం కనుపించదు
పెను అలల చక్షువుల్లో అమానుషత్వం లేనేలేదు
సాహసోపేత దీక్షకి సజీవప్రతీకలు అలలు
సంకుచిత భావాల తీరాలతో
అనునిత్యం వాటిపోరు
పసిడి కలల్ని కబళించే
అరాచక శక్తులతో వాటి వీరోచిత పోరాటం
హద్దుల్ని, సరిహద్దుల్ని దాటి
సుఖ స్వప్న కేదారాల్ని చేరి
అవిదిత అనంతానుభూతిని
పొందాలన్నదే వాటి తాపత్రయం
విశుద్ధ వినిర్మల సంధ్యావేళల్లో
స్వాప్నిక అభ్యుదయ భావాల్ని రూపకల్పన చేసుకొంటాయి
ఉరిపోసుకొంటున్న కోరికలకు
కొత్త ఊపిరి ప్రసాదించి
దిగంచాలవరకు వెళ్ళిపోతాయి
అవనికి అనుక్షణం నవ్యజీవద్భాషను
ప్రబోధిస్తాయి
అలలలో కళారూపం
హాస్యలాస్యాలతో కనుపిస్తుంది
అంచెలు అంచెలుగా లేచే అలల్లో
కవులను నిలువునా విలపింపజేసే
నవ సుమధుర గీతాలాపనలు వినిపిస్తున్నాయి
అలల్లో నవభావనా ప్రేరణాశక్తి దాగుంది
గిలల్ని కరిగించే కన్నెపల్లల్ని ఊరడించి
వారి హృదయాల్లో ప్రణయ భావనల్ని
రేకెత్తించే బలీయమైన శక్తి ఉంది
అందుకే అలలంటే నాకిష్టం
నా పసిడి కలలకు ప్రతిబింబాలు
ఈ కలలు !

ఎప్పటికీ......

శ్రీ కె. ఎస్. రఘుఱ

యీ నిశ్శబ్దంలో
    క్షణాలన్నీ చలికి వొణికిపోతోన్న నిరాలంబంలో
జ్ఞాపకాల చితుకుల్ని పోగుచేసుకొని
చలిమంట వేసుకుంటోంది హృదయం
వెచ్చటి అనుభూతి
చీకటి వెలుగుల్ని గొణుగుతోంది
చుక్కల లోకంలో తప్పిపోయిన
తన చక్కని చుక్కని
వెన్నెల చూపులతో వెతుక్కుంటూ
వొక్కడే బయలుదేరాడు చంద్రుడు
మానిన గాయాల మచ్చలను తడుముకుంటూ
మానని గాయంలాంటి ప్రేయసి జ్ఞాపకాన్ని
విరహ గేయంలా నములుకుంటూ
గతానికి గోరీకట్టి
వర్తమానం శిలని బోర్లించినా
భవిష్యత్తు వేపే సూర్యకాంతాల్నే పూయించినా
ముందుకు నడుస్తూ వున్న మనసు
విచిత్రంగా వెనక్కి గెంతుతుంది
అసంకల్పితంగా గోరీని తెరుస్తుంది
స్మృతులు దయ్యాల్లా లేచి చుట్టుముట్టుతాయి
పూల పరిమళాల్లా మాధుర్యాల్ని పుక్కిలిస్తాయి
రాబందుల్లా శవమైన హృదయాన్ని పొడుచుకు
                                        తింటాయి.

పగలును మింగిన రాత్రి
పొడుగవుతుంది
విశాలమౌతుంది
అనంతమౌతుంది
భీకర వక్త్రం తెరిచి
నిన్ను పళ్ళమధ్య యిరికించుకుంటుంది
కొద్ది కొద్దిగా నమిలేస్తుంది
తడితడిగా చప్పరిస్తుంది
మెదడు నిశల్నీ వుషల్నీ మరిచిపోతుంది
నిజంగానే లేనికాలం
వున్నట్లనిపించడం మాని
నిజంగానే అదృశ్యమౌతుంది
నువ్వు వొక్కడే మిగిలిపోతావు
జ్ఞాపకాల చలిమంట ముందు.

వేడెక్కిన నీ హృదయమే
చితిగా మండిపోతుంది
నువ్వు వొక స్మృతిగా కరిగిపోతావు
జీవన వారాశిలో వో మీనంగా
నువ్వు పన్నుతున్న వలలో
నువ్వే చిక్కుకుంటావు
విషాదంగా ఆనందంగా
విలాసంగా వుల్లాసంగా
వుద్వేగంగా వున్మాదంగా
అందంగా కట్టిన గాజు పుస్తకాల తొట్టిలో
అటూ యిటూ తిరుగుతుంటావు
నిన్ను చూట్టానికి వొచ్చే హృదయాల్లో
చిరంజీవంగా చితుల్ని రగిలిస్తావు
నవం నవంగా ఆలోచనల్ని పరిమళిస్తావు
ఆరిపోని వేకువల్ని వెలిగిస్తావు
చితినుంచి చితికి అలసిపోని
అనంత యానాలు చేస్తావు
ఆత్మనుంచి ఆత్మకి
అనుభూతి జ్వాలల వంతెనల్ని నిర్మిస్తావు
నువ్వుమాత్రం వుంటావు
చితిలో స్మృతిగా

వాక్యాల విద్యున్నాదుల్లో
ఋాదులాడే అయస్కాంత మీనంగా
నువ్వుమాత్రం మిగిలిపోతావు
మృతిలేని అనుభూతిలా
వొదిగిపోతావు

నిశ్శబ్దంలో శబ్దంలా
ఎప్పటికీ ...
ఆద్యంతరహిత జీవప్రవాహికలా
చైతన్య ప్రహేళికలా
ఎప్పటికీ ... ... !

కర్తవ్యం

శ్రీమతి మాడభూషి వరలక్ష్మి

బాలలూ

వినండి చెప్తానొక వింతకథ!
అనగనగా ఓ ప్రపంచం
అందులో ముగ్గురు అక్కాచెల్లెళ్ళు,
నింగీ, నేలా, ప్రకృతి వాళ్ళ పేర్లు!

అందర్లో పెద్దది ఆకాశం!
ఆమెకేమో అంతులేని గర్వం —
అందరి దానిననీ, అందని దానిననీ
అనంతాన్ననీ కాదు —

ప్రాతఃకాలపు పుటక
పడమటి పానుపు పడక
పక్షం రోజుల విన్యాసం
పక్షం రోజుల సన్యాసం -
ఐ
లోకాల్ని ఏలుతున్న కవలలకు
కన్నతల్లిని తానని!

ఇక రెండోది ప్రకృతి
వర్ణించలేను ఆమె ఆకృతి —
ఆ కాంత కంతులేని పులకింత
గాలీ, నీరూ, నిప్పూ జీవరాశికి
ప్రసాదించిన మాతృమూర్తిని తానని!

'నిస్వార్థులు తమ పిల్లలు,
కీర్తిన, మూర్తిన
సాటిలేని వారలు,
చిరంజీవులు'

అని
మిడిసి పడుతున్నారు వాళ్ళు
గేలితో గోల చేస్తున్నారు
తమ చెల్లెల్ని — భూతల్లిని!

"పిల్లలున్నా గొడ్రాలు నీవని!"

"కోటానుకోట్ల మందిని కన్నా —
తోబుట్టువులతో సమానం కానా"
చింతిస్తోంది ఆ తల్లి!

అంచేత
మీరు
సూర్యుడిలా వెలిగి,
చంద్రునిలా పెరిగి,
ఆకాశమ్మను ఆశ్చర్యంలో ముంచాలి!

గాలిలా జీవాలై,
నీటిలా చెడు కడిగి,
నిప్పులా నిజాలై,
ప్రకృతి పిన్ని కళ్ళు తెరిపించాలి!
పుడమి తల్లి పరువు నిలపాలి!!

డాక్టర్ కాశిభట్ట సేతురామేశ్వర దత్త

శతాధిక గ్రన్థకర్త
శ్రీ బెల్లంకొండ రామరాయ కవి

హయగ్రీవ ప్రసాదేన విద్యానాం కుంభసంభవమ్
బెల్లంకొండాన్వయాబ్ధీన్దుం రామరాయ కవిం భజే॥
పునరుద్దీపితాద్వైతో విశిష్టాద్వైత భంజకః
అపరః శంకరాచార్యో రామరాయో జయత్యయమ్॥
వైదుష్యం రామరాయస్య యశశ్చ విమలం బహు
లోకే ప్రథయితుం యత్నో మమాయం సఫలోభవేత్॥[1]

కవులు, పండితులు, దాతలు, శూరులు దేశకాల పరిమితులకు లోబడిన వారు కారు. అన్ని కాలములలోను అన్ని ప్రాంతములలోను గొప్పవారు తరుచుగ పుట్టుచుందురు. సంస్కృత భారతి కపారమైన సేవ చేసియు వెలుగుచూడని యాంధ్రదేశ కవి పండితులు చాలమంది కలరు. వీరిలో వాచస్పతి మిశ్ర, విద్యారణ్య, అప్పయ్య దీక్షితుల వంటి యుద్దండులతో బోల్పదగి, ఆధునిక కాలములో సంస్కృత సాహిత్యమును, శంకరాద్వైతమును స్వకీయ రచనలతో పరిపుష్టముచేసి యావదాంధ్ర జాతికే గర్వకారణమై యపరశంకరు లనదగినవారు, సుగృహీత నామధేయులు, హయగ్రీవోపాసకులు, విద్వత్కవులు, సర్వశాస్త్ర పారంగతులు, శతాధిక గ్రన్థకర్తలు నగు శ్రీ బెల్లంకొండ రామరాయకవిగారు ముఖ్యులు.

శ్రీ రామరాయ కవి శాలివాహన శకము 1797కు సరియగు యువ సంవత్సర మార్గశిర బహుళా వాస్య సోమవారమునాడు అనగా క్రీ. శ. 1875 డిశెంబర్ 27వ తేదీన గుంటూరు జిల్లా నరసారావు పేట తాలూకా పమిడిపాడు అగ్రహారమున సుసంపన్నమైన కవి పండిత వంశములో నియోగి బ్రాహ్మణ కుటుంబమున జన్మించిరి. వీరి తండ్రి మోహన్‌రావు, తల్లి హనుమాంబ. వీరిది ఋక్ శాఖ, ఆశ్వలాయన సూత్రము, భారద్వాజ గోత్రము. వీరి పూర్వులు దొండపాడు, గుంటగర్లపాడు అను రెండు అగ్రహారములకేగాక 84 గ్రామములకు ఆధిపత్యమును గలిగియుండిరి. వీరందరును దాతలు, శ్రోత్రియులు, కర్మఠులు, సదాచారపరాయణులు, నిరతాన్నదాతలు, విద్యాదాతలు, వ్యవహారదక్షులు, వ్యాయామ పారంగతులు దండనాయకులుగ నుండిరి. ఈ వంశములోని స్త్రీలు సంస్కృత కవిత్వమునందారి తేరినవారు.

శ్రీరామరాయకవికి ఐదవ సంవత్సరము వచ్చునప్పటికి తండ్రి దివంగతుడాయెను. దత్తుబోయిన వీరి పినతండ్రి కేశవరావు శ్రీరామరావు కుపనయనము గావించి కొంత ప్రాథమికవిద్య చెప్పించి తరువాత యాంగ్ల విద్యాభ్యాసము కొఱకు గుంటూరులోని యొక యున్నత పాఠశాలలో ప్రవేశబెట్టెను. సంస్కృత సాహిత్యమునకు, అద్వైత శాస్త్రమునకు అపారమైన సేవ చేయవలసి యుండిన శ్రీరామరావుకు ఆంగ్లవిద్య వలదని విధి తలచెను కాబోలు శ్రీరామరావుకు నిత్యము శరీరాస్వస్థత కలుగుచుండెను. ఎంతటి వైద్య చికిత్స వలనను ప్రయోజనము చేకూరదాయెను. విసిగివేసారిన కేశవరావు తన అన్న కుమారుడు ఆంగ్ల విద్య నభ్యసించుట దైవమున కిష్టము లేదని భావించి యా బాలుని హైస్కూలు చదువు మాన్పించి తమ స్వగ్రామమున పమిడిపాడులో తమ జ్ఞాతియయిన బెల్లంకొండ సీతారామయ్యగారి వద్ద సంస్కృత విద్య నభ్యసించుటకు ప్రవేశపెట్టెను. అందరికిని ఆశ్చర్యముగొల్పునట్లు సంస్కృత విద్యాభ్యాసముతో శ్రీ రామరావుకు స్వస్థత చేకూరెను.

బాల్యము నుండియు శ్రీరామరావు అసమాన ప్రజ్ఞాశాలి. తనతోబాటు చదువు సహాధ్యాయుల నధిగమించి వారందరికన్న బుద్ధిమంతు డనిపించుకొనెను. తమ పురోహితులవద్ద కొంత వైదిక విద్యను నేర్చుకొని యుత్తమ విద్యా ప్రాప్తికొరకు దమ ఇంటనున్న ప్రాచీన హయగ్రీయ సాలగ్రామమును భక్తి శ్రద్ధలతో నర్చించుచుండెను. అనుదినము తమగ్రామమున వెలసియున్న శ్రీరమావల్లభరాయస్వామి నర్చించుచు పరమ భాగవతుడని పేరు బడసెను. ఒకనాడు హయగ్రీవు డొక వృద్ధ బ్రాహ్మణ రూపమున స్వప్నములో శ్రీరామరావుకు సాక్షాత్కరించి హయగ్రీవ మంత్ర ముపదేశించి యా మంత్రమున కవసరమగు కవచము, మాల, పంజరము, యంత్రము మొదలగువాటిని సమీపముననున్న దమ్మాలపాడు గ్రామములో వైఖానస రత్నమాచార్యులవద్ద లభించుననిచెప్పి యంతర్ధానమాయెనట. శ్రీరామరావాస్వప్నమునకు సంతసించి దమ్మాలపాటికేగి రత్నమాచార్యుల నుండి హయగ్రీవ మంత్రాంగములగు కవచ, పంజరాదులను సంపాదించుకొని, శాస్త్ర విధి ననుసరించి యక్షరలక్షలు జపించి మంత్రమునకు పునశ్చరణము గావించిరట. తత్ఫలితముగ వారి కసాధారణ మేధ, ధారణాశక్తి, కవిత్వము, సర్వశాస్త్ర పాండిత్యము లభించెను. తమయందు పొంగి పొరలు భక్తిభావమునకు కవిత్వము తోడుకాగా "రమావల్లభరాయ స్తోత్రము", "రమావల్లభరాయ శతకము" మొదలగు స్తోత్రములను శ్రీ రామరావు తమ పదునా

రవ యేట రచించిరి. గురువులవద్ద రఘువంశము, కుమారసంభవము, కిరాతార్జునీయములలో కొన్ని సర్గలు మాత్రము చదివి తరువాత తమకు గురువుగారి పాఠము వద్దని చెప్పి తక్కిన గ్రంథములను స్వయముగ తామే చదువుకొనిరట. తమ పదునారవ సంవత్సరముననే ''రుక్మిణీ పరిణయ చంపూ'', ''రమాపరిణయచంపూ'' ''కందర్పదర్ప విలాస భాణము'' మొదలగు కావ్యములను రచించిరి.

శ్రీ రామరావుగారికి పంతొమ్మిదవ సంవత్సరమున నెల్లూరు వాస్తవ్యులు సింగరాజు వేంకటరమణయ్యగారి ద్వితీయపుత్రిక ఆదిలక్ష్మమ్మతో వివాహము జరిగెను. పతివ్రతయైన యా సాధ్వి భర్తకు శుశ్రూష చేయుచు గ్రంథరచనమందు ప్రోత్సాహము నిచ్చెను. దైవ దుర్విపాకముచే వీరికి సంతానమ్ము కలుగదాయెను. చాలమంది విద్యార్థుల కన్నము బెట్టి చదువు చెప్పించి విద్యాసేవ జేసిరి.

కేవలము సాహిత్య శాస్త్రాధ్యయనముచే తృప్తినొందని శ్రీ రామరావు తర్క, వ్యాకరణాదులందు మిక్కిలి యభిలాష కలిగి వాటిని బోధించు గురువుల నన్వేషించుచుండిరి. వారి కోర్కె ఫలించెనా యనునట్లు గోదావరి మండలమునుండి పురిఘల్ల రామశాస్త్రి, సుబ్రహ్మణ్యశాస్త్రియను సోదరులు గద్వాల సంస్థానమునకు వెళ్లుచు పమిడిపాడు చేరి శ్రీ రామరావు కోరికపై వారికి వ్యాకరణ, తర్కశాస్త్రములను బోధించిరి. గురుదక్షిణ స్వీకరింపనొల్లని గురువులకు తమ కృతజ్ఞత ప్రకటించుటకై శ్రీ రామరావు అభినవ కాళిదాస కృతమగు చంపూ భాగవతమునకు ''మంథర''యను విపులమైన వ్యాఖ్యవ్రాసి దాని పీఠికలో

శ్లో॥ చంపూ భాగవతాపగాపతిమముం కేచిత్తరన్తు స్వతః
కే చిత్ప్లవ్యతరీం తరన్తు కతి చిత్తీర్థోపదేశాశ్రయాత్।
సుబ్రహ్మణ్య నిదేశతస్సు మనసాం దాతుం తదీయామృతం
రామః ప్రారభతేఽథ తస్య మథనం శ్రీనాథపాదాశ్రయః॥

అని తమ తర్క గురువులగు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిని,

శ్లో॥ శ్రీ మద్ధయగ్రీవపదౌ ప్రణమ్య కాలార్థి హృత్కైరవ భాసనాయ।
శ్రీరామగుర్వాశ్రయలబ్ధ విద్యో రామశ్శరద్రాత్రిమిమాం కరోతి॥

అని సిద్ధాంత కౌముదికి తాము రచించిన ''శరద్రాత్రి''యను వ్యాఖ్యానములోని పీఠికలో తమ వ్యాకరణ గురువులగు శ్రీ రామశాస్త్రిని స్తుతించిరి. వీరు రచించిన ''మంథర'' వ్యాఖ్యానము మిక్కిలి సరళము, విపులముగనుండి మిగత యన్ని వ్యాఖ్యానముల కన్న మిన్నగనున్నది. అట్లే వీరి సిద్ధాంత కౌముదీవ్యాఖ్య ''శరద్రాత్రి'' కూడ చాల సులభముగ గహనమయిన వ్యాకరణ విషయములను విశదీకరించుచున్నది.

శ్రీ వైష్ణవ మత సంప్రదాయములను పాటించుచుండిన శ్రీరామరావు పెద్దల యాచారము ననుసరించి యూర్ధ్వపుండ్రము, తులసిమాల ధరించుచు శ్రీభాష్యాది విశిష్టాద్వైత మత గ్రంథములను పఠించుచుండిరి. శ్రీరామానుజ గీతాభాష్యమును చదివినను కొన్ని శ్లోకములకు అర్థము పొసగకుండునట్లు శ్రీ రామరావు గ్రహించిరి. కాని విద్యారణ్యకృతమగు ''పంచదశి''ని జదివిన తరువాత గీతాశ్లోకముల కర్థము చక్కగ గుదిరెను. దానితో దనివితీరక శంకరగీతాభాష్యము, బ్రహ్మసూత్ర భాష్యములను జదువగా రామానుజుల విశిష్టాద్వైత దర్శనమున అనాదరణ, శంకరాద్వైతమునందు ఆసక్తి, భక్తి, యాదరము వృద్ధికాదొడగెను. ఆ సమయమున యాయనకు పెద్ద పండితుడను పేరు గలిగెను.

అట్టి తరుణమున తిరుపతినుండి ప్రతివాది భయంకర రంగాచార్యులు అను శ్రీవైష్ణవ గురువులు పమిడిపాడు అగ్రహారమునకు వచ్చి ధార్మికోపన్యాసములు గావించుచు సమాశ్రయణమునకు రమ్మని తమ శిష్యుల నందరిని రమ్మని యాజ్ఞాపించిరి. అప్పటికే శ్రీవైష్ణవ మతముపై యనాదరణము కలిగిన శ్రీ రామరావు, సమాశ్రయణాంగభూతమగు తప్తచక్రాంకనము శూద్రవిహితమనియు అది లేకుండగ తిరుమంత్రము నుపదేశింపుడని గురువుల వారిని కోరగా, తప్తచక్రాంకనము గావింపక మంత్రోపదేశము చేయజాలమని చెప్పిరి. పోనిండు, సమాశ్రయణము పొందిన తరువాత తమయింట భోజనము చేయగలరాయని శ్రీరామరావడుగగ శ్రీవైష్ణవాచార్యుల కందుల కంగీకరింప జాలరయిరి. దానితో క్రోధము చెందిన శ్రీ రామరావు, స్మార్త బ్రాహ్మణులచేతను, శ్రీ వైష్ణవ బ్రాహ్మణులచేతను దిరస్కరింపబడిన యీ మధ్వే వైష్ణవ మతము భయభ్రష్టమని భావించి శ్రీ వైష్ణవాచార్యులను దిరస్కరించి శ్రీ వైష్ణవమత సంప్రదాయములను, మత గ్రంథములను త్యజించి స్మార్త బ్రాహ్మణ సాంప్రదాయము ననుసరించి విభూతి, రుద్రాక్షల ధరించుచు, అద్వైత గ్రంథముల బఠించుచు తప్త చక్రాంకనము శూద్రవిహితమనియు వేదవిహిత కర్మ లుద్దేశింపబడిన బ్రాహ్మణుని కది తగదనియు నిరూపించుచు ''శూద్రధర్మ దర్పణమ్'' అను బృహద్గ్రంథమును రచించిరి. అప్పటినుండియు విశిష్టాద్వైత మత ఖండనముచేయుచు అద్వైతమును పోషించుచు అనేక గ్రంథములను రచించిరి.

అంతటితో దనివితీరక శ్రీ రామరావు శ్రీ శాంకర రామానుజ గీతా భాష్యములను, బ్రహ్మసూత్ర భాష్యములను వివిధ వ్యాఖ్యానములతో గూడ సవిమర్శముగ జదివిరి. తమ శిష్యుడగు వాళ్లభండి నరశింహశాస్త్రి కోరికపై శ్రీ శంకరరామానుజ గీతాభాష్యముల రెండింటిని చదివి చెప్పుచూ యా భాష్యములందలి తారతమ్యములను విడమఱచి బోధించిరి. శ్రీ శాంకర గీతా భాష్యము శృతి, స్మృతి, యుక్తులతో వ్యాసహృదయమును చక్కగ ప్రతిబింబింప చేయుచుండెననియు, శ్రీరామానుజ గీతాభాష్యము శృతి, స్మృతి ప్రమాణ విరుద్ధమనియు నిరూపించుచు మూడు మాసములు పాఠ ప్రవచనము గావించిరి. ఈ వ్యాఖ్యాన పరంపరలోని విషయములను ''భగవద్గీతా భాష్యార్క ప్రకాశిక''యను గ్రంథ రూపముగ వెలయించిరి.

సంప్రదాయబద్ధముగ గురువులవద్ద చదువక స్వయముగ జదివి వ్రాసిన స్వకీయ గీతావ్యాఖ్యానము సాంప్రదాయబద్ధులగు అద్వైత పండితుల యామోదము పొందునో లేదోయని శ్రీ రామరావు సంశయించిరి. ఏలన ''బలవదపి శిక్షితానామాత్మన్యప్రత్యయం చేతః'' యని కాళిదాసు[2] నుడివినట్లు, తన గ్రంథమునకు పండితుల యాదరణము లభించువరకు శ్రీ రామరావు కేమియు తోప కుండెను. తన గ్రంథమందలి గుణగణములను పరిశీలించుటకు తగిన వ్యక్తి రాజమహేంద్రవర నివాసి శ్రీ ఆదిభొట్ల రామమూర్తి శాస్త్రులవారని నిర్ణయించుకొని అచ్చటికేగి తమ భాష్యమును వారికి జూపిరి. వారా బృహద్ భాష్యము నామూలాగ్రముగ పరిశీలించుటకు తీరికలేక ''నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః'' (II. 6), ''క్షేత్రజ్ఞమపి మాం విద్ధి'' (XIII. 2), ''సర్వధర్మాన్ పరిత్యజ్య'' (XVIII. 66) మొదలగు ముఖ్య శ్లోకములకు శ్రీ రామరావు వ్యాఖ్యానమును చదివి మిక్కిలి సంతసించి యా వ్యాఖ్యానము నిర్దుష్టమ్ము, అపూర్వము, నూత్నవిషయ విలసితము, శాంకర హృదయ దర్పణమని కొనియాడిరి. ఇట్లు తమ గ్రంథ ప్రాశస్త్యమునుగూర్చి పండితాభిప్రాయము బడసి తమ యద్వైత పాండిత్యమునందు నమ్మకము కలిగించుకొని దృఢతర దీక్ష వహించి మరికొన్ని యద్వైత గ్రంథములను వ్రాయదొడగిరి. ఇట్లు గ్రంథరచనము చేయుచున్నను తన యిష్టదైవమును సేవించుటకాని, హయగ్రీవోపాసనమునుగాని త్యజింపలేదు. భక్తిశ్రద్ధలతో కొంతకాలము కృష్ణానదీ తీరగత వేదాద్రి యోగానంద నృశింహ క్షేత్రమునందు తపస్సుచేసి హయగ్రీవ మంత్రజపసిద్ధిని బడసిరి.

ఆ కాలమున వైదిక, నియోగి, బ్రాహ్మణ విభేదము లుచ్చస్థాయినందుండినవి. తామే పండితులమనియు వేదకర్మానుష్ఠాన పరులనియు ఇతరులు కారనియు ఇరుతెగలవారును ఒకరినొకరు నిరసించుచుండిరి. ఒకనాడు తిరుపతి వేంకటకవులు నరసారావుపేటలో నష్టావధానము చేయుచుండిరి. కాన నా యవధానములో వైదికులైన యవధానుల కీర్తిప్రతిష్ఠలకు భంగము వాటిల్లునట్లు క్లిష్ట సమస్య నొకదాని నివ్వమని నియోగి బ్రాహ్మణులు శ్రీ రామరావును బలవంతబెట్టిరి. లబ్ధప్రతిష్ఠులగు యవధానులను సమస్యాప్రదానముచే నవమానింప ప్రయత్నించుట తగదని శ్రీ రామరావు వారి కెంతయో చెప్పి, విఫలులై మోమోటముతో ''పశ్యా పశ్యౌ నవ శ్యతః'' యను సమస్య నిచ్చి పంపిరి. తిరుపతి వేంకట కవులీ సమస్యను తప్పనిరి.[3] దీనితో నిరుపక్షములవారును నతి తీవ్రముగ పరస్పరము పత్రికా ముఖమున విమర్శించుచు సమస్య సాధువుకాదని పశ్య శబ్ద మీమాంస, శలభాలభనము'' మొదలగు వ్యాసములను తిరుపతి వేంకట కవులు, సమస్య సాధువని శ్రీ రామరావు ''గుంజా గర్వభంజనము, పంచానన వాయనము'' అను వ్యాసములను ప్రకటించిరి.

నియోగి, వైదిక, బ్రాహ్మణ వైషమ్యము లుచ్చస్థితిలో నుండు యా సమయమున కామరాజు కోటేశ్వరశర్మ యను నియోగి బ్రాహ్మణుడు, నియోగులలో బహు గ్రంథకర్త, ద్వైతాద్వైత మత స్థాపకుడు, సర్వశాస్త్ర పారంగతుడు, సర్వతంత్ర స్వతంత్రునిగను పేరు బడసిన నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితుల చరిత్రమును తెలుగునుండి సంస్కృతమున కనువదింపుమని శ్రీరామరావును కోరెను. ఆ గ్రంథములో నియోగులు ద్వైతాద్వైతులనియు, వైదికు లాసురాద్వైతు లనియు పేర్కొనబడుట గాంచి నియోగి బ్రాహ్మణుడగు శ్రీ రామరావు మిక్కిలి పరితపించి ''అద్వైతమును ద్వైతాద్వైతము ఆసురాద్వైతమని విభాగించుట వేదాంత శాస్త్రవిరుద్ధము. వేదైర్వ్యంతీతి వైదికాః అను వ్యుత్పత్తిచే వేద ప్రమాణముకల బ్రాహ్మణులందరను వైదికులే. వేదవిహిత కర్మలాచరించు మనము (నియోగులు) గూడ వైదికులమే. రాజనీతి ధురంధరులై రాజ్యతంత్ర నిర్వహణమ్ము కొరకు రాజుల కొలువులో నియోగింపబడుటచే కొందరి బ్రాహ్మణులకు నియోగులను పేరు వచ్చినది. వైదికులును, నియోగులును, యజన – **యా**జన, అధ్యయన–అధ్యాపన, దాన-ప్రతిగ్రహణములను షట్కర్మ నిరతులే. కాని యుద్యోగ, నిర్వహణముచే నియోగులు యాజన, అధ్యాపన, ప్రతిగ్రహణములను వదలుకొనిరి. వైదికులను వారు షట్కర్మ లన్నిటిని పాటించుచున్నారు. కాన నియోగులకును, వైదికులకును బ్రాహ్మణ ధర్మము సమానమే. మీరీ నిరర్థక కలహములు రేకెత్తింప వలదు.'' అని కోటేశ్వరశర్మతో పలికి నియోగులకు, వైదికులకు హితబోధ చేయుచు ''నియోగి వైదికజన హితోపదేశః'' అను గ్రంథమును రచించిరి. ఇట్లు రామరావుగారి సంఘసేవ ఎంతయో కొనియాడదగినది.

విధి విలాసము విపరీతముగ నుండును గద! నిరంతర గ్రంథ రచనానిరతుడు, బ్రహ్మచింతా నిమగ్నుడునగు శ్రీరామరావు బాల్యము నుండి యజీర్ణవ్యాధితో బాధపడుచుండిరి. దీనికితోడు మధుమేహ వ్యాధి మరింత పీడింపసాగెను. తమ కిష్టము లేకున్నను బంధు, మిత్ర, శిష్యగణ నిర్బంధముచే చికిత్స కొరకు మద్రాసులోని సుప్రసిద్ధ యాయుర్వేద వైద్యులగు పండిత డి. గోపాలాచార్యుల వారి కడకేగిరి. వైద్యాచార్యులు వారిని పరీక్షించి కొంతకాలము మానసిక పరిశ్రమకు తావివ్వ గ్రంథ రచనము మానుకొనినచో వ్యాధికి చికిత్స చేయగలమని చెప్పగా శ్రీరామరావు దాని కంగీకరింపక చికిత్సను దిరస్కరించి స్వగ్రామమునకు మరలిరి. దిన దినమునకు వ్యాధి ముదురుటచే తమకంత్యకాల మాసన్నమాయెనని గ్రహించిరి. బంధు మిత్రాదులు, భార్య బలవంతపెట్టినను దత్తపుత్రుని స్వీకరింపరైరి. వ్యాధి తీవ్ర దశను చేరుటచే బంధు, మిత్ర, శిష్య, పండిత వర్గము శోకించుచుండ ఆనంద సంవత్సర కార్తీక శుద్ధ నవమి (27–10–1914) నాడు శ్రీరామరావు వస్తమించిరి.

వారి మరణానంతరము బంధువుల నిరాదరణము, శిష్యుల యజ్ఞాగ్రత వలన వారి యముద్రిత గ్రంథములలో కొన్ని నష్టము కాగా కొన్ని యన్యాక్రాంతము లయినవి. మిగిలినవి విజయవాడలోని అడ్వొకేటు శ్రీ పాటిబండ సుందరరావుగారి యధీనములో నున్నవి. శ్రీరామరావుగారి జీవితకాలములో కొన్ని గ్రంథములు మాత్రమే

ముద్రింపబడి ప్రకటింపబడెను. కాని యాంధ్రదేశము యొక్క, సంస్కృత వాఙ్మయముయొక్క సద్భాగ్యమాయనునట్లు నరసారావు పేట నివాసియు, ప్రఖ్యాత యాయుర్వేద వైద్యులు శ్రీ కంతా వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారాంధ్ర దేశమునందు సంచరించి వదాన్యుల నుండి విరాళములు సేకరించి శ్రీరామరాయ కవీంద్రుల యముద్రిత గ్రంథములను పెక్కింటిని నాగర లిపిలోను, తెలుగులిపి లోను ప్రకటించిరి. ఆపద్బాంధవునివలె శ్రీరామరాయకవి గ్రంథా వళి నాదుకొనుట చేతనే నేటికిని మనము కవిగారి గ్రంథములను చదువు భాగ్యము కలిగినది. శ్రీ శాస్త్రిగారీపని చేపట్టకపోయినచో శ్రీ రామరావు కీర్తిచంద్రికలు దిగంతముల వ్యాపించెడివి కావు, అస్మదాదులు వారి గ్రంథములను పరిశీలించు సద్భాగ్యమునకు నోచు కొని యుండెడివారము కాము. అచ్చయిన వీరి గ్రంథములు కొను వారలు లేక నరసారావుపేటలో చీకటి కొట్లలో మగ్గుచున్నవి. పండితులు, వదాన్యులు శ్రీరామరావు ముద్రిత గ్రంథావళిని కొని వారి ప్రతిభను, పాండిత్యమును గుర్తింతురు గాక!

శ్రీ రామరావు వ్రాసిన వివిధ గ్రంథములు దాదాపు 148 అని తెలియుచున్నది వాటిలో కొన్ని మిక్కిలి చిన్న గ్రంథములు, మరికొన్ని బృహత్ గ్రంథములు మన కుపలభ్యమానములగు ముద్రి తాముద్రిత గ్రంథముల నీ క్రింది విధముగ విభజింపవచ్చును.

I కావ్యములు

ఇవి స్వతంత్ర కావ్యములు, ఇతర కవుల కావ్యముల వ్యాఖ్యానములని రెండు విధములుగ నున్నవి.

(a) స్వతంత్ర కావ్యములు

అ. కంచర్పదర్ప విలాసభాణ
ఆ. రుక్మిణీ పరిణయ చంపూ
ఇ. శ్రీకృష్ణలీలా తరంగిణి
ఈ. సముద్ర మథన చంపూ

(b) వ్యాఖ్యానములు

అ. (మంధర మను పేరుకల) భాగవత చంపూ వ్యాఖ్య
ఆ. (సుమనో మనోభి రామమను) మురారి నాటక వ్యాఖ్య
ఇ. హనుమన్నాటక వ్యాఖ్య

II విమర్శ గ్రంథములు

అ. గుంజ గర్వ భంజనమ్
ఆ. పంచానన పలాయనమ్

III వ్యాకరణ గ్రంథములు

శరద్రాత్రి (సిద్ధాంత కౌముదీ వ్యాఖ్యానము)

IV స్తోత్ర గ్రంథములు

అ. కుమారస్వామ్యష్టకము
ఆ. దశావతారాష్టోత్తర శతనామావళిః
ఇ. పరమాత్మ సహస్ర నామావళిః
ఈ. రమారాధాష్టకమ్
ఉ. రమావల్లభరాయ శతకమ్
ఊ. ,, స్తోత్రమ్
ఋ. రామస్మరణాష్టకమ్
ౠ. వివర్ణాది విష్ణు సహస్ర నామావళిః
ఌ. విశ్వరూప గద్యమ్
ౡ. శివ భుజంగ ప్రయాతమ్.
ఎ. శ్రీ వీరరాఘవ స్తోత్రమ్
ఏ. శ్రీ వైజయన్తి
ఐ. హకారాది హయగ్రీవాష్టోత్తర శతనామావళిః
ఒ. ,, ,, సహస్ర నామావళిః
ఓ. హయగ్రీవ నవరత్న స్తుతిః
ఔ. హయరాజాష్టకమ్

V నీతి, ధర్మశాస్త్ర గ్రంథములు

అ. కరిభూషణమ్
ఆ. కామ మీమాంసా
ఇ. ధన వర్ణనమ్
ఈ. ధర్మ ప్రశంసా
ఉ నియోగి వైదికజన హితోపదేశః
ఊ. మోక్ష ప్రాసాదః
ఋ. విద్యార్థ విద్యోతః
ౠ. శూద్ర ధర్మ దర్పణమ్

VI పురాణాంతరార్థ వివరణ శ్లోకములు

(రామాయణ, మహా భారత, మహా భాగవతాంతరార్థములు వివరించు శ్లోకములు ఆరు).

VII అద్వైత గ్రంథములు

వీటిని గూడ స్వతంత్ర గ్రంథములు, వ్యాఖ్యాన గ్రంథములని యీ క్రింది విధముగ విభజింపవచ్చును.

(a) స్వతంత్ర గ్రంథములు

అ. అద్వైతాన్య మత ఖండనమ్
ఆ. అద్వైతామృతమ్
ఇ. అద్వైత విజయః
ఈ. దేహదేహి భావ నిర్మూలనమ్
ఉ. లోకాయతాదియోగాన్తమత ఖండనమ్
ఊ. వేదాన్తతత్త్వామృతమ్
ఋ. వేదాన్త నిశ్చయః
ౠ. వేదాన్త సంగ్రహః
ఌ. శంకరా శంకర భాష్య విమర్శః
ౡ. శారీరక చతుస్సూత్ర విచారః
ఎ. వేదాన్త ముక్తావళీ

(b) వ్యాఖ్యానములు

అ. కృష్ణోద్ధవ సంవాద వ్యాఖ్య (శ్రీ మద్భాగవతము నందలి ఏకదశ స్కంధములోని 7, 8, 9, 10, 11, 12వ అధ్యాయములకు వ్యాఖ్య)

ఆ. భగవద్గీతా భాష్యార్క ప్రకాశిక (శ్రీ శాంకర గీతా భాష్యమునకు విపుల వ్యాఖ్య)

ఇ. సిద్ధాన్త సిన్ధుః (శ్రీ మధుసూదన సరస్వతి విరచిత సిద్ధాంత బిందువునకు విపుల వ్యాఖ్య)

VIII ఇతర గ్రంథములు

1 చిత్ర ప్రభోపోద్ఘాతః
2 త్రిమత సమ్మతమ్
3 సుమనో మనోరంజనమ్
4 రామాయణాభ్యుదయ హరికథా.

శ్రీ రామరావు దాదాపు తమ గ్రంథము లన్నింటను రచన కుపక్రమించిన, ముగించిన తేదీలను భారతీయ కాలమానములో గుర్తించిరి. మన కుపలభ్యమానములగు గ్రంథములను పరిశీలించి

నచో వారి రచనా వ్యాసంగము "సముద్ర మథన చంపువు" తో 1903 లో ప్రారంభమయినట్లు కనుపించును. శ్రీ వేదాన్త దేశిక కృతమగు "యాదవాభ్యుదయము"ను పరిమాణములోబోలి 18మంజరులు కల 'సముద్ర మథన చంపువు''ను ఒక సంవత్సర కాలములో వీరు రచించిరి. మురారి నాటక వ్యాఖ్యను 1904 మే నెలలో ప్రారంభించి 5 నెలల కాలములో ముగించిరి. "సిద్ధాంత సింధు" వను బృహద్వ్యాఖ్యను 1906 సెప్టెంబర్‌లో ప్రారంభించి అక్టోబర్‌లో ముగించిరి. "శ్రీకృష్ణలీలాతరంగిణి"ని 1906-1908 లోను "శూద్రధర్మ దర్పణము"ను 1908లోను రచించిరి. వారి జీవిత సర్వస్వమనదగు (నాగరలిపి ముద్రణలో క్రౌన్-క్వార్టర్ సైజులో 1747 పుటలుకల) "భగవద్గీతా భాష్యార్క ప్రకాశిక" యనెడి బృహద్ గ్రంథమును 15-10-1908లో ప్రారంభించి 17-6-1909లో ముగించిరి. అద్వైత సర్వస్వమనదగు (ముద్రణలో 371 పుటలు క్రౌను-క్వార్టర్ సైజులో) "శంకరా శంకర భాష్య విమర్శః" యనువాద గ్రంథమును 1-3-1913 నాడు ప్రారంభించిరి కాని రోగగ్రస్తులగుటచే నది వారి మరణము నాటికి (27-10-1914) యసంపూర్తిగ నిలిచిపోయినది. మిగత గ్రంథముల నొక్కొక్కటిని ఒకటి-రెండు దినములలో రచించిరి. పైన పేర్కొనిన గ్రంథరచనా కాలమును పరిశీలించినచో శ్రీ రామరావు తమ మరణమువరకు విశ్రమింపక ఏదోయొక గ్రంథమును రచించుచుండిరని తెలియును. విధి నిషేధముల కతీతులగు యోగీశ్వరులగుటచే దాదాపు వారి రచనములన్నియు చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య దినములలో ప్రారంభింపబడినవి. గ్రంథాద్యంతములందు హయగ్రీవ వందన మొనరించిరి. తమ గ్రంథములనన్నింటిని హయగ్రీవుడే తన ద్వారమున వ్రాయించెననియు తాము కేవలము నిమిత్తమాత్రులనియు నుడివి తమ వినయమును ప్రకటించిరి. విషయ బాహుళ్యము, భావస్పష్టత, విపులీకరణ వీరి రచనముల లోని ముఖ్యవిశేషములు. జన్మనా నియోగి బ్రాహ్మణుడగుటవలన శ్రీ రామరావు తమ జీవిత ప్రారంభ కాలమున "...వ్యాసేన సూత్రితత్వాత్ భగవద్రామానుజాచార్యైరానందమయశబ్ద..." అని శ్రీరామానుజులను,[4] "......యదుక్తం భగవద్వేదాన్త దేశికేన..." అని శ్రీ వేదాన్తదేశికులను[5] మిక్కిలి గౌరవించుచుండిరి. కాని శ్రీవైష్ణవమతాచార్యులతో కలహము సంభవించి నప్పటినుండి తమ రచనలలో శ్రీ రామానుజులను, వేదాన్తదేశికులను, విశిష్టాద్వైతమును, శ్రీ వైష్ణవ మతమును మిక్కిలి తీవ్రముగ ఖండించిరి. శ్రీ వేదాన్తదేశికులు శాంకరాద్వైతమును దూషించుచు రచించిన 'శతదూషణి''ని మనసున నిడుకొని యా దూషణలన్నింటిని తమ "వేదాన్తతత్త్వామృతమ్", "భగవద్గీతా భాష్యార్క ప్రకాశిక", "శంకరాశంకర భాష్యవిమర్శ" లందు తీవ్రముగ ఖండించిరి. అంతేకాక విష్ణుపురాణమంతయు అద్వైతపరమేయని "శంకరాశంకర భాష్యవిమర్శ"లో షడ్విధలింగ తాత్పర్యములతో సప్రమాణముగ ప్రతిపాదించిరి. శ్రీరామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంతములో 14 దోషములు చూపి విశిష్టాద్వైతము శ్రుతిశేతిహాస పురాణాగమ యుక్త్యనుభవ విరుద్ధమని నానా విధోపపత్తులతో నుద్ఘోషించిరి. ఇట్లు తమ జీవితకాలమంతయు విశిష్టాద్వైత మత ఖండనమునకును నద్వైత ప్రతిష్ఠాపనమునకును వినియోగించిరి. "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా"యను మొదటి బ్రహ్మ సూత్రములోని "అత" శబ్దమునకు యుక్తియుక్తముగ 108 అర్థములు వివరించిరి.

హయగ్రీవశతకము, హకారాది హయగ్రీవ సహస్ర నామము మొదలగు బహువిధ హయగ్రీవ స్తోత్రములు రచించి హయగ్రీవోపాసకులకు క్రొత్త దారి చూపిరి. తమ 'శరద్రాత్రి'' యను వ్యాఖ్యతో కౌముదీ పఠన పాఠనములను సులభతరము చేసిరి. తాము రచించిన 'రుక్మిణీ పరిణయచంపూ, సముద్ర మథనచంపూ'' మొదలగు గ్రంథములకు తామే స్వయముగ అపవ్యాఖ్యాన భయముతో వ్యాఖ్యానములు వ్రాసిరి. వీరి"భాగవత చంపూవ్యాఖ్య" వీరి వ్యాఖ్యాన కౌశలమును చాటుచు మల్లినాథ సూరిని తలపింప చేయుచున్నది. వీరి వివిధ రచనములలోను, వ్యాఖ్యానములలోను రామాయణ, మహాభారత, భాగవత, అధ్యాత్మ రామాయణములుగాక 15 సీశములు, 18 పురాణములు, 16 అపూర్వ ధర్మశాస్త్ర గ్రంథములు (స్మృతులు), 28 కావ్యములు, 4 జ్యోతిష గ్రంథములు, 5 అలంకార శాస్త్ర గ్రంథములు, 7 వ్యాకరణశాస్త్ర గ్రంథములు, 7 విశిష్టాద్వైత గ్రంథములు, 20 అద్వైత గ్రంథములనుండి బహు విషయము లుదాహరింపబడినవి. అంతేకాక మీమాంసా శాస్త్రము, శిల్పశాస్త్రము, ఛందశ్శాస్త్రములు కూడా నుదాహృతములైనవి. ఇట్లనేక విధముల సంస్కృత సారస్వతమునకు సేవ జేసిన యవతార పురుషులు, అపరశంకరులనదగు శ్రీరామరాయ కవీంద్రుల యశశ్చంద్రికలు దశదిశల వ్యాపించి యాంధ్రుల యౌన్నత్యమును చాటుగాక!

శ్రీ రామరావు గారింతటి గొప్పవారయినను సంస్కృత, సాహిత్య, తత్త్వశాస్త్ర చరిత్రకారులు తమ History of Sanskrit literature, History of Indian Philosophy అను గ్రంథములలో వీరి సంస్కృత సాహిత్యసేవను, అద్వైతసేవను గుర్తింపలేదు. ఇది మిక్కిలి దురదృష్టకరము. ఆంధ్రులలో విద్యారణ్యుల తరువాత ఇంత గొప్పవారు పుట్టలేదని పలువురు నుడివిరి.[6] శ్రీ రామరావు బెంగాలులో గాని, తమిళ దేశములోగాని పుట్టియుండినచో యా దేశీయులు వారికి బ్రహ్మరథము పట్టియుండెడివారు. శ్రీ కవీంద్రుల రచనలను పరిశీలించినవారు కూడ నరుదుగ కనుపింతురు. కొంతమంది పండితులు శ్రీ రామరావుగారి రచనల గొన్నింటిని యాంధ్రీకరించి ప్రచురించిరి. ఇది కొంతలో ఎంతైనా మేలు. శ్రీ కవీంద్రుల మిగత రచనలను కూడ నితర పెద్దలు సంస్కృత ప్రియులైన వదాన్యుల సహాయముతో తమకు తోచిన విధముగ

ప్రచారముచేసి [7] శ్రీరామరాయ కవీంద్రుల కృపాపాత్రులగుదురు గాక!

అధోజ్ఞాపికలు

1 "A study of the life and works of Bellamkonda Rama Raya Kavi" అను విషయముపై పరిశోధనా వ్యాసము సమర్పించిన ఈ వ్యాసకర్తకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమువారు 1977వ సంవత్సరములో పిహెచ్. డి. పట్టప్రదానను చేసిరి.

2 శాకున్తలము I–2

3 శ్రీ రామరావుగారి సమస్య తప్పనటయే తప్పు అని చెళ్ల పిళ్లవారు నుడువుచు శ్రీ రామరావువంటి మహాపండితులతో తమకు వైమనస్యము కలిగినందులకు చింతించుచు వారి ప్రతిభకు జోహారు లర్పించిరి. చూడుడు: చెళ్ళపిళ్ళ వారి "కథలు-గాథలు", సంపుటము 3, పేజీలు 467–479.

4 సముద్ర మథనచంపూ, I–1 వ్యాఖ్యానము (అముద్రితము)

5 భాగవతచంపూ వ్యాఖ్య (కవితా సుబ్రహ్మణ్యశాస్త్రి, నరసారావుపేట, చే 1961లో నాగరి లిపిలో ప్రకటితము), పుట 292.

6 భారతి, 1928 జనవరి, పుటలు 159–160.

7 ఈ వ్యాసమందలి పెక్కు విషయములు శ్రీ రామరావు శిష్యులు శ్రీ లంకా సుందరరామశాస్త్రి రచించిన "బెల్లంకొండ రామరాయ జీవిత చరిత్రము" నాధారముగ చేసుకొని వ్రాయబడినవి.

ఆలోచనల సముద్రం

గాలితో పూలుచేసే
సంభాషణ వింటానికైనా,
సాలీడు అల్లిక శబ్దాలు వింటానికైనా,
గుండుతో తుపాకీ చేసే
మూగభాష వింటానికైనా,
ఏకాంతం కావాలి

ఏకాంతంలో ...
మెదడు టేప్ రికార్డరై
ఆటోమేటిక్‌గా స్టార్టయ్యి
దాచిపెట్టబడ్డ జ్ఞాపకాల్ని
తవ్వి తీస్తుంది

ఏకాంతంలో ...
నా అంతరంగాన్ని
నా ప్రజల అంతరంగాల్ని
చూడ్డానికి ప్రయత్నిస్తా –

ఎప్పుడన్నా
ఏకాంతం బోరుకొట్టించినా,
ఎప్పుడూ...అది
ఆలోచనల సముద్రం.

జ్ఞాపకాలు

జీవితంలో
అందం ఎక్కడుందంటావ్ ?
అందం జ్ఞాపకాల్లోనే వుందని. నేనంటా –
నా మనస్సే నా 'డైరీ'
నా హృదయమే 'నా ఆల్బమ్'
నా మెదడే నా 'కెసెట్'
నా జ్ఞాపకాలన్నీ వీట్లో దాగివుంటాయి
కోరినప్పుడల్లా –
కన్పిస్తూ ... విన్పిస్తూ ...
జ్ఞాపకాలు
కలవర పెట్టినా, బాధపెట్టినా
అందం, గొప్పదనం జ్ఞాపకాల్లోనే –
ముప్పావలా జీవితం తర్వాత
జీవితం నుంచి రిటైర్ అయ్యేంత వరకూ
మనం మననం చేసుకోవాల్సింది
జ్ఞాపకాల్నే !

జింబో

శ్రీ కలువకొలను సదానంద

స్థితి

ఆకాశపు టంచులకు ఎగబాకే పండువెన్నెల నవ్వులూ, ఇంకిపోయిన సముద్రాలనుసైతం కన్నీటి కెరటాలతో నింపగలిగిన ఏడుపులూ మనిషి జీవితంలోనే వున్నాయి.

అయితే, మనిషికి అస్తిత్వం లేదు. వచ్చేటప్పుడు వెంట తెచ్చుకునేదీ, పోయేటప్పుడు మోసుకుపోయేదీ మనిషికి ఏదీలేదు.

మనిషికిలేని అస్తిత్వం మృత్యువుకు వుండటమన్నదే విచిత్రం! నలభై ఏళ్ళ కిందట నవవధువు ఒకతె మొగుడి మునిపంటి నొక్కులను తీయగా భరించి, నవ్వుతూ నవ మాసాలు మోసి ముక్కిమూలిగి కెవ్వున కేకవేసి ఒక నర ప్రాణిని ప్రసవించి 'రుద్రమూర్తి' అని నామకరణం చేస్తే, పుట్టి బతుకుతున్నవాడు రుద్రమూర్తి అని వ్యవహరిస్తున్నాం మనం. నిజం అదికాదు. మృత్యువు పుట్టింది. రుద్రమూర్తిని వెంట తెచ్చుకొన్నది, అడివికి వేటకు వచ్చిన మహారాజు హాస్యగాణ్ణి వెంటబెట్టుకు వచ్చినట్లు! మృత్యువు పోతూ పోతూ రుద్రమూర్తిని ఎత్తుకుపోతుంది, రాచపీనుగు తోడు పీనుగులో వెళ్ళినట్లు!

వేదాంతుల పరిభాషలో మనిషి మాయ కావచ్చు, జీవితం గాలిబుడగే కావచ్చు; అయితే నూరేళ్ళ దీర్ఘకాలనిమేషంలో ప్రచండ గ్రీష్మాలని అంటిపెట్టుకుని నూరు శరత్తులున్నాయి. పంచేంద్రియాలకే తప్ప ఇంద్రియాతీత జీవితానికి అందని పాంచభౌతికానందాలూ, కారుణ్య రసవాహినులకు జీవంపోసే సజీవ హృదయ స్పందనలూ వున్నాయి. అందుకే జీవితం విలువైనది!

మృత్యువు మనిషిని ఆడుకోనిస్తుంది, పాడుకోనిస్తుంది. తాను వేరు, జీవితం వేరుఅన్నట్లుగా నక్కుతూ నడయాడుతుంది. ఎప్పుడో వీలుచూసుకుని, వేటగాడు చెట్టుచాటున పొంచి పిట్టను కొట్టినంత పనిచేస్తుంది. అయితేనేం? జీవితం ఒక సరళరేఖ అనుకుంటే, మరణం ఒక బిందువు మాత్రమే!

మరణాన్ని జయించే మేధస్సు మనిషికి లేకపోవచ్చు. కానీ ప్రతి మనిషి జీవితాన్నీ సరళ రేఖగాను, మరణాన్ని బిందువుగానూ నియంత్రించుకోగల వ్యవస్థను నిర్మించుకోలేనంత చవట కాదు మనిషి. అయితే మనిషి ఒంటరివాడు. స్వార్థపరుడు.

రుద్రమూర్తికి జీవితం సరళరేఖాకాదు, మృత్యువు బిందువూ కాదు. జీవితమే మరణం. ఏది జీవితమో, ఏది మరణమో తెలియని అద్వైత స్థితి అతని బతుకు. పుట్టినప్పటి నుంచీ కళ్ళెదుట తిష్ఠవేసుకుని, పట్టుకుపోయే ప్రయత్నంలోనే వుంది మృత్యువు. దొరికిపోయిన కేడీ రుద్రమూర్తి. దొంగల గుండెల్లో నిద్రపోయే బ్రుమీసాల పోలీసు—మృత్యువు. బందీ ఒంటేలు పోసుకోవాలన్నా, మర్మాంగంలా అంటిపెట్టుకునే వెంటవస్తాడు పోలీసు.

రుద్రమూర్తిని ఒక్కపెట్టుకు చావనివ్వలేదు మృత్యువు. నొక్కి అదిమి పట్టుకుంటే మూడు నిమిషాల్లో నిగుడుకునే కళ్ళెను నలభై ఏళ్ళనుంచీ నరకయాతనలు పెడుతూనే వుంది. రుద్రమూర్తి గుర గుర మంటూనే వున్నాడు, అమృతం తాగివచ్చిన పందిపిల్లలా.

లోకం అద్దెకొంప అంటాడు విరాగి. లోకంలో తనకో స్వంత యింటిని సంపాదించుకుంటాడు రాగి. ఉన్నవాడికి ఒక్క యిల్లయితే లేనివాడికి వెయ్యి యిళ్ళు అని సరిపెట్టుకుంటాడు ఆర్థికరోగి.

వెయ్యి యిళ్ళ యజమాని-రుద్రమూర్తి తన ఆయుష్కాలం పూర్తయ్యే లోపున ఆ యిళ్ళన్నిట్లోనూ కాపురం చెయ్యాలని ముచ్చటపడ్డాడు కాబోలు, అతని జీవితమంతా ఇళ్ళు మార్చటంతోనే గడిచిపోయింది. మకాం పెట్టే వరకే అవి యిళ్ళు. ఆ తరవాత పులి బోనులు. బోనులోకి వెళ్ళి తలుపు మూసేసుకుని పులితో సహవాసం చెయ్యగలడా మనిషి? బోనులో నుంచి బయటపడటం, పరుగు, మళ్ళీ మరో బోను, మళ్ళీ పరుగు ... ఇదీ రుద్రమూర్తి జీవితం!

జెండా వీధిలోవున్న బోను తనది అనిపించుకోటానికి భగీరథ ప్రయత్నమే చేశాడు రుద్రమూర్తి. వారం రోజుల్లో ఆ యిల్లు ఖాళీ అవబోతుందనగా వెళ్ళి చూశాడతను. అందులో పండుముసలిది ఒకతె వుంటున్నది. ఆ యింట్లోనే రెండు నెలల క్రితం ఆమె మొగుడు పోయాడట. పొరుగూళ్ళో బెల్లం ముక్కలాంటి పెళ్ళాంతో కాపురం చేసుకుంటోన్న కొడుకు దగ్గరికి వెళ్ళిపోయి కోడలికి భారంగా బతకవలసి వస్తున్నది కదా అని కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది ముసలిది. ఇల్లంతా చూపించింది. ఇల్లు సౌకర్యంగా వుందని ఆమే అన్నది. వండి తినటానికి ఒక గదీ, తిని పడుకోటానికి ఒక గదీ వున్నాయి. పెరటిలో ఒక వైపు నుయ్యి, మరోవైపు ఫ్లెష్ ఔట్ లెట్రిన్, డాబా మెట్లూ వున్నాయి. కరెంటూ వుంది, మీటరూ వుంది. "అద్దె ముప్పై రూపాయలిస్తున్నాం నాయనా! ఇప్పుడు మరో ఇరవై పెంచేటట్లున్నారు. ఇప్పటికే ఇద్దరు ముగ్గురొచ్చి చూసిపోయారు. ఈ యిల్లు నీకు దొరుకుతుందో లేదో!" అన్నది ముసలిది.

''అవ్వా! ఈ యిల్లు ఎవరిది?'' అని అడిగాడు రుద్ర మూర్తి.

''సంగా రంగారెడ్డిది.''

''అదేమిటవ్వా? సంగ రంగారెడ్డి చచ్చిపోయి, ఇరవై ఏళ్ళ యింది కదా?''

''ఆయన పోతే ఏమి నాయనా? ఆయన కొడుకున్నాడుగా?''

సంగా రంగారెడ్డి కొడుకు సంగా పట్టాభి రామిరెడ్డి, స్కూల్ ఫైనల్ వరకూ రుద్రమూర్తితో కలిసి చదువుకున్నాడు. పట్టాభి తనమీద దయమాలి, యిల్లు మరొకరికి ఎలా యివ్వగలడన్న ధీమా కలిగింది రుద్రమూర్తికి.

వెంటనే లక్ష్మీనగర్‌కి వెళ్ళాడు. లక్ష్మీనగర్‌లో అన్నీ ఇంద్ర భవనాలే! ఇంట్లో పట్టాభి లేడు. ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని రైల్లో బస్సో ఎక్కి ఎక్కడో కాంచన ద్వీపానికి వెళ్ళి చీకటి పడ్డాక యింటికి వస్తుంటాడు.

పట్టాభి తల్లి ''ఏమిటి సంగతి?'' అని అడిగింది.

''అమ్మా! జెండా వీధిలో మన యిల్లు ఖాళీ అవుతుంద టా? అది నాకు కావాలి!''

''జెండా వీధిలో ఏ యిల్లు?''

''జెండా యిల్లే!''

''జెండా యిల్లంటే ఏదయ్యా? కింద రెండు వాటా లున్నాయి, పైన రెండు వాటాలున్నాయి, పక్కన సందులోంచి వెళితే, వెనక ఒక యిల్లుంది. ఖాళీ అయ్యేది ఏ యిల్లు?''

''వెనకిల్లేనమ్మా! ఫలానా ముసలాయన చచ్చిపోయిన ఇల్లు!''

''ఏమిటీ! ఆ ముసలాయన చచ్చిపోయాడా? ... హాఁ! ఎక్కడో ఒకచోట చావాల్సిందే కదా? ... ఇప్పుడా యింటికి నువ్వొస్తావా?...వెళ్ళి సారథి నడుగు. ఈ విషయాలన్నీ వాడే చూసు కుంటాడు.''

''సారథి ఎవరు?''

''మన గుమాస్తా. మండీలో వుంటాడు పో!''

మండీకి పరుగుతీశాడు రుద్రమూర్తి.

''చెయ్యి దాటిపోయింది సార్! మరో మనిషికి మాటివ్వడం జరిగిపోయింది. ఒక నెల అద్దె ఏభై రూపాయలు అడ్వాన్సు కూడా యిచ్చేశాడతను.'' అన్నాడు సారథి.

''అలా అంటే ఎలా సారథీ? నేను పట్టాభి స్నేహితుణ్ణి కదా?'' అన్నాడు రుద్రమూర్తి.

''స్నేహితులైతే నన్నేం చెయ్యమంటారు? ఆయన్నే అడ గండి!'' అన్నాడు సారథి.

ఆ సాయంకాలం కాంచన ద్వీపం నుంచి తిరిగి వచ్చిన పట్టాభిని రైల్వే ప్లాట్‌ఫారంలోనే కలుసుకుని, మహజరు సమర్పించు కున్నాడు రుద్రమూర్తి.

పట్టాభి ముఖం ఎప్పుడూ ప్రసన్నంగా వుంటుందని అంటారు అందరూ. ఆ మాట నిజంకాదు. పట్టాభి ప్రసన్నతను అభినయిస్తాడు. ''అలాగేలే రుద్రా! ఇల్లే కదా? ఆ వ్యవహార మంతా అమ్మకే వొదిలేశాను. అమ్మను ఒకమాట అడిగి, సారథితో చెబుతాలే!'' అన్నాడు ప్రసన్నంగా.

అమ్మ సారథి మీదికి, సారథి పట్టాభి మీదికీ, పట్టాభి అమ్మ మీదికీ నెట్టేస్తూ, వారం రోజుల పాటు రుద్రమూర్తిని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాపించి, అతడి చేతికి తాళం చెవి యిచ్చారు, బంగారపు కడ్డీ యిచ్చినట్టు.

రుద్రమూర్తి సంతోషంతో పొంగిపోయాడు. కృతజ్ఞతా భావంతో కృంగిపోయాడు. పట్టాభి కాలితో చెయ్యమన్న పనైనా సరే, చేతితో చెయ్యాలని మనస్సులోనే ఒట్టు పెట్టుకున్నాడు. ఆ మేరకు, ఆ తరువాతి రోజుల్లో, ఒకసారి ఊళ్ళో మంత్రిగారి సభ జరిగితే, మంత్రిగారిని పొగుడుతూ పట్టాభికి ఒక ఉపన్యాసం వ్రాసి యిచ్చాడు. వేదిక మీద పట్టాభి ఆ ఉపన్యాసం చదివి అందరిచేతా శెహబాస్ అనిపించుకున్నాడు. మరోసారి ఒక సభలో రుద్రమూర్తి స్వయంగా ప్రసంగిస్తూ, పట్టాభిని పావుగంటసేపు ప్రస్తుతించి, అప్రస్తుత ప్రసంగం చేశాడన్న అపకీర్తి తెచ్చుకున్నాడు.

తాళంచెవి పుచ్చుకున్న రుద్రమూర్తి తొందర్లోనే ఓ మంచి రోజు చూసుకుని, పుస్తె కట్టించుకున్న దిక్కుమాలినదాన్ని వెంట బెట్టుకుని వేకువజామున ఐదు గంటలకు కొత్త బోనులో కాలు మోపాడు. పాలకడలిపై శేషతల్పాన శయనించి పెళ్ళాంచేత కాళ్ళు పట్టించుకుంటున్న విష్ణుమూర్తి పటాన్ని కూడా వెంట తెచ్చు కున్నాడు. పొయ్యిఅంటించి పాలుపొంగించాడు. పటానికి నైవేద్యం పెట్టి పటపటమని చెంపలు వాయించుకున్నాడు. ఆ సాయంకాలమే తన నలుగురు పిల్లల్నీ, నాలుగు మట్టి పెంకుల్నీ ఆ యింటి నుంచి ఈ యింటికి చేరవేశాడు. తన శేషజీవితం ఇక నిశ్చింతగా గడిచి పోతుంది లెమ్మనుకున్నాడు.

అప్పటికి జీవితంలో పూర్తిగా అలసిపోయి, మిథ్యావాదాన్ని ఆశ్రయించి, తద్వారా ఉపశమనాన్ని పొందే స్థితికి చేరుకున్నాడు రుద్రమూర్తి. నిద్రాహార మైథునాలే కాక, లోగడ మరొక కోరిక కూడా వుండేదతనికి, తన శవం వల్లకాటికి వెళ్ళేటప్పుడు తన స్వంత యింట్లో నుంచే బయలుదేరాలని! ఆ కోరిక ఈ జన్మలో ఈడేరదని తెలుసుకోటానికి చాలా కాలం పట్టింది. వేనకు వేలు కుమ్మరించి తాను ఇల్లో, ఇంటి జాగానో కొనుక్కోలేదు. చస్తే, పీనుగును కదల్చటానికైనా శక్తిలేని తన నెత్తిన కులం శనిదేవతలా కూర్చున్నది. ఇళ్ళు లేనివారికి ఇళ్ళ స్థలాలు పంచిపెట్టిన చేయి, 'నీది తక్కువ కులం కాదే, నీకిలాంటి తక్కువ బుద్ధులు తగునా? పో అవతలికి!' అంటూ రుద్రమూర్తి నెత్తిన మొట్టింది. ఇళ్ళ

స్థలాల వేటలో విఫలుడైన రుద్రమూర్తి. 'ఒరే! శక్తికి మించిన ఆలోచనలు పెట్టుకోవటం తప్పుకదూ? నివేశన స్థలం దొరికితే మాత్రం ఏం చేసుకుంటావ్ చెప్పు? గొయ్యితీసి పైన మట్టి పోసుకుంటావా? ఇల్లు కట్టుకునే సత్తా నీకుందా ? ఇల్లంటే అగ్గిపెట్టె అనుకున్నావా ? ఇటుకలంటే, పారేసిన పేకముక్కలనుకున్నావా? కలప అంటే, పూడిపోయిన పలక చెక్కలనుకున్నావా ? సిమెంటంటే, పొయ్యిలో బూడిదనుకున్నావా ? కూలీలచేత పని చేయించుకోవటమంటే, మంత్ర తంత్రా లనుకున్నావా ? పిచ్చి నాగన్నా! ఇల్లూ ఇల్లూ అని కలవరించటం మానేసి, ఇంట్లో బియ్యం వున్నాయో, నిండుకున్నాయో చూడు!' అంటూ తనని తాను ఊరడించుకున్నాడు.

ప్రవాహంలో నువ్వొక పూచిక పుల్లవి. నీ శక్తి అత్యల్పం. ఎదురీదకు! ఏవైపు కొట్టుకుపోతున్నాం, ఎక్కడికి చేరుతాం అన్న జిజ్ఞాసేవద్దు. కాలం ఊబిలో చిక్కుకున్నావు. అది క్రమక్రమంగా నిన్ను బాధిస్తూనే నిన్నూ, నీ బాధల్నీ కూడా మింగేస్తుంది. అదే నీకు విముక్తి! కలిమీ, లేమీ అన్నవి పరస్పర విరుద్ధ స్థితులే అయినా, రెండూ మిథ్యే! అంటే కలిమీ లేమీ రెండూ ఒకటే!... ఈ తత్వానికి తలవంచేశాడు రుద్రమూర్తి.

మూడు రోజుల రైలు ప్రయాణానికి టిక్కెట్టు కొనుక్కున్నావు. బోగీలో తొక్కిసలాట. కూర్చోటానికి చోటులేదు. బొటన వేళ్ళమీద ఊనుకుని, ఒంటి కాలిమీద నుంచుని రెండు రోజులు ప్రయాణం చేశావు. మూడో రోజున పూర్తిగా ఒక బెర్తు దొరికింది. ఎక్కి పడుకున్నావు. అప్పుడు నీకెలా వుంటుంది ? మరో మూడు మైళ్ళ దూరంలో ప్రమాదం జరుగుతుందేమోనన్న ఆలోచన వచ్చినా, రైలు భూలోకం విడిచిపెట్టి గ్రహాంతరయానం చేస్తున్నదన్న భ్రమ కలిగినా, నువ్వు చలించవు. విశ్రాంతినే కోరుకుంటావు. నిద్ర చెదిరిపోకూడదనుకుంటావు. దొరికిన బెర్తే బ్రహ్మానంద సింహాసన మనుకుంటావు. జీవితంలో ఎన్నో మజిలీలు దాటినతర్వాత, రుద్రమూర్తి చేజిక్కించుకున్న నమ్మకమైన బెర్తు జెండా వీధిలోని యిల్లు.

అయితే, ఆ యిల్లు తన పాలిటి రుద్రభూమి అవుతుందని మొదట అనుకోలేదు రుద్రమూర్తి.

కాపురం చేరిన మొదటి మూడు నెలల్లో ఇంటిల్లిపాదీ వరసగా రెండేసిసార్లు మలేరియాకు లోనయ్యారు. ఆ వూళ్ళో చెయ్యి వాసి బాగున్న డాక్టరుగారు 'అంతా దేవుడి చలవ!' అంటూ మనసులోనే దండం పెట్టుకున్నాడు. ఆ తరవాత, వాళ్ళందరి శరీరాలూ, రక్తమూ, శ్వాసావయవాలూ, పంచేంద్రియాలూ ఆ యింటి వాతావరణానికి అలవాటు పడిపోయాయి.

ఇక్కడ, జెండా బిల్డింగు బ్లూప్రింటు ఎత్తిచూపటం అవసరం. పశ్చిమాభిముఖంగావున్న ఆ భవనానికి ఇరువైపులా వలయాకారపు మెట్లచివర రెండు సిమెంటు జెండాలు కదలకుండా మెదలకుండా నిలబడి వుంటాయి, నంది విగ్రహం నెత్తిన కొమ్ముల్లా! నెలకు ఎనభయ్యేసి రూపాయలు చెల్లిస్తూ కింద రెండు కుటుంబాలూ, పైన రెండు కుటుంబాలూ అద్దెకుంటున్నాయి. పక్కన సందులోంచి వెడితే, వెనకవైపున రుద్రమూర్తి యిల్లు వుంటుంది. రుద్రమూర్తి యింటి వాకిట్లో నిలబడిచూస్తే సిమెంటు జెండాలు కనిపించవు. గుమ్మానికి మూరెడు దూరంలో ఎట్ట ఎదుట, కిందివాటాల పెరటి తలుపులు రెండూ బార్లా తెరుచుకుని వుంటాయి, ప్రసవ వేదనాభారంలో సిగ్గెగ్గులపైన ధ్యాసకోల్పోయిన తొలిచూలాలిలా! రెండు పెరళ్ళలోని మురుగు దొడ్లూ, అభిషేకానికిముందు అలంకారాలన్నీ ఒలిచి పెట్టేసిన దేవుడి విగ్రహాల్లా నగ్నంగా కనిపిస్తుంటాయి. పై వాటాలనుంచి మురుగు నీళ్ళు కిందికి పోవటంకోసం, రుద్రమూర్తి యింటి గుమ్మంలోనే రెండు సిమెంటు పైపులున్నాయి, కిందికి జారి వేళ్ళు తన్నుకున్న మర్రి ఊడల్లా! ఆ నాలుగిళ్ళ మలమూత్రాలూ, మురుగునీళ్ళూ రుద్రమూర్తి యింటి అరుగున మూతపెట్టిన రెండు కాలవల గుండా కదిలివెళ్ళి అవతల పడిపోతుంటాయి. రుద్రమూర్తి యింటి పెరటి తలుపు తెరిస్తే, తూరుపు దిక్కు దర్శనమిస్తుంది. అయితే, అందంగా వుండవలసిన తూరుపు పరమరోతగా వుంటుంది. పెద్ద మురుగు కాలవ. కాలవగట్టున మిరపతోట. దిగువ ఎక్కడో మళ్ళించిన మురుగు నీళ్ళతో మిరపతోట పండుతూ వుంటుంది. కాలవ పొడుగునా చాలాభాగం యిసుక మేటలే! రుద్రమూర్తి యింటి దగ్గిర మాత్రం, మోకాటిలోతు బురదలో పందులు పొర్లాడుతుంటాయి. కంటితో చూడనలవికాని పదార్థాలన్నీ రుద్రమూర్తి పెరటి గోడ కింది తూముల్లోనుంచి కాలవలోకి దూకుతుంటాయి.

ముందువైపుగానీ, వెనకవైపు గానీ తలుపు తెరవాలంటే భయం. ముక్కులు బద్దలయ్యేంత కంపు ఆగి ఆగి ఉప్పెనలా వచ్చి పడి ముఖంమీద మొత్తేస్తూ వుంటుంది. శ్వాస ఆగిపోతే ప్రాణం పోతుంది. రుద్రమూర్తి యింట్లో శ్వాసించటమన్నదే పెద్దచావు. వచ్చిన కొత్తలో అతను మేలురకం అగరువత్తులు కొనుక్కొచ్చి వెలిగించాడు. నెలరోజుల తరవాత, ప్రయోజనం లేదని తెలుసుకుని ఆ పని మానేశాడు.

రుద్రమూర్తికి గాలీ, వెలుతురూ, చెట్టుచేమా, ఎండా, వానా, వెన్నెల, చుక్కలు, వేకువ, సంధ్య మొదలైన ప్రకృతి సొగసులంటే చాలా యిష్టం. వాటికోసం అతను ఉదయమో లేదా సాయంకాలమో మాత్రమే డాబామీదికి వెళ్ళవలసి వుంటుంది. డాబా మీదనుంచుని తూర్పుదిశగా చూస్తే మురుగునీళ్ళతో పెంచే మిరపతోట, దాని పక్కన సున్నపు బట్టీలు, గోతులూ కనిపిస్తాయి. కింద కాలువలో మురుగు లుకలుక లాడుతూ వుంటుంది. ఎప్పుడూ ఎవరో ఒకరు—ఆడ, లేక మగ—బట్ట పైకి మడిచి పెట్టుకుని వెనక్కి తిరిగి కూర్చుని వుంటారు. సాయంకాలాల్లో అయితే, ఆకాశం ఎర్రబడగానే, దోమలు ఇనప మేకుల్లావచ్చి పైన బడతాయి. నాలుగైదు నిమిషాలు డాబామీద నిలబడ్డ తర్వాత, రుద్రమూర్తి తప్పనిసరిగా కిందికి దిగి వెళ్ళిపోవలసిందే!

పట్టపగలే ఇంట్లోనూ, మరుగుదొడ్డిలోనూ దోమలు స్వైరవిహారం చేస్తుంటాయి. పొద్దుపోతే యిక వాటి పరాక్రమానికి ఎదురులేదు. ఇంటినిండా దోమలే! మొదట వాటికి కాకులు అని పేరు పెట్టాడు రుద్రమూర్తి. పిదప గద్దలన్నాడు. ఆ పేరు కూడా సరిపోదనుకున్నాక, రాబందులన్నాడు. అంతటితో తృప్తిపడక, గండభేరుండ పక్షులన్నాడు.

గండభేరుండ పక్షులనుంచి ఆత్మరక్షణ చేసుకోవటం ఎలా? మస్కిటో ఫాయిల్స్ కొనటం మొదలుపెట్టాడు. అందుకోసం నెలకు పదిరూపాయల ఖర్చు. ప్రారంభంలో గండభేరుండాల గుంపు తగ్గినట్లే అనిపించింది. అయితే అవి క్రమంగా ఆ మందు పొగను కూడా లొంగదీసుకునేశాయి.

దోమతెరలు కొనుక్కోవాలన్న జ్ఞానంలేని మూర్ఖుడు కాడు రుద్రమూర్తి. అప్పుగా లభించేట్లయితే అండపిండ బ్రహ్మాండాన్నయినా కొనేయగలడు. అయితే తనకు అప్పుదొరికే కొట్లో మస్కిటో ఫాయిల్స్ వున్నాయిగానీ, దోమతెరలు లేవు. డబ్బుపెట్టి కొనుక్కోవాలంటే, దోమతెరలు కొనగలిగినంత డబ్బు అతడి దగ్గిర ఎప్పుడూ వుండదు.

రాత్రి తెల్లవార్లూ రుద్రమూర్తి యింటి బయట నిలబడే ఓపిక ఎవరికైనా వుంటే, లోపల ఛెళ్ళు ఛెళ్ళున ఒళ్ళు చరుచుకుంటున్న చప్పుళ్ళు వినగలరు వాళ్ళు. రుద్రమూర్తి పెళ్ళాం పిల్లలు దీపాలు ఆర్పేసి పడుకున్నాక, గంటసేపు దోమల్ని చరుచుకుంటూ, అలసి నిద్రపోతారు. మూడు యాములు పూర్తయ్యాక కానీ, రుద్రమూర్తికి నిద్రపట్టదు. అటూ యిటూ పొర్లుతూనే వుంటాడు. ఒళ్ళంతా బాదుకుంటూ వుంటాడు. నడివీపున చరుచుకోవడం కూడా, అభ్యాసంవల్ల సులువైన పనైపోయిందతనికి. ఒక్కొక్క చరుపుకు గొంగళి పురుగంత దోమ చితికి, వేలికంటుకుంటుంది. పెళ్ళాం పిల్లలపైన సానుభూతి చంపుకోలేక, అప్పుడప్పుడూ లేచి లైటు వేస్తాడతను. కాకుల గుంపుల్లా పైకి లేస్తాయి దోమలు. అందరివైపూ ఒకసారి చూస్తాడు. ఉక్కకు రవిక విప్పేసుకుని చెమటలో దొప్ప దోగుతున్న తన పెళ్ళాం రొమ్ముమీద ఒక్కచరుపు చరిచి, ఒక మశకాసురుణ్ణి హతమారుస్తాడు. గులాబీ మొగ్గలాంటి తన కూతురి చెక్కిలిమీద ఒక చరుపు చరుస్తాడు. చెడ్డీ విప్పేసి బోరగిల పడుకున్న తన చిన్న కొడుకు పిర్రమీద ఒక్క చరుపు చరుస్తాడు. లేచి నిలబడి, కర్రసాము చేసేవాడిలా గిరగిరా తువ్వాలు తిప్పుతూ చెంగనాలు వేస్తాడు.

దోమలకు తోడు, పడకచుట్టూ బొద్దింకలూ, మురుగు కాలవలోంచి పాకి వచ్చిన కప్పలూ!

కిందివాటాల పెరళ్ళు రెండూ గుమ్మానికి ఎదురుగా వుండటంతో, దొడ్డికి కూచున్న వాడి ముడ్డిదగ్గిర ముఖంపెట్టి పడుకున్నప్పటి అనుభూతి నిత్యనూతనమైపోయింది రుద్రమూర్తి కాపురంలో. రాత్రింబవళ్ళూ ఏకధాటీగా, ముక్కూ చెవులూ కళ్ళూ భరించలేనంత వాసనా, ధ్వనీ, రోతా! పాచిపట్టిన పెరటినేల ఎండలికి ఆరటంకోసం ఆ తలుపులు పగలల్లా తెరిచే వుంటాయి. లోపలి తలుపులు మూసివుంటాయి. అవసరమైనప్పుడల్లా లోపలి తలుపులు తెరుచుకోవడం, పెరటి తలుపులు మూసుకోవటం, మరుగుదొడ్ల తలుపులు తెరచి మూసుకోవటం; అవసరం తీరాక మూసిన తలుపులు తెరచుకోవటం, తెరచిన తలుపులు మూసుకోవటం జరుగుతుంటాయి. అవసరంలేని సమయమేలేదు. అనుక్షణం 'ఈ పని జరుగుతూనే వుంటుంది. ఆ గోడకూ ఈ గోడకూ మధ్య మూరెడు ఎడం మాత్రమే వుండటంవల్ల, ఆ శబ్దాలన్నీ చెవుల్లో మార్మోగుతుంటాయి. ఉదయంపూట తలుపులు సంగీత సాధన చెయ్యటం, అంటగిన్నెలు ఖంగు ఖంగు మనటం, ముఖం కడుక్కుంటూ తుర్రున ముక్కు చీదటం, క్యాక్కుమని ఖాండ్రించటం లాంటివి గూబల్ని అదరగొట్టేస్తాయి. రాత్రిళ్ళు పెరటి తలుపులు మూసుకుంటాయిగానీ, అవి శబ్దాలను మాత్రం అడ్డుకోలేవు. శబ్దం శ్రావ్యంగా వుంటుంది, అది లయబద్ధమైనప్పుడు! శబ్దం నిరపాయకరంగానే వుంటుంది, దాన్ని వినటానికి మనం సిద్ధంగా వున్నప్పుడు! కింది వాటాలనుంచి వచ్చే శబ్దాలు లయబద్ధమైనవీ కావు, అవి చెప్పి వచ్చేవీ కావు.

నడిరేయిదాకా అప్పుడప్పుడూ కిందివాటాల పెరళ్ళ లోపలి తలుపులు ఢభాల్‌మంటూ తెరుచుకుంటాయి. మరుగు దొడ్లకున్నవి రేకు తలుపులు. అవి ఢర్‌మంటాయి. కొంత విరామం. ఆ విరామంలో కూనిరాగం. కాకపోతే ఈలపాట. తరవాత ధపధపమంటూ ముడ్డి కడుక్కుంటున్న చప్పుడు. బుడుక్కు డుబుక్కుమంటూ రెండు బక్కెట్ల నీళ్ళు బిలంలోకి దూకేస్తాయి. మళ్ళీ మరుగుదొడ్డి తలుపు ఢర్‌మంటే, లోపలి తలుపు ఢభాల్‌మని వంత పాడుతుంది. చెవిలోనే మరుగుదొడ్లూ పెరళ్ళూ వున్నాయా అనిపించే ఈ శబ్దాలు వినటానికి సిద్ధంగాలేని రుద్రమూర్తి ఉలికులికి పడుతుంటాడు. అతని గుండె దడదడలాడిపోతుంది. సిమెంటు జెండాల వెనక్కి వచ్చాక, అతనికి గుండెదడ అనే జబ్బు కూడా ప్రారంభమైంది. రోజుకి రెండు మూడు కాంపోజ్ మాత్రలు మింగటం అలవాటైంది. తనమీద తనకెంత జాలివుందో, ఎదుటి వాటాల వాళ్ళమీద కూడా అంతే జాలి వుంది అతనికి. పాపం, వాళ్ళు చేసిన నేరం ఏముంది? పెరడూ, దొడ్డీ మానవుడికి నిత్యావసరాలూ, అత్యావసరాలూ కదా?

ముక్కు మూసుకుంటూ, చెవులు మూసుకుంటూ, గుండె నిమురుకుంటూ, ఒళ్ళు చరుచుకుంటూ, ఉస్సురని నిట్టూరుస్తూ, ఆ యింట్లో రెండేళ్ళు గడిపేశాడు రుద్రమూర్తి. మనిషికి ముక్కున్నది ఎందుకు? మురుగు వాసన పీల్చి బతకటానికేనా? చెవులున్నాయి ఎందుకూ? కర్ణకఠోరమైన శబ్దాలు వినటానికేనా? కళ్ళున్నవి ఎందుకు? ముట్టురాలైన పుడమితల్లి మాలిన్య మర్మాన్ని తిలకించటానికేనా? చేతులున్నవి ఎందుకు? రాత్రంతా నిద్ర మేలుకుని ఒళ్ళు చరుచుకోటానికేనా? ఈ శరీరం ఎందుకు? అసహజమూ, అమానుషమూ అయిన చిత్రవిచిత్ర హింసల్ని అనుభవించటానికేనా? ఏమిటీ ఈ యిల్లు? ఇది యిల్లా, నరకమా? భూమికీ ఈ యింటికీ సంబంధంలేదు. భూమిని అంటిపెట్టుకుని తిరుగుతున్న గ్రహశకలం యిది. రెండూ ఒక్క

టిగా కలిసి తిరుగుతున్నా, దేని వాతావరణం దానిదే! ఇల్లు సౌకర్యంగా వుందని చెప్పిన ఆ ముసలిదీ, దాని మొగుడూ ఈ యింట్లో అన్నేళ్ళు ఎలా వుండగలిగారు? ముదివగ్గులైన వాళ్ళ సర్వేంద్రియాలూ బహుశా చచ్చుబడిపోయి వుంటాయేమో!

"అబ్బా! ఈ యింట్లో యింకోక్షణం కూడా బతకలేనురా దేవుడా!" అంటూ అనుక్షణం ఆక్రందించాడే కానీ, మరో యిల్లు వెతికే ప్రయత్నం చెయ్యలేదు రుద్రమూర్తి. గుంజకు కట్టేసిన గొడ్డులా అక్కడే వుండిపోవటానికి కారణం లేకపోలేదు. రుద్రమూర్తికి వచ్చే జీతం, తిని తేపటానికే చాలదు. కాలికి బలపం కట్టుకుని భూప్రదక్షిణం చేసినా, వెంటనే మరో యిల్లు దొరకదు. దొరికినా, యిలాంటిదే మరో నరకం దొరుకుతుంది కానీ, యింతకంటే మెరుగైన యిల్లు దొరకదు. మెరుగైన యిల్లు దొరికినా, ఏ వంద రూపాయలో అద్దె యిచ్చే స్తోమతు తనకులేదు. పిల్లలు చదువుకుంటున్నారు. వాళ్ళ చదువులకు అయ్యే ఖర్చులన్నిటినీ మానేస్తే, అంతలేసి అద్దెలు యిచ్చేయవచ్చు. ఆ యిల్లు వదలకపోవటానికి మరో ప్రబల కారణం వుంది. పట్టాభిగానీ, అతని తల్లిగానీ, గుమాస్తాగానీ ఏనాడూ యింటికొచ్చి అద్దె అడిగిన పాపాన పోలేదు. తాను వెళ్ళి యివ్వటమేతప్ప, వాళ్ళు రారు. నెలనెలా వరసగా యివ్వలేక, నాలుగు నెలల అద్దెడబ్బులు ఒక్కసారిగా తీసుకుపోయి యిచ్చిన సందర్భాలూ వున్నాయి. అద్దె యింట్లో కాపురం వుంటున్నవాడికి అంతమంచి సౌకర్యం వున్నప్పుడు, అది నరకం అయితే మాత్రమేం?

రుద్రమూర్తిని నిస్సహాయుణ్ణి చేసింది అతని దుస్థితి. అస్తవ్యస్తమైన ఆలోచనలూ, స్వగతాలూ, ఆధ్యాత్మిక ఊహావీచికలూ అతనికి నెచ్చెలులైనాయి. జీవన్మరణాలలోని వివిధ రసానుభూతులకూ సృష్టిస్థితిలయ విన్యాసాలకూ ప్రతీకలై మానవుడి నీడలో అమరత్వాన్ని సాధించిన దేవుళ్ళతో మాట్లాడటానికి వీలుపడే ఊహాలోకపు తలుపులన్నీ అతనికోసం తెరుచుకున్నాయి.

ఓ రోజు నడిరేయిదాకా మస్కిటో ఫాయిల్ పొగతో ఊపిరితిత్తుల్ని నింపుకుని, రెక్కలు పడిపోయేదాకా ఒళ్ళు చరుచుకుని, విష్ణుదేవుడి పటంముందు నిలబడి జాలిగా అడిగాడు రుద్రమూర్తి. "స్వామీ! ఈ దోమలు నిన్నేమీ చెయ్యటంలేదూ?"

విష్ణుదేవుడు మాట్లాడలేదు కానీ, పటంచుట్టూ ప్రదక్షిణం చేస్తున్న ఓ దోమ యిలా గీ పెట్టింది: "పటానికి అద్దం బిగించుకుని పడుకున్నాడు గనక సరిపోయింది. లేకపోతే నా తడాఖా చూపించనూ?"

కొన్నాళ్ళ తర్వాత పందికొక్కు పటాన్ని దొర్లించేసింది. అద్దం కాస్తా ముక్కలైపోయింది. రుద్రమూర్తి మళ్ళీ అద్దం వేయించలేదు.

అతను మళ్ళీ యిలా అన్నాడు దేవుడితో: "స్వామీ! పాపం, నిన్ను దోమలు పొడిచి చంపేస్తున్నాయేమో! ఈ కంపుతో నీకుక్కు దిబ్బళ్ళు పడిపోతున్నదేమో! ఏం చెయ్యను? మళ్ళీ అద్దం వేయించాలని వుంది. కానీ, చేతిలో చిల్లిగవ్వయినా నిలవటంలేదు."

దేవుడు హేళనగా నవ్వి అన్నాడు, "పిచ్చివాడా! నీ కంటికి నేను వేరుగా, దోమలూ దుర్వాసనా వేరుగా కనిపిస్తున్నామా? నేనే దోమని, దోమే నేను! నేనే దుర్వాసనని, దుర్వాసనే నేను! నవ్వేవాడూ ఏడ్చేవాడూ, బాధపడేవాడూ–బాధపెట్టేవాడూ, మేడకట్టేవాడూ–మేడలో కాపురం పెట్టేవాడూ, అన్నమో రామచంద్రా అని ఆక్రోశించేవాడూ–లేదు పొమ్మని కసురుకునేవాడూ, మేడ ముందరున్న సిమెంటు జెండా – మేడ వెనకవున్న మురుగు కాలవా అన్నీ నేనే! నీదనుకుంటున్న ఆ శరీరమూ నేనే, ఆ శరీరంపైన వాలిన దోమా నేనే! ఈ సృష్టిలోని ప్రతి అణువూ నేనే!...దోమేమిటీ, దుర్వాసనేమిటీ!"

రుద్రమూర్తి ఒక సరళరేఖ గీచాడు. ఒక చివర మురుగు కాలవ చన్ను కుడుపుతూ మురుగుదొడ్లు ముద్దులాడుతున్న ఈ అద్దె యిల్లు, మరోచివర ఐదారు లక్షల రూపాయల ప్రభుత్వ సహాయంతో అత్యాధునికంగా నిర్మించిన సినిమా థియేటరు! ఈ రెండూ ఒకే భూతలం పైన వున్నాయి! ఈ రెంటికీ మధ్య, యిదే భూతలంపైన యింకా ఏమున్నాయి?

లక్ష్మీనగర్. లక్ష్మీనగర్‌లో పట్టాభి యిల్లు. అందులో ఎన్నో గదులు. పైన మరో అంతస్తు. ఇంటి చుట్టూ ఎన్నో కిటికీలూ, వెంటిలేటర్లూ. ప్రతిగదిలోనూ సోఫాలూ, మంచాలూ, టేబిల్సూ, సీలింగ్ ఫ్యాన్లూ, కర్టెన్లూ వగైరా!...రుద్రమూర్తికి అక్కడ స్థానంలేదు.

సరళరేఖమీద మరో బిందువు–ఒక్కొక్క యింటికి మూడువేల రూపాయల మతింపు చొప్పున, వెనకబడిన కులాల వాళ్ళకోసం మంత్రిగారు కట్టించిన కాలనీ!... రుద్రమూర్తికి అక్కడా స్థానం లేదు.

సరళరేఖమీద మరోచోటు–సత్యమ్మ గుడిపక్కన రావిమాను కింద రచ్చబండ. సత్యమ్మ అన్నది గ్రామదేవత పేరు. ఆమె పసుపూ కుంకుమా పులుముకుని, మూరెడెత్తు రాయిగా అక్కడ వెలసింది, గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను ఉద్ధరించటంకోసం! పట్టాభికీ, సర్పంచ్‌కూ స్థితిగతుల్లో చాలా పోలికలున్నాయి. సర్పంచ్ వృద్ధుడూ, శారీరకంగాబలహీనుడూ! ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్నీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్నీ, పాకీవాళ్ళ బృందాన్నీ అతను ఎక్కడ దాచి పోషిస్తున్నాడో ఎవరికీ తెలియదు. డి. డి. టీ పౌడరూ, ఫినాయిలూ, వాటి తాలూకు సాధన సంపత్తీ ఒకటి రెండు వీధుల్ని మాత్రమే సేవించి తరిస్తుంటాయి. సర్పంచ్‌కు దైవభక్తి అపారం. అతను ఉదయమూ సాయంకాలమూ క్రమం తప్పకుండా సత్యమ్మచుట్టూ చేతులు జోడించి ప్రదక్షిణాలు చేస్తుంటాడు.

పక్కన రచ్చబండపైన రావిచెట్టు నీడను ఒక ముష్టివాడు ఆక్రమించుకున్నాడు, దేవేంద్ర సింహాసనం దొరికినంత సంబరంతో. వాడు అద్దె చెల్లించనవసరం లేదు. మంచి గాలి. పరిసరాలలో ఎక్కడా దుర్గంధంలేదు. దోమల బెడదలేదు. కందమూలాలు తిని కొండ నీళ్ళు తాగి బతికే తాపసిలా ఆరోగ్యంగా వున్నాడు. వాణ్ణి చూస్తే రుద్రమూర్తికి అసూయ. వాడు చావటంగానీ, వూరు

వదిలి వెళ్ళిపోవటంగానీ జరిగితే, ఆ స్థలాన్ని తాను ఆక్రమించాలన్న బలీయమైన కోరిక రుద్రమూర్తికి వుంది. అయితే తాను ఆ పని చెయ్యలేడు. తనకు సంసారంవుంది. తను అలాటి పనిచేస్తే, తనను వెక్కిరించటంతప్ప తన పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకోలేని సమాజం తన చుట్టూవుంది. రుద్రమూర్తికి అక్కడ కూడా స్థానంలేదు.

ప్రభుత్వ సహాయంతో ధనవంతుడు కట్టుకున్న సినిమా థియేటరూ, లక్ష్మీనగర్‌లో పట్టాభి యిల్లు, గ్రామదేవతచుట్టూ చేతులు జోడించి ప్రదక్షిణంచేసే సర్పంచ్‌గారు కొలువుదీరే పంచాయతీ ఆఫీసు, పథకాలూ ప్రణాళికలూ దయతలిచి తక్కువకులం వాడికి ప్రసాదించిన నీడపట్టు, ముష్టివాడు మకాం పెట్టిన రచ్చబండ, భూలోక వాతావరణానికి భిన్నంగా తాను వుంటున్న గ్రహశకలం–యివన్నీ దేవుడేనా? అయ్యోపాపం, దేవుడెంత కురూపి!

తన యింటి వెనకవున్న మురుగు కాలవకు వైతరణి అని పేరు పెట్టుకున్నాడు రుద్రమూర్తి. వీధిలో ఎప్పుడైనా చావు తప్పెట మోగినప్పుడు, ఊళ్ళో ఎవరైనా చచ్చారన్న వార్త విన్నప్పుడూ, పెరటివైపు తలుపు తెరిచి వైతరణికేసి చూసేవాడు. దున్నపోతు నెక్కి వైతరణిమీదుగా కదిలిపోతూ కనిపిస్తాడు యమధర్మరాజు. మొదటిసారి, కనుబొమ ఒకటి పైకెగరేసి ఓరగా చూస్తూ మీసం దువ్వుకుంటూ వెళ్ళాడు. రెండోసారి, వైతరణి మీద ఆగి, ఆ భుజంమీది గదను ఈ భుజానికి మార్చుకుని, చిరునవ్వుతో రుద్రమూర్తికేసి చూస్తూ, ''ఏమోయ్! నువ్వూ వస్తావా?'' అన్నాడు. ''ఇప్పుడేనా? పిల్లలు ప్రయోజకులు కావాలి గదా!'' అంటూ తలుపు మూసుకున్నాడు రుద్రమూర్తి.

మరోసారి, ''యమధర్మరాజా! ఇప్పుడు నువు పట్టుకుపోతున్నవాడు స్వర్గానికి వెడతాడా, నరకానికి వెడతాడా?'' అని అడిగాడు.

''నరకానికే!'' అన్నాడు యముడు.

''నరకం ఎలా వుంటుంది స్వామీ?''

''మూర్ఖుడా! నరకంలోనే వుంటున్నావు, నరకాన్ని గురించి తెలియదంటావే!'' అనేసి, దున్నపోతు డొక్కలో తన్ని ముందుకు సాగిపోయాడు యముడు.

రుద్రమూర్తికి క్రమేపీ బ్రతుకుమీద రోతపుట్టింది. చావు గురించీ, మరణానంతర జీవితం గురించీ అతనిలో ఆలోచనలు ఎక్కువ కాసాగినవి వల్లకాడు అతన్ని ఆకర్షించింది. పరిచితులు ఎవరు చచ్చినా, అతను శవంవెంట వల్లకాటికి వెళ్ళేవాడు. వీలయినంతసేపు శవాన్ని చూసేవాడు. శవాన్ని పాతిపెట్టి అందరూ వెళ్ళిపోయిన తరవాత కూడా, చాలాసేపు అక్కడే ఏ చెట్టు నీడనో కూర్చుంటాడు. సమాధులకేసి, అక్కడక్కడా చెదురు మదురుగా పడివున్న పుర్రెలకేసి, ఎముకలకేసి తదేకంగా చూస్తూ వుండిపోతాడు. ఏ ఎముక ఎవరిదో ఎలా చెప్పగలం అనుకుంటూ నవ్వుకుంటాడు శవాన్ని తగల బెట్టాల్సివస్తే, చితికి నిప్పంటించిన తరవాత, వెట్టివాళ్ళు వెంట ఇతరు లెవ్వరూ అక్కడ వుండరు, ఒక్క రుద్రమూర్తి తప్ప! నింగిని తాకే మంటల్లో శవం కాలటం చూస్తాడతను. పుర్రె పెటేల్లున పేలటం చూస్తాడు వంకర్లు పోతున్న కట్టెను వెట్టివాళ్ళు కర్రలతో బాదటం చూస్తాడు. ఒంటరిగానే యింటికి తిరిగి వస్తాడు.

చావుపట్ల అతనికి భయం పోయింది. వల్లకాటిమీద గౌరవం పెరిగింది. వల్లకాడు! ఇది సిమెంటు జెండాలు నిలబడ్డ చోటు కాదు. శాంతి బావుటా రెపరెపలాడే సదానంద సీమ! శరీరానికీ, పంచభూతాలకూ సంబంధం లేదిక్కడ! శవాలు సుఖంగా నిద్రపోతాయి యిక్కడ! శరీరాన్ని మట్టి తినివేయటంగానీ, చింతనిప్పులు మాడ్చివెయ్యటంగానీ ఏమీ తెలియదు. అంతగాఢ నిద్ర! ఆకలికి అల్లాడేవాడూ, నొప్పికి ఏడ్చేవాడూ, రోగీ, భోగీ, కలవాడూ, లేనివాడూ, మాన్యుడూ, సామాన్యుడూ, ఇల్లులేని రుద్రమూర్తీ, ఇళ్ళూ పొలాలూవున్న గ్రామ సర్పంచ్, అందరూ సుఖాన్ని సమంగా పంచుకుని సహజీవనం చేసే సమతారాజ్యం యిది!ఇక్కడ దరిద్రుడు మస్కిటో ఫాయిల్స్ వెలిగించుకోనవసరంలేదు. ముక్కూ చెవులూ మూసుకోనవసరంలేదు. ఉలికిపడటమంటూ వుండదు. కాంపోజ్ మాత్రలతో పనిలేదు. మృతి జీవితంలోనే వున్నది. ఇక్కడ వున్నది మృతి కాదు; అమృత కవచం!

వయస్సుతోబాటు బరువు బాధ్యతలు పెరగటంవల్లా, ఓపిక చచ్చిపోవటంవల్లా, సాయంకాలాల్లో వాహ్యాళి వెళ్ళే అలవాటు తప్పిపోయింది రుద్రమూర్తికి. అయినా, అరుదుగా ఎప్పుడైనా ఊరి బయట కొండమీదికి వెళ్ళి కూర్చుంటాడు. సంధ్యారాగంలో ప్రకృతి సౌందర్యాన్ని చూచి అతని హృదయం పులకించిపోతుంది. సంఘ జీవనానికి దూరంగా, ఎంత ప్రశాంతి! ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకో గలిగితే ఎంత బాగుణ్ణు! అయితే అది సాధ్యం కాదుగదా? తనవెంట మరో అయిదుగురు. వాళ్ళ అవసరాలు యిక్కడ తీరవు. జన జీవనానికి అవసరమైనవేవీ ఈ కొండమీదలేవు, ఒక్క బ్రహ్మానందం తప్ప! మరేం ఫరవాలేదు. తాను చచ్చిన తర్వాత ఈ అపార సౌందర్యమంతా తనదే కదా? శరీరం వల్లకాట్లో నిద్రపోతుంది. ప్రాణం ఈ గాలిలో కలిసిపోయి విశ్వమంతటా వ్యాపించి పాంచభౌతిక జీవన సౌందర్యాన్ని అణువణువునా ముద్దిడుకుని మురిసిపోతుంది. వర్తమానం చేదుగా వుంటే వుండనీ, భవిష్యత్తులో ఎంత మాధుర్యం వుంది!

వేసవికాలం వచ్చింది. పరీక్షలు ముగిశాయి. పిల్లలకు సెలవలిచ్చారు. పదిరోజులపాటు సుఖంగా వుండి వద్దామని, రుద్రమూర్తి భార్య పిల్లల్ని వెంటబెట్టుకుని తన అన్నగారు వుంటున్న వూరికి వెళ్ళింది దోమలమధ్య, మురుగు వాసనలమధ్య, మరుగుదొడ్ల వికృత శబ్దాలమధ్య పలుకుతోడు లేకుండా ఒంటరిగా యమయాతన పడ్డాడు రుద్రమూర్తి.

ఒకనాటి ఉదయం, గ్రామ సర్పంచ్ పోయాడన్న వార్త తెలిసింది. ప్రాణం యింట్లోనే పోయిందట! అయినా, బంధుమిత్ర కుటుంబ పరివారమంతా వెంటనే శవాన్ని పట్నం ఆస్పత్రికి తీసుకు

పోయి, ప్రాణం పోయిందని పెద్ద డాక్టర్ల దగ్గిర రూఢి చేసుకుని, శవాన్ని యింటికి తీసుకొచ్చేశారు.

రుద్రమూర్తి పెరటి తలుపు తెరిచాడు. యమధర్మరాజు అవతలి ఒడ్డుకు వెళ్ళిపోతున్నాడు.

''యమధర్మరాజా!'' అన్నాడు రుద్రమూర్తి.

యముడు విసుగ్గా వెనక్కి తిరిగి చూశాడు.

''సర్పంచ్ గారినేనా పట్టుకుపోతున్నావు?''

''ఊ!''

''యమధర్మరాజా! నన్ను కూడా తీసుకుపోవూ?''

యముడు వికటాట్టహాసం చేశాడు. దున్నపోతు కూడా నవ్వింది. సర్పంచ్ నవ్విన చప్పుడు కూడా వినిపించింది.

''నిన్ను తీసుకుపోవటమేమిరా మందమతీ! నువ్వెప్పుడో చచ్చావుకదా? నువ్వు పీనుగువి! పీనుగులు వల్లకాటికి వెళ్ళాలిగానీ, మాతో రాకూడదు...'' అనేసి, నవ్వలేక నవ్వుతూ వెళ్ళిపోయాడు యమధర్మరాజు.

రుద్రమూర్తి తన శరీరాన్ని పరీక్షించుకున్నాడు. గుండె కొట్టుకుంటూనే వుంది. నాడి ఆడుతూనే వుంది. ఒళ్ళు వెచ్చగానే వుంది.

''మంచి విట్టే వేశాడు యమధర్మరాజు!''

మామూలుగానే ఆ సాయంకాలం శవం వెంట వెళ్ళాడు రుద్రమూర్తి. మైలు పొడుగునా జన సందోహం! తప్పెట్లు, మేళతాళాలు, చెక్కభజనలు, కోలాటాలు, బాణ సంచా, దారి పొడుగునా పాడెమీద చిల్లర డబ్బుల వాన! పీక నొక్కుతున్నా పడగ విప్పటం తెలియని తక్కువ కులాల వాళ్ళంతా తాగి తందనాలాడారు. మనిషీ మనిషీ ఒరుసుకుంటూ, కాలూ కాలూ తొక్కుకుంటూ సాగింది శవయాత్ర. వల్లకాటికే గదా వెళుతున్నాం, అనుకున్నాడు రుద్రమూర్తి. అయితే శవం వల్లకాటికి కాకుండా, మరో దారి వెంబడి ఊరి పొలిమేర చేరుకుంది. చుట్టూ కనుచూపు మేరవరకూ సర్పంచ్‌గారి పొలాలూ, తోటలూ! నలభై వేల రూపాయలు ఖర్చు పెడితేగానీ తవ్వించలేనంత బ్రహ్మాండమైన పంపుబావి గట్టున పొన్నచెట్టు పక్కన గోతిలో సర్పంచ్‌గారి శవాన్ని పాతిపెట్టారు. సంక్రాంతి ముగ్గులు తీర్చినట్లు జనంగుంపులు గుంపులుగా కూర్చుని, సర్పంచ్‌గారు టోకుగా గుత్తకు తీసుకున్న ఉత్తమ గుణాలన్నిటి గురించీ ముచ్చటించుకున్నారు. సర్పంచ్‌గారికి చలువ రాళ్ళతో సమాధి కడతారనీ, సమాధిపైన నగిషీలు మలిచిన మండపం కూడా కడతారనీ విన్నాడు రుద్రమూర్తి. సర్పంచ్ బతికినంతకాలమ్మూ పై మెట్టుమీదే బతికాడు. చచ్చిన తరవాత కూడా పై మెట్టుమీదే సమాధి అయిపోతున్నాడు. అతనికి వల్లకాడు అంటరానివాళ్ళ

గూడె మన్నమాట! చచ్చిన తర్వాత కూడా అతనికొక ప్రత్యేకమైన ఉనికి! తన స్వంత ఎస్టేటులోనే తనకు సమాధి. అక్కడ మరెవ్వరినీ పాతిపెట్టటానికి వీల్లేదు. వల్లకాటి ప్రేతాలన్నీ వల్లకాట్లో వుండాల్సిందే. అవి యింత దూరానికి తొంగిచూడలేవు. 'ఒరే సర్వంచూ!' అని పిలిచి, తమకున్న సమాన హోదాను ప్రదర్శించుకోటానికి వాటికి అవకాశంలేదు.

రుద్రమూర్తి మౌనంగా నడుస్తూ, దారి పొడుగునా కనిపించిన మిద్దెల్నీ మేడల్నీ గుడిసెల్నీ పాకల్నీ పొడుగోడల్నీ చూస్తూ, ఆగుతూ, సాగుతూ, చీకటి పడుతుండగా యిల్లు చేరుకున్నాడు. తాళం తీసి తలుపు తెరిచిన అరనిమిషానికి, "రుద్రయ్యా!" అంటూ లోపలికి తొంగిచూశాడు రహీం. అతడి భుజాన గునపం, చేతిలో బరువైన చిన్నసంచీ వున్నాయి.

పట్టాభి రుద్రమూర్తితో కలిసి స్కూల్ ఫైనల్‌దాకా చదువుకుని కాలేజీకి వెడితే, రహీం ఐదో తరగతివరకే చదువుకుని, బడి మానేసి, కులవృత్తి చేపట్టాడు. మైలుదూరంలో వాడికొంప. రాళ్ళు పగలగొట్టీ, పునాదిగోడలు కట్టీ పొట్ట పోసుకుంటున్నాడు. అతని ఒంటిమీద ఎప్పుడూ మురికిబట్టలే వుంటాయి. అవి కూడా చీలికలు పేలికలుగా చిరిగిపోయి వుంటాయి. పాతచొక్కా ఏదైనా కావలసి వచ్చినప్పుడూ, రూపాయో అర్ధో అవసరమైనప్పుడూ రుద్రమూర్తి దగ్గరికి వస్తూవుంటాడు రహీం.

డబ్బు అడుగుతాడేమో, లేదని చెబుదాం; చొక్కా అడుగుతాడేమో, వున్న రెండు చొక్కాల్లోనుంచి ఒకటి యిచ్చేద్దాం అని అనుకుంటూ, "ఏం కావాలి?" అన్నాడు రుద్రమూర్తి.

"ఏం లేదు రుద్రయ్యా! ఈ వీధి చివర పని చేస్తున్నాను. పునాది పనిలే! రేపటికి పూర్తవుతుంది. రేపు మళ్ళీ రావాలి కదా? ఈ గునపం, సంచీ యిక్కడ పెట్టిపోదామని..." అన్నాడు రహీం.

"ఊఁ!"

రహీం సంచీ, గునపం ఒక మూలపెట్టి వెళ్ళిపోతుంటే, "ఒరే రహీం!" అన్నాడు రుద్రమూర్తి. రహీం వెనక్కివచ్చాడు.

"రహీం! నీకు పునాదులు వెయ్యటం మాత్రమే తెలుసా? ఇంకేమీ చేతకాదా?"

"పెద్దలు నేర్పింది అదేకదా రుద్రయ్యా! అదితప్ప యింకేం తెలుసు?"

"వెధవా! అదికాదు! పునాదుల్ని పెకలించలేవూ?"

"ఎందుకు పెకలించాలి?" అన్నాడు రహీం, చిత్రంగా.

"దున్నపోతూ! పెకలించాల్సిన అవసరం ఎంతో వుంది. పునాదులు వేసి వేసీ ఊరు పాడు చేశావు గదరా! పునాదులు పడగొట్టలేనివాడివి పునాదులు ఎందుకు వేశావు?"

పిచ్చివాగుడుగ అర్థం చేసుకుని బిత్తరపోయాడు రహీం. ఏదో ఒక సమాధానం చెప్పాలి గనక, "పునాదులు వెయ్యాలని కూలీకి పిలుస్తారు గానీ, పడగొట్టమని ఎవరూ పిలవరు గదా రుద్రయ్యా!" అన్నాడు.

"కూలి వెధవా! అందుకే యిలా పాతగుడ్డలూ పావలాలూ అడుక్కుంటున్నావు. నీ బుద్ధి మారదు, నీ బతుకూ మారదు..."

రహీం కాసేపు నిలబడి, తిరిగిచూస్తూ తిరిగిచూస్తూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి, మూలనున్న గునపాన్ని చూస్తూ వెల్లకిలా పడుకున్నాడు రుద్రమూర్తి. దోమలు ఈలలతో పొడుస్తున్నా, మస్కిటోఫాయిల్ వెలిగించుకోలేదతను. చెవిదగ్గరున్న కిందివాటాల మరుగుదొడ్ల తలుపులు డర్ బుర్ మంటున్నా, కాంపోజ్ మాత్రలు మింగలేదు. గాలి కదలక, ఉక్క పోసేసి, గుబగుబమంటూ చెమట పట్టేస్తున్నా, అట్టముక్కతో విసురుకునే ప్రయత్నం చెయ్యలేదు. తన చాప కింది తూములో జరజరమంటూ పెంట కదిలిపోతున్న చప్పుడు వినిపిస్తున్నా, ఆగి ఆగి కంపు గుప్పుగుప్పుమంటూ ముఖాన్ని మింగేస్తున్నా, అతను చీదరించుకోలేదు. అతను యిప్పుడు అసహ్యించుకుంటున్నది వల్లకాటిని!

వల్లకాటిని గురించి తాను అనుకున్నదంతా పొరబాటు! అది మనిషిని పూడ్చడానికి పనికివచ్చే కల్లబొల్లి ఓదార్పు మాత్రమే! పెంటను భరించలేడు మనిషి. ఇంట్లోనుంచి తరలించిన పెంటను పాతిపెట్టటం కోసమే వల్లకాడు. అక్కడ శరీరాలు కుళ్ళిపోతాయి. కాలిపోతాయి. మట్టిలో కలసిపోతాయి. అక్కడ జీవంలేదు. జీవంలేని చోట సుఖమూలేదు. శ్మశానంలో సమానత్వం నిర్జీవమైనది; అది ప్రాణవంతమైనది కాదు.

మనిషికి సుఖమూ, శాంతీ, తృప్తీ, ఏది కావాలన్నా, బతికి వున్నప్పుడే అది సాధ్యంకావాలి. మనిషిచచ్చాక. కష్టాలూ చస్తాయి, సుఖాలూ చస్తాయి. కష్టసుఖాలు రెండూలేని మరణానంతరస్థితి ప్రతివాడికీ తప్పనిసరి. అందుకు జాలిపడటం గానీ, మురిసిపోవటం గానీ అవివేకం. చావును ఎదుర్కొనేలోపున, మనిషి మనిషిగా బతకలేకపోవటం మాత్రం ఘోరమైన దురన్యాయం.

మిద్దెలూ మేడలూ సోఫాలూ ఫ్యాన్లూ ఇలాటివన్నీ నాకు కావాలనుకుంటే, అది అత్యాశే! సంపద లేకపోతేనేం, నిరాడంబరంగా బతుకు. అంతేకానీ, అసహజంగా మాత్రం బతక్కు! సహజంగా బతకలేకపోతే, నువ్వు పీనుగువే!

అర్ధరాత్రి దాటింది. రుద్రమూర్తి లేచి కూర్చున్నాడు. ఇల్లంతా కలయజూశాడు. బలపం తీసుకుని నేలమీద సరళరేఖ గీచాడు. సినిమా థియేటర్, లక్ష్మీనగర్, మంత్రిగారు కట్టించిన కాలనీ, రచ్చబండ, జెండా బిల్డింగ్, తాను కూర్చునివున్న రుద్రభూమీ గుర్తించాడు. ఇవన్నీ ఒకే నేల మీదున్నాయి ఈ క్రమాన్ని తారుమారుచేసి, పేకముక్కల్లా ఎలా కలిపినా, తన స్థానం మాత్రం అట్టడుగునే! తనది అధోగతి! ఇది యిల్లు కాదు. వల్లకాడు. మనిషి ప్రాణంతో వుండవలసిన చోటు కాదు. ఇది బతుకు కాదు. పీనుగు నడయాడటం వంటిది. ఈ వైపరీత్యం సహించరానిది! ఈ మురికి గుంటమీద ముడికిరసనాయిలు కుమ్మరించాల్సిందే!

ఈ అస్తవ్యస్తతను, అన్యాయాన్నీ సృష్టించి బతకనిస్తున్న దెవరు? ఈ విషపూరిత గ్రహశకలాన్ని ఈ సుందర భూతలానికి లంకె వేసిందెవరు? మనిషిని ఊపిరివున్న పీనుగుగా మార్చిందెవరు? ఎవరైతేనేం, ఈ వ్రణాన్ని శస్త్రంతో ఖండించవలసిందే! ఈవికృత సృష్టిని విలయం చెయ్యాల్సిందే!

రుద్రమూర్తి పైకి లేచాడు. కట్టెపుల్ల లాంటి చేతిలో గునపం అందుకున్నాడు. బరువుగా వుంది. మళ్ళీ దాన్ని గోడకు చేర్చాడు. ముందుకీ వెనక్కీ ఇరువైపులకీ అడుగులు వెయ్యటం మొదలెట్టాడు. అవక తవక అడుగులే కాసేపటికి లయబద్ధమైనాయి. అడుగుల వేగం, చేతుల వూపు ఎక్కువైనాయి. చివాలున గునపం అందుకున్నాడు రుద్రమూర్తి. తనకు మూడో కన్నేదో పొడుచుకొచ్చిన అనుభూతీ, కులగిరులను సైతం కుళ్ళగించగల శక్తీ కలిగాయతనికి. గునపాన్ని త్రిశూలంలా గిరగిరా త్రిప్పుతూ, తాండవం చెయ్యసాగాడు. కళ్ళమీద రెప్పపడటం లేదు. అతని పద తాడనంలో, నడుము వొంపుల్లో, భుజాల కదలికలో, వేయి ఢమరుకలు ముక్తకంఠంతో నినదించాయి.

రుద్రమూర్తి తనను తాను శాశ్వతంగా మరిచిపోయాడు. అతనిప్పుడు మరో కొత్తశక్తి. రుద్రతాండవంచేస్తూ, మధ్యగోడను గునపంతో ఖంగు ఖంగున మోదసాగాడు. లయను నియంత్రించే ఘంటానాదంలా, ఆ గునపంపోట్లు తాండవ రుద్రమూర్తికి భావావేశ శిఖరాలదాకా సోపానాలు వేశాయి.

పది, పదిహేను నిమిషాలపాటు ఖంగు ఖంగుమన్న ధ్వని ఆ వీధి అంతటా ప్రతిధ్వనించింది. వీధి వీధే మేలుకొన్నది. జనం సందులో జొరబడ్డారు. కిటికీలోంచి లోపలికి చూశారు మధ్యగోడ విరిగిపడి వుంది. దానికింద రుద్రమూర్తి అచేతనంగా పడివున్నాడు, తనువు చాలించిన అవతారమూర్తిలా!

రుద్రమూర్తి కథ ముగిసింది.

పట్టాభి ఆ గోడను తిరిగి కట్టించాడు.

ఒక పీనుగు ఆ యింటిని ఖాళీచేసి వెళ్ళిపోగానే, మరోపీనుగు వచ్చి కాపురం పెట్టింది.

ప్రభుత్వ సహాయంతో కట్టిన సినిమా థియేటరూ, ధనవంతులు వుంటున్న లక్ష్మీనగర్, పేదవాళ్ళ కోసం కట్టిన కాలనీ, ముష్టివాడు తిష్ఠవేసిన రచ్చబండ, జెండా బిల్డింగు వెనక రుద్రభూమీ — అలాగే వున్నాయి, ఒకే భూతలం పైన.

నేలమీద మనుషుల నీడలు, ఆ నీడల్లో వాళ్ళ మృత్యుచ్ఛాయలూ తిరుగాడుతూనే వున్నాయి. నింగిలో సిమెంటు జెండాలు కదలకుండా మెదలకుండా అలాగే నిలబడివున్నాయి.

రుద్రమూర్తి మతిచలించి చావును నెత్తినేసుకున్నాడని వ్యాఖ్యానించారు జనం. అతను ఎదిగినంత ఎత్తుకు ఎదగడానికి వాళ్ళకు యింకెంతకాలం పడుతుందో మరి!

రేపటి ఉదయ గీతం

జనజ్వాల

ఉక్కు పాదాల క్రింద
నురగ నెత్తురు కక్కుంటూ
గిల గిల తన్నుక చస్తున్న
చంద్రుడ్ని చూచినపుడు
జాలితో ఏడ్చాను

కాని ... ... ఆ
ఉక్కు పాదాల క్రిందే
సూర్యుడు ఉదయించడం...చూసి
ఊపిరిపీల్చుకుంటూ
ఆనందించాను.

ఆ ఆనందములో
నా కంఠంధ్వనిస్తూ
స్వాగత గీతం పాడింది ... ఆ
ఉదయ భాస్కరునికి

జాలి దుఃఖము ఎగిరిపోయినా
నా కంఠంలోంచి ... ...
రేపటి ఉదయగీతం...కూడ
వినిపిస్తుంది!


శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

చాళుక్య కుసుమాదిత్యుని క్రివ్వక తామ్రశాసనము


సుమారు పదేండ్లకు ముందు మిత్రులు శ్రీ భాగవతుల లక్ష్మీనారాయణగారు తాము ఖమ్మంమెట్టు కళాశాలలో చరిత్రోపన్యాసకులుగ పనిచేయుచున్నపుడు భద్రాచలములో నీ శాసనపు రేకులను సంపాదించిరి ఖమ్మం జిల్లా పాల్వంచ తాలూకా కుకనూరు గ్రామమునుండి యొక మిత్రుడు వీటిని సేకరించి తమ కొసగినట్లు చెప్పిరి. తర్వాత శ్రీ లక్ష్మీనారాయణగారు ఈ శాసనమును ఆం. ప్ర. పురావస్తుశాఖ శాసన పరిశోధక ప్రచురణమగు ఎపిగ్రాఫియా ఆంధ్రికా రెండవ సంపుటములో ప్రకటించిరి. (పుటలు 39-49). శాసనపు రేకులు పురావస్తుశాఖ ప్రదర్శనశాలలో భద్రము చేయబడియున్నవి. వీటిని మొదట భద్రాచలము తామ్రపట్టికలని పేర్కొనిరి. శ్రీలక్ష్మీనారాయణగారు 'కుసుమాదిత్యుని కుకనూరు పట్టికలు' అను శీర్షికతో ప్రకటించిరి. దానమొసగబడిన గ్రామము కుకనూరు సమీపమున గల క్రివ్వక యగుటచేత ఆ పేరుతో నిచట పేర్కొనబడెను. శ్రీ లక్ష్మీనారాయణగారు తమ ఆంగ్లవ్యాసములో కొన్ని ముఖ్యవిషయములను చేర్చకపోవుటవలనను, మరికొన్ని క్రొత్త విషయము లిపుడు లభించుటవలనను దీనిని తెలుగులో నిపుడు ప్రకటించుచుంటిని.[1]

ఇందు 20 సెం. మీ. పొడవు, 10 సెం. మీ. వెడల్పు 3మి.మీ. మందముగల యైదు రాగిరేకులు గలవు. అవి 1.5సెం.మీ వ్యాసముగల రంధ్రముల గుండ 12 సెం. మీ. వ్యాసముగల కడియములో దూర్చబడియున్నవి కడియమునకు 8 సెం. మీ. వ్యాసము గల రాజముద్రిక బిగించబడెను. ఆ ముద్రికపైన చాళుక్య వంశపు రాజుల వరాహలాంఛనము, దానిపైన సమతలముగ అంకుశము, కుడి యంచున చంద్రరేఖ, శంఖము, వరాహమునకు వెనుక వింజామరలు, క్రింద మూడు కలశములున్న తోరణ ద్వారము గలవు.

అయిదు రేకులలోను మొదటిరేకు మొదటివైపు, తుదిరేకు రెండవవైపున వ్రాతలేదు. మిగిలిన యెనిమిదివైపుల మొత్తము 66 పంక్తులు వ్రాయబడెను. వ్రాత భద్రముగ నుండుటకై రేకుల



మొదటి రేకు : రెండవ ప్రక్క




రెండవరేకు : మొదటి ప్రక్క


యంచులు కొంచె మెత్తుగ చేయబడెను. రేకులు, రాజముద్రిక, కడియము, వ్రాత యేమాత్రము చెడిపోకుండ చక్కగనున్నవి.

భాషాదికము

శాసనమందలి యక్షరములు సుమారు క్రీ. శ. 12వ శతాబ్ద్యంతము నాటివైనను అంతకుపూర్వపు వాటిని బోలిన అక్షరములు, గుణింతములు చాల గలవు. అ, చ, భ, హ,లు పూర్వపు పోలికలు గలిగియున్నవి. ‘ఱ’ అను ద్రవిడాక్షర మింక వాడుకలో నిందు గానవచ్చును. ‘తొంగొడ్లు’ (32వ పంక్తి), ‘ఖడ్గసహాయులై’ (26వ పంక్తి), వీటిలో ‘డ’కు బదులు ‘ఱ’ను వాడెను. ‘ఉ’కార కొమ్ము పూర్వమువలె క్రిందికి చూపుట పలు చోట్ల గనుపించును. వ్రటుసుడి ‘యుండవలసిన అక్షరములను ‘ఇ’కార గుడి యిచ్చి వ్రాయడితో చూపుచుండెను. ‘నృప’కు బదులు ‘నిప’ (13వ పంక్తి), ‘వృక్ష’కు బదులు ‘విక్ష’ (50వ పంక్తి)




రెండవరేకు : రెండవ ప్రక్క



మూ డ వ రే కు : మొ ద టి ప్ర క్క

ఇందు కుదాహరణములు· 'మ' రెండు విధములుగ వ్రాయబడెను. అందొకటి ఆనాటి వాడుకలోని **రూ**పము. రెండవది లిపి పరిణామ**ములో** జూపబడదు కాని అప్పటి కొన్ని వ్రాతలలో గనుపించును· అది 'ర్'వలె నుండును. దీనినుండియే యిప్పటి అనుస్వారము 'ం' సున్నగ వచ్చెను. 'ర్'లో తలకట్టువంటి పొల్లు భాగమును తీసిన 'ం' మిగులును

'శ్రీధామ్నః పురుషోత్తమస్య' అని ప్రారంభమగు మొదటి శ్లోకము, 37వ పంక్తిలో 'పద్మగర్భస్థా......' ఇత్యాది కొంత సంస్కృతము, 54వ పంక్తినుండి ప్రారంభమైన 'బహుభి...' ఇత్యాది కొన్ని శాసనాంత శ్లోకములు, ముగింపున వ్రాయసగాని పేరు మున్నగు పదములు సంస్కృతములో తప్పులతో రచించబడెను. మిగిలినదంతయు తెలుగు గద్య**లో** వ్రాయబడెను. కాని అక్షర దోషము లధికము అట్లే **న్యూ**నాక్షరములు, అధికాక్షరములు**గూ**డ



మూ డ వ రే కు : రెం డ వ ప్ర క్క




నాల్గవ రేకు : మొదటి ప్రక్క

ననేకము గలవు. మూలమును వ్రాయుచు కొన్నిటిని సవరించితిని. ఈ గద్యభాగము చక్కని గ్రాంథిక శైలిలో రచింపబడెను.

వి ష య ము

లక్ష్మీనిలయుడగు పురుషోత్తముని యొక్క నాభి కమలము నుండి జగత్తునకు సృష్టికర్తయగు స్వయంభు బ్రహ్మ ఉదయింపగా అతనికి మానస సూనుడగు అత్రి మునియు అతనినుండి శివునికి శిరోభూషణమైన అమృత కిరణుడగు చంద్రుడు జన్మించెను ఆ చంద్రవంశమున బుట్టిన చాళుక్యాన్వయులు 59 సింహాసనంబులు రాజ్యముచేసిన యనన్తరంబు కొరవి పుర వల్లభుండయిన కరియ గొణగుణ్డు మత్తేభంబుల (వైభవముతో) ఇష్ట శిష్టత్థున్‌లకు దానంబు లొసగుచు మహదైశ్వర్యముతో భూమిని సాధించి నెగడుచుండెను. ఆ కరియ గొనగుని సోదరుడగు నిజ్జయ రాజునకు, కుసుమాయుధుడు, అతనికి బేతరాజు, ఇతనికి ముట్టానెగల్లు బిరుదముగల కుసుమాయుధుణ్డు, ఇతనికి వినీత జనాశ్రయుడను బొట్టుచేత భూపాలుడు పుట్టెను. ఈ బేతరాజునకు అభినవ గౌరి



నాల్గవ రేకు : రెండవ ప్రక్క

యను శ్రీ మహాదేవికి మార్బల కేసరి యను బిరుదుగల కుసుమాదిత్యుండును, వివేక నారాయణ్డగు నాగతిరాజును బుట్టిరి. వీరిలో కుసుమాదిత్యుం రాజ్యము సేయుచుండ నతని మొదటి రాజ్య వర్షమునందు దేశములో నొక ఉపద్రవము సంభవించగా బొట్టున వాని ప్రధానులు శ్రీ కరణాధిపతియునగు ఇందపరాజును, అతని తమ్ముడైన రేమరాజును వస్త్రవాహనంబులతో నా కుసుమాదిత్యుని పరమణ్డలాభి ముఖము తోడ్కొనిపోయి అడవులందు కంద మూలములు భక్షించుచు పన్నెండేండ్లు గడపిరి. తదుపరి వారి శౌర్య పరాక్రమములతో తిరిగి నిజదేశమైన విసుఅునాడు ప్రవేశింపజేసి వానిచే రాజ్య మేలించిరి. ఈ సందర్భమున తనకు అత్యంతము అనుకూలురై కాయ్యన్ ఖడ్గ సహాయులై తిరిగి రాజ్యప్రాప్తికి తోడ్పడిన అమాత్యులగు ఇందప రేమనలకు కుసుమాదిత్యుడు కృతజ్ఞతా భావంబున మహామణ్డలేశ్వర పదవిని, ఆయా లాంఛనములతో ప్రసాదించి విసుఅునాడులో మహాసారవంతమైన క్రివ్వక గ్రామమును అగ్రహారముగ, ఉత్తరాయణ పుణ్యకాలమప్పుడు దానమొసగెను.


అంత నా యగ్రహారమునకు సీమలు బేర్కొనబడెను. తూర్పున గోదావరి పసి వృక్షము, కుంట, వెల్లటాళ్లు, ద్రింట మెట్టయు గలవు. దక్షిణమున ఆరిలోవ (య?). పడుమర మ[ర] డుంబాకతుటియ. ఉత్తరమున గోదావరి నది కలవని చెప్పబడెను. ఈ పిమ్మట శాసనోల్లంఘనము చేయువారికి మహాపాపము సంభవించునని తెలుపు వాక్యములు కొన్ని తెలుగులోను, కొన్ని అసంపూర్తి శ్లోకములలోను వ్రాయబడెను

విశ్వకర్మ బేతాచారి చేతనీ శాసనము వ్రాయబడెను.

విషయ పరిశీలన

చాళుక్య వంశమునకు చెందిన కుసుమాదిత్యుడను రాజు అతని ప్రధానులగు ఇందపరాజు ఇతని సోదరుడగు రేమరాజు నిఅుపురకును విసుఅునాంటిలోని క్రివ్వక గ్రామము నగ్రహారముగ నిచ్చెనని శాసన సారాంశము. ఇందు శాసన కాలము జెప్పబడలేదు. ఉత్తరాయణ సంక్రాన్తి నిమిత్తము మాత్రము చెప్పబడెను. అంత మాత్రమున సంవత్సరము గనుగొనుట కష్టము. శాసన లిపి కూడ పూర్వపు పోలిక యుండుటచే కాలనిర్దేశమునకు తోడ్పడుటలేదు. ఆధారాంతరముల బట్టియే శాసన కాలమును చెప్పవలసియున్నది. అట్టి ఆధారాంతరములను బరిశీలించుటకైనను ఇందలి విషయము లంతగ తోడ్పడుటలేదు. శాసనములో జెప్పబడిన 'క్రివ్వక' గ్రామమును మొదట ప్రకటించినవారు 'క్రిచ్చక' అని చదువుటచేతను, కుకనూరు అను గ్రామము పేరిందు లేకపోవుటచేతను స్థలనిర్దేశము గూడ చేయుట కష్టమయ్యెను. 'క్రివ్వక' యని సరిగా చదువుట వలన దానిని పాల్వంచ తాలూకాలో గోదావరి యొడ్డునగల గ్రామముగ నిర్దేశించ వీలయ్యెను. అది కుకనూరు సమీపమున గలదు. భద్రాచలమునకు సుమారు 30 కి. మీ. దిగువున గోదావరి కావలి యొడ్డున గలయొక గ్రామము. దానినిపుడు కివ్వాక యనికూడ నందురు దీనివలన స్థలనిర్దేశము జరుగుచున్నది కాని కాల నిర్దేశము జరుగుటలేదు.

శాసనమందు దాతగ జెప్పబడిన కుసుమాదిత్యుడుగాని అతని తండ్రి తాతలు గాని చరిత్ర కిదివరకు తెలిసివారు కారు. వారి వంశమిందు ఈ విధముగ జెప్పబడెను.



అయిదవ రేకు : మొదటి ప్రక్క

చాలుక్యవంశము

కరియ గొనగుడు (కొరవిపుర వల్లభుడు)

1 నిజ్జయరాజు

2 కుసుమాయుధుండు

3 బేతరాజు

4 కుసుమాయుధుండు ('ముట్టానెగల్ల' బిరుదు)

5 బొట్టుబేత (వినీత జనాశ్రయ) (భార్య—శ్రీ మహాదేవి)

6 కుసుమాదిత్యుడు (మార్బల కేసరి, బిరుదు) (శాసనదాత)

నాగతిరాజు (వివేకనారాయణ, బిరుదు)

ఈ వంశక్రమములో నాలు పురుషాంతరములు, నెనిమిది మంది రాజులు పేర్కొనబడిరి. అయినను వీరందరు చరిత్ర కపరిచితులనియే చెప్పవచ్చును. మొదటివాడగు కరియగొనగుడు కొరవి పుర వల్లభుడని శాసనమందు జెప్పబడెను. కనుక నీ చాలుక్యవంశము కొరవికి సంబంధించినదని స్పష్టము. కొరవిలో నొక శిలాశాసనము నందొక కుసుమాయుధుడు, వాని పెద్దకొడుకు గొణగయ్యయు, ఇతని తమ్ముడు నిరవద్యుడనువాడును బేర్కొనబడిరి.[2] పెద్దవానికి అనుంగు గొణగయ్య యను పేరు కూడ కలదు. వీరు మంచి కొండనాడును కూడ పాలించుచున్నట్లును, వీరికి ముదుగొండ సల్కులను వంశనామము గలదనియు ఆ కొరవి శాసనమందు జెప్పబడెను కనుక మన క్రివ్వక శాసనములో కొరవి పుర వల్లభుడని చెప్పబడిన కరియగొనగుడు ముదిగొండ చాలుక్యవంశమువాడు కాదగునని చెప్పవచ్చును. కొరవి శాసనములోని అనుంగు గొణగయ్య, అతని తమ్ముడగు నిరవద్యుడు వరుసగ మన శాసనములోని కరియ గొనగుడు, ఇతని తమ్ముడు నిజ్జయరాజు కాదగుదురా లేదా యనునది తెలిసికొనవలసియున్నది.

ఇందప రేమనలకు కుసుమాదిత్యుడు మహామండలేశ్వర పదవిని ప్రసాదించి తదనుబంధముగ నీ మర్యాదలు కూడ నిచ్చెను.

(31 35 పంక్తులు)

1 మకర తోరణములు—వారి నివాస ప్రాసాద ముఖద్వారమున కలంకారముగ మకర తోరణ శిల్పమును నిర్మించుకొనవచ్చును.

2 బల్లి తొంగద్దు- దీని యర్థము తెలియుటలేదు.

3 సలికి కూంకట్లు—ఇదియు సరిగ అర్థమగుటలేదు. సలికి పదము చాలుక్యవంశ నామమును సూచించును. భీమసలికి, ముదుగొండ సలుకులు అను ప్రయోగములు శాసనములందు గానవచ్చును. 'కూకటి'పదము 'జులపాలు' అను నర్థమున వాడియున్నచో చాలుక్య రాజు లుంచుకొనునట్లు వీరుకూడ తమ జుట్టు నలంకరించుకొనుట కనుమతించబడెనేమో తెలియదు.

4 బడి ఢక్కలు—పంచమహా శబ్దములలో ఢక్కావాద్యమొకటి. ఇచట 'పది ఢక్కలు' అని చదివినచో కొంత అర్థమగును. అనగా వారు పది ఢక్కలను తమ యధికార సూచకముగ వాడుకొనవచ్చునని చెప్పవచ్చును.

5 బల్లి యందలంబును—మేనావంటి వాహన మధిష్ఠించుటకు అనుమతించబడెను.

6 ఒలపున బన్నుపిడి యెక్కను—దంతముండు ఏనుగునెక్కుట యనుమతించబడెనని తోచును.

7 వింజామరలు—రాజలాంఛనముగ వీచబడు చామరద్వయము.

ఈ పై వాటిలో కొన్ని పదములు సరిగా అర్థమగుటలేదు. సాధారణముగ రాజులు తమ సామంతులను నియమించునపుడు వారికి కొన్ని అధికార లాంఛనములు గూడ నుపయోగించుకొనుట కనుమతించుదురు. అట్టి యనుమతిలేనిదే యితరులు వాటి నుపయోగించుట నేరమగును.

(చరిత్రాంశములు వేరొక సంచికలో వ్రాయుదును.)

శాసన మూలము

మొదటి రేకు—రెండవ వైపు

1 శ్రీధామ్నః పురుషోత్తమస్య మహతో నారాయన(ణ)స్య ప్రభోః నాభీపం—

2 కరుషే(హో)బ్జ(ద్భ) భూవ జగతః స్రష్టాస్వయం భూస్తథా(ః) జజ్ఞే[3] మానస

3 సూను రత్రి రితి యః తస్మాన్మునే రత్రితః సోమో వంస(శ) కరస్సు—

4 ధాం సు(శు) రధితః[4] శ్రీకంట(ఠ) చూడామణిః[II*] 1*[5] ఇట్లుగాం బరమేస్వ(శ్వ)—

5 రు జటా కలాపంబుల కాభరణంబై వెలుంగుచు —

6 న్న నిషా(శా) కరాన్వయంబునం బుట్టిన చాలుక్యావయులు[6]

7 యే (ఏ)కోన షష్టి సింఘా(హా)సనంబుల రాజ్యంబులు సేసిన తద—

8 నా(న)న్తరా(ర)ంబునం గొరవి పుర వల్లభుణ్డయిన కరియ గొన—

9 గొ(బ)ణ్డు మదాన్ధగన్ధ సిన్ధురంబుల నిష్టసి(శి)ష్టత్తున్లకు వా—

10 యనంబు లిచ్చి మహావిభూతితో ననమి(ని) నొంచి నెగ—

రెండవ రేకు - మొదటి వైపు

11 డి నట్టి కరియ గొనగని సహోదరుణ్డయ్ను నిజ్జియరాజున—
12 కు గుసుమాయుథు(ధు)ణ్డు వుట్టె నట్టి కుసుమాయు థు(ధు)నకు బే—
13 తరాజు వుట్టె నట్టి బేత(ని(నృ)పతికి ముట్టానెగల్లు ణ్డైన కుసుమా—
14 యుధుణ్డు ది(ద)యించె నట్టి కుసుమాయుథు (ధు)నకు వినిత [7] జ—
15 న్మా(స(శ)యుణ్డైన బొట్టుబేత భూపాలుణ్డు జని మి—
16 ంచె[8] నట్టి బేతరాజునకుం నభినవ గవిరి[9] య్మైన శ్రీమ—
17 హాదేవికి మాబ్బన్‌లకేసరి యయ్ను కుసుమాదిత్యుణ్డును వి—
18 వేక నారాయును(ణు)ణ్డైన నాగతిరాజునుం బుట్టి రయ్యి ద్దటిలోన
19 గుసుమాదిత్యుణ్డు జేష్ట[10] పుత్రుణ్డై రాజ్యలక్ష్మిదాల్చిని—

రెండవ రేకు - రెండవ వైపు

20 ల్చె నాతని ప్రథమ రాజ్యంబున భూమిప్రఘట్టంబు వుట్టి—
21 న యవసరంబున బొట్టున వాని ప్రధానులు శ్రీకరణా—
22 ధి పతియైన యిందపరాజును అతని తమ్ముణ్డైనరేమరా—
23 జును సమస్త వస్తువాహనంబుల నుం గులధన—
24 ంబుల నుం జేకొని కుసుమాదిత్యుతోడన పరమ—
25 ణ్డు లాభిముఖులై కందమూల ప(ఫ) ల సా(శా)ఖాదు లాహారంబు
26 గా ద్వాదస(శ) వరుషంబులు నవసి కాయ్యన్ ఖ ల్గ సహాయు
27 లై నిజదేసం(శం)బైన విసుఉనాణ్డు సకలమును [గు]—

మూడవ రేకు - మొదటివైపు

28 సుమాదిత్యు నేలించి యా చంద్ర ((ద్రా) క్కన్ంబుగా ప్రతిష్ట(ష్ఠి)(ం*) చి
29 న కుసుమాదిత్యుణ్డు యి[ం]దన రేమనల భృ(భృ)త్య భావంబు [న]—
30 కుం దన్నుం జేకొని ప్రతిష్టి(ష్ఠి)ంచిన ప్రధానత్వంబు నకు న—
31 త్యన్తం బైన కారుణ్యంబు గలిగి మకర తోరణంబు—
32 లుం బల్లి తొంగడ్లునుం సలికి క్షూంకట్లు లు[11] నుం బ—
33 డిడ(ఢ)క్కలుం బల్లియందలంబును యొలపున బ—
34 న్ను పిడియెక్కను వెంజామరాలునుం దలవుగా మహామణ్డ—
35 లేస్వ(శ్వ)ర పదవి విరాజమ(మా)న మానోణ్నన్[12] త ప్రభు మంత్రోత్సా
36 హా(హ) స (శ)క్తి సమస్థా(స్తా)లంకారంబును నిచ్చి మఱి యున్ను ప—

మూడవ రేకు - రెండవ ప్రక్క

37 ద్మ గ చ్ఛున్(చ్ఛన్) స్తథాపుత్ర [ః]* యాజ్ఞవల్కి మహాత్మనాం రి(ఋ)షి వ్విన్ ప్ర
38 కులాన్వా(న్వ)యం ఇతిః[13] కౌణ్డ(ణ్డి)ల్య గోత్రతః అనం గాను భయ
39 కుల సు(శు)ద్ధులయిన యాదన్తన పెగ్గన్డ్ల పుత్రులు శ్రీకర—
40 ణము నిందప రాజునకు వ(వా)రి సహోదరుణ్డయి న రే—
41 మ రాజునకు నిట్టి మహామహిమ లిచ్చి విసుఉ
42 నాంట మహాసారాం(రం)బైన క్రివ్వక యగ్రహారంబుగాను—
43 త్తరాయ న(ణ) నిమిత్యం (త్తం)బున ధారాపూర్వన్ (క*)ంబుసేసి యా—
44 దిత్యం[14] చంద్రులు కలయన్త గాలంబునకు సాసా(శాస)—

నాల్గవ రేకు - మొదటి ప్రక్క

45 నంబుగా నిచ్చె ం◊ం ఆనత్సంద్రస్యా సూయ్యన్స్యయా—
46 వత్తిష్టతి మేదినీ యావద్రామ కథాలోకే తావ ర
47 ద్రజ్యం విభీషణః [II] [15] ఇది దీవనార్థన్ంబు వ(ప) రమా
48 ర్థన్ంబు గావించి యిచ్చె నియ్యా(య్య)గ్రహారంబు
49 సీమ సన్ధిః(న్ధి)[I]* పూర్వన్తః గోదావరి తీరంబున పసి
50 ప్రిక్షంబును కుంటయు లెల్లజాలును ద్రింట మె
51 ట్టయు దక్షిణతః యారిలోవ పశ్చిమతః మ—

నాల్గవ రేకు - రెండవ ప్రక్క

52 [ర]ఢుం బాక తుటియ యుత్తరత్తః (తః) గోదావరినది
53 యిది వొలము సీమము [I]*దీని సీమలంఘనము సే—
54 సిన వారు పంచ మహా పాతకులగు ద్రు (దురు) [I]*16

ం◊ం బహువ్వన్.

55 సుద్దన్త్వా బహు భిశ్చాను లేపని సష్టిం వరు–
56 ష సహస్రాణి స్వగ్గన్ మోధపి భూమిపు ◆
57 ఎస్య యెస్య యెతా భూమి తాస్య తస్య తథా పల
58 ం స్వదత్తం పరదత్తం వా యోహరేతి వసుంధర

ఐదవ రేకు - మొదటి ప్రక్క

59 సష్టివరుష సహస్రణ విష్టాయాం జాయతే
60 క్రిమిః నవిషం విష మిత్యాహు బ్రహ్మస్వం విష ము–
61 చ్యతే విషమే కాకినీ హన్తి బ్రహ్మస్వం పుత్ర ప–
62 విత్ర త్రికం ఆయుశ్రయం బల మానంత విలాస
63 మాజ్ఞాం వేదో హరిశ సురపాః క్రమసో రవిశ్చ
64 మద్భక్తి మానితి విచింత్య దదంతు సర్వన్ బయ్యాహ్వాయ
65 స్య భువి భూసుర పంగవస్యం ఇతిః కట విలాస ప్రుతినం
66 విస్వ కమ్మన్ రిషినాం బేతాచారి లిఖితం [U]*

అధోజ్ఞాపికలు

1 ఆం. ప్ర పురావస్తు శాఖ డైరెక్టరుగారు దీని నిందు ప్రకటించుట కనుమతించినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుచుంటిని.

2 ఎపిగ్రాఫియా ఆంధ్రికా I–పుటలు 118–145

3 'భూస్తథా।జజ్జే' అని యుండవలెను.

4 రుదితః

5 శార్దూల విక్రీడితము

6 చాలుక్యాన్వయులు

7 'త' పంక్తికి దిగువ చేర్చబడెను. 'వినీత' అని చదువవలెను.

8 జన్మించె

9 నభినవ గౌరి

10 జ్యేష్ఠ

11 'లు' మిగులు వర్ణము

12 'మానోన్నత'

13 'కులాన్వయ ఇతి' అని యుండవలెను.

14 అనుస్వారము మిగులు

15 ఈ శ్లోకమునిట్లు చదువవలెను –
''యావచ్చంద్రశ్చ సూర్యన్శ్చ యావత్తిష్ఠతిమేదినీ।
యావద్రామ కథా లోకే తావద్రాజ్యం విభీషణ॥''

16 54వ పంక్తిలో తుది యందారంభమైన శాసనాంత సంస్కృత శ్లోకములు కొన్నిటి నిట్లు సరిచేయవచ్చును– బహుభిర్వసుధాదత్తా రాజభిస్సగరాదిభిః। యస్య యస్య యదా భూమిస్తస్య తస్యతదా ఫలం॥ స్వదత్తాం పరదత్తాం వాయోహరేత వసుంధరాం। షష్ఠింవషన్ సహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః॥ నవిషం విషమిత్యాహుః బ్రహ్మస్వం విషముచ్యతే।విషమేకాకినంహన్తి బ్రహ్మస్వం పుత్రపౌత్రకమ్॥ ఆయుః శ్రియం బలమనన్త విలాస మాజ్ఞాం, వేధోహరీశ సురపాః క్రమశో రవిశ్చ। మద్భక్తి మానితి విచింత్య దదాతు సర్వం, బయ్యాహ్వయస్య భువి భూసుర పుంగవస్య॥

ప్రకృతి

శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి

ప్రకృతి
అందానికి
ఆకృతి.

పూవులు పూచి — కాయలు కాచి
కడుపునిండ, సస్యాలను — కనీ — పెంచి
తల నీలాలు వీగి తనూలత తూగి
శిశిరం వరకూ కృశించిన ప్రకృతి
వసంతం నాటికి చేకొంటుంది నవ్యాకృతి.

ఏ కాంతకూ లేని ఈ సుగుణం
ఆ కాంతకు చర్విత చర్వణం.

సెగలు చిమ్మే దిగుళ్ళ మ్రోడుల్లో
చిగురు వేసే ఆశలకు

ప్రకృతి
భాషారహిత,
వ్యాకృతి.

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

ఎలమంచిలి చాళుక్యులు - సాహితీ సేవ

తెలుగునాట మార్గ కవిత చోటు చేసుకొన్నప్పుడు దేశి కవితను పుట్టించి ఆశ్రయమిచ్చిన ఖ్యాతి నిస్సందేహంగా వేంగీ చాళుక్యులకే చెందుతుంది.[1] గుణగ విజయాదిత్యుని కాలమునకే లతలల్లుకొన్న తెనుఁగు కవిత నన్నపార్యుని భారత రచనతో రాజరాజు కాలమునకు ఆంధ్రదేశమంతయు వలముకొన్నది. ఈ భాషాపోషణ, జాతీయ సంస్కృతీ పరిరక్షణలు వీరి నుండి పుణికిపుచ్చుకున్నది ఎలమంచిలి చాళుక్యులు. వీరు వేంగీ చాళుక్య వారసులై తీరాంధ్ర ప్రాంతమును క్రీ॥ శ॥ పదమూడవ శతాబ్ది ఆరంభము నుండి సుమారు నాలుగు వంద లేండ్లు రాజ్యమేలిరి. తమ పూర్వీకులు తెలుగు సాహిత్యాన్కి సభాగౌరవ మందిస్తే, యీ రాజులు తెలుగువారికి శాస్త్రగ్రంథాలు, లక్ష్య గ్రంథాలు ప్రప్రథమంగా అందింపజేసి తమ వంశ ప్రతిష్ట వినుమడింపజేసినారు. "తెలుగుదేశ భాష తెలియు బొమ్మనఁ బోక, తెలియవలయుమించు తేటపడఁగ"[2] అని ఘంటాపథంగా శాసించిన తెలుగుతనం మనకీవంశస్తుల్లో స్ఫుటంగా కన్పిస్తుంది. ఎలమంచిలి రాజధానిగా రాజ్యంచేసిన యీ రాజులు శైవమతాభిమానులు.[3]

వీరి రాచరికంలో సాహిత్యం మూడు పూవు లారు కాయలుగా వర్ధిల్లింది. వీరికాలపు సంస్కృత రచనలు మాత్రం లభ్యంకాలేదు. శాసనములలో కూడ జనసామాన్యమున కర్థమగునను దృష్టితో సంస్కృత భాగము దిగువున తెలుగున చెప్పబడెడిది. శుష్కభాషాభిమానమే కాకుండ, కొప్ప రాజనారాయణుడు, విశ్వేశ్వరదేవ చక్రవర్తి మున్నగువారు సాహితీవేత్తలని శాసనముల మూలమున తెలియుచున్నది.[4] వారు పోషించిన కవుల రచనము లందు కూడ ఈ విషయము స్పష్టపరుపబడినది.

రసజ్ఞుల్ని రంజింపజేసే విధంగా తెలుగు కావ్యాన్ని మలచటాన్కి చాల ప్రయత్నాలు సాగాయి. కాని ఆ ప్రయత్నముల ప్రక్రియ సంస్కృత భాషా సంబంధం కావటంతో అనుకరణగా మారి తెనుఁగు కవిత్వ స్వేచ్ఛకు భంగము కల్గినది. తెనుఁగుకవులు ఆయా సందర్భములలో సంస్కృత గ్రంథములు నిర్దేశించు నియమానుసారమే కట్టుబడవల్సిన వారైరి. తెలుగు సాహిత్య చరిత్రలో అంత వరకు యే ఒక్క శాస్త్ర గ్రంథమును లేకపోవుట గుర్తింపదగిన లోపము. అసంఖ్యాకములైన ప్రబంధముల తాకిడికి తట్టుకొని నిల్చిన శాస్త్రగ్రంథములే తెనుఁగున అంతంతమాత్రము. నారయ కవి "పశు వైద్యము"ను గ్రంథమును, వేదయ "ఆయుర్వేద సంగ్రహ"మను గ్రంథమును వ్రాసి ఈ లోటు తీర్చినమా, పైన పేర్కొనిన కాలమునకే దోనయామాత్య కవి "సస్యానందము"ను గ్రంథమును వ్రాయుట గమనార్హము ఇది మిగిలిన శాస్త్రగ్రంథము లన్నింటిలోను తలమానికమని పోల్చదగినది. ఈ దోనయామాత్యుడు ఎలమంచిలి రాజాశ్రితుడు.[5]

"వసుధలోన పరమవంశ విభూషణమైన నన్నుపేంద్రు డాదరింప
శ్రీకరముగ 'సర్వ లోకాశ్రయముజెప్పి- మిన్నుముట్టు కీర్తిగన్నవాడ"

— అని చెప్పటను బట్టి ఈ కవి 'సర్వలోకాశ్రయ' మను గ్రంథమును కూడ చేసినట్లు తెలియుచున్నది. కాని అది లభ్యము కాలేదు. ఎలమంచిలి రాజులు సర్వలోకాశ్రయ బిరుదాంకితు లగుటచే వారి వంశ ప్రశస్తిని వర్ణించు గ్రంథము కానోపును. శ్రీ నిడదవోలు వెంకటరావుగారి యభిప్రాయమున ఈ కవికాలం క్రీ॥ శ॥ 1356 గాని 1360 గాని యగును. అట్లైనచో పైన పేర్కొనబడ్డ ఉపేంద్రుడు, కొప్ప రాజనారాయణుని కుమారుడు క్రీ॥ శ॥ 1356–64 సం॥మధ్య రాజ్యమేలిన మూడవ ఉపేంద్రుడు కాదగును.

ఇతడు వ్రాసిన 'సస్యానందం' వర్షశాస్త్రం. వర్షమే కదా సస్యానంద కారకం! అయితే కవి ప్రత్యేకంగ ఈ విషయమై ఒక గ్రంథము చేయుటనుబట్టి ఈతని లోకోపకార దృష్టి తెలియుచున్నది. "వానచేత సస్యవర్గంబు వర్ధిల్లు సస్యవృద్ధి సకలజన సమృద్ధి; కారణంబు దానగావున ధరలోన వానవలయు నెల్ల వారలకును" — అని గుర్తించి "పవర్ష వివర్షణంబులు జనులకు బోధ సేయుటకునై సస్యానందము జెప్ప నుద్యోగించితి" అని తన సంకల్పమును వ్యక్తపఱచెను. ఈ పరిస్థితుల్లో యిలాంటి యిలాంటి గాలులు వానలూ వుంటే తత్ఫలితంగా సస్య ఫలిత మే తీరున వుంటుందో నిర్దేశించి చెప్పటం నిజంగ సాహసమే. ఆ సంగతి కూడ కవి పేర్కొంటాడు.

దానవ సుర ఖచరాదులు
గానరు మానిముల చిత్తగతియును ధరలో
వానల రాకయు బోకయు
మానవులది దెలియుట కట మాన్యముగాదే!

ఎందుకు కాదు, మాన్యుడు గనుకనే గ్రహగతులకు తోడుగా ప్రకృతిలో సంభవించే మార్పును క్రోడీకరించి మరీ చెప్పగలిగాడు వానల రాకపోకలు. చుక్కలు, దిక్కులు, గాలులు, మేఘాలు, ప్రకృతి — వీటి పరస్పర సంబంధాలు అర్థమైతే తప్ప యిలా చెప్పగలగట మసాధ్యం. ఈ గ్రంథంలో వర్ష ప్రశ్నోత్తర లక్షణాలు సవిస్తరంగా చెప్పబడ్డాయి. పశుపక్ష్యాదులు వాతావరణంలోనిమార్పులకు ఎట్లా సురయ్యేదీ ఈ గ్రంథంలో గుర్తించటం జరిగింది.[6]

వాతావరణశాస్త్రం జ్యోతిషంలో భాగమనేది అంద రెరిగిన సత్యం. గ్రహాల చలనాలు, పరస్పర ప్రభావాలు గుర్తెరగనిదే వర్ష నిర్ణయం సాధ్యం కాదు. ఈ దోనయామాత్య కవి గొప్ప జ్యోతిష శాస్త్రవేత్త కూడ నగుటచే ఈ గ్రంథంలో కొన్ని సాంకేతిక పదాల్ని ప్రయోగించాడు. స్వాతీ నక్షత్రాన్ని వాయుతార యన్ని, అనూరాధని మైత్రభమని, ఆరుద్రని రుద్ర నక్షత్రమని, హస్తని కరతారయని, జ్యేష్ఠ నక్షత్రాన్ని మహేంద్రమని, శతభిషని వారుణమని, ఆశ్లేషని భుజగతారయని పేర్కొన్నాడు. ఇదేగాక పూర్వులు ఏ విధంగా వాన రాకడ తెల్సుకొనేవారో కొన్ని అనుశ్రుతంగ వస్తున్న పద్ధతుల్ని కూడ కవి ప్రస్తావించాడు. ఆషాఢ శుద్ధ పూర్ణిమనాడు తెల్లవారు ఝామున గాలివీచే దిశనిబట్టి ఆయేటి వానల తత్వం తెలుస్తుంది. ఈ ఆషాఢ శుద్ధ పాడ్యమి మృగశిరా నక్షత్రంతో కూడివుండగా మేఘం గట్టిపడితే ఆ యేటి తొలకరికి కరువే లేదుట. గాలిని, మేఘాన్నిబట్టే కాకుండ కురుస్తున్న మంచునిబట్టి కూడ వర్షపు ఉధృతిని తెల్సుకోవచ్చునట. పుష్యమాసపు పున్నమినాటి రాత్రి కురుస్తున్న మంచు ఆధారంగా ఆయేటి వర్ష పరిమాణం చెప్పబడు తుంది. అలాగే వర్షాన్ని ఏ విధంగా కొలుస్తారో, ద్రోణమంటే ఏమిటో వివరిస్తూ —

''కొలువగ నరువది మూడం
గుళములు ముఖ వృత్తమైన కలశను దైవ
జ్ఞులు బయల నిల్పి వర్షము
వెలిసిన నవిలుతమైన
వెస ద్రోణమగున్'' — అంటాడు.

వీని యన్నింటి కంటె ముఖ్యమైనది, శాస్త్రీయమైనది తొలకరి వర్షపు రుచినిబట్టి ఆయేటి పంటల పరిణామ ప్రమాణాలు నిర్ణయించటం —

''తొలుతటి వానలో దోయంబు లొగరైన
నొట్టైన యగునేని కొఱ్ఱచేలు
తిక్తంబు నూవు బత్తియు గుసుమయునగు
మధురంబు నగునేని మద్దిగడలు
నెఱయ జప్పనయైన నింపుతో జొన్నలు
చెలువొందు గోధుమ చేలు బండు
కనరైన వరి గయు గంటెయు బొడ చామ
లాదిగా జేలు బెంపారు నీరు
పుల్లయయ్యేనేని ప్రొల్లగు దఱచుగ
నుప్పనైన బంట జెప్పజూప
గలుగ దండ్రు... .. ''

— ఎన్ని విశేషాలు! ఎంతటి పరిశీలన!!

దోనయామాత్యుడు వివరించిన వాతావరణ సూచనలన్నింటిని యాతని సమకాలికులు, అనంతర కవులు తమ తమ వర్ణనల్లో చొప్పించటం గమనార్హం. శాస్త్రీయ దృష్టిచేతనేగాక భాషా వాఙ్మయ విషయ దృష్టిచేత కూడ ఈ గ్రంథం పరిశీలింపదగినదని శ్రీ నిడదవోలు వెంకటరావుగారి యభిప్రాయం. వాఙ్మయ విశేషాలు చాల ఈ గ్రంథం వలన తెలుస్తాయి. ఈ కాలం నాటికే మంజరీ ద్విపద తెలుగు సాహిత్యంలో ఆవిర్భవించిన దనటానికి ఈ కావ్యమే సాక్ష్యం. కొన్ని నూత్న ప్రయోగాలు, విలక్షణమైన యతుల వాడకం, ఈ గ్రంథపు ప్రత్యేకతలు.[7] తెలుగు వాఙ్మయంలోని ఈ చిన్న చిరుజల్లు 'సస్యానందం'' పేరుతో ప్రభవించి ఇతర కవులకు, శాస్త్రకారులకు నాటికి నేటికి మార్గదర్శకంగా విలసిల్లుతోందంటే ఈ ఖ్యాతి దోనయామాత్యునకు, అంతకుమించి యాతనిని చేరదీసి తెలుగున ఈ కృతిచేయించిన ఎలమంచిలి చాళుక్యులకే చెందుతాయి. ఈ కవి వ్రాసిన 'సర్వలోకాశ్రయ'మే కనుక లభ్యమైతే ఎలమంచిలి ప్రభువుల కూలంకష చరిత్ర జాతికి లభ్యమై కొత్త వెల్గు చిందించేదేమో!

ఎలమంచిలి చాళుక్య వంశాన్ని తెలుగు సారస్వత మున్నంత కాలం స్ఫురణకు తెచ్చే మరొక మహోత్కృష్ట గ్రంథం 'కావ్యాలంకార చూడామణి'. ఈ 'చూడామణి' 'సాహితీ ఘన రస రత్నాకరం' నుంచి 'ఒడగూర్చి' తేబడిన 'కబ్బపుమణి'. ''అచ్చటనచ్చట నున్న కావ్యాగమములం జెలంగి సత్కవి సౌకర్యసిద్ధి కొరకు, ఒక్కచోటనె యొడ గూర్ప నుత్సహించి'', కూర్చిన ఉల్లాసాల మాలిక. ఒక లక్షణ గ్రంథం. దీని కర్త విన్నకోట పెద్దన. ఎలమంచిలి ప్రాంతములు క్రీ॥ శ॥ 1377 – 1407 సం॥ మధ్య పాలించిన చాళుక్య విశ్వేశ్వర భూపతి ఆశ్రితుడు. గ్రంథారంభమున తనను గూర్చి,

''......గావ్య క్రమవేది నర్చిత బుధానందాదరా లోకితున్,
మనిత శ్రీగిరి జేశపాద యుగళున్, మాన్యున్, గళకౌశలున్,
వినుతుం గౌశిక గోత్రుం బెద్దన సుధీ విఖ్యాతు—''

నని చెప్పుకొన్నాడు.

గ్రంథంలో ఈతడు నియోగి బ్రాహ్మణుడని, కౌశిక గోత్రుడని, గోవిందామాత్యుని కుమారుడని తెలుస్తుంది. ఈతనినిగూర్చి, వీరి వంశాన్ని గూర్చి తెల్సుకోవటానికి సింహాచలంలోని శాసనాలు, పంచధారల ధర్మలింగేశ్వరుని ఆలయంలోని శాసనాలకి తోడుగా ఈ కావ్యం మనకెంతో వుపకరిస్తుంది. ఈతనిని గూర్చి కవి—

సీ॥ ''శ్రీకంఠ చూడాగ్ర శృంగార కరణమే రాజున కవ్వయారంభ గురుడు,
చాళుక్య వంశ భూషణము శ్రీవిష్ణువర్ధనుడే మహీశు తాతలకుం ధాత,

భృత కుమారా రామ భీముండు చాళుక్య భీముఁడే నృపకులా
బ్ధికి విధుండు,
రాజమహేంద్ర పురస్థాత రాజనరేంద్రుఁ డెక్కువ తాత యే
విభునకు,
తే॥ నంధ్రదళ దానవోపేంద్రుఁ డగు నుపేంద్ర, ధరణివల్లభుఁడే
రాజు తండ్రి తండ్రి
ఘనుఁ డుపేంద్రాఖ్యుఁ డెవ్వనిగన్న తండ్రి, యతఁడు విశ్వేశ్వ
రుఁడు లక్కమాంబ సుతుడు.''

– అని పేర్కొనినాడు.

శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు తమ 'ఆంధ్ర కవుల చరిత్ర'లో ఈ విశ్వేశ్వర భూపతి రాజరాజనరేంద్రున కేడవ మనుమఁడై యుండునని యభిప్రాయపడి ఈతని కాలం క్రీ॥ శ॥ 1304 తర్వాత నారంభమగునని తెల్పినారు. ఈ విషయమునే ధృవపఱచుచు శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు[8] మరియొక విధముగ పరిశీలించినమా ఈ విశ్వేశ్వరుని మనుమడైన నరసింహదేవ చక్రవర్తి క్రీ॥ శ॥ 1403 వాడగుటచే నీ విశ్వేశ్వరుడు రూఢిగా క్రీ॥ శ॥ 1330 ప్రాంతము వాడనిరి. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ''శాకాబ్దే నవ బాహు రామ శశి సంఖ్యాతే...... ...'' అని యున్న పంచధారల పురంలోని చాళుక్య విశ్వేశ్వరుని శాసనమాధారంగ[9] ఈతని కాలం శక సం॥ 1329 అనగా క్రీ॥శ॥1407 నాటికి సరిపోవుచున్నదని తేల్చిరి.

శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రిగారు 'కావ్యాలంకార చూడామణి' ఉపోద్ఘాతములో ఈ విశ్వేశ్వరుని రాజ్యారంభకాలమును గూర్చి ప్రస్తావించుచు ఈ గ్రంథమున నొకచోట ''నూతన క్ష్మానాథుండగు విశ్వనాథునకు'' అనుటను బట్టియు, శక సం॥ 1324 ప్రాంతమున జరిగినట్లు పేర్కొనబడిన సర్వసిద్ధి యుద్ధము కూడ గ్రంథమున ప్రస్తావించుటను బట్టియు, ఈ రాజు క్రీ॥ శ॥ 1400 ప్రాంతమున సింహాసనమునకు వచ్చియుండునని చెప్పినారు. కాని ఈ విశ్వేశ్వరుడు క్రీ॥ శ॥ 1377 నుండి 1407 వరకు రాజ్యము చేసినట్లు శాసనాధారము కలదు. విష్ణువర్ధన, సర్వలోకాశ్రయ చక్రవర్తి, రాయగండగోపాల, ధరణీ వరాహ - మున్నగునవి శాసనములలో వర్ణితములైన ఈతని బిరుదనామములు.

వీరి వంశ వృక్షము గమనింపుడు (శాసనము లాధారముగా నిర్మించినది.)

విజయాదిత్యుడు (క్రీ. శ. 1205–28)
(భార్య : చండాంబిక)
|
మల్లపుడు (క్రీ. శ. 1228–53)
(భార్య : లక్ష్మి)
|
మొదటి ఉపేంద్రదేవుడు (క్రీ. శ. 1253–66)
(భార్య : గంగాంబ)
|
రెండవ మల్లపదేవుడు (క్రీ. శ. 1266–83)
(భార్య : చోడాంబ)
|
రెండవ ఉపేంద్రదేవుడు (క్రీ. శ. 1283–1316)
(భార్య : మల్లాంబ)
|
కొప్పరాజనారాయణుడు (క్రీ. శ. 1316–1356)
(భార్య : గంగాంబ)
|
మూడవ ఉపేంద్రదేవుడు (క్రీ. శ. 1356–64)
(భార్య : బింబాంబ) 'సస్యానంద'పు కృతిపతి

చెన్నీశ్వరుడు (క్రీ. శ. 1364–72)
(భార్యలు : మల్లాంబ; ముమ్మడాంబ)

నాల్గవ ఉపేంద్రుడు (క్రీ. శ. 1372–75)
(భార్య : లక్కాంబిక)
|
విశ్వేశ్వరదేవచక్రవర్తి (క్రీ.శ.1377–1407)
(భార్య : మనుమయదేవి)
'కావ్యాలంకార చూడామణి' కృతిపతి

(చెన్నీశ్వరుని కుమారులు:)

ఐదవ ఉపేంద్రుడు (క్రీ.శ.1375–77)
(భార్య: అత్యమాంబ)

చీడేంద్రుడు (క్రీ. శ.1391–1412)

(ఐదవ ఉపేంద్రుని కుమారులు:)

ఆరవ ఉపేంద్రుడు (క్రీ.శ. 1412–17)

నాగేంద్రదేవుడు (క్రీ.శ.1417–22)
(భార్యలు : అన్యమదేవి; భవానిదేవి)
|
కుమార ఎఱ్ఱమనాయకుడు (క్రీ. శ. 1437–94)
(భార్య : సింగమాంబ)
|
సింగరాజ మహాపాత్రుడు (క్రీ. శ. 1494–1530)

నరసింహదేవచక్రవర్తి
(క్రీ. శ. 1422–1437)

(సింగరాజ మహాపాత్రుని కుమారులు:)

శ్రీధరరాజనరేంద్రుడు
(క్రీ. శ. 1530–38)

హరినరేంద్రుడు
(క్రీ. శ 1538–70 లేక 80)
|
సర్వరాజు
(క్రీ. శ. 1570 లేక 80 – 1599)

పెద్దన కవి యీ అలంకార గ్రంథమున పురవర్ణన కుదాహరణగా రాజమహేంద్రవరమును వర్ణించుటచే శ్రీ వీరేశలింగం పంతులుగారు యీ విశ్వేశ్వరుని రాజధాని రాజమహేంద్రవరముగా భావించిరి. కాని యట్లనుకొనుట కాధారములులేవు. ఎలమంచిలి చాళుక్యవంశమునకు రాజమహేంద్రవర మెన్నడును రాజధానిగాలేదు. ఈ 'కావ్యాలంకార చూడామణి'లో ఒక సందర్భమున కవి విశ్వేశ్వరుని వర్ణించుచు "ఆంధ్రేశ్వరాభిరాముఁడు" అనియు, "ఆంధ్ర భూపాగ్రగణ్యుడు" అని చెప్పి వేరొకచోట (పైన పేర్కొనిన పద్యమున) "ఆంధ్రదళ దానవోపేంద్రుడ"ని పేర్కొనినాడు. అట్లే శక సం॥ 1324న జరిగిన సర్వసిద్ధి యుద్ధమున యీ విశ్వేశ్వరుడు ఆంధ్రబలాల్నెదిరించి ఓడించినట్లుగా పంచధారల శిలాశాసనం పేర్కొంటుంది. ఇదే విషయాన్ని తన గ్రంథంలోని యేడవ వుల్లాసంలో విన్నకోట పెద్దన కూడ వర్ణించాడు :

"చతురుపాయ బాహుశక్తి క్షమావళి బాఱవిడిచి చిత్రభానుసాక్షిఁ
బాఱె సర్వసిద్ధి పదమేది ధరణీ వరాహమునకునోడి రాచకదుపు"

ఇచ్చటి 'రాచకదుపు' ప్రయోగాన్నిబట్టి ఆ శత్రుసైన్యం ఏ ఒక్కరిదో కాదని, కొందరి కలయిక అని, ఆ మూక చాళుక్య విశ్వేశ్వర దేవునిచే పరాభవింపబడిరనియు స్పష్టముగా తెలుస్తోంది.

పైన పేర్కొనిన పద్ధతిలో యీ ఎలమంచిలి విశ్వేశ్వర దేవుడు 'ఆంధ్రరాజు'గా కొన్ని పర్యాయాలు, ఆంధ్రరాజుల వైరిగా కొన్ని పర్యాయాలు చిత్రింపబడతాడు. దీనికి ఒక కారణం వూహించటానికి అవకాశం వుంది. ఈ కాలం 'ఆంధ్ర' శబ్దం స్థలపరంగా సరిగా నిర్ధారణ కాని కాలం. ఇంతకుముందు మూడువందల సం॥ల ముందువరకు వేంగిమండలంగా గుర్తింపబడ్డ ప్రాంతాలు మాత్రమే యీ 'కాలం' నాటికి 'ఆంధ్ర'మండలంగా చెప్పబడేది. దీనికుత్తర భాగము కళింగము. ఎలమంచిలి, పిఠాపుర ప్రాంతాలన్నీ చాల కాలంవరకు కళింగాంతర్భాగాలే.[10] ఆంధ్రప్రాంత మనిపించుకొను రాజమహేంద్రవర పాలకులు తఱచు సింహాద్రి పర్యంతము నాక్రమించు యుద్దేశ్యముతో యుద్ధములు చేయుచుండుటచే తను సామంతృత్వము కళింగ సార్వభౌములైన గాంగుల, గజపతుల దెస నెఱపినపుడు ఆంధ్రవైరులమనియు, రాజమహేంద్రవర పాలకుల సార్వభౌమత నంగీకరించినపుడు ఆంధ్రులమనియు పరిస్థితులనుబట్టి అనుకొనుచుండుట ఇటువంటి సామంతుల పద్ధతియని చెప్పనగును.

కాలమునుబట్టి యీ కవి శ్రీనాథుని సమకాలికుడు ఈ గ్రంథము నందెచ్చటను పూర్వకవి స్తుతి కన్పట్టదు. ఇది ఒక "పూర్వకల్పిత శాస్త్రానుగతియైన" స్వతంత్ర రచన దేనికిని అనువాదముకాదు. కాని విషయమునుబట్టి, యీతడు చెప్పకపోయినను యీతనికి పూర్వులైన విద్యానాథుని 'ప్రతాపరుద్రయశోభూషణము', దండి వ్రాసిన 'కావ్యాదర్శము' మున్నగు గ్రంథముల నీతడు తప్పక మూలముగా గొనియుండును.[11] తన ప్రభువున కంకితమిచ్చుచు ప్రతాప రుద్రీయమువలెనే యన్నింటికి ప్రభువునే విషయముగా జేసి లక్ష్యములను వ్రాసినాడు.

తెనుగు కవిత తీగ సాగుసరికి తెలుగున ఛందోగ్రంథము గాని వ్యాకరణ గ్రంథముగాని లేదు. విపుల శబ్ద శాసనుడైన నన్నయ ఒక సంప్రదాయ సృష్టికి మూలకారణమైనాడు.[12] ఆ వరవడిలో తన "కవి జనాశ్రయము"తో బాటలు వేసినది రేచన. తెలుగువారికి వ్యాకరణ గ్రంథములేని కొఱత తీర్చినది కేతన. ఇట్లివి వేర్వేరుగానున్న పరిస్థితులలో, "కావ్యకళాచతుష్టయము" "అన్యోన్య ముఖావలోకము" చేయకుండిన సందర్భమున 'ఏకస్థలిం కలిగించు'టకు యీ విన్నకోట పెద్దన సమకట్టి, వుల్లాసమాలికగ రూపుదీర్చి తెలుగు సాహిత్యమున 'చూడామణి'గ నమరించెను. యిట్లన్నింటి మేళవింపుల గుబాళింపు గీర్వాణమున సైతము గానదాదని పరిశీలకులు పేర్కొనుట ముదావహము. ఈ కూర్పు వెనుకనున్న ప్రోత్సాహము స్మరించుకొనుచు కవి—

సీ॥ "వేదశాస్త్ర రహస్య విధులెల్లఁ బరికించి, సరిఁజతుర్వర్గ ప్రశస్తినొంది,
రాజ విద్యాతంత్ర రక్తి సంభావించి, వర్ణక్రమంబుల వల నెఱింగి
జ్యోతిషాయుర్వేద సంగతి నెగడొంది, సంగీత సాహిత్య సరణి నేర్చి
తురగేభరోహణాదుల విశ్రుతికి నెక్కి యాయుధ విద్యల నతిశయిల్లి
(౧ ఉల్లా.౯)

తే॥ యచట నచ్చటనున్న కావ్యాగమములఁ
జెలఁగి సత్కవి సౌకర్యసిద్ధి కొఱకు
నొక్కచోటనె యొడఁ గూర్ప నుత్సహించి,
సత్కళావర్తి విశ్వేశ చక్రవర్తి.

మ॥ లలినన్యోన్య ముఖావలోకనము లీలం జేయఁగాలేని యా
విలసత్కావ్య కళాచతుష్టయము లుర్విం బర్వనేకస్థలిం
గలిగించెం బదవాక్యవేదియు సలంకారజ్ఞుఁడున్ భావరో
జ్జ్వల విద్యావిభవోన్నతుండునగు విశ్వక్ష్మావిభుండిమ్మలన్
(౯ ఉల్లా. ౧౭౨)

– అని తన యేలికను ప్రస్తుతించినాడు. మన ఆంధ్రదేశాన్ని తెలుగు దేశమని అనటానికి కారణం చెప్తూ—

కం. "ధర శ్రీపర్వత కాళేశ్వర దాక్షారామ సంజ్ఞ వఱలు త్రిలింగాకరమగుట నంధ్రదేశం బరుదారఁ ద్రిలింగ దేశమనఁ జనుఁ
గృతులన్ (౯ ఉల్లా. ౫).

గీ. తత్త్రిలింగ పదము తద్భవంబగుటచేఁ
దెలుఁగు దేశమనఁగ దేట పడియె,
వెనుఁక, దెనుఁగు దేశమును నంధ్రు కొందఱు
బ్బాస పంచగతులఁ బరఁగు చుండు." (౯ ఉల్లా. ౬)

— అని వివరించాడు.

తన ఈ లక్షణ గ్రంథాన్ని ఎలా మలుస్తాడో పేర్కొంటూ,

మ. ''చతురశ్రోత్ర సుఖా కరామృత పరిష్యందంబు నందంబునై
క్షితిఁ గావ్య ప్రసరంబు వొల్చు నిఖిల క్షేమంకర స్ఫూర్తితోఁ
బ్రతిభావంతులు మెచ్చ లక్షణము నొప్పం జెప్పదుం బూర్వక
ల్పిత శాస్త్రాను గతంబుసంగతముగాఁ బ్రీతిప్రద వ్యక్తిచేన్.''
(౩ ఉల్లా. ౨౨)

— అంతటి లాక్షణికుడు కనుకనే గణపవరపు వేంకట్ట కవి వంటి వారి ప్రశంసలకు బాత్రుడైనాడు.

ఈ కవి ఈ లక్షణ గ్రంథమేకాక 'ప్రద్యుమ్న చరిత్రము'ను ప్రబంధమును కూడ రచించినట్లు భావింపబడుచున్నది,[13] కాని నిర్ధారించుటకు తగిన ఆధారములు లేవు. ప్రస్తుతం మనకి లభ్య మౌతున్న గ్రంథంలోకూడా కొన్ని పద్యాలు పెద్దనవి కావంటారు.[14]

ఇక, ఈ 'చూడామణి' రచనాకాలము గుర్తించుటకు ఈ క్రింది యంశములు గమనింపవలసియున్నది.

(I) సప్తమోల్లాసపు ౪౧ వ పద్యమున విశ్వేశ్వరభూపతి విజయము నందిన సర్వసిద్ధి యుద్ధము వర్ణింపబడుట.

(II) ద్వితీయోల్లాసపు ౨ వ పద్యమున విశ్వేశ్వరదేవుని ''నూతన క్ష్మానాథుండు'' అని పేర్కొనుట.

(III) తృతీయోల్లాసపు ౯౪ వ పద్యమున పురవర్ణన కుదాహరణగా రాజమహేంద్రవరము వర్ణింపబడుట.

(VI) షష్ఠ్యంతములలో కృతిపతి నాశీర్వదించు సందర్భమున ''అభ్యుదయ పరంపరల కకంపిత స్థితి యావహిల్లు నట్లుగా'' అని చెప్పుట.

శాసనములు పేర్కొనుటనుబట్టి ఎలమంచిలి విశ్వేశ్వరదేవుడు క్రీ॥ శ॥ 1377 నుండి 1407 వరకు ఎలమంచిలి ప్రాంతమును పాలించెను. చివరి అర్ధభాగము అనగా క్రీ॥శ॥ 1391 నుండి తన దాయాదియైన చోడగంగునితో కల్సి పాలింపవలసివచ్చెను. ఇట్టి సంయుక్త పాలన కానాటి రాజకీయ పరిస్థితులు కారణము కావచ్చును.[15] చిత్రభాను నామ సం॥ అయిన క్రీ॥ శ॥ 1402లో సర్వసిద్ధి కడ జరిగిన భీకర యుద్ధములో విశ్వేశ్వరదేవుడు ఆంధ్ర బలాన్నెదిరించి జయించినట్లు 'కావ్యాలంకార చూడామణి' లోను, శాసనాల్లోను కూడ ప్రస్తావింపబడింది. అయితే ఈకాలంలో విశ్వేశ్వరునిచే ఓడింపబడ్డ ఆంధ్రరాజు లెవరనేది ఆసక్తితో పరిశీలింప వల్సిన విషయం. ఆ శత్రువులెవరైనదీ ఈ ఆధారాల్లో పేర్కొన బడలేదు.

కాటయ వేముడు తన బలాల్తో తూర్పు గాంగుల నుండి సరియైన ప్రతిఘటన లేని కళింగ భాగాల్లోకి చొచ్చుకొని రావటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అతడీ ప్రాంతాల్ని ఆక్రమించుకున్నట్లు ఒడ్డాది మత్స్యరాజులు, జంతర్నాటి గాంగులపై సార్వభౌమాధికారం పొందినట్లు చెప్పటానికి ఆధారాలున్నాయి.[16]

బహుశః ఆ పరిస్థితుల్లో ఒక యుద్ధమున ఈ సామంతరాజుల కూటమి చాళుక్య విశ్వేశ్వరుని నాయకత్వమున సర్వసిద్ధి కెడ రెడ్డి సైన్యముల నోడించియుండును. తర్వాత చాల కాలము వరకును ఈ మహత్తర విజయమును ఎలమంచిలి చాళుక్య శాసనములు వర్ణించుటనుబట్టి ఈ యుద్ధపు ప్రాముఖ్యత గుర్తింపదగినది. పెద కోమటి వేమారెడ్డి వంటి ప్రబల శత్రువులతో చికాకుల నొందుచున్న సమయమున కాటయ వేము డిట్టి పరాజయము నొందెననుకొనుటయు నసమంజసము కానేరదు. రాజరాజనరేంద్రుని రాజధానియైన రాజమహేంద్రవరమునకు తొలివారసులము తామేయని ఈ ఎలమంచిలి చక్రవర్తులు భావించుచున్నట్లు ఈ గ్రంథమున కొన్ని పర్యాయములు రాజమహేంద్రవరము ప్రస్తావించుటను బట్టి యూహించుకొనవచ్చును. బహుశః ఆ తీరమందలి కొన్ని ప్రాంతములు కూడ ఈ విశ్వేశ్వరు డాక్రమించెనేమో పరిశీలింపవల్సిన విషయము.[17] ఆక్రమించియుండుటచేతనే 'నూతన క్ష్మానాథుండ'ని పించుకొని యుండును. కాని ఈ విజయ ఫలితము లెంతకాలము నిల్చెనో చెప్పలేము. ఆ గెల్చిన ప్రాంతములపై నైనను వీరియాధిపత్యము బలముగ నుండెనో లేదో తెలియదు. కాని ఈ 'అభ్యుదయ పరంపరల కకంపిత స్థితి యావహిల్లునట్లుగా' షష్ఠ్యంతములలో కవి యాశీర్వదించెను.

మరి కొందరి యభిప్రాయములో[18] ఎలమంచిలి విశ్వేశ్వరుని చేతిలో సర్వసిద్ధి యుద్ధమున నోడిన రాచకదుపు 'ఆంధ్రదేశ్వరుల' మని బిరుద నామములు ధరించిన వెలమపాలకులు. కాటయవేముడు పెద కోమటి వేమునితో తీవ్ర కలహములలో మున్గియున్నప్పుడు అన్న దేవచోడుడు రేచెర్ల వెలముల సాయముతో కళింగముపై దండు వెడలగా రెడ్డి రాజుల తరపున చాళుక్య విశ్వేశ్వరుడు వారిని సర్వసిద్ధి వద్ద మళ్ళించియుండునని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి యభిప్రాయము. సింహాద్రి పర్యంతము రెడ్డి నాయకత్వమున నుండుటచే వారి పక్షమున ఈ ప్రాంతపు సామంతులందరును విశ్వేశ్వరుని నాయకత్వమున నటొనరించియుందు రనుకొనుట సహేతుకమే. ఏమైనను ఈ విజయము ఎలమంచిలి చాళుక్యవంశ చరిత్రలో గణనీయమైనది. క్రీ॥ శ॥ 1402వ సం॥న జరిగిన—ఈ యుద్ధము కూడ ఈ గ్రంథమున పేర్కొనబడుటచే నిది క్రీ॥శ॥ 1402నకు, విశ్వేశ్వరుని రాజ్యాంతకాలమైన క్రీ॥ శ॥ 1407 నకు నడిమిని వ్రాయబడి యుండును. ఇట్టి సలక్షణమైన లాక్షణిక గ్రంథమును తెల్గువారికి తెల్గున అందించుటచే ఈ వంశస్థులు తమ పూర్వీకులైన వేంగీ చాళుక్యులను మించి ధన్యతనందిరి.

దోనయ, విన్నకోట పెద్దనల తర్వాత ఎలమంచిలి చక్రవర్తులచే పోషితుడైనవాడు చెన్నాప్రగ్గడ చెన్నకవి రాజకలహంస. ఈతడు కవిత్వము చెప్పచున్నట్లు శాసనముల మూలముగ తెలియుచున్నది.[19] పంచధారల ధర్మలింగేశ్వరుని ఆలయమున కొన్ని శాసనములు తప్ప ఈతని యితర కృతులేవియు నేడు మన కందుబాటున లేవు.

అధోజ్ఞాపికలు

1 పాణ్బన్నయ యుగము పే. 376.
2 కావ్యాలంకార చూడామణి – నవమోల్లాసం. 8.
3 జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటీ, వాల్యూం XXVII పే. 4.
4 యస్. ఐ. ఐ. వాల్యూం నెం. VI, 665; ఏన్యువల్ రిపోర్టు ఆఫ్ ఎపిగ్రఫీ 216 ఆఫ్ 1899.
5 సమగ్ర ఆంధ్ర సాహిత్యం – రెడ్డి రాజుల యుగం.
6 ,, ,,
7 ,, ,,
8 భారతి, డిసెం. 1932, పే. 829.
9 ఎపిగ్రఫియా ఇండికా. వాల్యూం. XXX పే. 335.
10 కళింగ సంచిక.
11 భారతి, డిసెం. 1932, పే. 829.
12 రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక, పే. 50–72.
13 కావ్యాలంకార చూడామణి – పీఠిక.
14 భారతి, 1962 పే. 89.
15 'జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటీ' వాల్యూం. XXVII.
16 రెడ్డి రాజుల చరిత్ర.
17 కావ్యాలంకార చూడామణి – పీఠిక.
18 కవి తరంగిణి. వాల్యూం. IV.
19 యస్. ఐ. ఐ. VI. 670, 671; ఎ. ఆర్. ఇ. 220A; 221 ఆఫ్ 1899.

విస్మృతిలో స్మృతి

శ్రీ మల్లాప్రగడ రామారావు

ఎన్ని నిట్టూర్పుల రహదార్లు పరచినా
అనుభూతుల చేతులు చాచి నిలచినా
విస్ఫారిత ఆశా నేత్రాలతో కలయచూచినా
రహస్య, నిశ్శబ్ద గీతాలతో పిలచినా
విలపించినా ...
కనపడని దేశాలు
కాలిడరాని దూరాలు
మనిద్దరిమధ్యా·
అందుకే ...
జ్ఞాపకాల మడుగులో
జలకాలాడను
వ్యాపకాల గొడుగులో
తలదాచుకుంటాను.

ఐనా ...
ఏ పిల్లగాలో
అల్లరిగా నను లేపి
కూర్చోబెడుతుంది
ఆల్బంలోని ఫొటో
"అన్యాయమ"ంటూ ఆక్రోశిస్తుంది.
సంపెంగిపూవు
అగ్గిపెట్టెలోంచి కన్నీరు కారుస్తుంది.
ఇసుకబొమ్మలో నిలబెట్టి
సముద్రం ఘర్జిస్తుంది
పచ్చదనం తోటకి వ్రేలాడగట్టి
'లోయతోట' ఉరి తీస్తుంది.
ఉదయంలోని అస్తమయంవలె
విస్మృతిలో స్మృతి నను బాధిస్తుంది.

శ్రీ కె. యస్. చెలమ్

పాతికేళ్ల మనదేశ ప్రణాళికా ప్రగతి

మానవ చరిత్రలో ప్రణాళికలకు ఒక ప్రత్యేకస్థానం వుంది. ప్రకృతి కూడా ఒక క్రమబద్ధంగా ప్రకృతిసిద్ధమైన ప్రణాళికను అనుసరిస్తున్నట్లుగా మనం గుర్తించవచ్చు. మానవ పరిణామం కూడా ఒక ప్రణాళికాబద్ధంగా జరిగిందేగదా! అందుచేత ప్రణాళికల చరిత్ర ఎక్కడితో ప్రారంభమయిందో ఖచ్చితంగా చెప్పలేం. అయితే 2400సంవత్సరాలకు పూర్వం ప్లేటో తన 'రిపబ్లిక్' అన్న గ్రంథంలో ప్రణాళికల గూర్చి ప్రస్తావించటం మనకు కన్పిస్తుంది. 19వ శతాబ్దంలో పెట్టుబడిదారీ వ్యవస్థమూలంగా వచ్చిన అనర్థాలను దృష్టిలో పెట్టుకొని ఆనాటి మేధావులు ప్రభుత్వం యీ విషయంలో జోక్యం కల్పించుకోవాలని చేసే వాదనలలో ప్రణాళికల గూర్చి ప్రస్తావించారు. చరిత్రలో, ప్రణాళికలకు శాస్త్రీయప్రాతిపదికను కల్పిస్తూ మొదటి ఆచరణలో (1928) పెట్టింది సోవియట్ రష్యామాత్రమే అవుతుంది. నాజీ జర్మనీ, ఫాసిస్ట్ ఇటలీలో కూడా 'జాతీయ సామ్యవాదం' అన్నపేరుతో ప్రణాళికలను చేబట్టడం జరిగినా అవి శాస్త్రీయమైనవి కావనే చెప్పాలి. దేశంలో కూడా సోవియట్ రష్యాచే ప్రభావితులైన ఆనాటి స్వాతంత్ర్య సమర యోధులలో చాలామంది సామ్యవాదంవైపు, ప్రణాళికలవైపు మొగ్గు చూపించటం కన్పిస్తుంది. శ్రీ మోక్షగుండం విశ్వేశరయ్య 'భారతదేశానికి ప్రణాళికా బద్ధమైన ఆర్థికవ్యవస్థ (**Planned economy for India**) అనే పుస్తకాన్ని 1934లోనే వ్రాశారు. 1937లో జాతీయ కాంగ్రెస్ శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన మొట్టమొదటిసారిగా జాతీయ ప్రణాళికా సమితిని ఏర్పాటుచేసింది. కొన్ని రాజకీయ కారణాలవలన యీ సంఘం 1949 నాటికిగాని తమ నివేదికను తయారుచేయలేకపోయింది. అలాగే 'బోంబే ప్లాన్' అని పిలవబడే టాటా బిర్లాల ప్రణాళిక కూడ ఒకటివుంది. ఈ ప్రణాళిక కాలపరిమితి 15 సంవత్సరాలుగా పెట్టుబడి 10 వేలకోట్ల రూపాయలుగా నిర్ణయించారు. దీనికి పోటీగా ఎమ్. ఎన్. రాయ్ తయారుచేసిన ప్రజాప్రణాళిక, ఎస్. ఎన్. అగర్వాల్ రూపొందించిన గాంధీ ప్రణాళికలు మనకు కొత్తఏమీకాదు. జాతీయ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా 1951లో మనకు మొదటి పంచవర్ష ప్రణాళిక వచ్చింది. ఇది స్థూలంగా మన ప్రణాళికల చరిత్ర.

నిర్వచనం

ప్రణాళికలను మేధావులు, ఆర్థిక శాస్త్రవేత్తలు రకరకాలుగా నిర్వచిస్తున్నారు. 'ఒక ప్రభుత్వ సంస్థ అనేక రకాలైన ఆర్థిక ప్రత్యామ్నాయాలలో కావాలని ధైర్యంగా మెలుకువగా కొన్నింటిని మాత్రమే ఎంపిక చేయటం ప్రణాళికవుతుంది' అని బార్బరా వూటన్ అన్నారు. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ప్రణాళిక అంటే ముందుగా నిర్ణయింపబడిన సూచన (**design**) గా పేర్కొన్నది. డ్రార్ అనే ఆర్థిక శాస్త్రవేత్త భవిష్యత్తులో కొన్ని లక్ష్యాలను సాధించేందుకుగాను తీసుకొనబడే కొన్ని అభిలషణీయమైన నిర్ణయాలను తయారుచేయటమే ప్రణాళికగా పేర్కొన్నారు.

సాధారణంగా యోజన (**plan**) ను ప్రణాళికను (**planning**) ఒకటిగానే చెప్తారు. కాని యోజనవేరు, ప్రణాళికవేరు. యోజన అంటే పై నిర్వచనం ప్రకారం తయారు చేయబడిన ముసాయిదా పత్రం మాత్రమే. దానిని సక్రమంగా అమలుజరిపినప్పుడే అది ప్రణాళిక అవుతుంది. అందుచేతనే మన దేశంలో యోజన వుంది గాని, ప్రణాళికలేదని కొంతమంది చెమత్కరిస్తారు.

ప్రణాళికను ఎలా నిర్వచించినప్పటికి దానికి కావలసిన ముఖ్య లక్షణం ప్రత్యామ్నాయాలలో కొన్నింటినే ఎంపికచేసి ముందుగా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వనరులకు, అవసరాల కనుగుణంగా ఉత్పత్తి పంపిణి, వినియోగంలను రూపొందించటం అని పేర్కొనవచ్చు.

ప్రణాళికలను 6 రకాలుగా ప్రొఫెసర్ లెవిస్ విభజించారు. అవి 1. భౌగోళిక ప్రణాళికలు, 2. ద్రవ్యప్రణాళికలు, 3. వస్తువులు, వనరుల ప్రణాళికలు, 4. ఉత్పత్తిలక్ష్యాల ప్రణాళికలు, 5. వివిధ రంగాలకు చెందిన ప్రణాళికలు, 6. ప్రభుత్వరంగం ప్రైవేట్ రంగాలకు చెందిన ప్రణాళికలు. ఇరల ప్రతి ప్రణాళికలో 4 రకాల దశలుంటాయి. అవి 1. ప్రణాళికా రచన, 2. రచింపబడిన ప్రణాళికను మార్చకుండా ఆమోదించటం, 3. ప్రణాళికలను అమలుపరచటం, 4 ప్రణాళికలను ఎప్పటికప్పుడు పరిశీలించటం.

మన ప్రణాళిక లక్ష్యాలు

మన ప్రణాళికలను పంచవర్ష ప్రణాళికలుగా పేర్కొనటం జరిగింది. ఇప్పటి వరకు ఐదు పంచవర్ష ప్రణాళికలను పూర్తిచేసి ఆరవ ప్రణాళికలో ఇప్పుడు మనం ఉన్నాం. మూడు వార్షిక ప్రణాళికలను మినహాయిస్తే మన ప్రణాళికల వయస్సు పాతికేళ్ళు అవుతుంది. మన ఆర్థిక వ్యవస్థను అటు పెట్టుబడిదారీ వ్యవస్థ, ఇటు

సామ్యవాద వ్యవస్థ కాని మిశ్రమ ఆర్థిక విధానంగా చెప్పుకుంటారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రణాళికలను చేబట్టడం అవసరం అని జాతీయ కాంగ్రెసు, దాని ఆధ్వర్యంలో యేర్పడిన నెహ్రూగారి ప్రభుత్వం గుర్తించింది. మన వ్యవస్థయొక్క మౌలిక స్వరూపాన్ని మార్చకుండానే పార్లమెంటరీ పద్ధతి ద్వారా సామ్యవాదాన్ని నెలకొల్ప వచ్చుననే భావనతో, ప్రణాళికలను చేబట్టడం జరిగింది.

స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రణాళికా వ్యవస్థలో ప్రణాళికా సంఘం, జాతీయాభివృద్ధి సంస్థ ముఖ్యమైన అంగాలుగా వుంటున్నాయి. మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుండే ఫెడరల్ వ్యవస్థ వుండటంచేత తదనుగుణమైన ప్రణాళికలనే మనం రూపొందిస్తున్నాం. దీనికితోడుగా, మిశ్రమ ఆర్థికవ్యవస్థను, మార్కెట్ శక్తులను, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆర్థిక పంథాను మాత్రమే మనం ప్రణాళికల్లో రూపొందిస్తున్నాం. ఇవే మన ప్రణాళికల ముఖ్యాశయాలు. వీటితోబాటు ప్రతి ప్రణాళికలోనూ కొన్ని ప్రత్యేకమైన లక్ష్యాలను నిర్ణయించడం జరిగింది. అప్పటి పరిస్థితులు, ఆ ప్రణాళికా కాలంలో సాధించిన విజయాలను, లోపాలను దృష్టిలో పెట్టుకొని ఈ లక్ష్యాలను మార్చటం కూడా జరిగింది.

మొదటి పంచవర్ష ప్రణాళికను ఆనాటి పరిస్థితుల కనుగుణంగా, భవిష్యత్తులో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి కావలసిన పునాదులు నిర్మించేందుకు ఏర్పరచిన ప్రయత్నంగా పేర్కొనవచ్చు. యుద్ధం, దేశ విభజన, చాలాకాలం విదేశీయుల పరిపాలనలో దోచుకోబడిన ఆర్థిక వ్యవస్థలో వున్న లోటుపాట్లను తొలగించుకునేందుకు ఈ ప్రణాళికలో కృషి జరిగింది. సాంఘిక న్యాయం, ప్రణాళికా వ్యవస్థ నిర్మాణంకూడా ఈ ప్రణాళిక లక్ష్యంగా గుర్తించడం జరిగింది. రెండవప్రణాళిక ప్రవేశపెట్టిన నాటికి వ్యవసాయరంగంలో చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించి, ధరలు స్థిరపడడంతో వ్యవసాయ రంగంకు ఈ ప్రణాళికలో ఎక్కువ ప్రాధాన్యతను యివ్వనవసరం లేదని అనుకున్నారు. పరిశ్రమలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలని, ఆదాయ సంపదలలో వ్యత్యాసాలను తగ్గించాలనే ఆశయాలను ఈ ప్రణాళికా లక్ష్యాలుగా చేపట్టడం జరిగింది. రెండవ ప్రణాళికలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయటంతో ఆహార వస్తువుల ఉత్పత్తిలో మాంద్యం ఏర్పడి చాలా సమస్యలకు దారితీయుట జరిగింది. అందుచేత, మూడవ ప్రణాళికలో 5 శాతం అభివృద్ధిని సాధించాలని, రెండవ ప్రణాళికలో ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం ప్రకారం నిర్ణయింపబడిన కొన్నిముఖ్య పరిశ్రమలైన ఉక్కు, సిమెంట్ వంటి పరిశ్రమలను అభివృద్ధి పరుస్తూ ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించాలనే లక్ష్యాన్ని నిర్ణయించారు. అయితే మూడవ ప్రణాళిక తరువాత ఏర్పడిన విదేశీ మారక ద్రవ్యంలో వచ్చిన మాంద్యం, 1965 నాటి పాకిస్తాన్ యుద్ధం మన ఆర్థిక వ్యవస్థను బాగా దెబ్బతీశాయి. అందుచేత నాల్గవ ప్రణాళికను వెంటనే చేబట్టి లేక ప్రణాళిక పద్ధతిని పూర్తిగా విడిచి పెట్టలేక 1966–67 నుండి 1968–69వరకు మూడు వార్షిక ప్రణాళికలను మాత్రం చేబట్టడం జరిగింది.

నాల్గవప్రణాళికలో ప్రధానంగా నాలుగు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకోవటం జరిగింది. 1. వ్యవసాయానికి పరిశ్రమలకు తగినంత ప్రాధాన్యతనిస్తూ వాటిలో స్వయం సమృద్ధిని సాధించటం, 2. ద్రవ్యోల్బణాన్ని అరికట్టి ధరల స్థిరీకరణకు పాటుపడటం, 3. వ్యవసాయ అభివృద్ధి ద్వారా పల్లెప్రజల జీవన ప్రమాణాలను వృద్ధిచేయటం, 4. కుటుంబ నియంత్రణను విస్తృతంగా అమలు పరచి జనాభావృద్ధి అరికట్టడం. ఐదవ ప్రణాళిక ప్రధానంగా రెండులక్ష్యాలమీద కేంద్రీకరించబడింది. ఒకటి పేదరికనిర్మూలన, రెండు స్వయం సమృద్ధి. ఈ ప్రణాళికా కాలంలోనే అత్యవసర పరిస్థితిని ప్రకటించడం దరిమిలా 20సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రకటించడం జరిగింది. ఆరవప్రణాళిక మిగతా ప్రణాళికల కంటె వ్యూహంలోనూ, లక్ష్యాలలో కూడా భిన్నమైనది. ఈ ప్రణాళికలో ఆరు లక్ష్యాలను నిర్ణయించారు. అవి 1. నిరుద్యోగాన్ని అల్పోద్యోగతను పూర్తిగా తొలగించటం, దేశంలోని అతి నిరుపేదవర్గాల జీవన ప్రమాణాలను పెంచటం, 3. మానవ కనీస అవసరాలైన మంచినీరు, ఆరోగ్యం, ప్రాథమిక విద్యను అందరికీ అందేటట్లు చేయటం, 4. గత ప్రణాళికల కంటే ఈ ప్రణాళికా కాలంలో ఎక్కువ అభివృద్ధి రేటును సాధించటం, 5 ఇప్పుడువున్న ఆదాయ సంపద వ్యత్యాసాలను తగ్గించటం, 6. స్వయం సమృద్ధిని సాధించటం.

నిరంతర ప్రణాళిక అన్న కొత్త ప్రణాళికా వ్యూహాన్ని 6వ ప్రణాళికలో ప్రవేశపెట్టడం జరిగింది. అందుచేత ఈ ప్రణాళికను 6వ పంచవర్షప్రణాళిక అనకుండా 1978–83ప్రణాళిక అన్నారు. ఈ నిరంతర ప్రణాళికలో ప్రతి సంవత్సరం ఒక ప్రణాళికను తయారుచేస్తారు. అలా చేసేముందు అంతకుముందువున్న ప్రణాళికల ఫలితాలను దృష్టిలోకి తీసుకొని తయారుచేయడం జరుగుతుంది. ప్రణాళిక తయారైన తరువాత మార్పులకు, చేర్పులకు అవకాశం వుంటుంది.

నిధుల కేటాయింపు

ప్రణాళికా వ్యూహంలో ప్రణాళికా సంఘం మొట్టమొదట చేయవలసినది వనరుల సమీకరణ. వాటి మదింపు, ఒక్కో రంగానికి వాటియొక్క ప్రాధాన్యత ననుసరించి నిధులను కేటాయించటం జరుగుతుంది. మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యయం ప్రభుత్వ రంగంలో 2069 కోట్ల రూపాయలు వుంటుందని అనుకున్నా అది చివరకు 1960 కోట్ల రూపాయలకు తగ్గించబడింది. అలాగే రెండవ ప్రణాళికలో కూడా మొదట 4800 కోట్ల రూపాయలు అనుకున్నది 4600 కోట్లకు తగ్గించబడింది. ప్రతి ప్రణాళికలో ఒక్కొక్క రంగానికి కేటాయించిన నిధులను విపులంగా ఈ క్రింది పట్టికలో చూపడమైనది. ప్రభుత్వరంగంలో కేటాయించిన నిధులతో ప్రైవేట్ రంగంలో కూడా ఖర్చు చేస్తున్న నిధులు కలిపి చూస్తే మొత్తం ఆయా ప్రణాళికల్లో ఎంతెంత కేటాయించినదీ తెలియగలదు.

పట్టిక — 1

ప్రణాళికా నిధుల కేటాయింపు

[కోట్ల రూపాయలలో]

	రంగం	మొదటి ప్రణాళిక 1951–56	రెండవ ప్రణాళిక 1956–61	మూడవ ప్రణాళిక 1961–66	మూడు వార్షిక ప్రణాళికలు 1966–69	నాల్గవ ప్రణాళిక 1969–74	ఐదవ ప్రణాళిక 1974–79	1978–83 ప్రణాళిక
1	వ్యవసాయం, దానికి సంబంధించినవి	290	549	1089	1107	2320	4644	8600
2	నీటిపారుదల, విద్యుత్, వరదలనివారణ	583	882	1917	1684	4286	10450	25400
3	పరిశ్రమలు, మైనింగ్	97	1125	1967	1636	3107	10201	14750
4	రవాణ, ప్రసార సాధనాలు	518	1261	2112	1222	3080	6881	10625
5	సాంఘిక సంక్షేమం తదితరమైనవి	472	855	1492	976	2986	7127	10005
6	మొత్తం పబ్లిక్ రంగం నిధులు	1960	4672	8577	6625	15779	39303	69380
7	ప్రైవేట్ రంగ నిధులు	1800	3100	4100	----	8990	27048	46860
8	మొత్తం ప్రణాళికా నిధులు	3760	7772	12677	6625	24759	66351	116240
9	సగటున ప్రణాళికా కాలంలో ఒక వ్యక్తికి అయిన వ్యయం(రూ॥లలో)	191	189	275	132	442	1053	1684

పై పట్టిక ననుసరించి వివిధ ప్రణాళికల్లో కేటాయించిన నిధుల వివరాలను తెలుసుకొనవచ్చును. మొదటి ప్రణాళికలో వ్యవసాయానికి నీటి పారుదలకు కలిపి మొత్తం ప్రణాళికానిధులలో 31 శాతం ఖర్చు చేశారు. అయితే ఈ మొత్తం రెండవ ప్రణాళికలో 20 శాతానికి తగ్గిపోయింది. మరల యీ రంగానికి నాల్గవ ప్రణాళికలో తగిన ప్రాధాన్యత నివ్వడం జరిగింది. (మూడు వార్షిక ప్రణాళికలను విడిచి పెట్టి) గత పాతికేళ్ళుగా మనం ప్రణాళికాభివృద్ధికై కేటాయించిన నిధులు మొత్తం 115319 కోట్ల రూపాయలు వుంది. ఆరవప్రణాళికాంతానికి యీ నిధుల మొత్తం 238184 కోట్ల రూపాయలు వుండగలదు.

అనగా 1983వ సంవత్సరాంతానికి మనం సగటున ఒక వ్యక్తిపై 3876 రూపాయలను వివిధ ప్రణాళికల ద్వారా ఖర్చు చేయనున్నాము. ఒక్క ధనరూపంలోనేగాకుండా సామాజిక పరంగా చూస్తే మనం ఎన్నో ఒడుదుడుకులకు లోనై వెచ్చించిన యీ మొత్తం విలువ నిజరూపంలో యింకా ఎక్కువే వుండవచ్చునని కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

సాధించిన విజయాలు

అభివృద్ధి చెందుతున్న భారతదేశంవంటి దేశాల్లో ఐదు పంచవర్ష ప్రణాళికలకాలం ఆదేశం యొక్క గమ్యాన్ని నిర్ణయించేందుకు సరిపోతుంది. గతపాతికేళ్ళుగా యీ దేశాన్ని నయా వలసవాదులు, పెట్టుబడిదార్లు పంచుకున్నారనే వామ పక్షం వారి వాదన ఎంతవరకు సమంజసమోపరిశీలిద్దాం. చరిత్రలో ముప్పయి సంవత్సరాల కాలం చాలా తక్కువ కాలం అయినప్పటికీ దేశంలో పేదరికాన్ని నిర్మూలించటానికి పారిశ్రామికంగా కొంత ముందంజ వేయటానికి సామ్యవాద వ్యవస్థ నిర్మాణానికి కావలసిన పునాదులు నిర్మించటానికి గట్టి ప్రయత్నం యీ పాతికేళ్ళలో జరిగిందని చెబుతున్న ప్రజాస్వామ్య సోషలిస్టుల వాదనను కూడా నిష్పక్షపాతంగా పరిశీలించవలసివుంది. వివిధ రంగాలలో మనం సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకొని వారి వాదనలను పరిశీలిద్దాం.

వ్యవసాయరంగం

మనదేశంలో సుమారు 75 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అంతేకాదు, జాతీయాదాయంలో

సుమారు 40 శాతం ఆదాయం యీ రంగం నుండే మనకు వస్తూంది. ఈ ప్రణాళికాకాలంలో వరి, గోధుమల ఉత్పత్తి, వాటి సాగు గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చును. 1960లో 3 కోట్ల 41 లక్షల హెక్టార్ల భూమిలో వరిని సాగుచేస్తే 1975-76 నాటికి మూడు కోట్ల 96 లక్షల హెక్టార్లకు పెరిగింది. అలాగే గోధుమల సాగు కూడా 1 కోటి 29 లక్షల హెక్టార్ల నుండి 2 కోట్ల హెక్టార్లకు పెరిగింది. పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ కొన్ని జిల్లాల్లో నూతన పద్ధతుల నవలంభించి ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచటంతో దేశంలో హరిత విప్లవం వచ్చినట్లుగా పేర్కొనటం జరిగింది. అయితే, భారతదేశం అంటే మూడు నాలుగు రాష్ట్రాలు మాత్రమే కాదు గదా!

మొదటి పంచవర్ష ప్రణాళికలో వెచ్చించిన నిధుల దృష్ట్యా వ్యవసాయంలో వచ్చిన మార్పును గ్రహించి తరువాత ప్రణాళికల్లో దీన్ని నిర్లక్ష్యంచేయటం జరిగింది. దీనితో ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గి ధరలు పెరగటంతో నాల్గవ ప్రణాళికాకాలం నాటికి చాలా సమస్యలను దేశం ఎదుర్కోవలసి వచ్చింది. మొదటి ప్రణాళికా కాలంలో ఆహారపంటల ఉత్పత్తి 50 మిలియన్ టన్నులు వుంటే నాల్గవ ప్రణాళికాంతానికి 105 మిలియన్ టన్నుల వరకు పెరిగింది. 1978 నాటికి 125 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించటం జరిగింది. అయితే, మనం ఈ ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధిని పరిగణించే కంటే సగటున ఒక వ్యక్తికి అవి ఎట్లా లభిస్తున్నాయో తెలుసుకుంటే యీ ప్రగతిలోని లోటుపాట్లు తెలియగలవు. ఈ క్రింది పట్టికలో ఆహార వస్తువులు, మరికొన్ని ముఖ్యావసర వస్తువులు సామాన్యునికి ఏమోతాదులో లభిస్తున్నాయో తెలియజేయడమైనది.

పట్టిక — 2

తలసరి వ్యక్తికి లభించే కొన్ని ముఖ్యావసర వస్తువులు

[ఒక సంవత్సరానికి]

సంవత్సరం	ఆహార ధాన్యాలు ఒకరోజుకు లభించేది గ్రాములలో	నూనెలు కేజీలు	వనస్పతి కేజీలు	పంచదార కేజీలు	నూలుబట్ట మీటర్లు	చేనేత వస్త్రాలు మీటర్లు	టీ పొడి గ్రాములలో	కాఫీపొడి గ్రాములలో
1950-51	395.0	—	—	—	—	—	—	—
55–56	430.9	2.5	0.7	5.0	14.4	—	257	67
60–61	468.7	3.2	0.8	4.7	13.8	1.2	287	80
65–66	408.2	2.7	0.8	5 7	14.7	1.7	337	70
68–69	445.2	2.6	0.9	5.0	14.4	1.9	353	75
74–75	409.6	3.3	0.6	6.8	12.9	1.4	435	62
75–76	456.8	3.5	0.8	6.1	12.6	1.4	443	62

సామాన్య ప్రజానీకానికి కావలసిన నిత్యావసర వస్తువులలో గత 25 ఏళ్ళ ప్రణాళికాకాలంలో ఏవిధమైన అభివృద్ధిని సాధించామో యీ పట్టికను చూస్తే తెలుస్తూంది నిధులరూపంలో ఎంత ఖర్చు చేస్తున్నప్పటికీ తలసరి వ్యక్తికి లభించేదే మన అభివృద్ధిని తెలియజేస్తుంది. ఆహార ధాన్యాల విషయంలో కొంత మార్పు వున్నప్పటికీ వస్త్రాల విషయంలో ప్రణాళికాకాలంలో తరుగుదల మాత్రమే కన్పించింది. మరికొన్ని వస్తువులలో ఏ మాత్రం మార్పు లేదు. పెరుగుతున్న జనాభా అవసరాలను యధాతధంగా తీర్చటానికే ప్రణాళికలు తోడ్పడ్డాయి తప్ప సామాన్యుడు కొత్తగా బాగుపడిందేమీ లేదనే వాదనకు యిది తావిస్తూంది.

పరిశ్రమలు

పారిశ్రామిక రంగంలో భారతదేశానికి ప్రపంచంలో సముచిత స్థానం వుందనటంలో సందేహంలేదు. ఈరోజు మనం పారిశ్రామిక ఉత్పత్తులను యితరదేశాలకు ఎగుమతి చేసుకునే స్థితికి ఎదిగామంటే అందుకు కారణం మన ప్రణాళికల కృషి అని చెప్పవలసి వుంది. రెండవ ప్రణాళికాకాలంలో (1956) ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమలను వివిధ రంగాలుగా విభజించి ప్రభుత్వరంగంలో భారీ కీలక పరిశ్రమలను అభివృద్ధి చేయవలసిందిగా సూచించటం జరిగింది. తదనుగుణంగా చిన్న మార్పులు చేర్పులతో మన పారిశ్రామిక విధానం కొనసాగించబడటంతో పారిశ్రామిక ఉత్పత్తులు బాగా వృద్ధిచెందాయి.

పట్టిక — 3

కొన్ని ముఖ్యమైన పారిశ్రామిక ఉత్పత్తులు

	వస్తువు పేరు	1956	1960–61	65–66	75–76	77-78
1	ఉక్కు (మిలియన్ టన్నులు)	1. 35	2. 39	4. 51	5. 91	6. 6
2	బొగ్గు ,,	40. 1	55. 7	70. 3	102. 7	103. 9.
3	సిమెంట్ ,,	5. 0	8. 0	10. 8	17. 2	19. 2
4	అల్యూమినియం (వేల టన్నులు)	——	34. 0	57. 0	60. 0	49. 0
5	యంత్ర పరికరాలు (మిలియన్ రూపాయలు విలువగలవి)	——	70. 0	294. 0	1137. 0	——-
6	రైల్వేవేగన్‌లు (వేల సంఖ్య)	——	11: 9	33. 5	12. 2	——
7	కార్లు, జీప్‌లు (వేల సంఖ్య)	——	26. 6	35. 4	21. 9	——-
8	రేడియోలు (,,)	——	282. 0	606. 0	1523. 0	1799. 0
9	రవాణావాహనాలు (,,)	——	28. 4	35· 3	43. 7	84. 0
10	విద్యుత్ ఉత్పత్తి (మిలియన్ కిలోవాట్లు)	——	16. 9	33. 0	79. 9	91. 0

పారిశ్రామిక ఉత్పత్తుల విషయంలో ప్రణాళికలు సాధించిన ప్రగతి చెప్పుకోదగ్గదని మనం అంగీకరించినా ఎక్కువశాతం పరిశ్రమలు ప్రైవేట్ రంగంలోనే నెలకొల్పబడ్డాయి.

పట్టిక — 4

వివిధ రంగాలుగా నెలకొల్పబడిన పరిశ్రమలు 74-75

	పరిశ్రమల సంఖ్య	పెట్టుబడి (కోట్ల రూ.)	ఉత్పత్తి విలువ (కోట్ల రూ.)
ప్రైవేట్‌రంగం	59279	7317	4319
పబ్లిక్ రంగం	3697	9399	1370
ఉమ్మడిరంగం	1241	1216	392
మొత్తం	64217	17932	6081

పై పట్టిక ననుసరించి చూస్తే 92 శాతం పరిశ్రమలు ప్రైవేటురంగంలో నెలకొల్పబడినట్లు తెలుస్తోంది. అయితే పబ్లిక్ రంగంలో పెట్టుబడి ప్రైవేట్ రంగంకంటే ఎక్కువే వున్నప్పటికీ

వాటి ఉత్పత్తి విలువ ప్రైవేట్ రంగంకంటే ఎక్కువగానే వున్నది. ప్రభుత్వరంగం ఎప్పుడూ మిగతావాళ్లకు మార్గదర్శిగా వుండాలి కాబట్టి, ప్రభుత్వ యాజమాన్యంలో వుండే పనిగంటలు, కార్మికుల సంక్షేమ పథకాలు కార్మికుల కనుకూలంగా వుండి వ్యయం ఎక్కువవుతూంది. అంతేకాదు, ప్రభుత్వ రంగంలో ఉత్పత్తిచేయబడిన వస్తువులన్నీ మార్కెట్ చేసేది చివరకు ప్రైవేట్ సంస్థలు, కంట్రాక్టర్లే అవటంతో వచ్చే లాభాలు వారికే దక్కుతున్నాయనే వాదన కూడా వుంది. దీనికితోడు పరిశ్రమలన్నీ కొద్ది బడా పారిశ్రామిక వేత్తల చేతుల్లో కేంద్రీకరింపబడి వున్నాయని, వాటిని తగ్గించేందుకు కృషిచేయాలనే వుద్దేశంతో గుత్తాధిపత్యం మరియు నిర్బంధ వ్యాపార చట్టము (MRTP)ను 1970లో ప్రవేశపెట్టడం జరిగింది. అయితే దీనివలన ఫలితం ఎంతవరకు సాధించామో యీ క్రింది పట్టిక తెలియజేయగలదు.

పట్టిక — 5

కొన్ని గుత్తసంస్థల ఆస్తులు

(కోట్ల రూపాయలు)

	1963–64	1975–76
బిర్లా	282.9	1064.6
టాటా	375.0	974.6
మఫత్‌లాల్	39.5	284.3
జె. కె. సింఘానియా	54.5	224.1
సిండియా	46.3	217.1
థాపర్	63.3	204.1
బంగూర్	62.3	195·9
శ్రీరాం	50.3	186.9
సారాభాయ్	33.9	182.5
ఐ. సి. ఐ.	36.8	181.5
కిర్లోస్కర్	19.1	177.1
ఎ. సి. సి.	76.9	169.1
ప్యారి	11.7	148.1
మహేంద్ర	20.1	143.9
బజాజ్	16.7	143.2
కిల్లిక్	38.3	139.4
వాల్‌చంద్	52.7	135.5
మోడి	11.3	116.1
వార్నన్ & ఆటోబ్రో		113.5
కస్తూరిబాయ్ లాల్‌బాయ్	33.9	109.2
	1325.7	4994.2

ఈ ఆస్తుల వివరాలన్నీ ప్రభుత్వం వారిచ్చినవే అందుచేత వాటి విలువ సాధారణంగా తక్కువగానే వుండొచ్చు. అయినప్పటికీ దేశంలోని సంపద అంతా ఎవరివద్ద కేంద్రీకరింపబడివుందో దీనిని బట్టి తెలియగలదు. ఇందులో 1963లో 10 కోట్లు, 1977–78లో 100కోట్లు అంతకంటె ఎక్కువ ఆస్తులున్న సంస్థలనే తీసుకోవటం జరిగింది. వందకోట్లకంటె తక్కువ ఆస్తులున్న సంస్థలు యింకా చాలా వున్నాయి. వాటి ఆస్తులన్నీ కలుపుకుంటే యీ పాతికేళ్ల ప్రణాళికా ఫలితాలు ఎవరివద్ద కేంద్రీకరింపబడి వున్నాయో మనకు స్పష్టమవుతుంది.

ప్రజాసంక్షేమం, బీదరిక నిర్మూలన

మొదటి పంచవర్ష ప్రణాళికాకాలంనుండి మనదేశ ప్రజల ఆదాయ వ్యత్యాసాలలో మార్పు తీసుకురావటానికి ప్రణాళికలద్వారా ప్రయత్నం జరిగింది. అదేవిధంగా ప్రజల సంక్షేమాన్ని పెంచేందుకు కావలసిన అనేక పథకాలను అమలుజేయటం కూడా జరుగుతూంది. ప్రజల విద్య, ఆరోగ్య విషయాలకు ప్రణాళికలతో కావలసిన నిధులు ఏ విధంగా కేటాయించబడ్డాయో ముందునున్న పట్టికలో వివరించాం 1961 సంవత్సరంలో 5900 మంది ప్రజలకు ఒక డాక్టరుపుంటే 1971 నాటికి 1400 మంది జనాభాకు ఒక డాక్టరు వుండేటట్లుగా కృషిచేయటం జరిగింది. ప్రజల ఆరోగ్యానికై తలసరి సుమారు 11 రూపాయలు వరకు సంవత్సరానికి ప్రభుత్వం ఖర్చుచేస్తోంది. విద్యలో కూడా కొంతమార్పు వచ్చిందని చెప్పవచ్చు. అయితే మన నిరక్షరాస్యుల శాతం 70 నుండి తగ్గలేదు. 1951లో 16 శాతమే అక్షరాస్యులుంటే 1971 నాటికి 29.4 శాతానికి మాత్రమే పెరిగింది. ప్రజల జీవన ప్రమాణానికి తలసరి జాతీయాదాయం ఒక సూచికగా గుర్తిస్తే యీ క్రింది పట్టికద్వారా దానిలో వచ్చిన మార్పును గ్రహించవచ్చు.

పట్టిక — 6

ప్రణాళికా కాలంలో తలసరి ఆదాయంలో వచ్చిన మార్పు

	సాధారణ విలువ	నిజ విలువ	
మొదటి ప్రణాళికాంతానికి (55–56)	255.0	267.8	(48–49 ధరల ప్రకారం)
రెండవ ప్రణాళికాంతానికి (60-61)	325.7	305 6	(1961 ధరల ప్రకారం)
మూడవ ప్రణాళికాంతానికి (65–66)	426.1	311.0	(1961 ధరల ప్రకారం)
మూడు వార్షిక ప్రణాళికలలో (68–69)	554.7	327.0	,,
నాల్గవ ప్రణాళికాంతానికి (73-74)	851.8	349.1	,,
ఐదవ ప్రణాళికాంతానికి (77–78)	1163.0	656.0	(1971 ధరల ప్రకారం)

తలసరి జాతీయాదాయాన్ని సాధారణ విలువ, నిజ విలువ ంలో వివరించడం జరిగింది. ఒక వస్తువు నిజవిలువలో మార్పు లేక పోయినా మార్కెట్ ధరలలో దాన్ని పరిశీలించేటప్పుడు ధరలో వచ్చే మార్పుదృష్ట్యా మనకు దాని విలువ పెరిగినట్లనిపిస్తుంది. ఉదాహరణకు 1961లో ఒకతనివద్ద ఒక చొక్కాయె వుందనుకుందాం. దాని ధర 10 రూపాయలు. 1981 లో కూడా అతని వద్ద ఒక చొక్కాయె వుందనుకుందాం. దానిధర 50 రూపాయలు. మనం అతని చొక్కా ఖరీదును చూసి మాత్రమే అతని ఆర్థిక పరిస్థితిని గుర్తిస్తే అతని నిజస్వరూపం తెలియదు. అదే 1961 ధరలలో అతని చొక్కా విలువ చూస్తే అతని ఆర్థిక పరిస్థితిలో మార్పు లేనట్లే కనిపిస్తుంద. అందుచేతనే తలసరి జాతీయాదాయాన్ని రెండు విలువలలోనూ వివరించటం జరిగింది. సాధారణ ధరలలో తలసరి జాతీయాదాయాన్ని చూస్తే గత 20 ఏళ్లలో చాలా మార్పువచ్చినట్లు కన్పిస్తుంది. అదే అసలు విలువలో చూస్తే ఆ మార్పు మనకు అంత ఎక్కువవున్నట్లు కన్పించదు. బీదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషిచేస్తూ౦దనటానికి ప్రణాళికల నిధుల కేటాయింపు ఉదాహరణగా చూపించినా నిజానికి 66 శాతం ప్రజలు ఇప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువనే జీవిస్తున్నారు. అలాగే నిరుద్యోగంతో బాధపడుతున్నవారి సంఖ్య (ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వారి లెక్కల ప్రకారం) 1977 నాటికి ఒకకోటి 92 వేల మంది వున్నారు.

ముగింపు

గత 28 ఏళ్లలో మూడు వార్షిక ప్రణాళికలను మినహాయిస్తే మనం 5 పంచవర్ష ప్రణాళికలను గత పాతికేళ్లలో అమలు పరిచాం. ఈ పాతికేళ్ల ప్రణాళికా కాలంలో దేశంలో చెప్పుకోదగ్గ ఆర్థికాభివృద్ధి వచ్చిందని చెప్పటానికి నిదర్శనాలున్నాయి. అయితే ఈ ఫలితాలు సామాన్య జనానికి అందాయా? అదేకాలంలో మిగతాదేశాలు యింత భారీ మొత్తాలనే వ్యయపరచి యింతకంటే ఎక్కువ అభివృద్ధిని సాధించాయికదా? అని కొంతమంది విమర్శకులు ప్రశ్నించవచ్చు. యీ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని ఉత్పత్తిశక్తుల కేంద్రీకరణాన్ని పరిశీలించిన తరువాత మీరు యీ ప్రశ్నలను వేసుకోండి అనిమాత్రమే వారికి జవాబు చెప్పగలం.

ఆదాయ సంపదల పంపిణీలో వ్యత్యాసాలను తగ్గించేందుకు జరిగిన కృషి ప్రణాళికా ఫలితాలు తెలియజేస్తున్నాయి. ఐదవ ప్రణాళికా నివేదికలో యీ విషయం ప్రస్తావించటం జరిగింది. వ్యయాలననుసరించి విభజింపబడ్డ గ్రామీణప్రాంత పేదవర్గాల శాతాన్ని 52 నుండి 42 శాతానికి ధనవంతుల శాతాన్ని 0.5 నుండి 0.04కు తగ్గించటానికి మధ్యతరగతి శాతాన్ని 48.5 నుండి 57·96కి పెంచటానికి ప్రయత్నం జరిగింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో 40.5 శాతంవున్న పేదవర్గాలు 28 శాతానికి, 3 శాతంవున్న ధనవంతులు 0.4 శాతానికి తగ్గించబడతారని, మధ్యతరగతి ప్రజలు 56.5 శాతంనుండి 71.6 శాతానికి పెరగగలరని అంచనా వేయబడింది. ఈ ప్రణాళికా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందు ముందు రాబోయే ప్రణాళికల స్వరూపాన్ని ఊహించవచ్చు. ప్రజల జీవన ప్రమాణంలో చెప్పుకోదగ్గ మార్పు తీసుకురాలేకపోయినప్పటికీ వెన్నెముకలేని మధ్యతరగతి ప్రజల శాతాన్ని పెంచేందుకుమాత్రం యీ పాతికేళ్లలో ప్రయత్నం జరిగిందని చెప్పటానికి ఎటువంటి సందేహంలేదు.

డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి

శాతవాహనుల నాణెములు-1

ఇక శాతవాహనుల నాణెములు. ఇదొక ఉత్థాపిత సమస్య.

శాతవాహనుల నాణెములు శతసహస్రము లభించినవి. అందు లేఖనములుకల నాణెములు అనేకము కలవు. లేఖనములు అనగా నాణెములను వెలయించిన రాజుల పేరులుకల వాక్యములు. అవి షష్ఠీవిభక్త్యంతములుగ ఉండును. లేఖనము కల నాణెము ఆ పేరిటి రాజుయొక్క నాణెమని అర్థము. ఆ రాజు వెలయించిన నాణెమని తాత్పర్యము. లేఖనములులేని నాణెములు ఎవరివో గుర్తించుట కష్టము. లేఖనములు కల నాణెములు ఎవరివో తెలియుట సులభము. అంతేకాదు. లేఖనములు లేని నాణెముల ఆపాదనము నిర్వివాదము కాదు. లేఖనములు కల నాణెముల అన్వయము నిర్ధారకము. అయినను లేఖనములు కల శాతవాహనుల నాణెములను అన్వయించునెడ అభిప్రాయభేదములు కలవు.

1. శిముకశాతవాహనుని నాణెములు

'రఞొసిరిసతవహణస' అని, 'సదవహణస' అని, 'సాతవాహనస' అని, 'సతవాహణస' అని, 'సాదవాహనస' అని, 'సాదవాహణస' అని, 'సిరిఛిముకసాతవాహన' అని లేఖనములు కల నాణెములు అలతిగ కలవు. శిముక శాతవాహనుని ప్రతిమాశాసనమున 'సాతహహన' శబ్దము, కృష్ణుని నాసికశాసనమున 'సాదవాహన' శబ్దము ప్రయుక్తము.[1] నకారము ప్రాయికముగ ణకారమగుట, సంస్కృత దీర్ఘము వికల్పముగ హ్రస్వమగుట ప్రాకృతభాషా లక్షణము. కనుక పయి లేఖనములు అభిన్నము. అభిన్నములైన ప్రాకృతలేఖనము లన్నిటికి 'రాజ్ఞః శ్రీశాతవాహనస్య' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా శాతవాహనునియొక్క నాణెమని అర్థము. శాతవాహనుని నాణెమని తాత్పర్యము. 'ఛిముక' అను విశేషణముకల నాణెములు శిముక శాతవాహనుని నాణెములని నిర్ధారకము. 'ఛిముక' అను విశేషణములేని నాణెముల విషయమున అభిప్రాయ భేదములు కలవు.

శాతవాహన నామాంకితములైన నాణెములమీది లిపి స్వరూపము, నానాఘాట్ శాసనము లందలి లిపిస్వరూపముకంటె ఇంచుక పూర్వకాలికము కనుక, అవి శాతవాహన వంశ మూలపురుషుడు అనగా శిముక శాతవాహన, కృష్ణుల తండ్రి అగు శాతవాహనుని నాణెములని డాక్టర్ వి. వి. మిరాషీగారి అభిప్రాయము.[2] డాక్టర్ యం. రామారావుగారి అభిప్రాయము కూడ అదే.[3] కాని, శిముక శాతవాహన, కృష్ణుల తండ్రిపేరు శాతవాహనుడు, అతడు శాతవాహనవంశ మూలపురుషుడు అనుటకు ఎట్టి ఆధారమునులేదు. అంతేకాదు. శిముక శాతవాహనునికంటె పూర్వము, మఱొక శాతవాహనుడు పరిపాలించె ననుటకును ప్రమాణములేదు. కాణ్వాసు శర్మను చంపి, శుంగుల శేషమును నాశనముచేసి, ఆంధ్ర సామ్రాజ్యమును స్థాపించిన ఆదిపురుషుడు శిముక శాతవాహనుడు. అనాది పురుషుని ఆవాహనము కేవలము అనావశ్యకము.

శ్రీశాత లేక శాతకర్ణి వారసుడైన శాతవాహనుడు—అనగా నానాఘాట్, ప్రతిమా శాసనములలోని కుమార శాతవాహనుని నాణెములని డాక్టర్ యస్. యల్. కటారేగారి అభిప్రాయము.[4] కాని, కుమారశాతవాహనుడు పరిపాలకు డనుటకు ప్రమాణము లేదు. కనీసము పురాణ రాజనామావళి పురస్కారమైననులేదు. అంతేకాదు. ప్రతిమా శాసనములలోని కుమార శాతవాహనుడు నానాఘాట్ శాసనములోని వేదిశ్రీ. అతడు నానాఘాట్ శాసనకాలమునకు స్వర్గస్థుడని నానాఘాట్ శాసన ప్రకరణమునుబట్టి ప్రతీయమానము. ఇది శాతవాహనుల శాసనములను శీర్షికను వివృతపూర్వము. కనుక శాతవాహన నామాంకితములైన నాణెములు కుమార శాతవాహనుని నాణెములు కావు.

ఓరుగల్లు, హైదరాబాదు, ఔరంగాబాదు లందు లభించిన శాతవాహన నామాంకితములైన నాణెములు, నెవాసాయొద్ద లభించిన శాతవాహన నామాంకితములైన నాణెములు లిపిస్వరూపమున, నిర్మాణ విధానమున ఒక విధముగలేవు కనుక, అవి ఒక శాతవాహన నామధేయుని నాణెములు కాక, పెక్కుమంది శాతవాహన నామధేయుల నాణెములని డాక్టరు హెచ్. డి. శంకాలియా ప్రభృతుల అభిప్రాయము.[5] కాని 'లిపిస్వరూపమును బట్టి నాణెముల కాలమును, రాజుల క్రమణికను సూచించు ప్రయత్నము కేవలము ప్రయోజనము లేని కేశవిభజనము.' అని డాక్టర్ పి. యల్. గుప్త గారి అభిప్రాయము.[6] అంతేకాదు. ఒక్క శాతవాహనరాజు నాణెములును ఒక విధముగ లేవు. ఉపరి, పెక్కుమంది శాతవాహన నామధేయులైన శాతవాహన రాజులు కలరనుటకు ప్రమాణాంతరము లేదు. కనుక పెక్కుమంది శాతవాహన నామధేయుల నాణెములు కావు.

పయి నాణెములు కృష్ణుని కొడుకు, మొదటి శాతకర్ణి తండ్రి అయిన శాతవాహనుని నాణెములు, రెండవ శాతకర్ణి నాణెములును అని డాక్టర్ యస్. బి. దేవ్‌గారి అభిప్రాయము.[7] కృష్ణుని కొడుకు, మొదటి శాతకర్ణి తండ్రి అయిన శాతవాహనుడు అనగా కుమార శాతవాహనుడని ఆంతర్యము. కాని, కుమార శాతవాహనుడు కృష్ణుని కొడుకుకాడు. మొదటి శాతకర్ణి తండ్రియును కాడు. కృష్ణుని కొడుకు శ్రీశాతకర్ణి. శ్రీశాతకర్ణి కొడుకు కుమార శాతవాహనుడు. అతడు పరిపాలకుడు అనుటకు ప్రమాణము లేదు.

అంతేకాదు. మొదటి శాతకర్ణి, రెండవశాతకర్ణి అను చరిత్రకారుల ఆధునిక వ్యవహారము కూడ భ్రాంతి మూలకము. అది వక్ష్యమాణము. అదియుంచి, శాతవాహన నామాంకితములైన నాణెములను శాతకర్ణి నాణెములనుట మరింత అసంగతము. కనుక కుమార శాతవాహనుని నాణెములు కావు. రెండవ శాతకర్ణి నాణెములును కావు.

ఈ నాణెములు రెండవ శాతకర్ణి వారసుని అనగా పురాణ రాజనామావళిలోని లంబోదరుని నాణెములని డాక్టర్ కె. గోపాలాచారి గారి అభిప్రాయము.[8] కాని, శ్రీ శాతకర్ణి వారసుడు లంబోదరుడని పురాణములందు ఏకవాక్యత లేదు. శ్రీశాతకర్ణి పుత్రుడు ఆపాదబద్ధుడని వాయుపురాణమున, అపోలవుడని బ్రహ్మాండ పురాణమున కలదు. మత్స్య, విష్ణు, భాగవత పురాణము లిందుమాత్రము లంబోదరుడని కలదు. భవిష్యోత్తరపురాణమున శ్రీశాతకర్ణి తర్వాత స్కందస్తంభి, స్కందస్తంభి తర్వాత లంబోదరుడు అని కలదు. అంతేకాదు. శాతవాహన నామాంకితములైన నాణెములు శాతకర్ణి నాణెము లనుటవలె, లంబోదరుని నాణెములనుట కూడ అసంగతము. కనుక లంబోదరుని నాణెములు కావు.

లిపిస్వరూపమును బట్టి కాక, చిహ్న సముదాయమునుబట్టి నెవాసాయొద్ద లభించిన శాతవాహన నామాంకితములైన నాణెములు ఇద్దఱు శాతవాహన నామధేయులైన శాతవాహన రాజుల నాణెములని డాక్టర్ పి. యల్. గుప్తగారి అభిప్రాయము.[9] కాని, ఒక్క శాతవాహనరాజు నాణెములును ఒకవిధమైన చిహ్నసముదాయమున లేవు. కనుక లిపిస్వరూపము, నిర్మాణ విధానమువలె చిహ్నసముదాయమును నిర్ధారక సాధనముకాదు. ఇద్దరు శాతవాహన నామధేయులైన శాతవాహనరాజులు పరిపాలించినట్లు ప్రమాణములేదు. కనుక ఇద్దరు శాతవాహన నామధేయుల నాణెములు కావు.

శాతవాహన నామాంకితములైన నాణెములు శిముక శాతవాహనుని నాణెములని డాక్టర్ డి. సి. సర్కార్‌గారి అభిప్రాయము.[10]

అసలు శాతవాహన శబ్దము వ్యక్తినామముకాదు. కుల నామము. కృష్ణుని నాసిక శాసనమున 'సాదవాహనకులే' అని స్పష్ట ప్రతిపాదనము కలదు.[11] అయినను శాతవాహన సంజ్ఞ శాసనము లందు ఇద్దరికి మాత్రమే కలదు. అది కూడ ప్రతిమా శాసనము లందు మాత్రమే.[12] 'రాయాసిముక సాతవాహనో—', 'కుమార సాతవాహనో' అని. శిముక శాతవాహనుడు పురాణములందు శిశుక, శిముక, సింధుక, బలి, బలిపుచ్ఛక నామములచేత వ్యవహృతుడు.[13] శిముక శబ్దమును 'శ్రీముఖ' శబ్దముగ సంస్కృతీకరించుట కలదు.[14] ఇది కేవలము అసంగతము. సంస్కృత శ్రీముఖ శబ్దమునకు 'సిరిముహ' లేక 'సిరిముక' అను ప్రాకృత రూపములు మాత్రమే సంభవముకాని, 'సిముక' అను ప్రాకృతరూపము సంభవముకాదు. 'సిముక' అను ప్రాకృతరూపమునకు 'సింహక' అను సంస్కృతచ్ఛాయ సంగతము. శిముక శాతవాహనుని పేరు సింహక స్వాతికర్ణుడని భవిష్యోత్తర పురాణమునకలదు.[15] సింహక శబ్దమును వ్యక్తినామము కాదు. బిరుద నామము కావచ్చును. చంద్రగుప్త విక్రమాదిత్యునికి సింహచంద్ర, సింహవిక్రమ బిరుదనామములు చరిత్ర ప్రసిద్ధము.[16] కనుక శాతవాహనకుల మూలపురుషుడైన శాతవాహన రాజునకు సింహకశబ్దము బిరుదనామము. కాణ్వసుశర్మను చంపి, శుంగుల శేషమును నాశనముచేసి, ఆంధ్రసామ్రాజ్యమును స్థాపించిన శాతవాహన రాజునకు సింహకబిరుదము సార్థకము. నూతన రాజ్యమును స్థాపించిన మొదటి రోమను చక్రవర్తి వ్యక్తి నామమున కాక, బిరుద నామమున 'సీజర్ అగస్టస్' అని వ్యవహృతుడు.[17] కుషాణ వంశ రాజ్యమును స్థాపించిన మొదటి కుషాణ రాజు వ్యక్తినామమున కాక, వంశనామమున కుషాణుడని వ్యవహృతుడు.[18] అట్లు నూతనముగ ఆంధ్రసామ్రాజ్యమును స్థాపించిన మొదటి శాతవాహనరాజు వ్యక్తి నామమున కాక, బిరుద నామమున శిముకుడని, కులనామమున శాతవాహనుడని, తదుభయ నామమున శిముక శాతవాహనుడని వ్యవహృతుడగుట సహజము. అట్టి శిముక శాతవాహనుని సోదరుని పౌత్రుడు వేదిశ్రీ కుమార శాతవాహనుడని వ్యవహృతుడగుట కూడ సహజము. కుమార శాతవాహనుడైన వేదిశ్రీ పరిపాలకుడనుటకు ప్రమాణములేదు. ఉపరి, నానాఘాట్ శాసనకాలమునకు స్వర్గస్థుడైనట్లు అనుమాన ప్రమాణముకలదు. కనుక శాతవాహన నామాంకితములైన నాణెములు శిముకశాతవాహనుని నాణెము లగుట సాధకము.

నెవాసాయొద్ద లభించిన 1810 4685, 6544, 6863 సంఖ్యల నాణెములు శాతవాహనుని నాణెములని శ్రీ ఐ. కార్తికేయశర్మగారి అభిప్రాయము.[19] కాని, 1810వ సంఖ్య నాణెముమీద '—సరసతకణిస' అను లేఖనము కలదు.[20] 4695వ సంఖ్య నాణెముమీద 'రఞొసర—' అను లేఖనము కలదు.[21] 6544వ సంఖ్య నాణెము వివరములులేవు.[22] 6863వ సంఖ్య నాణెముమీద 'రఞొసరస...ణిస' అను లేఖనము కలదు.[23] అనగా 'సరసతకణిస' అని పూర్తిలేఖనము. 'సర' అను పదము 'సిరి' అను పదమునకు లేఖకదోషము. 'సిరిసతకణిస' అను ప్రాకృత రూపమునకు 'శ్రీశాతకర్ణేః' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా శ్రీశాతకర్ణియొక్క నాణెమని అర్థము. కనుక 1810, 4695, 6544, 6863 సంఖ్యల నాణెములు శ్రీశాతకర్ణి నాణెములు. శాతవాహనుని నాణెములుకావు.

నెవాసాయొద్ద లభించిన 1175వ సంఖ్య నాణెముమీద 'రంఞొసరిసత వాహణస' అను లేఖనము, 1981వ సంఖ్య నాణెముమీద 'రఞొసరసతవాహణ/స/' అను లేఖనమ్ము, 2186వ సంఖ్య నాణెముమీద '—తవాహణస' అను లేఖనము, 3640 వ సంఖ్య నాణెముమీద '—ఞొసరసతవహణస'అను లేఖనము, 6495వ సంఖ్య నాణెము మీద '/రం/ఞొసరసతవహణస' అను లేఖనము కలవు.[24]

ఔరంగాబాదు దగ్గర లభించిన నాణెముమీద'—సిరిసదవహణ/స/' అను లేఖనము కలదు.[25]

హైదరాబాదునందు లభించిన నాణెముమీద 'రంఞొసిరి సాదవాహ /ణస/' అను లేఖనము కలదు.[26]

ఓరుగల్లు దగ్గర లభించిన నాణెముమీద 'రంఞొసిరిసాద వాహ/నస/' అను లేఖనము కలదు.[27]

కొండపూరునందు లభించిన నాణెముమీద '—సిరిసదవహ-' అను లేఖనము కలదు.[28]

కరీంనగరు నందు లభించిన నాణెముమీద '—/సి/రిసతవ /హనస/' అను లేఖనము కలదు.[29]

కోటిలింగాలయొద్ద లభించిన పండ్రెండు నాణెముల మీద '—సిరిసాతవాహనస' అను లేఖనము, ఎన్మిది నాణెములమీద '/ర/ ఞొసిరి ఛిముక సాతవాహ /నస/' అను లేఖనము కలదు.[30]

కనుక నెవాసాయొద్ద లభించిన 1175, 1981, 2186 3640, 6495 సంఖ్యల అయిదు నాణెములు; ఔరంగాబాదు, హైదరాబాదు, ఓరుగల్లు, కొండపూరు, కరీంనగరులందు లభించిన అయిదు నాణెములు; కోటి లింగాల యొద్ద లభించిన ఇరువది నాణెములు, మొత్తము ముప్పది నాణెములును శిముక శాతవాహనుని నాణెములు.

శిముక శాతవాహనుని నాణెములు ఓరుగల్లు, హైదరాబాదు, కరీంనగరు, కోటిలింగాల, కొండపూరు, ఔరంగాబాదు, నెవాసా అను స్థలములందు లభించినవి. అనగా ఆంధ్ర, మహారాష్ట్రదేశములందు లభించినవని అర్థము.

2. కృష్ణశాతకరి నాణెము, ముద్ర

'రఞొసిరికణ్హ సాతకణిస' అను లేఖనముకల నాణెముకలదు. 'రఞొ సిరికణ్హసాతకణిస' అను ప్రాకృతరూపమునకు 'రాజ్ఞః శ్రీకృష్ణశాతకర్ణేః' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా రాజుయొక్క, శ్రీకృష్ణశాతకర్ణియొక్క నాణెమని అర్థము. కృష్ణ శాతకర్ణి నాణెమని తాత్పర్యము.

కృష్ణశాతకర్ణి నాణెము లిపిస్వరూపమును బట్టి అర్వాచీన కాలికమని, ఆ పేరు పురాణరాజనామావళి యందు గుర్తించుట అసంభవమని ఇ. జె. రేప్సన్ గారి అభిప్రాయము.[31] కాని, నాణెముల మీద లేఖనములకు వలయు స్థలము పరిమితము కనుక లిపి స్వరూపమునుబట్టి నాణెముల కాలమును నిర్ణయించుట భ్రమ ప్రమాదభరితమని డాక్టర్ వి. వి. మిరాషీ గారి అభిప్రాయము.[32] అంతేకాదు. కృష్ణశాతకర్ణిని పురాణరాజనామావళి యందు గుర్తించుట అసంభవము కాదు. సుసంభవము. శిముకశాతవాహనుని తర్వాత అతని సోదరుడు పరిపాలించునని వాయుపురాణమున కలదు. ఆ సోదరుని పేరు కృష్ణుడని బ్రహ్మాండపురాణమున కలదు. విష్ణు పురాణమున కలదు. భాగవత పురాణమునకలదు. మత్స్యపురాణమున మాత్రము లేదు. కాని పార్జిటరు పరిష్కృత పాఠమున కలదు. అంతేకాదు శిముకశాతకర్ణి సోదరుడు కృష్ణశాతకర్ణి అని భవిష్యోత్తరపురాణమున కలదు. ఆ శ్లోకము లివి —

> 'శిముకః శాతకర్ణిస్తు యమాహూర్బలినం జనాః
> భోక్ష్యత్యన్ధమహీం రాజా త్రయోవింశతి వత్సరాన్
> కృష్ణశ్శాన్తకర్ణిస్తు భ్రాతాచాస్య మహాయశాః
> అష్టాదశ సమారాజా కణ్వాఖ్యేన భవిష్యతి'

ఇందు శిముకశాతకర్ణి సోదరుడు కృష్ణశ్రీ శాంతకర్ణి అని ఇదమిత్థము. కృష్ణశ్రీ శాంతకర్ణి అనగా కృష్ణశ్రీ శాతకర్ణి. అతడే శ్రీకృష్ణశాతకర్ణి. అనగా కృష్ణ శాతకర్ణి. శాతకర్ణి అను శబ్దము శాంతకర్ణి అనియు పురాణములందు కలదు. అంతేకాదు. పయి శ్లోకమున 'కణ్వాఖ్యేన' అనుపాఠము కంటె, 'కణ్హాఖ్యేన' అను పాఠము అర్థవంతము.కృష్ణుని నాసికశాసనము సుప్రసిద్ధము. అందు 'కన్హే' అని కలదు.[33] కృష్ణశబ్దమునకు కణ్హ, కన్హ అను ప్రాకృతరూపములు సంభవము.

చందామండలమున లభించిన నాణెము మీద '-రికణ్హ సాత/క/—' అను లేఖనము కలదు.[34] అనగా 'రఞొసిరికణ్హసాత కని స' అని పూర్తిలేఖనము. కనుక కృష్ణశాతకర్ణి నాణెము.

కృష్ణశాతకర్ణి నాణెము మాత్రము కాదు; ముద్ర కూడ సముపలబ్ధము. అదొక ప్రత్యేకమైన దంతపుముద్ర. ఆ దంతపు ముద్ర మీద 'కన్హస' అను లేఖనము కలదు.[35] 'కన్హస' అను ప్రాకృత పదమునకు'కృష్ణస్య' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా కృష్ణునియొక్క దంతపుముద్ర అని అర్థము. కృష్ణుని దంతపు ముద్రమీది స్వస్తికాది చిహ్నములు శాతవాహనుల నాణెముల మీది స్వస్తికాది చిహ్నములకు సదృశము. అంతేకాదు. కృష్ణుని దంతపుముద్ర శాతవాహనుల నాణెములతోపాటు త్రవ్వకము నందు లభించినది. కనుక కృష్ణుని దంతపుముద్ర కృష్ణశాతకర్ణి దంతపు ముద్రఅగును. అయినను కృష్ణుని నాణెము ఒక్కటి కూడ ఎక్కడను లభింపలేదని, ఆ దంతపుముద్ర 'కృష్ణశాతవాహనుని' దంతపు ముద్రఅగునా ? కాదా? అని డాక్టర్ శంకాలియా ప్రభృతుల శంకావహమైన ప్రశ్నార్థక చిహ్నము.[36] కాని, కృష్ణశాతకర్ణి నాణెము కలదు. నాణెము మీది కృష్ణశాతకర్ణి అని పూర్తి నామము కలదు. నాసికశాసనమున కృష్ణశబ్దము మాత్రముకలదు. పురాణము లందు కృష్ణ శబ్దము, కృష్ణ శాతకర్ణి అను పూర్తి నామమును కలదు. కనుక కృష్ణశబ్దముకల, శాతవాహనుల నాణెములతోడి సాదృశ్యము, సాహచర్యము కల నెవాసా యొద్ద లభించిన దంతపుముద్ర కృష్ణ శాతకర్ణి దంతపుముద్ర.

కృష్ణశాతకర్ణి నాణెము చందామండలము నందు, దంతపు ముద్ర నెవాసా యొద్ద లభించినవి. మహారాష్ట్రదేశమున లభించినవని అర్థము.

3. శ్రీశాతకర్ణి నాణెములు

'రణొసిరిసాతకనిస' అని, 'సిరిసాతకణిస' అని, 'సిరిసాతకనస' అని, 'సిరిసాతకణస' అని లేఖనములు కల నాణెములు అనేకము కలవు ఆ లేఖనములు అభిన్నములు. 'రాజ్ఞః శ్రీశాతకర్ణేః, రాజ్ఞః శ్రీశాతకర్ణస్య'అను సంస్కృతచ్ఛాయలు సంగతము. అనగా రాజుయొక్క శ్రీశాతకర్ణి లేక శ్రీశాతకర్ణుని యొక్క నాణెమని అర్థము. శ్రీశాతకర్ణి నాణెమని తాత్పర్యము.

పశ్చిమభారత దేశమున లభించిన 5, 6, 7 సంఖ్యల నాణెములు, కొన్ని ప్రత్యేక లక్షణములను బట్టి, ప్రాచీనకాలములోని ఆకరదేశమునకు అనగా అర్వాచీన కాలములోని తూర్పుమాళవదేశమునకు చెందినవని, అవి గౌతమీపుత్త్ర శాతకర్ణి ఆకరదేశాధిపతి కనుక గౌతమీపుత్త్రశాతకర్ణి నాణెములు కాని, తత్పూర్వుడైన మరొక శాతకర్ణి నాణెములు కాని అగునని ఇ.జె.రేప్సన్‌గారి అభిప్రాయము.[37] కాని, గౌతమీపుత్త్రశాతకర్ణి నాణెముల మీద గౌతమీ పుత్త్ర విశేషణము కలదు. పయి నాణెముల మీద లేదు. కనుక గౌతమీపుత్త్ర శాతకర్ణి నాణెములు కావు.

పయి నాణెములు శాతవాహనకుల మూలపురుషుడైన శిముక శాతవాహనుని నాణెములని హెచ్.పి. త్రివేదిగారి అభిప్రాయము.[38] కాని శిముకశాతవాహనుని నాణెముల మీద శాతవాహనశబ్దము కాని, శిముకశాతవాహన శబ్దద్వయము కాని కలదు. పయి నాణెముల మీద లేదు. కనుక శిముకశాతవాహనుని నాణెములు కావు.

పయి నాణెముల మీద గజచిహ్నము మొరటుగ ఉన్నది. కనుక మొదటి శాతకర్ణి నాణెములని యన్. అహ్మద్‌గారి అభిప్రాయము.[39] కాని, మొదటి శాతకర్ణి కల్పితపురుషుడు. అది వక్ష్యమాణము. కనుక మొదటి శాతకర్ణి నాణెములు కావు.

పశ్చిమ భారతదేశమున లభించిన 8–12 సంఖ్యల సింహచిహ్నము కల నాణెములను గౌతమీపుత్త్రశాతకర్ణి నాణెములు కాని, తత్పూర్వుడైన మరొక శాతకర్ణి నాణెములు కాని అగునని రేప్సన్ గారి అభిప్రాయము.[40] కాని, ఈ నాణెముల మీదను గౌతమీపుత్త్ర విశేషణము లేదు. కనుక గౌతమీపుత్త్ర శాతకర్ణి నాణెములు కావు.

పయి నాణెములు /8-12/ రెండవ శాతకర్ణి నాణెములని గోపాలాచారిగారి అభిప్రాయము.[41] రామారావుగారి అభిప్రాయము కూడ అదే.[42] కాని, ఈ నాణెముల /8–12/ వెనుక వైపు వాలకము, పై నాణెముల /5-7/ వెనుకవైపు వాలకము ఒక విధముగ ఉన్నది కనుక ఇవి కూడ మొదటి శాతకర్ణి నాణెములని అహ్మద్‌గారి అభిప్రాయము.[43] కాని, మొదటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి అని ఇద్దరు శాతకర్ణులు లేరు. అది వక్ష్యమాణము. కనుక మొదటి శాతకర్ణి నాణెములు కావు. రెండవ శాతకర్ణి నాణెములును కావు.

నాసిక యొద్ద లభించిన సింహచిహ్నము కల మరొక నాణెము గౌతమీపుత్త్ర శాతకర్ణి నాణెమని త్రివేది, గుప్తగారల అభిప్రాయము.[44] కాని ఈ నాణె మీదను గౌతమీపుత్త్ర విశేషణము లేదు. కనుక గౌతమీపుత్త్ర శాతకర్ణి నాణెము కాదు.

పయి సింహచిహ్నము గల నాసిక నాణెము. పశ్చిమ భారత దేశమున లభించిన సింహచిహ్నము కల 8–12 సంఖ్యల నాణెముల వలె కలదు గాన, మొదటి శాతకర్ణి నాణెమని అహ్మద్ గారి అభిప్రాయము.[45] అంతేకాదు. క్రామజ్, కార్వాణ్‌ల దగ్గర లభించిన మరికొన్ని సింహచిహ్నము కల నాణెములును అదే కారణమున మొదటి శాతకర్ణి నాణెములని అహ్మద్ గారి అభిప్రాయము.[46] మరొక సింహచిహ్నము కల నాణెము ముద్రణ విధానమును బట్టి మొదటిశాతకర్ణి నాణెమని అహ్మద్‌గారి అభిప్రాయము.[47] వేఱొక సింహచిహ్నము కల నాణెము కూడ పశ్చిమభారతదేశమున లభించిన సింహచిహ్నము కల నాణెముల వలె కలదు గాన, మొదటిశాతకర్ణి నాణెమని అహ్మద్ గారి అభిప్రాయము.[48] కాని, మొదటిశాతకర్ణి కల్పిత పురుషుడు, అది వక్ష్యమాణము. కనుక మొదటి శాతకర్ణి నాణెములు కావు.

పశ్చిమ భారతదేశమున లభించిన 59–61, 74–75, 206-209 సంఖ్యల నాణెములు రెండవశాతకర్ణి నాణెములని కార్తికేయశర్మ గారి అభిప్రాయము.[49] కాని, రెండవశాతకర్ణి లేడు. అది వక్ష్యమాణము. కనుక రెండవశాతకర్ణి నాణెములు కావు.

నెవాసా యొద్ద లభించిన 942 1195, 1369, 1799, 6657, 6659, 6710 సంఖ్యల నాణెములు మొదటి శాతకర్ణి నాణెములని, 942, 1114, 1195, 1799, 1880, 3263 6564, 6657, 6659, 6710 సంఖ్యల నాణెములు రెండవశాతకర్ణి నాణెములని కార్తికేయశర్మగారి అభిప్రాయము.[50] ఇందు 942, 1114, 1195, 1799, 6657, 6659, 6670 సంఖ్యల నాణెములు అటు మొదటి శాతకర్ణి నాణెములని, ఇటు రెండవ శాతకర్ణి నాణెములని, అనుట చిత్రము. అంతేకాదు. మొదటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి అని ఇద్దరు శాతకర్ణులు లేరు. అది వక్ష్యమాణము. కనుక మొదటి శాతకర్ణి నాణెములు కావు. రెండవ శాతకర్ణి నాణెములును కావు.

నెవాసాయొద్ద లభించిన వృషభ చిహ్నముకల నాణెము మొదటి శాతకర్ణి నాణెమని, గజచిహ్నముకల నాణెములు రెండవ శాతకర్ణి నాణెములని గుప్తగారి అభిప్రాయము.[51] కాని, మొదటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి అని ఇద్దరు శాతకర్ణులులేరు. అది వక్ష్యమాణము. కనుక మొదటి శాతకర్ణి నాణెములుకావు. రెండవ శాతకర్ణి నాణెములును కావు.

కొండపూరు, పెదబంకూరు, మాస్కి, మొదలైన స్థలములందు లభించిన 2–25 సంఖ్యల నాణెములు మొదటి శాతకర్ణి నాణెములని, 235–275 సంఖ్యల నాణెములు నాల్గవ శాతకర్ణి నాణెములని రామారావుగారి అభిప్రాయము.[52] కాని, మొదటి

శాతకర్ణి, రెండవ శాతకర్ణి, **మూ**డవ శాతకర్ణి, నాల్గవ శాతకర్ణి అను చరిత్రకారుల పరిగణనము ప్రామాదికము. నాల్గవ శాతకర్ణి అనగా వాసిష్ఠీపుత్ర శాతకర్ణి. వాసిష్ఠీపుత్ర శాతకర్ణి నాణెముల మీద వాసిష్ఠీపుత్ర విశేషణము కలదు. పయి 235–275 సంఖ్యల నాణెములమీద వాసిష్ఠీపుత్ర విశేషణము**లేదు**. అంతేకాదు. మొదటి శాతకర్ణి కల్పితపురుషుడు. కనుక పయి 2–25 సంఖ్యల నాణెములు **మొ**దటి శాతకర్ణి నాణెములు కావు. 235–275 సంఖ్యల నాణెములు నాల్గవ శాతకర్ణి నాణెములు కావు.

అసలు మొదటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి, మూడవ శాతకర్ణి, నాల్గవ శాతకర్ణి అను వ్యవహారము ఆధునికము. అంతేకాదు. పురాణ రాజనామావళీ పురస్కృతము. ఉపరి, పరిష్కృత పాఠ**మూ**లకము.

శిముక శాతవాహనుని సోదరుడు కృష్ణుడని విష్ణు, బ్రహ్మాండ, భాగవత పురాణములందు కలదు. కృష్ణశాతకర్ణి అని భవిష్యోత్తర పురాణమున కలదు. కృష్ణుని పుత్త్రుడు శ్రీసాతకర్ణి అని **వాయు**పురాణమున, శ్రీశాంతకర్ణి అని బ్రహ్మాండ పురాణమున, శాంతకర్ణి అని విష్ణుపురాణమున, శ్రీశాతకర్ణుడని **భా**గవత పురాణమునం కలదు. అనగా శ్రీశాతకర్ణి. అతడు 56 సంవత్సరములు పరిపాలించునని వాయు, బ్రహ్మాండపురాణములందు కలదు. మత్స్యపురాణమున శిముక శాతవాహనుని పుత్త్రుడు మల్లకర్ణి అని కలదు. ఇతడు 10 సంవత్సరములు పరిపాలించునని కలదు. కాని, పార్జిటరు పరిష్కృత పాఠమున శిముక శాతవాహనుని సోదరుడు కృష్ణుడు, కృష్ణుని పుత్త్రుడు శ్రీశాతకర్ణి అని కలదు. అంతేకాదు. అతడు 10 సంవత్సరములు పరిపాలించునని కలదు. అనగా మల్లకర్ణి స్థానమున శాతకర్ణి అవతరించినట్లు అవగాహకము.

మత్స్యపురాణ**ము**లోని —

'శిశుకో న్ధః సజాతీయః ప్రాప్స్యతీమాం వసుంధరాం
త్రయోవింశత్సమా రాజా శిశుకస్తు భవిష్యతి' —శ్లో 2

'శ్రీ మల్లకర్ణిర్భవితా తస్య పుత్త్రస్తు వై దశా
పూర్ణోత్సఙ్గ స్తతోరాజా వర్షాణ్యష్టాదశైవతు'
— శ్లో. 3, అ. 272

అను శ్లోకములమధ్య, బ్రహ్మాండ పురాణములోని—

'కృష్ణో భ్రాతాస్య వర్షాణి సో స్మాద్దశ భవిష్యతి'—
/అస్మాద్దశ—అష్టాదశ/
— శ్లో. 162, అ. 74, త్రృ. పా.

అను శ్లోకము యొక్క పూర్వార్ధమును చేర్చి,

'కృష్ణో భ్రాతా యవీయాంస్తు అష్టాదశ భవిష్యతి'

అను పాఠాంతర**ము**ను కూర్చి, బ్రహ్మాండ పురాణములోని,

'శ్రీ శాన్తకర్ణిర్భవితా తస్య పుత్త్రస్య /స్తు/ వైమహాన్'
— శ్లో. 162, అ. 74, త్రృ. పా.

అను ఉత్తరార్ధమునుబట్టి, మత్స్యపురాణములోని,

'శ్రీమల్లకర్ణిః'

అను పాఠమును

'శ్రీశాతకర్ణిః'

అని మార్చినట్లు అనుమేయము. అందువలన బ్రహ్మాండ పురాణములోని 56 సంవత్సరములు పరిపాలించు శ్రీశాతకర్ణి, పార్జిటరు పరిష్కృత పాఠమున 10 సంవత్సరములు మాత్రము పరిపాలించు శాతకర్ణి అయ్యెను మత్స్యపురాణ తాళపత్ర గ్రంథములందు సర్వసాధారణముగ 'మల్లకర్ణి' అను పాఠమే కలదని పార్జిటరుగారి ప్రతిపాదనమే![53] కాబట్టి పార్జిటరుగారి పరిష్కృత పాఠములోని శ్రీ శాతకర్ణి అసలు మల్లకర్ణి అని స్పష్టము.

భవిష్యోత్తర పురాణమున శిముక శాతవాహనుని సోదరుడు కృష్ణశాతకర్ణి, కృష్ణశాతకర్ణి తర్వాత మల్లశాతకర్ణి అని కలదు. మల్లశాతకర్ణి 10 సంవత్సరములు పరిపాలించునని కలదు. అనగా మత్స్యపురాణములోని మల్లకర్ణి, భవిష్యోత్తర పురాణములోని మల్లశాతకర్ణి ఒకడు. అతడు శ్రీశాతకర్ణి అని పార్జిటరుగారి పరిష్కృత పాఠము. అనగా కల్పిత పురుషుడు. అతడు **మొ**దటి శాతకర్ణి అని చరిత్రకారుల, నాణక శాస్త్రప్రవీణుల అభిప్రా**యము**.

మత్స్యపురాణ**ము**న మల్లకర్ణి తర్వాత పూర్ణోత్సంగుడు, **పూ**ర్ణోత్సంగుని తర్వాత శాంతకర్ణి అని కలదు. అతడు 56 సంవత్సరములు పరిపాలించునని కలదు. భవి**ష్యో**త్తర పురాణమునందును మల్లశాతకర్ణి తర్వాత పూర్ణోత్సంగుడు, **పూ**ర్ణోత్సంగుని తర్వాత శ్రీశాతకర్ణి అనికలదు. అంతేకాదు. అతడు 56 సంవత్సరములు పరిపాలించుననియు కలదు. అనగా మత్స్యపురాణములోని **పూ**ర్ణోత్సంగుని తర్వాతి శాంతకర్ణి,భవిష్యోత్తర పురాణములోని పూర్ణోత్సంగుని తర్వాతి శ్రీశాతకర్ణి ఒకడు. అతడు పార్జిటరు పరిష్కృతపాఠమున కలడు. కనుక రెండవ శాతకర్ణి అని చరిత్రకారుల, నాణక శాస్త్రప్రవీణుల అభిప్రాయము.

వాయు, బ్రహ్మాండ పురాణములందు 56 సంవత్సరములు పరిపాలించునని కల కృష్ణుని పుత్త్రుడు శ్రీశాతకర్ణి; మత్స్య, భవి**ష్యో**త్తర పురాణములందు 56 సంవత్సరములు పరిపాలించునని కల పూర్ణోత్సంగుని తర్వాతి శ్రీశాతకర్ణి ఒకడు. ఇద్దరు కారు. అనగా వాయు, విష్ణు, బ్రహ్మాండ, భాగవత పురాణ**ము**లలోని కృష్ణుని పుత్త్రుడు శ్రీశాతకర్ణి; మత్స్య, భవిష్యోత్తర పురాణములలోని పూర్ణోత్సంగుని తర్వాతి శ్రీశాతకర్ణి ఒకడని అర్థము. కనుక చరిత్రకారుల, నాణక శాస్త్రప్రవీణుల రెండవ శాతకర్ణియే శ్రీశాతకర్ణి. పార్జిటరుగారి పరిష్కృత పాఠములోని శాతకర్ణి మత్స్యపురాణ తాళపత్ర గ్రంథ**ము**లందు, మత్స్యపురాణ ముద్రితగ్రంథమునందు మల్లకర్ణి. భవిష్యోత్తర పురాణమునందు మల్లశాతకర్ణి. కనుక చరిత్రకారుల, నాణక శాస్త్రప్రవీణుల మొదటి శాతకర్ణి మల్లకర్ణి లేక మల్లశాతకర్ణి. మల్ల /శాత/ కర్ణి, శ్రీశాతకర్ణి సదృశనామములు కారు. కనుక **మొ**దటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి అని ఇద్దరు శాతకర్ణులు లేరని కరతలామలకము.

చరిత్రకారుల, నాణకశాస్త్ర ప్రవీణుల మొదటి శాతకర్ణి మల్ల /శాత/కర్ణి. రెండవ శాతకర్ణి, శ్రీశాతకర్ణి. మూడవ శాత కర్ణి గౌతమీపుత్ర శాతకర్ణి. నాల్గవ శాతకర్ణి వాసిష్ఠీపుత్ర శాత కర్ణి. గౌతమీపుత్రశాతకర్ణి నాణెములమీద గౌతమీపుత్ర విశే షణము కలదు. వాసిష్ఠీపుత్ర శాతకర్ణినాణెములమీద వాసిష్ఠీపుత్ర విశేషణముకలదు. అంతేకాదు. కృష్ణశాతకర్ణి నాణెముమీద కృష్ణ శబ్దము కలదు. స్కంద శాతకర్ణి నాణెములమీద స్కందశబ్దము కలదు. గౌతమీపుత్ర విజయశాతకర్ణినాణెములమీద గౌతమీపుత్ర విశేషణముతోపాటు విజయశబ్దము కలదు. వాసిష్ఠీపుత్ర చంద్రశాత కర్ణి నాణెములమీద వాసిష్ఠీపుత్ర విశేషణముతోపాటు చంద్ర శబ్దము కలదు. రుద్రశాతకర్ణి నాణెములమీద రుద్రశబ్దము కలదు. అట్లు మల్ల /శాత/కర్ణినాణెములు కలవేని, ఆ నాణెములమీద మల్ల శబ్దమును ఉండుట విధాయకము. కాబట్టి మల్లశబ్దములేని, గౌతమీపుత్ర విశేషణములేని, వాసిష్ఠీపుత్ర విశేషణములేని, శ్రీశాత కర్ణి పేరుమాత్రమే కల నాణెములు శ్రీశాతకర్ణి నాణెములని స్పష్టము.

పురాణ రాజనామావళులందు శిముక శాతవాహనుడు మొదలు శ్రీ పులుమావివరకు సుమారు ఇరువదిమందికి పైగా శాతకర్ణి శబ్దము ప్రయుక్తమైనను నిరుపపదమైన శాతకర్ణి శబ్దము ఒక్క శ్రీశాతకర్ణికి మాత్రమే కలదు. ఇతర శాతకర్ణి సంజ్ఞి తులకు ఇతర విశేషణములు కలవు. అవి నాణెములమీది లేఖనము లందును కలవు. శాసనము లందును కలవు. ఏ విశేషణమునులేని శ్రీ శాతకర్ణి ఏకైక వ్యక్తి. ఇది గమనార్హమైన విశేషము.

పశ్చిమ భారతదేశమున లభించిన 5వ సంఖ్య నాణెము మీద '/ర/--ణిస' అను లేఖనము, 6వ సంఖ్య నాణెము మీద '/ర/— /ణ/స'అను లేఖనము, 8వ సంఖ్య నాణెము మీద '—-ణిస' అను లేఖనము, 9వ సంఖ్య నాణెము మీది '—/శో/ సతకంణి—' అను లేఖనము, 10వ సంఖ్య నాణెము మీద '—-ణస' అను లేఖనము కలవు.[54] 7,11,12 సంఖ్యల నాణెముల మీద లేఖనము జాడలు కలవు.[55] 60వ సంఖ్య నాణెము మీద '/రఞొసరస/-' అను లేఖనము, 75వ సంఖ్య నాణెము మీద 'రఞొ——' అను లేఖనము కలవు.[56] 59, 74 సంఖ్యల నాణెముల మీద లేఖనము జాడలు కలవు.[57] 61వ సంఖ్య నాణెము మీద ఆ జాడ కూడ లేదు.[58]

చందామండలము నందు లభించిన 171వ సంఖ్య నాణెము మీద '—సిరిసాతక /ణి/—' అను లేఖనము, 172వ సంఖ్య నాణెము మీద '—సిరిసతక ' అను లేఖనము, 173వ సంఖ్య నాణెము మీద '—/ర/ సతక—స' అను లేఖనము 174వ సంఖ్య నాణెము మీద '—/స/ తకణి—' అను లేఖనము, 175వ సంఖ్య నాణెము మీద '—/స/ తకణి—' అను లేఖనము, 176వ సంఖ్య నాణెము మీద '—-తకణిస' అను లేఖనము, 177వ సంఖ్య నాణెము మీద '—స/త/ కణిస' అను లేఖనము కలవు.[59]

ఉత్తరభారతదేశమున ఉన్న 5వ సంఖ్య నాణెము మీద'— సతకన్—' అను లేఖనము, 6వ సంఖ్య నాణెము మీద, '—సిరిసతక—' అను లేఖనము, 7, 9, 10సంఖ్యల నాణెములమీద '—తకనిస' అను లేఖనము, 11వ సంఖ్య నాణెము మీద '—సతక—' అను లేఖనము, 12వ సంఖ్య నాణెము మీద 'సతరఞొణిస—' అనగా 'రఞొ—సత-ణిస' అను లేఖనము కలవు.[60] 8, 13–29 సంఖ్యల నాణెముల మీద లేఖనములు ఖిలమైనవి.[61]

కొండవూరు, పెదబంకూరు, ఖమ్మంమెట్టు, మాస్కి, బీదర్ అను స్థలము లందు లభించిన 3వ సంఖ్య నాణెము మీద '/—సతకణస/' అను లేఖనము, 4వ సంఖ్య నాణెము మీద '—సతక—' అను లేఖనము, 2, 10–12 సంఖ్యల నాణెముల మీద '—/రి/ సత—' అను లేఖనము, 15వ సంఖ్య నాణెము మీద '—స—' అను లేఖనము కలవు.[62] 9, 16–24 సంఖ్యల నాణెముల మీద లేఖనములు ఖిలమైనవి.[63] 238, 239, 245, 246, 248–250, 260 262, 273 సంఖ్యల నాణెముల మీద '—సిరిసతకణి/ణ/స' అను లేఖనము, 236, 237, 251–255, 257, 258 సంఖ్యల నాణెముల మీద '—సతక ణిస' అను లేఖనము, 247, 250, 261 సంఖ్యల నాణెముల మీద '—సిరిసతక—' అను లేఖనము, 235, 240, 243, 256, 267 సంఖ్యల నాణెముల మీద '—సతక—' అను లేఖనము, 241 245, 268, 269, 270, 272 సంఖ్యల నాణెముల మీద '—సిరిసత—' అను లేఖనము, 275వ సంఖ్య నాణెము మీద '—సత-' అను లేఖనము, 239, 244, 271, 274 సంఖ్యల నాణెముల మీద '-సిరిస—' అను లేఖనము కలవు.[64]

సారనాథ్ ప్రదర్శనశాలలోని నాణెముల మీద లేఖనములు ఖిలమైనది.[65]

నెవాసా యొద్ద లభించిన 1810, 6659 సంఖ్యల నాణెములమీద '—సరసతకణిస' అను లేఖనము, 1462వ సంఖ్య నాణెము మీద '-రసతకణి—' అను లేఖనము, 6863వ సంఖ్య నాణెము మీద 'రఞొసరస—ణిస' అను లేఖనము, 1968 6710 సంఖ్యల నాణెముల మీద '—సరసత—' అను లేఖనము, 1880వ సంఖ్య నాణెము మీద '—తకణి—' అను లేఖనము, 1369వ సంఖ్య నాణెము మీద '-కణిస' అను లేఖనము, 1712వ సంఖ్య నాణెము మీద '—ణిస' అను లేఖనము, 3007వ సంఖ్య నాణెము మీద '—సరిస—' అను లేఖనము, 4695వ సంఖ్య నాణెము మీద 'రఞొసర—' అను లేఖనము కలవు.[66]

పశ్చిమ మాళవదేశమున లభించిన 4, 5 సంఖ్యల నాణెము మీద '—సిరిసాత /కణిస/' అను లేఖనము, 46వ సంఖ్య నాణెము మీద '—/సి/ రిసత—' అను లేఖనము, 7వ సంఖ్య నాణెముమీద '-సాతకణి—' అను లేఖనము, 8వ సంఖ్య నాణెముమీద '—సిరిసాత కణిస' అను లేఖనము కలవు.[67]

క్రామజ్ దగ్గర లభించిన 5వ సంఖ్య నాణెముమీద '—/సిరిసా/ తకణిస' అను లేఖనము కలదు.[68]

కార్వణ్ దగ్గర లభించిన 6వ సంఖ్య నాణెముమీద '—సర—' అను లేఖనము కలదు.[69] 7—10 సంఖ్యల నాణెములమీద లేఖనములు ఖిలమైనవి.[70]

నాసికయొద్ద లభించిన 11వ సంఖ్య నాణెముమీద'—సాతక—' అను లేఖనము కలదు.[71] 12వ సంఖ్య నాణెముమీద లేఖనము ఖిలమైనది.[72] నాసికయొద్ద త్రవ్వకమునందు లభించిన 860వ సంఖ్య నాణెముమీద లేఖనము ఖిలమైనది.[73]

త్రిపురియొద్ద లభించిన 14వ సంఖ్య నాణెముమీద '—సిరిసాతకణిస' అను లేఖనము కలదు.[74] మరొక నాణెముమీద '—సరసతకనిస' అను లేఖనము కలదు.[75]

పౌని యొద్ద లభించిన ఒక నాణెముమీద '—సిరిసాతకంమి—' అను లేఖనము కలదు.[76] పౌనియొద్ద త్రవ్వకమునందు లభించిన మరొక నాణెముమీద '—సిరిసాతకనిస' అను లేఖనము కలదు.[77] వేరొక నాణెముమీద లేఖనము ఖిలమైనది.[78]

ఉజ్జయినియందు లభించిన ఒక నాణెముమీద '—సిరిసాత—' అను లేఖనము కలదు.[79] మరొక 13వ సంఖ్య నాణెముమీద లేఖనము ఖిలమైనది [80] వేరొక 4వ సంఖ్య నాణెముమీద '—సాతకని-' అనులేఖనము కలదు.[81]

కథియవాడ్ దగ్గర లభించిన 57A సంఖ్య నాణెముమీద 'రఞొసిరిసాత—' అను లేఖనము కలదు.[82]

విదిశయొద్ద లభించిన 1వ సంఖ్య నాణెముమీద '/ర/ ఞొసిరిసాతకణి /స/' అను లేఖనము కలదు [83] విదిశయొద్ద త్రవ్వకమునందు లభించిన మరొక నాణెముమీద 'రఞొసిరిసాతకనిస' అను లేఖనము కలదు.[84]

బ్రహ్మపురియొద్ద త్రవ్వకమునందు లభించిన 4139వ సంఖ్య నాణెముమీద '—/సా/తకనిస' అను లేఖనము కలదు.[85]

బాల్పూర్ దగ్గర త్రవ్వకమునందు లభించిన నాణెముమీద లేఖనము ఖిలమైనది.[86]

ప్రతిష్ఠానమునందు త్రవ్వకమునందు లభించిన నాణెముమీద లేఖనము ఖిలమైనది.[87]

ఇబ్లు అవ్రా[88] దగ్గర, కౌండిన్యపురము[89] త్రవ్వకమునందు లభించిన నాణెములు శ్రీశాతకర్ణి నాణెములు.

కొండపూరునందు లభించిన మరొక నాణెముమీద 'రఞొసిరిసాతకనిస' అను లేఖనము కలదు.[90]

చంద్రవల్లియందు లభించిన 2వసంఖ్య నాణెముమీద'—/ఞ/సత /క/—' అను లేఖనము, 4వ సంఖ్య నాణెముమీద '—స—కణ—' అను లేఖనము, 5వ సంఖ్య నాణెముమీద '—సాతక—' అను లేఖనము కలవు.[91]

కౌశాంబియందు లభించిన 5వ సంఖ్య నాణెముమీద 'రఞొసిరిసాత—' అను లేఖనము కలదు.[92]

హైదరాబాదునందు లభించిన 1వ సంఖ్య నాణెముమీద '—సిరిసతకణిస' అను లేఖనము, 2వ సంఖ్య నాణెముమీద '—నస' అను లేఖనము కలవు.[93] మరొక నాణెముమీద '—సరసతకణస' అనులేఖనము కలదు.[94]

ఆంధ్రదేశమునందు లభించిన 8వ సంఖ్య నాణెముమీద 'రఞొసిరిసాతకణిస' అను లేఖనము, 9వ సంఖ్య నాణెముమీద 'రఞొ/సిరిసాత /క/—' అను లేఖనము కలవు.[95] ఆంధ్రదేశమున లభించిన మరొక 206—209 సంఖ్యల నాణెములమీద లేఖనములు ఖిలమైనవి.[96]

మాచెర్లయందు లభించిన 19వ సంఖ్య నాణెముమీద 'రఞొ—సతకణస' అను లేఖనము కలదు.[97]

చేబ్రోలు దగ్గర లభించిన 20వ సంఖ్య నాణెముమీద '—సతకణస' అను లేఖనము, 47వ సంఖ్య నాణెముమీద 'రఞొసిరిసతకణిస' అను లేఖనము కలవు.[98]

అమరావతియొద్ద లభించిన 39వ సంఖ్య నాణెముమీద 'రఞొ—సతకణి-' అను లేఖనము కలదు.[99]

దీపాలదిన్నె దగ్గర లభించిన 25వ సంఖ్య నాణెముమీద 'రఞొ—సతకనస' అను లేఖనము కలదు.[100]

ధరణికోటయందు లభించిన 19వ సంఖ్య నాణెముమీద 'రఞొసిరిసతక /ణిస/' అను లేఖనము, 37వ సంఖ్య నాణెముమీద 'రఞొసిరిసతకణిస' అను లేఖనము కలవు.[101]

నాగార్జునకొండయొద్ద లభించిన కొన్ని నాణెములమీద శ్రీశాతకర్ణి లేఖనము కలదు.[102]

మరొక నాణెముమీద 'రఞొ—సతకణి—' అను లేఖనము కలదు.[103]

ఇంకొక నాణెముమీద 'ఞొ రసతక—' అను లేఖనము కలదు.[104]

వేరొక నాణెముమీద 'రఞొసాతకర్ణిస' అను లేఖనము కలదు.[105]

నాగనికా శ్రీశాతకర్ణుల వెండి నాణెము

జున్నార్ దగ్గర లభించిన వెండినాణెముమీద ముందువైపు పైన 'రంఞొ సిరిసాత /క/—'అను లేఖనము, క్రింద 'నాగనికాయ' అను లేఖనము కలదు.[106] ఇది అశ్వమేధయాగ సందర్భములోని నాణెము.[107]

ఇందు లేఖనములు కల నాణెములు నిర్ధారకముగ, లేఖనములు ఖిలమైన నాణెములు సంశయాత్మకముగ శ్రీశాతకర్ణి నాణెములు.

శ్రీశాతకర్ణి నాణెములు ఆంధ్రదేశము, హైదరాబాదు, ఖమ్మం మెట్టు, మాచెర్ల, చేబ్రోలు, అమరావతి, దీపాలదిన్నె, ధరణికోట, నాగార్జునకొండ, బీదర్, కొండిన్యపురము, చంద్రవల్లి, పశ్చిమ భారతదేశము, చందామండలము, నాసిక, నెవాసా, బ్రహ్మపురి, ప్రతిష్ఠానము, పౌని, అర్వా, జున్నార్, కొండపూర్, పెవబంకూర్, మాస్కి, కొమ్రజ్, కార్వణ్, కథియవాడ్, పశ్చిమమాళవదేశము, ఉజ్జయిని, త్రిపురి, సారనాథ్, బాల్పూర్, విదిశ, కౌశాంబి, మొదలైన బహు స్థలములందు లభించినవి. అనగా ఆంధ్ర, విదర్భ, కర్ణాట, మహారాష్ట్ర, సౌరాష్ట్ర, మాళవ, మధ్యప్రదేశ, దక్షిణ కోసల, ఉత్తరప్రదేశము లందులభించినవని అర్థము.

ఏబదియారు సంవత్సరములు ఏకచ్ఛత్రాధిపతిగ ఏలిన ఆంధ్ర సామ్రాజ్యాధిపతి శ్రీశాతకర్ణి అత్యధికముగ నాణెములు వెలయించుట అత్యంత సహజము. అవి నేడు అనేక స్థలము లందు లభించుట అదృష్టవిశేషము.

4. స్కంద శాతకర్ణి నాణెములు

'రణోసిరిఖదసాతకణిస' అను లేఖనము కల నాణెములు అలతిగ కలవు. 'రణోసిరిఖదసాతకణిస' అను ప్రాకృతరూపమునకు 'రాజ్ఞః శ్రీస్కందశాతకర్ణేః' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా రాజుయొక్క, శ్రీ స్కందశాతకర్ణి యొక్క నాణెమని అర్థము. స్కందశాతకర్ణి నాణెమని తాత్పర్యము.

స్కందశాతకర్ణి పులుమావి తర్వాతి శివస్కందశాతకర్ణి అని మిరాషీగారి అభిప్రాయము.[108] కాని, 'సరిఖదసాతకణిస' అను ప్రాకృత రూపమునకు 'శ్రీశివస్కందశాతకర్ణేః' అను సంస్కృతచ్ఛాయ సంగతము కాదు. అంతేకాదు. శివస్కందశాతకర్ణి నాణెము మీద శివశబ్దమును ఉండుట విధాయకము. పులుమావికి పూర్వము స్కందశాతకర్ణి కలడు. అతడు స్కందస్వాతి అని మత్స్యపురాణమున, శ్రీ స్కందశాతకర్ణి అని భవిష్యోత్తర పురాణమున కలదు. అంతేకాదు. స్కందస్వాతి 7 సంవత్సరములు పరిపాలించునని మత్స్యపురాణమున, శ్రీ స్కందశాతకర్ణి 7 సంవత్సరములు పాలించునని భవిష్యోత్తర పురాణమున కలదు. కనుక మత్స్యపురాణములోని స్కందస్వాతి, భవిష్యోత్తరపురాణములోని శ్రీ స్కందశాతకర్ణి ఒకడు. అతడు స్కందశాతకర్ణి. అంతేకాదు. అజ్ఞాతకర్తృకమైన 'పెరిప్లస్ ది ఇర్రిత్రేయియన్' అను గ్రంథములోని 'సందర్నెస్' అను రాజు స్కందశాతకర్ణి అని ప్రకరణమును బట్టి ప్రతీయమానము. ఇది పూర్వోక్తము.[109] కనుక 'సిరిఖదసాతకణిస' అను లేఖనము కల నాణెములు స్కందశాతకర్ణి నాణెములు.

తర్హాళానిధి యందు 23 నాణెముల మీద 'సిరిఖదసాతకణిస' అను లేఖనము కలదు.[110]

చందానిధిలోని ఒక నాణెము మీద లేఖనము 'యు /గ/ దసాత–' అని హోయిర్నెల్ గారి సందిగ్ధపాఠము కాని, 'ఖదసాత–' అని సరియైన పాఠమని మిరాషీ గారి అభిప్రాయము.[111] కుండలీకృతమైన 'గ' వర్ణము 'ఖ' వర్ణమునకు సహోదరము. 'యు' వర్ణము శాతవాహన రాజనామమునకు అనుగుణము కాదు. కనుక '–గదసాత–' లేక '–ఖదసాత–' అను పాఠము సమంజసము.

కృష్ణాగోదావరీ మండలములందు లభించిన 179వ సంఖ్య నాణెముమీది లేఖనము '–/రు/దసాతక–' అని రేప్సన్‌గారి పాఠము కాని అది కూడ '–ఖదసాతక–' అను పాఠమని మిరాషీగారి అభిప్రాయము.[112]

ఉత్తర భారతదేశమున ఉన్న మరొక నాణెముమీది లేఖనము 'సరిఛదసాతక–' అని స్మిత్‌గారి పాఠము కాని, అది స్పష్టముగ '–సరిఖదసాతక–' అను పాఠమని మిరాషీగారి అభిప్రాయము.[113] నూతన ముద్రణమునన్ను 'సరిఖదసాతకణి–' అను లేఖనము కలదు.[114]

ఇట్లు బ్రహ్మపురియందు లభించిన నాణెము స్కందశాతకర్ణి నాణెము.[115]

ఆంధ్రదేశమున లభించిన 145వ సంఖ్య నాణెముమీది '–ఖదసతక–' అను లేఖనము కలదు.[116]

ఇవి స్కందశాతకర్ణి నాణెములు.

స్కందశాతకర్ణి నాణెములు ఆంధ్రదేశము, కృష్ణాగోదావరి మండలము, తర్హాళా, చందా, బ్రహ్మపురి, మొదలైన స్థలము లందు లభించినవి. అనగా ఆంధ్ర, విదర్భ, మహారాష్ట్రదేశము లందు లభించినవని అర్థము.

5. హాలుని నాణెములు

'రణోసిరిసతస' అని, 'సిరిసదస' అని, 'సిరిసాతస' అని 'సిరిసాతిస' అని లేఖనములు కల నాణెములు అలతిగ కలవు. అందు 'సిరిసతస' అని, 'సిరిసదస' అని, 'సిరిసాతస' అని కల లేఖనములు అభిన్నము. 'సిరిసాతిస' అని కల లేఖనము అందుకు భిన్నముగ తోచుట సహజము కాని, 'చదసాతస' అని, 'చదసాతిస' అని, 'సాతస, సాతిస' అను లేఖనములు అభిన్నముగ కలవు. అది వక్ష్యమాణము. కనుక 'సిరిసాతస', 'సిరిసాతిస' అను లేఖనములు కూడ అభిన్నము. 'సిరిసతస, సిరిసదస, సిరిసాతస' అను ప్రాకృతరూపములకు 'శ్రీశాతస్య' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా శాతుని యొక్క నాణెమని అర్థము. శాతుని నాణెమని తాత్పర్యము.

పశ్చిమ భారతదేశమున లభించిన, పయి లేఖనములు కల 1, 2 సంఖ్యల నాణెములు నాగనిక భర్త శ్రీశాతకర్ణి నాణెములని రేప్సన్‌గారి అభిప్రాయము.[117] మొదటి శాతకర్ణి నాణెములని కటారేగారి అభిప్రాయము.[118] మొదటి శాతకర్ణి లేక రెండవ శాతకర్ణి నాణెములని దీక్షిత్‌గారి అభిప్రాయము.[119] శాతకర్ణి పూర్వుని కాని, అనంతరుని కాని నాణెములని గుప్తగారి అభిప్రాయము.[120] శిముకశాతవాహనుని నాణెములని మిరాషీగారి తొలి అభిప్రాయము.[121] నాగనిక పుత్త్రుడు శక్తిశ్రీ నాణెములని మేలి

అభిప్రాయము.[122] అహ్మద్‌గారి అభిప్రాయమును అదే.[123] కార్తికేయశర్మగారి అభిప్రాయము కూడ అదే.[124] కాని, శాతుడు శాతకర్ణి అగుట అంత సంగతముకాదు. కనుక శ్రీశాతకర్ణి నాణెములు కావు. మొదటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి అను పరిగణనము భ్రాంతి మూలకమని పూర్వోక్తము. కనుక మొదటి శాతకర్ణి నాణెములు కావు. రెండవ శాతకర్ణి నాణెములును కావు. ఇక నాగనిక పుత్త్రుడు నానాఘాట్ శాసనమున 'సతిసిరి' అని కలదు. ప్రతిమా శాసనమున 'హకుసిరి' అని కలదు. తదుభయ ప్రాకృతరూపములకు 'శక్తిశ్రీ' అను సంస్కృతచ్ఛాయ సంగతము. 'శాతశ్రీ' అను సంస్కృతచ్ఛాయ అసంగతము. కనుక శక్తిశ్రీ నాణెములు కూడ కావు.

హైదరాబాదునందు లభించిన ఒక నాణెముమీద ముందువైపు '-తిస' అను లేఖనము, వెనుకవైపు 'సల' అను లేఖనము, మరొక నాణెముమీద 'సాతిస' అను లేఖనము కలవు.[125] అవి హాలుని నాణెములని రామారావుగారి అభిప్రాయము.[126] ఇందు ఒక నాణెముమీద వెనుకవైపున కల 'సల' అను లేఖనము అవశ్యగమనార్హమైన విశేషము. అది సాల, హాల అను ప్రాకృత రూపములకు అనురూపము.

హాల శబ్దము విలక్షణమైనది. వాయు, మత్స్య, బ్రహ్మాండ, భవిష్యోత్తర పురాణములందు 'హాలః' అని సంస్కృత శబ్దముగ ప్రయుక్తము. భాగవత పురాణమున హాలేయః' అని ప్రయుక్తము. విష్ణుపురాణమున 'హాలాహలః' అని సంస్కృత శబ్దమే ప్రయుక్తము. అనగా హాల శబ్దము సంస్కృత శబ్దము కాదని విష్ణుపురాణకారుని అభిప్రాయముగ అవగాహకము. అంతేకాదు. గాథా సప్తశతియందు 'హాలేణ', 'సిరిహాల', ఇత్యాదిగ హాలశబ్దము ప్రాకృతశబ్దముగ బహుధా ప్రయుక్తము. గాథాసప్తశతి హాల సంకలితము. హాలుడు ప్రాకృతభాషావేత్త. ప్రాకృత గాథా కర్త. ప్రాకృత వాఙ్మయ ప్రదాత. హాలశబ్దము తత్త్వతః ప్రాకృత శబ్దము. సంస్కృత శబ్దముగ పురాణప్రోక్తము. కావ్యప్రయుక్తము. అంతేకాదు. చరిత్ర ప్రసిద్ధము. 'హాల' అను ప్రాకృత పదమునకు 'శాత' అను సంస్కృతచ్ఛాయ సంగతము. సంస్కృత 'శ' వర్ణము ప్రాకృతమున 'స' వర్ణముగను 'హ'వర్ణముగను మారుట ప్రసిద్ధము. సంస్కృత 'త' వర్ణము ప్రాకృతమున 'త' వర్ణముగ ఉండుట, 'ద' వర్ణముగ మారుట కూడ ప్రసిద్ధము. మరి, సంస్కృత 'త, ద' వర్ణములు ప్రాకృతమున 'ల' వర్ణముగ సహితము మారుట కలదు.[127] అతసి-అలసి, అసిత—అసిల, పలిత-పలిల, విద్యుత్ విజ్జుల, ఇత్యాదులు కోకొల్లలు. అంతేకాదు. శాతకర్ణి—సాతకర్ణి—హాతకరి అనురూపములకు శాతవాహన నాణక ప్రమాణము కలదు.[128] శాతవాహన—సాతవాహన—సాదవాహన అను రూపములకు శాతవాహన శాసన ప్రమాణము కలదు.[129] సాలవాహన అను రూపమునకు ప్రాకృత వాఙ్మయ ప్రమాణము కలదు.[130] సంస్కృతదీర్ఘము ప్రాకృతమున దీర్ఘముగ ఉండుట, హ్రస్వముగ మారుట బహు ప్రసిద్ధము. శాతకర్ణి—సాతకణి—సతకణి—సదకణి అను ప్రాకృత రూపములు శాసనములందు । నాణెములమీదను ప్రయుక్తము.[131] నాణెములమీది లేఖనములందు 'సిరి' అను ప్రాకృతపదము 'సర' అను ప్రాకృత పదముగ కలదు. అది లేఖక దోషము. అట్లే 'సాతస' అను ప్రాకృత పదమునకు 'సాతిస' అను ప్రాకృతపదము లేఖక దోషము కావచ్చును. సంస్కృత శాతశబ్దమునకు సత, సద, సాత, సాద, సాల, హాల అను ప్రాకృత రూపములు నిష్పన్నములగును. అనగా ప్రాకృత 'హాల' శబ్దమునకు 'శాత' శబ్దము సరియైన సంస్కృతరూపము. కనుక శాతుడు అనగా హాలుడు.

• మత్స్యపురాణమున ఒక స్వాతి, భవిష్యోత్తర పురాణమున మరొక శాతశాతకర్ణి కలరు. ఇద్దరు భిన్నులు. మత్స్యపురాణములోని స్వాతి, భవిష్యోత్తరపురాణములోని శాత స్వాతి ఒకడు. కనుక శాతుడు శాతస్వాతి అని కాని, శాతశాతకర్ణి అని కాని అనవచ్చును. కాని, కృష్ణశాతకర్ణి నాణెముమీద కృష్ణశాతకర్ణి అను పూర్తినామము, స్కందశాతకర్ణి నాణెముమీద స్కందశాతకర్ణి అను పూర్తినామము వలె, శాతస్వాతి నాణెముమీద శాతస్వాతి అను పూర్తినామము, శాత శాతకర్ణి నాణెముమీద శాతశాతకర్ణి అను పూర్తినామము ఉండుట విధాయకము. కాని లేదు. సరికదా హాల శబ్దమునకు ప్రాకృతరూపాంతరము 'సల' అను లేఖనము ఒక నాణెముమీద వెనుకవైపున కలదు. కనుక 'సతస' అని, 'సదస' అని, 'సాతస' అని, 'సాతిస' అని లేఖనములుకల నాణెములు హాలుని నాణెములు.

పశ్చిమ భారతదేశమున లభించిన 1వ సంఖ్య నాణెముమీద 'రఞోసరసాతస' అను లేఖనము, 2వ సంఖ్య నాణెమువిూద 'రఞోసిరిసాతస' అను లేఖనము కలవు.[132]

హోషంగాబాదు మండలమున లభించిన నాణెముమీద '/ర/ ఞోసిరిసాతస' అను లేఖనము కలదు.[133]

భేరాఘాట్ దగ్గర లభించిన ఒక నాణెముమీద 'రఞో—సాతిస' అను లేఖనము, మరొక నాణెముమీద 'రఞోసిరిసాతస' అను లేఖనము కలవు.[134]

కొండపూరునందు లభించిన 93వ సంఖ్య నాణెముమీద '—సిరిస/త/స' అను లేఖనము, 95వ సంఖ్య నాణెముమీద '—సదస' అను లేఖనము కలవు.[135]

పెదబంకూరు నందు లభించిన 99వ సంఖ్య నాణెముమీద 'రఞో—సతస' అను లేఖనము కలదు.[136]

మాస్కి యొద్ద లభించిన 14వ సంఖ్య నాణెము మీద '—/రిసతస/' అను లేఖనము, 94వ సంఖ్య నాణెముమీద '—సతస' అను లేఖనము కలవు.[173]

ఇట్లు కౌండిన్యపురము త్రవ్వకము నందు లభించిన నాణెములు హాలుని నాణెములు.[138]

మాళవదేశమున లభించిన నాణెము మీద '/రఞో—సాతస/' అను లేఖనము కలదు.[139]

ఉజ్జయిని యందు లభించిన 3వ సంఖ్య నాణెము మీద '—/సి/రిసాతస' అను లేఖనము కలదు.[140]

త్రిపురి యొద్ద లభించిన ఒక నాణెము మీద 'రఞొసిరిసతస' అను లేఖనము కలదు.[141] మరొక నాణెము మీద 'రఞొసిరిసాతిస' అను లేఖనము కలదు.[142]

విదిశ యొద్ద లభించిన 2వసంఖ్య నాణెము మీద '—స/సి/రిసాతస' అను లేఖనము కలదు.[143]

ఆంధ్రదేశము నందు లభించిన 45వ సంఖ్య నాణెము మీద '—సాతస' అను లేఖనము కలదు.[144]

హైదరాబాదు నందు లభించిన ఒక నాణెము మీద ముందు వైపు '—తిస' అను లేఖనము, వెనుక వైపు 'సల' అను లేఖనము, మరొక నాణెము మీద '—సాతిస'అను లేఖనము కలవు.[145]

పెనుమూలి యొద్ద లభించిన నాణెము మీద'—/సా/త/స/' అను లేఖనము కలదు.[146]

మరొక నాణెము మీద '—సతస' అను లేఖనము కలదు.[147]

కనుక హాలుని నాణెములు.

హాలుని నాణెములు ఆంధ్రదేశము, హైదరాబాదు, పెనుమూలి, కొండిన్యపురము, పశ్చిమభారతదేశము, హోషంగాబాదు, మాళవదేశము, ఉజ్జయిని, త్రిపురి, భెరాఘాట్, విదిశ, మొదలైన స్థలము లందు లభించినవి. అనగా ఆంధ్ర, విదర్భ, మహారాష్ట్ర, మాళవ, మధ్యప్రదేశములందు లభించినవని అర్థము.

6. మాఠరీపుత్ర శివస్వాతిశక సేనుని నాణెములు

'మాఠరిపుతస—' అని, 'సకసదస' అని, 'సకసెనస' అని, 'సకసాతకణిస' అని లేఖనములు కల నాణెములు అలతిగ కలవు. 'మాఠరిపుతస అను ప్రాకృతరూపమునకు 'మాఠరీపుత్త్రస్య' అను సంస్కృతచ్ఛాయ సంగతము అనగా మాఠరీపుత్త్రుని యొక్క నాణెమని అర్థము. 'సకసదస' అను ప్రాకృత రూపమునకు 'శకశాతస్య' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా శకశాతుని యొక్క నాణెమని అర్థము. 'సకసెనస' అను ప్రాకృతరూపమునకు 'శకసేనస్య' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా శకసేనుని యొక్క నాణెమని అర్థము. 'సకసాతకణిస' అను ప్రాకృతరూపమునకు 'శకశాతకర్ణేః' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా శకశాతకర్ణి యొక్క నాణెమని అర్థము.

మాఠరీపుత్త్రుడు, శకశాతుడు, శకసేనుడు, శకశాతకర్ణి భిన్నులని తోచుట సహజము. కాని ఒక్కడు. వాయుపురాణమున శివస్వామి కలడు. అతడు శివస్వాతి అని మత్స్య, విష్ణు, బ్రహ్మాండ, భాగవత, భవిష్యోత్తర పురాణము లందు కలదు. అంతేకాదు. శివస్వాతి మాఠరీపుత్త్రుడని భవిష్యోత్తర పురాణమున కలదు. ఉపరి, మాఠరీపుత్త్రశివస్వాతిని మహాజనులు శకసేనుడు అని వ్యవహరింతురని కూడ భవిష్యోత్తర పురాణమున కలదు. అంతేకాదు. కన్హేరీ శాసనమున మాఠరీపుత్త్ర స్వామిశకసేనుడు అని కలదు.[148] కనుక వాయుపురాణములోని శివస్వామి, మత్స్య, విష్ణు, బ్రహ్మాండ, భాగవత పురాణములలోని శివస్వాతి, భవిష్యోత్తర పురాణములోని మాఠరీపుత్త్ర శివస్వాతిశకసేనుడు, కన్హేరీశాసనములోని మాఠరీపుత్త్ర స్వామిశకసేనుడు ఒకడు. అతడు శకశాతుడు, శకశాతకర్ణి అగుట సంభవము. అంతేకాదు. పురాణరాజనామావళు లందు కాని, శాసనము లందు కాని, అన్యథాకాని, శాతవాహనరాజు మరొక మాఠరీపుత్త్రుడు లేడు. ఇంకొక శకశాతుడు లేడు. వేరొక శకసేనుడు లేడు. కొండొక శకశాతకర్ణి లేడు. కనుక మాఠరీపుత్త్రుని నాణెములు, శకశాతుని నాణెములు, శకసేనుని నాణెములు, శకశాతకర్ణి నాణెములు మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుని నాణెములు.

శకసేనుని నాణెములు కన్హేరీశాసనములోని మాఠరీపుత్త్ర స్వామిశకసేనుని నాణెములు కాని, మాఠరీ పుత్త్రసివలకురుని నాణెములు కాని కావచ్చునని రేప్సన్ గారి అభిప్రాయము. కాని, మాఠరీపుత్త్ర సివలకురునికి శకసేనవ్యవహారము కలదనుటకు ఎట్టి ఆధారమును లేదు. మాఠరీపుత్త్రశివస్వాతికి శకసేనవ్యవహారము కలదనుటకు కనీసము పురాణవచనము కలదు. అంతేకాదు. శకశాతకర్ణి అను నాణకలేఖనము శకసేనవ్యవహారము ఒక శాతవాహనరాజునకు కలదనుటకు ఉపబలకము. మాఠరీ పుత్త్రశివస్వాతికి వినా మరొక శాతవాహనరాజునకు శకశబ్దప్రమేయము లేదు. కనుక శకసేనుని నాణెములు మాఠరీపుత్త్రశివస్వాతి శకసేనుని నాణెములు.

శకశాతుడు అనగా శకహాలుడని, శకశాతకర్ణి అనగా శకశ్రీ శాతకర్ణి అనికూడ అనవచ్చును. కాని, హాలునికి గాని, శ్రీశాతకర్ణికి గాని శకశబ్ద ప్రమేయము కలదనుటకు ప్రమాణాంతరము కానరాదు. అంతేకాదు. శకశాత రూపము నిర్ధారకము కాదు. పూరకము. శాతకర్ణిశబ్దము శాతవాహనరాజ సాధారణము. కనుక శకశాతుని నాణెములు, శకశాతకర్ణి నాణెములును మాఠరీపుత్త్రశివస్వాతి శకసేనుని నాణెములు.

పెద్దబంకూరు దగ్గర లభించిన 313వ సంఖ్య నాణెము మీద 'మాఠరిపు—' అను లేఖనము, 311వ సంఖ్య నాణెము మీద 'మాఠరి' అను లేఖనము, 309వ సంఖ్య నాణెము మీద 'మా/ఠరి/' అను లేఖనము, 310, 312వ సంఖ్యల నాణెముల మీద 'మా—' అను లేఖనము కలవు.[149] 'మా' అను వర్ణములు మాఠరీశబ్దములోని ఆద్యక్షరములు అగును. మాఠరీశబ్దము సంస్కృతము. మాఢరీశబ్దము ప్రాకృతము. సంస్కృత 'ఠ' వర్ణము ప్రాకృతమున 'ఢ' వర్ణ మగును. 'ఠోఢః' అని వరరుచి సూత్రము.[150] సంస్కృత గ్రంథము లందు మాఢరీ శబ్దము ప్రాకృత లేఖనము లందు మాఠరీశబ్దము ఉండుట చిత్రము. 'మాఠరిపు—' అను లేఖనమునకు 'మాఠరీపుతస' అని పూర్తి

రూపము' అనగా అయిదు నాణెముల మీదను 'మాఠరీపుతస' అను పూర్తిలేఖనము కలదని అవగాహనము.

కృష్ణా, గోదావరీ మండలములందు లభించిన 34వ సంఖ్య నాణెముమీద 'సకస—స' అను లేఖనము, 36వ సంఖ్య నాణెముమీద '—కస స' అను లేఖనము కలవు.[151] 34వ సంఖ్య నాణెముమీది లేఖనమునుబట్టి, 36వసంఖ్య నాణెముమీది లేఖనమును '/స/కస—స' అనులేఖనము అగును. తన్మధ్య వర్ణము 'ద' వర్ణము కావచ్చునని రేప్సన్‌గారి అభిప్రాయము.[152] అనగా 'సకస' /ద/ స' అని పూర్తి లేఖనము. అది 'సక సెనస' అను లేఖనమును కావచ్చునని రేప్సన్‌గారి సూచనము.[153] 37వసంఖ్య నాణెముమీద 'సకసె—స' అనులేఖనము కలదు. తన్మధ్యవర్ణము 'న' వర్ణమగుట తథ్యము. అనగా 'సకసె/న/స' అని పూర్తిలేఖనము.

తర్హాళానిధిలోని 1వ సంఖ్య నాణెము మీద '—కససాతక—' అను లేఖనము, 2వ సంఖ్య నాణెము మీద '—ఠసక-సా—' అను లేఖనము కలవు.[154] అనగా 'రణ్ణోసి/స/ రిసాతకణిస' అని పూర్తి లేఖనము.

బ్రహ్మపురి యందు లభించిన నాణెములమీది లేఖనములకు ఆకరములను అరయవలయును.[155]

అమరావతి యొద్ద లభించిన ఒక నాణెముమీద 'సకస—స' అను లేఖనము కలదు.[156]

కనుక మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుని నాణెములు.

మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుని నాణెములు కృష్ణా గోదావరీ మండలములు, అమరావతి, తర్హాళా, పెదబంకూరు, బ్రహ్మపురి అను స్థలము లందు లభించినవి. అనగా ఆంధ్ర, విదర్భ, మహారాష్ట్ర దేశము లందు లభించినవని అర్థము.

సూచికలు

1 SI. p. 183 & 185
2 JNSI. XI. p. 2
3 APMC, pp. 10-11
4 JNSI. XIII, p. 38
5 FHPHN, p. 176
6 CSCE, p. 135
7 JNSI, XXII, p. 144
8 CHI. 11, p. 304
9 CSCE, p. 135
10 AIU, p. 198, FN. 4
11 SI, p. 183
12 Ibid, p. 185
13 భారతి ఆగస్టు, 1978, పుటలు 12–13
14 ASWI, V, p. 64
15 భారతి, డిశంబరు 1978, పు. 54.
16 AHI, p. 116
17 JNSI, XXX p. 48
18 Ibid
19 CSCE, p. 79
20 FHPHN, p. 179
21 Ibid, pp. 180-181
22 Ibid, p. 181
23 Ibid, p. 180
24 Ibid, pp. 171-72
25 BDCRI, VI, pp. 141-42
26 MSI, III, pp. 1-4
27 JNSI, VII, p. 1
28 Ibid, XI, p. 22
29 OUJ, p. 123
30 భారతి, జూన్, 1978, పు॥లు 51, 55
31 BMC, pp. xiii-x1iii
32 A. JNSI, XIV, p. 26
B. Ibid, XVI, pp. 77-85
33 SI, p. 183
34 BMC, p. 48
35 FHPHN, pp. 202-3
36 Idid, p. 203
37 BMC, p. XCV
38 JNSI, XXII, pp. 253-54
39 CSCE, p. 1
40 BMC, p. XLVI
41 CHI, 11. p. 304
42 NNM, p. 6
43 CSCE, p. 1.
44 JNS1, XVI, pp. 90-91
45-48 CSCE, p. 1
49 Ibid, p. 80
50 Ibid, pp. 79-81
51 Ibid, pp. 135-36
52 APMC, pp. 32, 33, 52, 53, 54, 55

53 DKA, p. 39, FN. 29
54 BMC, pp. 3-4
55 Ibid
56 Ibid, pp. 17-19
57 Ibid
58 Ibid
59 Ibid, pp. 43-44
60 IMC, pp. 210-11
61 Ibid.
62 APMC, pp. 32-3
63 Ibid
64 Ibid, pp. 52-5
65 JNSI, XIII, pp. 110-11
66 FHPHN, pp. 176-81, 186, 188-90
67 JNSI, IV, pp. 25-7
68 Ibid, XII, pp. 28-9
69 Ibid
70 Ibid
71 Ibid, XIII, pp. 33-4
72 Ibid
73 ENJ, p. 32
74 Ibid, p. 36
75 Ibid, XXI, pp. 110-11
76 Ibid, XXXV, p. 107
77 P. E., p. 99
78 Ibid, p. 33
79 JNSI, IV, p. 28
80 Ibid, XIII, p. 214
81 CSCE, p. 29
82 EMN, p.
83 CSCE, p. 27
84 IAR, 1967-68, p. 63
85 EBK, p. 41
86 IAR, 1958-59, p. 66
87 Ibid, 1965-66, p. 28
88 JMPIP, 1964, p. 4
89 EK. p. 137
90 JNSI, XXVIII, pp. 54-7
91 Ibid, XXII, p. 151
92 CSCE, p. 29
93 JNSI, XIII, pp. 131-2
94 Ibid, VIII, p. 18
95 BMGM, Vol. VII, No. 2., p. 15
96 DMC, pp. 53-4
97 JDHC 11-2, p.82
98 Ibid, pp. 82, 86
99 Ibid, p. 86
100 CSI, 11. p. 44
101 JDHC. 11-2, pp. 82, 85
102 IAR, 1956-57, p. 38
103 PHC, 1945, p. 24
104 JDHC, 11-2, p. 87
105 JNSI, XXII, p. 151
106 Ibid, XXXVIII, p. 6
107 Ibid, p. 9.
108 Ibid, 11, p. 35
109 భారతి, ఏప్రియల్ 1979 పుటలు 19-20.
110-113. JNSI, 11, p. 85
114 IMC, p. 213
115 BPWM, p. 62
116 BMGM, Vol. VII, No. 2, P. 21
117 BMC, p. XCIII
118 JNSI, XIII, pp. 36-39
119 Ibid, XVI, p. 70
120 Ibid, pp. 88-9
121 Ibid, VII, p. 3
122 Ibid, XIV, p. 32
123 CSCE, P. 2
124 Ibid, p. 79
125 JNSI, XIII, pp. 132-33
126 Ibid, XX, NNM, p. 7
127 CGPL, pp. 174-75
128 EI. XXXV, p. 249
129 SI, pp. 185, 183
130 CGPL, p. 175
131 SI, p. 191
132 BMC, p. 1
133 JNSI, XII, pp. 94-95
134 Ibid, XVI, pp. 70, 81
135 APMC, p. 39
136 Ibid
137 Ibid, pp. 39
138 EK, pp. 29, 134-35
139 JNSI, IV, pp. 25-27
140 CSCE, p. 29
141 JNSI, XVI, p. 95
142 Ibid, XIII, p. 35
143 CSCE, p. 29
144 BMGM, Vol. VII, No. 2., p. 16
145 JNSI, XIII, pp. 132-33
146 ASIAR, 1924-25, pp. 159-61
147 JNSI, XIII, p. 138
148 ASWI, V, p. 79

(మిగతా 76వ పేజీలో)

కలగూరగంప

జీవితానంద తత్వవేత్త హెర్‌బర్ట్ మార్‌కూస్

జర్మన్ తత్వవేత్త హెర్‌బర్ట్ మార్‌కూస్ తన 81వయేట 1979 జూలై 29వ తేదీన మరణించాడు. ఆయన సిద్ధాంతాలూ, ఆశలూ తప్పని చారిత్రక పరిణామాలు రుజువు చేశాయని, విద్యార్థుల విప్లవం విఫలమయిన తర్వాత పది సంవత్సరాలకు, ఆయన 80వ జన్మదినోత్సవానికి ముందు ఆయనను నిందించారు. కాని అవి తప్పని, రుజువు కానేకాలేదని ఆయన అన్నాడు. వాస్తవ ప్రపంచంలో సిద్ధాంతాలకూ ఆచరణకూ సమన్వయం ఎప్పుడూ కుదరదని ఆయనకు తెలుసు. ఒక సిద్ధాంతం తాలూకు వ్యతిరేక ఫలితాలు ఒక మంచి సిద్ధాంతం తప్పు అని రుజువు చేయడానికి ఉపయోగపడజాలవు., అనగా ఒుూ సందర్భంలో ఆయన హెగిలియన్ కోవ తార్కికుడు.

ఈ శతాబ్దంలో నయినా ప్రజలు స్వేచ్ఛగా, సుఖంగా తమ అవసరాల కనుగుణంగా జీవించగలగడానికి వీలుగా సాంకేతికాభ్యున్నతి సంఘాన్ని మార్చివేయగలదని మార్‌కూస్ గట్టి నమ్మకం. ఆయన మటుకు ఆయన జీవితాన్ని పూర్తిగా అనుభవించి, సుఖపడినాడు. ఈ శతాబ్దంలోని గొప్ప తత్వవేత్తలందరిలో ఆయన ఒక్కడే జీవితానంద తత్వవేత్త.

నమ్మేటంత చక్కగా తన ఆశావాదాన్ని స్నేహితులకూ, శిష్యులకూ వివరించటంలో మార్‌కూస్ నిష్ణాతుడు. 1910 తర్వాతి సంవత్సరాల నుంచి 1950 వరకూ క్లిష్టమయిన సాంఘిక సిద్ధాంతాలను అధ్యయనం చేసిన అధ్యాపకుడుగా ఆయన ప్రాముఖ్యం అంచనాకు అందనంత గొప్పది. నిరోధించడానికి సాధ్యం కానట్టి ఆకర్షణ ఆయనలో వున్నది. అందమయిన తల, ప్రకాశవంతమయిన నేత్రాలు, మితంగానే అయినా అపరిమితంగా ఆకర్షించే హావ భావ ప్రకటనలూ, ఖంగుమనే కంఠస్వరమూ, ఆయన యాసప్రేక్షకులను ముగ్ధులను చేసేవి.

జననం, బాల్యం

హెర్‌బర్ట్ మార్‌కూస్ 1898 జూలై 19వ తేదీన బెర్లిన్‌లో భాగ్యవంతులయిన తల్లిదండ్రులకు జన్మించాడు. మొదటి ప్రపంచ యుద్ధం ఆఖరులో సైన్యం నుంచి విడుదలయిన తర్వాత క్రియాశీల రాజకీయాలలో కొంతకాలం ఆయన పాల్గొన్నాడు. బెర్లిన్ నగరంలోని సోల్‌డ్యర్స్ కౌన్సిల్‌లో ఆయన సభ్యుడుగా ఉండేవాడు. అంతకు రెండు సంవత్సరాలకు ముందు తను చేరిన సోషల్ డెమోక్రటిక్ పార్టీకి 1919లో రాజీనామా ఇచ్చాడు. కార్మిక వర్గానికి ఆ పార్టీ ఆ దశలో ప్రాతినిధ్యం వహించడంలేదని ఆయన అభిప్రాయపడినాడు.

జర్మన్ విప్లవం విఫలమయిన తర్వాత రాజకీయాల నుంచి ఆయన పూర్తిగా వైదొలగి బెర్లిన్, ఫ్రీబర్గ్‌లలో తత్వశాస్త్రం అధ్యయనం చేశాడు. మార్టిన్ హెయిడెగ్గర్ ఆయన ఉపాధ్యాయులలో ముఖ్యుడు. మార్‌కూస్ వ్రాసిన మొదటి పెద్ద గ్రంథం హెగెల్ సత్యతత్వ విచారం గురించి. 1932లో ప్రచురితమయిన ఆ గ్రంథంపై హెయిడెగ్గర్ ప్రభావం స్పష్టంగా వున్నది. జర్మనీలో సంభవించిన రాజకీయ పరిణామం అర్థం యేమిటంటే— మార్‌కూస్, హెయిడెగ్గర్‌ల మధ్య అనివార్యమయిన చీలిక. హెయిడెగ్గర్ మరణించే వరకూ మార్‌కూస్ ఆయనకు కృతజ్ఞత చెప్పలేదు. ఫ్రీబర్గ్‌లో హెయిడెగ్గర్ వద్ద విద్యాశిక్షణ పొందిన విద్యార్థులెవరూ ఆయన సిద్ధాంతాలలోని ఫాసిస్టు ధోరణిని 1932 వరకూ గ్రహించలేదని ఒక ఇంటర్‌వ్యూలో మార్‌కూస్ చెప్పాడు. ఒక పాఠ్యగ్రంథంలోని పదాలను [నమ్మకుండా] పట్టుకు వ్రేలాడకుండా, వాటి వెనుక దాగి వుండే అర్థాన్ని ఎలా గ్రహించాలో మార్‌కూస్‌కూ, ఆయన తరం వారికి హెయిడెగ్గర్ నేర్పాడు.

ప్రవాసం

ఫ్రాంక్‌ఫర్ట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ రిసెర్చ్‌లో 1933 నాటికే మార్‌కూస్ సభ్యుడు. పాల్ టిలిచ్, కారల్ మాన్‌హీమ్, హ్యూగో సెంజైమర్‌లతోపాటు అధికారికంగా ఆ సంవత్సరం ఏప్రిల్‌లో ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బహిష్కృతులయిన వారిలో మార్‌కూస్ మొదటి వ్యక్తి.

మార్‌కూస్ తొలుత జెనీవాకు వలస వెళ్ళాడు. ఒక సంవత్సరం తర్వాత న్యూయార్క్‌కు వెళ్ళాడు. అక్కడి కొలంబియా యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్‌లో ఆయన సభ్యుడయినాడు. 1942 నుంచి 50 వరకూ వాషింగ్టన్‌లో విదేశవ్యవహారాల శాఖాధిపతిగా పనిచేశాడు. ఆ తర్వాత కొలంబియా యూనివర్సిటీ రష్యన్ ఇన్‌స్టిట్యూట్‌లోనూ, హార్వర్డ్‌లోనూ ఆయన అధ్యాపకుడుగా పని చేశాడు.

బోస్టన్‌లోని బ్రాండీస్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా అప్పుడు ఆయన నియమితుడయినాడు. సాండీగో కాలిఫోర్నియాలో తత్వశాస్త్రం ప్రొఫెసర్‌గా 1965లో ఆయన నియమితుడయినాడు.

ఆ తర్వాతనే కీర్తికాంత మార్‌కూస్‌ను వరించింది. ఆయన వ్రాసిన రెండు గ్రంథాలు—"ది వన్ డైమన్షనల్ మాన్" "ఇరాస్ అండ్ సివిలిజేషన్—చాలా ముఖ్యమయినవి 1960 తర్వాతి సంవత్సరాలలో అమెరికా సామ్రాజ్యవాదానికి విరుద్ధంగా ప్రపంచ వ్యాప్తంగా ఆక్షేపణ ప్రకటించాలని పిలుపు ఇచ్చిన కొత్తవామపక్షం గ్రంథాలలో ఆ రెండూ ప్రమాణగ్రంథాలయినవి కూడా.

ఎంత అవినీతికర దశలో సంఘం ఉన్నదో విశ్లేషించి నప్పటికీ దాన్ని అధిగమించడానికి ఉపయోగపడే సూచన యేమీ చేయజాలక పోయిన అడోర్నో, హొయిర్‌కీమర్‌ల నిరాశావాదంలో మార్కూస్‌కు నమ్మకం లేదు.

ఎక్కడో అమలు జరుగుతున్న సోవియెట్ కమ్యూనిజమ్ లేదా సోషలిజమ్ ముక్తిని ప్రసాదిస్తుందని మార్కూస్ అభిప్రాయ పడడం లేదు. ఈనాటి పారిశ్రామిక కార్మికుడు ప్రపంచ విప్లవాన్ని తీసుకురాగలడని అయినా మార్కూస్ భావించలేదు.

సాంకేతిక నైపుణ్యం ప్రాముఖ్యత

మార్కూస్ వ్రాసిన ప్రధాన గ్రంథం ''వన్ డైమన్షనల్ మాన్'' పరస్పర విరుద్ధాంశాల మయమయిన పెట్టుబడిదారీ విధానంలో, కొత్త సాంకేతిక విధానాలను రూపొందించడం ద్వారా సంక్షోభాలను ఇంకా సమర్థంగా ఎదుర్కొని వ్యవస్థను స్థిరీకరించి పెద్ద ప్రమాదాలను నిరోధించడం సాధ్యపడినదని ఆ గ్రంథంలో ఆయన వివరించారు.

ఉత్పత్తి ప్రక్రియలో నిమగ్నులయిన వారిచేత లక్ష్యానికి అనుగుణంగా పని చేయించటం, వారందరూ కలసి వచ్చేట్టు చూడటం పైన వివరించిన లక్ష్యాన్ని సాధించడానికి చెల్లించిన మూల్యం. ఈ ప్రక్రియకు వారు దాసులవుతారు. మానవహోదాకు తగ్గట్టు మరొక రకంగా జీవించడం సాధ్యమేనన్న విషయాన్ని వారు తుదకు మరచిపోతారు.

చాలీ చాలని ఆర్జనలతో బ్రతికేవారే స్వేచ్ఛను సంపాదించ గలరని మార్కూస్ తుదివరకూ నమ్మారు. (మూడవ ప్రపంచం) అభివృద్ధి చెందుతున్న దేశాలలోని దుర్బలవర్గాలవారూ, మేధావులూ, పీడితులూ మాత్రమే వ్యవస్థను బదాబదలు చేయడానికి (తెగించి) యత్నించగలరని ఆయన నమ్మకం. ఈ వర్గాలవారికి—తిరస్కారం, నిరాకరణ నినాదాలు ఇచ్చాడాయన. ఈ నినాదాలను తొలుత చేపట్టిన వారు విద్యార్థులూ, హిప్పీలూ. చాలా బాగా పనిచేసినయి ఆ నినాదాలు. ఉత్పత్తు లన్నింటినీ సొంత అవసరాలకే వాడుకోవాలని తహతహ లాడే సంపన్నుల సంఘం, ఆ విధానాన్ని కొందరు కోసివేసి మరొక రకం జీవితాన్ని ఎంచుకునేట్టు చేయగలిగినది.

కొత్త సాంకేతిక పద్ధతుల నిర్మాణాత్మక శక్తిపట్ల మార్కూస్‌కు అపరిమిత విశ్వాసం. ఈ విషయంలో అభ్యుదయంలో నమ్మకం వున్న కల్తీలేని సిసలయిన మార్క్సిస్ట్ ఆయన. తమను తాము మరచిపోయి, మరొకరితో తాదాత్మ్యం చెందవలసిన దుస్థితి లేకుండా తమ నిజావసరాల కనుగుణంగా — ఇంకా ఎక్కువమంది జీవించడానికి వీలుగా మన జీవితాన్ని మనం గుర్తించే అవకాశాన్ని సైన్సు, టెక్నాలజీ ఇస్తున్నాయని ఆయన అభిప్రాయం.

మార్క్సిస్టులలో చాలామంది వలే కాకుండా – సాంఘిక పరిణామాలను గురించి మాత్రమే కాకుండా వ్యక్తి సుఖం గురించి కూడా మార్కూస్ శ్రద్ధ వహించాడు. దౌర్జన్యాన్ని ప్రోత్సహించే భాగాలు కొన్ని ఆయన వ్రాసిన గ్రంథంలో వున్నా, లక్షలాది ప్రజలకు అంతులేని కష్టనష్టాలను కలుగజేసే విప్లవం పర్యవసానాలను గురించి హెచ్చరికలు చేసిన భాగాలు కూడా అందులో వున్నాయి.

సంఘానికి మాత్రమే కాకుండా వ్యక్తికి కూడా విముక్తి కలిగించవలసిన ఆవశ్యకతను గ్రహించగలగడం మార్కూస్ సాధించిన ఘన విజయమనేది నిర్వివాదాంశం.

ఆయన ఇలా గ్రహించగలగడానికి మూడు ప్రభావాలు కారణాలని చెప్పవచ్చు. మొదటిది. హెయిడెగ్గర్ ప్రతిపాదించిన (ఎగ్జిస్టెన్షియల్ ఫిలాసఫీ) ఉనికి తత్వవాదం. ఈ తాత్వికత బీజాలు కీర్క్‌గార్డ్ సిద్ధాంతంలో వున్నాయి. ఈ ప్రపంచంలో మానవుని ఉనికి ఎంత అసమర్థనీయమో యీ సిద్ధాంతం వివరిస్తుంది. మార్క్స్ తొలిదశలో వ్యక్తిగా మానవుణ్ణి గురించి శ్రద్ధ వహించాడే గాని ఆర్థిక జీవిని కేంద్రంగా భావించి వుండలేదు. ఆ దశలోని మార్క్స్ ప్రభావం మార్కూస్ ఆలోచనలను దిద్ది తీర్చిన రెండవ అంశం — సిగ్మండ్ ఫ్రాయిడ్ మూడవ ప్రభావం.

హెర్బర్ట్ మార్కూస్, ఎరిక్ ఫ్రాన్‌లు ఆచరణలో చూపించినట్టు మనస్తత్వ విశ్లేషణా (సైకో అనాలిసిస్) పద్ధతిని మార్క్సిస్ట్ ఆలోచనలతో కలపడం తాత్విక రంగంలో సాహసమే. 1910 తర్వాత సంవత్సరాలలో అలాంటి పద్ధతి సాధ్యమని వూహించడ మయినా కష్టమే. రాబోయే కాలంలో చాలా పర్యవసానాలకు దోవ తీసేట్టు ఫ్రాయిడ్ సిద్ధాంతాలకు పునర్ వ్యాఖ్యానం చేసినందుకు హెర్బర్ట్ మార్కూస్‌కు మనం కృతజ్ఞత చెప్పాలి.

విధ్వంసం కోసం మనం జీవించడంలేదని ఫ్రాయిడ్ చెప్పాడని మార్కూస్ వాదన. మరణం లక్ష్యం విధ్వంసం ఒక్కటే కాదు – విధ్వంసం ఆవశ్యకతను అధిగమించడం. క్లుప్తంగా చెప్పాలంటే మృత్యు వాంఛ లక్ష్యం జీవితానికి పరి సమాప్తం కాదు - బాధలు పూర్తి కావడం. ఈ విధంగా తుదివరకూ మార్కూస్ ఆశావాది.

[''జర్మన్ ట్రిబ్యూన్''కు కృతజ్ఞతతో]

శ్రీ వి. ఎస్. అవధాని

హిందీ నవలా రచయిత్రులు

భారతీయ సాహిత్యాలలోనే కాక విశ్వసాహిత్యాలలో కూడా రచయిత్రులు ఒక మహత్తర స్థానము పొందగలిగా రనుటలో అతిశయోక్తి ఏమాత్రంలేదు.

కథానికా నవలా సాహిత్య నిర్మాణములో ఆరంభంనుంచీ ఇప్పటివరకు మహిళలు తమ అనేక రచనలద్వారా అసమాన ప్రతిభయే గాక, రచనా కౌశలాన్ని కూడా నిరూపించుకొన్నారు. అయినప్పటికి రచయిత్రుల రచనా ప్రాభవం యెడల పురుషులకు గల నిర్లక్ష్యభావన వలన వారు రచించిన సాహిత్యం చాలాకాలంవరకు

ఉపేక్షా దృష్టిలో చూడబడింది. వారి ప్రతిభకు తగినంత ప్రోత్సాహం లభించలేదు. ఇందువలననే మహిళలద్వారా వ్రాయబడిన సాహిత్యం నిర్లక్ష్యం చేయబడి లుప్తప్రాయం అయిపోయింది. ఇటువంటి కథానికా నవలా సాహిత్యాన్ని గురించి ఇప్పటివరకు వెలువడిన పరిశోధనా గ్రంథాలు, వారి రచనా స్వరూపాన్ని నిరూపించే రచనలు చాలా అరుదుగా కన్పిస్తాయి. ఈవిధంగా మరుగున పడియున్న హిందీ మహిళల కథాసాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చినవారిలో డా॥ ఊర్మిళాగుప్త, డా॥ ప్రేమలత, డా॥ ఉమేష్ మాథుర్‌ల పేర్లు పేర్కొనదగినవి. డా॥ ఊర్మిళాగుప్తగారు 'హిందీ కథాసాహిత్యకే వికాస్ మే మహిళావోంకా యోగ్‌దాన్', 'హిందీ స్వాంతత్ర్యోత్తర కథాలేఖికాయేం' అను రెండు పుస్తకాలను రచించారు. వీటిలో మొదటి పుస్తకములో స్వాతంత్ర్యానికి పూర్వం మహిళల ద్వారా రచింపబడిన కథా సాహిత్యాన్ని గురించి, రెండవ పుస్తకములో స్వాతంత్ర్యానంతరం మహిళలు సృష్టించిన కథాసాహిత్యాన్ని గురించి, పరిశోధనలు జరిపారు. డా॥ ప్రేమలతగారు 'హిందీ గద్యసాహిత్యకే వికాస్‌మే మహిళావోంకా యోగ్' అను తమ పరిశోధనా గ్రంథములో మహిళల గద్య రచనల గురించిన పరిశోధనల వివరాలను వెలుగులోకి తెచ్చారు. డా॥ ఉమేష్‌మాథుర్ ద్వారా రచింపబడిన 'ఆధునిక్ యుగ్‌కీ హిందీ లేఖికాయేం' అను పరిశోధనా గ్రంథములో స్వాతంత్ర్యానంతర హిందీ కవయిత్రులను గురించి, కథానికా రచయిత్రులను గురించిన అనేక విషయాలు పొందుపరచబడ్డాయి.

నిజానికి ఎన్నో సాంఘిక కారణములచే మహిళలద్వారా రచింపబడిన కథానికా నవలా సాహిత్యాలు ఆధునిక హిందీ సాహిత్యంలో తమ మహత్తర స్థానాన్ని సంపాదించుకొన్నాయి. కుటుంబ నిర్వహణ విషయంలో, ప్రణయ వాత్సల్య సన్నివేశ చిత్రణలో స్త్రీజీవిత సమస్యల సూక్ష్మ పరిశీలనలో రచయిత్రులు పొందిన సాఫల్యం రచయితకు దుర్లభం అనే చెప్పవచ్చు.

రచయిత్రులు కావ్యాలు వ్రాయడంలోనే ఎక్కువ సాఫల్యం పొందారన్న ఆరోపణ లోపభూయిష్టమైనదే. పురుషులతో పోల్చి చూస్తే స్త్రీలు వారికంటే సంవేదనాశీలురు, మరియు కోమల స్వభావులు అని ఖచ్చితముగా చెప్పవచ్చును. కాని కథానికా నవలా సాహిత్య నిర్మాణంలో కూడా స్త్రీలు గణనీయమైన ప్రగతిని సాధించారని వక్కాణించవచ్చు. స్త్రీలకు తగినంత విద్యాభ్యాసం లేకపోవడం, కుటుంబ బాధ్యతలు, సమాజంలోను, కుటుంబంలోను తనపైనున్న కట్టుబాట్లు, స్త్రీ సహజమైన సంకోచ స్వభావము, తన ప్రతిభకు తగిన ప్రోత్సాహం మరియు ఆర్థిక స్వాతంత్ర్యము లేకపోవడం, తన మాతృత్వము, మొదలగు కారణములవలన గత రెండు దశాబ్దాలవరకు సాహిత్య సేవలో పురుషునికంటే స్త్రీ వెనుకబడియున్నదని స్పష్టమవుతోంది.

హిందీ సాహిత్యంలో కేవలం పురుషులచే రచింపబడ్డ నవలా సాహిత్యానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. బంగమహిళ, ఉషాదేవిమిత్రా, మహాదేవివర్మ, సుభద్రాకుమారి చౌహాన్, హోమవతీదేవి మొదలగు కొందరు ప్రముఖ రచయిత్రులను గురించి సందర్భానుసారంగా ఉల్లేఖించడం జరిగిందేగాని ఈ రచయిత్రులకు సాహిత్యంలో సముచితస్థానం యివ్వబడలేదు. డా॥ ఊర్మిళాగుప్త, డా॥ ప్రేమలతగార్లు తమ పరిశోధనా గ్రంథాలలో వీరికి స్థానమిచ్చి వీరి సేవను గత దశాబ్దంలో వెలుగులోనికి తెచ్చారు.

హిందీలో తొలిసారిగ 'దులాయీవాలీ' అను కథానికను 'బంగమహిళ' (రచయిత్రి మారుపేరు) రచించింది. కథల్లాగే నవలా సాహిత్యం కూడా హిందీలో అనువాదాలతోనే ప్రారంభమైంది. హిందీలో నవలలను అనువదించిన రచయిత్రులలో 'సతీసాధ్వీ పతిప్రాణా అబలా' (రచయిత్రి మారుపేరు), 'గోపాలదేవి', సరోజాదేవిగార్ల పేర్లు పేర్కొనదగినవి. సతీసాధ్వీ పతిప్రాణా అబలా 'రాధారాని'(1883), గోపాలదేవిగారు 'లక్ష్మీబహు' (1912), 'దయావతి', సరోజాదేవిగారు 'వివాహ విప్లవం' (1923) అను నవలలను అనువదించి అనువాద నవలా సాహిత్య వికాసానికి దోహదం చేసారు.

హిందీలో ప్రప్రథమంగా సతీసాధ్వీ పతి ప్రాణా అబలగారు 'సుహాసిని' (1890) అను మౌలిక సాంఘిక నవలను ప్రచురించారు. ఇందులో సుహాసిని అను స్త్రీ పాత్ర ప్రధానమైంది. ఈనవల ఇతివృత్తాన్ని సంక్షేపంగా ఈవిధంగా చెప్పవచ్చును. సుహాసినికి తన పెళ్లి జరిగిన కొద్ది రోజులలోనే దారిద్ర్యాన్ని అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. సంపాదనకోసం తన భర్త దేవిప్రసాద్‌తో ఇంకో ఊరు పోవలసి వస్తుంది. సుహాసిని ఒక బ్రాహ్మణుని ఇంట వంట మనిషిగా కుదురుతుంది. కానీ కొద్ది రోజులలోనే, సుహాసిని ఆ యింటి యజమాని కుమారుని దుష్ప్రవర్తనవల్ల ఆ యింటి నుంచి పారిపోవలసిన పరిస్థితి సంభవిస్తుంది. తన భర్తకోసమై వెతుకుతున్న సుహాసినిపై ఒక బ్రాహ్మణుడు కనికరించి, మాతృస్వరూపిణి సుహాసినిని తన యింట ఉండవలసినదిగా కోరుతాడు. కొద్ది రోజులలోనే ఆ వృద్ధ బ్రాహ్మణుడు మరణించగా, అతడి ఆస్తికి వారసురాలౌతుంది తన భర్తను గాలించడానికి ఆమె చేసిన ప్రయత్నం నిఫలమౌతుంది. ఈవిధంగా 8 సం॥లు గడిచిన పిదప సుహాసిని కాశీయాత్రకు బయలుదేరి కాశీలో ఒక భిక్షగాడిరూపంలో తన భర్తను తిరిగి పొందుతుంది. ఈ విధంగా నవలను ఆకస్మికంగా సుఖాంతం చేయడం కనిపిస్తుంది.

20వ శతాబ్దం ప్రారంభంనుండి స్వాతంత్ర్య ప్రాప్తివరకు లభించిన కొన్ని ప్రముఖ నవలలను ఇచ్చుట ఉదహరిస్తాము.

రచయిత్రి పేరు	రచించిన నవల
శ్రీమతి ప్రియంవదాదేవి	1. లక్ష్మి (1905) (సాంఘిక నవల)
	2. కలియుగ్ పరివార్‌కా ఏక్‌దృశ్య (సాంఘిక నవల)
శ్రీమతి హేమలత కుమారి చౌధరీ	1. ఆదర్శమాత 2. జాగరణ } సాంఘిక నవలలు

రచయిత్రి పేరు	రచించిన నవల
శ్రీమతి యశోదాదేవి	1. వీరపత్ని (1909) చారిత్రాత్మక నవల
శ్రీమతి బ్రహ్మకుమారి భగవాన్‌దేవి దుబే	1. సౌందర్యకుమారి (1914) (సాంఘిక నవల)
శ్రీమతి రుక్మిణీదేవి	1. మేమ్ ఔర్ సాహబ్ (1919) (యజమానురాలు మరియు యజమానుడు) వ్యంగ్య ప్రధానమైన నవల
శ్రీమతి హుకుమ్‌దేవి గుప్త	1. గూఢభావ్ ప్రకాశ్ (1919) గూఢ భావ ప్రకాశము— సాంఘిక నవల
శ్రీమతి లీలావతీదేవి	1. సతీ దమయంతి 2. సతీ సావిత్రి } పౌరాణిక నవలలు
శ్రీమతి ఉషాదేవి మిత్రా	1. వచన్‌కా మోల్ (1936) (మాటయొక్క విలువ) 2. ప్రియా 3. జీవన్ కీ ముస్కాన్ (1939) (జీవితపు చిరునవ్వు) 4. పథచారీ (1940) (బాటసారి) (సాంఘిక నవలలు)
శ్రీమతి కంచన్‌లతా సబ్బర్‌వాల్	1. మూక్ ప్రశ్న్ (1944) (మూగప్రశ్న) 2. భోలీ భూల్ (మంచిమరుపు) 3. సంకల్ప్ (1946) (సంకల్పము) సాంఘిక నవలలు

సంక్షిప్తముగా ఈ నవలలను గురించి చెప్పాలంటే 'రాజకుమార్' ఒక జానపద ఇతివృత్తాన్ని తీసుకుని రచయిత్రి కల్పనాశక్తిద్వారా నిర్మించబడిన సాంఘిక నవల. 'సౌందర్య కుమారి' లో జూదగాడయిన తన తండ్రి యొక్క బాధ్యతారహిత ప్రవర్తన వలన సంసార భారాన్ని నిర్వహించడములో స్త్రీకి ఎదురయ్యే సమస్యల చిత్రీకరణ జరిగింది. 'లక్ష్మి', 'ఆదర్శమాత', 'గుఢభావ ప్రకాశ్', 'కలియుగే పరివార్‌కా ఏక్ దృశ్య' మొదలగు సాంఘిక నవలలలో స్త్రీకి సంబంధించిన వైవాహిక గృహస్థ జీవితాన్ని, వైధవ్య జీవితాన్ని గాక, స్త్రీ సహజమైన సవతిపోరును, గృహకలహాల వలన ఉత్పన్నమయ్యే సమస్యలను చిత్రీకరించడం జరిగింది. ఉషాదేవి మిత్రా, కంచన్‌లతా సబ్బర్‌వాల్, తమ నవలలలో స్త్రీని పరిస్థితుల సంఘర్షణల మధ్య చిత్రించి వాటి నెదుర్కొనే విధానంలో వారి మనస్తత్వాలను సూక్ష్మంగా చిత్రించారు. రచయిత్రులు పౌరాణిక, చారిత్రాత్మక నవలలను వ్రాసి వాటిని రచించడంలో కూడా వారు సిద్ధహస్తులమని నిరూపించుకున్నారు.

'వచన్ కా మోల్' నవలలో మాట విలువ దాని నిర్వహణలో పట్టుదల గురించిన రచయిత్రియొక్క ఆదర్శప్రాయమైన అభిప్రాయాలు తెలుస్తాయి. 'ఫియా' (ప్రియా) అనే పాత్ర ప్రధాన నవలలో హిందూజాతి విధవస్త్రీల సమస్యలు, జీవన్‌కీముస్కాన్'లో కరుణాజన్యమైన సామాజిక సమస్యలు, 'పథచారీ' నవలలో మన సంఘంలోని ఆర్థిక అసమానతలు, నిరుద్యోగ సమస్యలు చిత్రీకరించబడ్డాయి. 'మూక్ ప్రశ్న్' అనే నవలలో రచయిత్రి కంచన్‌లతా సబ్బర్‌వాల్, శారీరక బాహ్య సౌందర్యం కంటే, మానసిక సౌందర్యమే మిన్న అని సమర్థించారు. 'భోలీభూల్'(మంచి మరుపు)అనే నవలలో పాపమును త్యజించవలెనే కాని పాపిని కాదు అను గాంధీ సూక్తిని సమర్థిస్తూ యధార్థంలోనే ఆదర్శాన్ని వెతికేందుకు ప్రయత్నించడం జరిగింది. 'సంకల్ప్' (సంకల్పము) గాంధీవాద ప్రభావముతో వ్రాయబడిన మరొక సాంఘిక నవల.

ఈ విధంగా స్వాతంత్ర్యానికిపూర్వం వ్రాయబడిన నవలలలో సాంఘిక ఇతివృత్తాన్ని ప్రధానంగా చేసుకొని వ్రాయబడినవి ఎక్కువగా కన్పిస్తాయి. మతపరమైన, పౌరాణిక మరియు చారిత్రాత్మక ఇతివృత్తముగా గల నవలలు తక్కువ. రచయిత్రు లందరూ తమ ఉద్దేశ్యానికే ప్రాధాన్య మిచ్చారు. ఒక్కోసారి ఉపదేశాల్నివ్వడమే వీరి ఉద్దేశ్యము అనిపిస్తుంది కూడాను. వీరు తమ నవలలలో నైతికత, సత్ప్రవర్తనను గురించిన ఆదర్శాలనుచిత్రిస్తూ, ఆనాటి స్త్రీలపై పురుషులుచేసే అత్యాచారాల్ని అఘాయిత్యాల్ని ఎలుగెత్తి చాట ప్రయత్నించారు. స్త్రీపాత్రలపట్ల విశేషంగా ఆదరాభిమానాలను చూపించి సానుభూతి కల్గేట్లు ఆ పాత్రల్ని చిత్రీకరించారు. ఎక్కువ భాగం నవలల పేర్లు కూడా స్త్రీపాత్రలపైనే ఆధారపడియున్నవి కూడాను. ఈ విధంగా హిందీ నవలా రచయిత్రులు స్త్రీ జాగరణకు తోడ్పడటమే కాకుండా సాంఘిక దురాచారాల్ని తొలగించి సంఘ సంస్కారానికి ఎంతో తోడ్పడ్డారనవచ్చును.

స్వాతంత్ర్యానికిపూర్వం వ్రాసిన నవలల్లో శిల్పసంబంధమైన లోటుపాట్లు కనిపించినా ఆ నవలల చారిత్రాత్మిక గొప్పదనాన్ని త్రోసిపుచ్చలేము. ఎందుకంటే స్వాతంత్ర్యానంతరం ప్రవాహంవలె పెల్లుబికి వచ్చిన రచయిత్రులకు కొంతవరకు ప్రేరణ వాటి నుండి లభించినదే కదా!

ఇక స్వాతంత్ర్యానంతర నవలా రచయిత్రులను గూర్చి ఆలోచించి చూస్తే స్వాతంత్ర్యానంతరం(అంటే 1947 తర్వాత) రచయితలతో సమానంగా రచయిత్రులు కూడా ఆధునిక నవలాసాహిత్య వికాసానికి దోహదం చేశారనడంలో మాత్రం సందేహం లేదు.

ఈ రోజుల్లో పాశ్చాత్య దేశాల ప్రభావం కారణంగా మన దేశంలో కూడా స్త్రీలు భారతీయ ఆదర్శాల పేరుతో ఆరోపింపబడిన ఘోషా పద్ధతి మరియు పతిభక్తి అంటూ గుడ్డిగా భర్తల ననుసరించటమన్న వాటిలోని నిస్సారతను, నిజాన్ని గ్రహించి వాటిని

త్యజించి పురుషులతోపాటు సమాన అధికారాలను చాటటం మొదలు పెట్టారు. స్వతంత్రంగా ఆలోచించే స్వాతంత్ర్యాన్ని సంపాదించు కున్నారు. అందుకే మహిళలు ముందుకన్నా ఇప్పుడు కథానికా నవలా సాహిత్యాల్లో అధిక ఆసక్తిని చూపుతున్నారు.

స్వాతంత్ర్యానంతరం మనదేశ జీవనప్రమాణాలలో ఏవిధంగా మార్పులొచ్చి, క్రొత్త క్రొత్త సమస్యలు తలలెత్తాయో వాటిని రచయితలలాగే రచయిత్రులు కూడా ఆకళించుకొని నవలావికాసానికి క్రొత్త దిశలు అన్వేషించడంలో తోడ్పడ్డారు. వారి రచనా శైలి కూడా పరిష్కృమైంది.

స్వాతంత్ర్యానంతరం హిందీలో నవలా సాహిత్యాన్ని సమృద్ధం చేసిన వారిలో స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి రచనలు చేస్తున్న శ్రీమతి ఉషాదేవిమిత్రా మరియు కంచన్‌లతా సబ్బర్‌వాల్‌లు కాక శ్రీమతి రజనీ పనికర్, శ్రీమతి అమృతాప్రీతమ్, శ్రీమతి వసంత ప్రభా, శ్రీమతి కృష్ణాసోబతి, శ్రీమతి చంద్రకిరణ్ 'సౌన్‌రెక్సా', కుమారి అన్నపూర్ణ తాంగడీ, శ్రీమతి శివానీ, శ్రీమతి విమల్ వేద్, శ్రీమతి మన్నూ భండారి మొదలగు పేర్లు ముఖ్యంగా పేర్కొనదగ్గవి.

శ్రీమతి రజనీ పనికర్ రచించిన నవలలలో 'ఠోకర్' (ఎదురుదెబ్బ) 'పానీకీ దీవార్' (నీటిగోడ), మోమ్‌కేమోతీ (మైనపు ముత్యాలు), ప్యాసే బాదల్ (దప్పిగొన్న మేఘాలు), 'జాడేకీ ధూప్' (చలికాలపు ఎండ), 'కాలీ లడకీ' (నల్లపిల్ల), 'ఏక్ లడకీ దోరూప్' (ఒక అమ్మాయి రెండు రూపాలు) మొదలగునవి చెప్పుకోదగ్గవి. ఈవిడ నవలలన్నీ సాంఘిక నవలలే. ఇందులో స్త్రీకి సంబంధించిన సమస్యల చిత్రీకరణ యెక్కువగా జరిగింది. 'ఠోకర్' అనే నవలలో రచయిత్రి సంఘంలోని చదువుకొన్న మధ్య తరగతివాళ్ల స్వేచ్ఛా పూరితమైన జీవితాన్ని చిత్రించి జీవన యదార్థాలమీద ఆదర్శాల గెలుపుని సూచించారు. ఇదే విధంగా తమ ఇతర నవలలలో కూడా సంఘంలోని నిమ్న, మధ్య మరియు ఉచ్చ తరగతుల మధ్య జరిగే సంఘర్షణ మరియు వారి సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

శ్రీమతి వసంతప్రభగారు 'సాంఝ్ కే సాథీ' (సాయంత్రపు మిత్రులు) మరియు 'అధూరీ తస్వీర్' (సగం చిత్రం) అను సాంఘిక నవలలలో జీవితంలోని ఎత్తుపల్లాల్ని, సుఖ దుఃఖాల్ని, ఆశా నిరాశల్ని, మంచీ చెడుల్ని చిత్రిస్తూ కుటుంబ వాతావరణాన్ని నిశితంగా పరిశీలించారు.

సుశ్రీలీలా అవస్థిగారు 'దోరాహా' (రెండు దారులు), 'బిఖరే కాంటే' (తుళ్లిన ముళ్లు), మరియు 'బదరవా బరసన్ ఆయే' (మేఘాలు కురవ వచ్చాయి) అను మూడు సాంఘిక నవలలలో వ్యక్తికి సమాజానికి మధ్య జరిగే సంఘర్షణను చిత్రించారు. శ్రీమతి చంద్రకిరణ్ 'సౌన్ రెక్సా' తన సాంఘిక నవల 'చందన్ చాందనీ' (చందనము వంటి వెన్నెల)లో నిమ్న-మధ్యతరగతుల వారి సమస్యలను చిత్రించారు. కుమారి అన్నపూర్ణ తాంగడీగారు 'నిర్ధనతాకా అభిశాప్' (నిర్ధనత యొక్క శాపము), 'చితాకీ ధూల్' (చితి – బూడిద) 'మిలనాహూతి', 'విజయినీ' అను నాలుగు నవలలను రచించారు. 'నిర్ధనతాకా అభిశాప్'లో నిర్ధనత వలన ఎదురయ్యే సమస్యలను చిత్రించి దుఃఖాంతం చేసారు. 'చితాకీ ధూల్' లో కులమత భేదాల కారణంగా విఫలమైన ప్రేమగాథ చెప్పబడింది. 'మిలనాహూతి' హిందూ, ముస్లిములమధ్య ఐక్యతాభావం ఏర్పరచే ఉద్దేశ్యంతో వ్రాయబడిన నవల. 'విజయినీ' ఒక పాత్ర ప్రధాన శైలిలో వ్రాయబడిన సాంఘిక నవల.

శ్రీమతి విమలాదేవిగారి రచనలలో 'జ్యోతికిరణ్', 'అర్చనా' మరియు 'అసలీ హీరా – నకలీ హీరా' అనునవి పేర్కొనదగ్గ నవలలు. ఈవిడ తమ నవలలలో సమ సామయిక సాంఘిక సమస్యలను చిత్రించడమే గాక వీటితో కుటుంబ సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను కూడా చిత్రించారు. నిమ్న మరియు ధనిక తరగతుల కథానాయకా నాయికలమధ్య ప్రేమ సాఫల్యాన్ని చిత్రించి రెండు వర్గాలమధ్య పొందుకూర్చడం ఈవిడ నవలల ధ్యేయం.

శ్రీమతి కృష్ణాసోబతీ గారి రచనలలో 'సూరజ్ ముఖీ అంధేరేకే' అను నవల 'యారో కె యార్' మరియు 'తిన్‌పహాడ్' అను నవలికలు పేర్కొనదగ్గవి. ఈవిడ ఆకలి, నిద్ర మొదలగు శరీరధర్మముల లాగే కామేచ్ఛను కూడా ఒక శారీరక ధర్మంగా భావించి, 'సెక్స్'కు సంబంధించిన విషయములను నిస్సంకోచంగా తమ నవలలలో చిత్రించారు. ఈవిడ 'దార్ సే బిఛుడీ' (కొమ్మ నుండి వేరై) అనే నవలను పంజాబీ జానపద కథనాధారంగా చేసుకొని మాండలిక శైలిలో సృష్టించారు శ్రీమతి భారతీ విద్యార్థి ద్వారా రచింపబడిన 'పాంచ్ బేంత్' (ఐదు పేము బెత్తాలు) అను నవల కూడా మాండలిక శైలిలో వ్రాయబడినదే. శ్రీమతి భారతీ విద్యార్థిగారు 'హార్ యా జీత్' (ఓటమా–గెలుపా) అను సాంఘిక నవలను కూడా వ్రాసారు. మాండలిక తత్వాలను జేర్చి వ్రాయు వారిలో శ్రీమతి 'శివానీ' పేరు కూడా పేర్కొనవచ్చును. ఈవిడ రచించిన 'మాయాపురి' లో మాండలికతను మనం చూడగలం. శివానీగారి ఇతర రచనలలో 'కృష్ణకలీ', 'శ్మశాన్ చంపా' మరియు 'విషకన్యా' పేర్కొనదగ్గ నవలలు.

దేశకాల పరిస్థితుల వర్ణనలలో భాషలో మాండలిక ప్రయోగాల్ని చేసే ప్రవృత్తి స్వాతంత్ర్యానంతర నవలలలో కన్పించే నవీనత అనే చెప్పాలి.

శ్రీమతి మన్నూ భండారిగారి నవలలలో పాత్రల మనోవిజ్ఞాన వికాసాన్ని మనం చూడవచ్చు. ఈవిడ రచించిన 'ఆప్ కా బంటీ' (మీ బంటి; బంటి=పేరు) అను నవల దీనికి ప్రత్యక్ష ఉదాహరణం. ఈవిడ తన భర్త రాజేంద్రయాదవ్ గారితో కలిసి 'ఏక్ ఇంచ్ ముస్కాన్' (ఒక ఇంచి చిరునవ్వు) అను నవలను కూడా రచించారు.

పైన చెప్పబడిన రచయిత్రులే కాక ఇంకా ఎందరో రచయిత్రులు హిందీలో నవలా రచనలు చేస్తున్నారు. కాని వారందరి పేర్లను కాని వారు రచించిన నవల లన్నింటిని కాని ఇక్కడ పేర్కొ

నడం కష్టం. కావున కొందరు ప్రముఖ రచయిత్రుల పేర్లను వారి ద్వారా రచింపబడిన నవలలను మాత్రమే ఇక్కడ ఉదహరిస్తున్నాను.

స్వాతంత్ర్యానంతర నవలలు

రచయిత్రి పేరు	నవల పేరు
కుంవరానీ తారాదేవి	1. జీవన్‌దాన్ (జీవనదానం)
శ్రీమతి లావణ్య ప్రభారావ్	1. రజనీ గంథా
సుశ్రీ సత్యవతీదేవిభెయ్యా 'ఉషా'	1. మృదుల
	2. క్షితిజ్ కే ఉస్‌పార్
శ్రీమతి సరితారానీ	1. నీలా
శ్రీమతి భారతీ విద్యార్థి	1. హార్ యాజీల్ (ఓటమి–గెలుపు)
	2. పాంచ్ బేంత్ (ఐదు పేము బెత్తాలు)
శ్రీమతి సుష్మాభాటి	1. గేట్ కీపర్
	2. మమత
శ్రీమతి దర్శన	1. చాయ్‌కా పానీ (టీ నీళ్ళు)
శ్రీమతి సుదేష్‌రశ్మి	1. ఏక్ హీ రాస్తా (ఒకే దారి)
శ్రీమతి సంతోష్ సచ్‌దేవా	1. రుప్ ఔర్ ఛాయ (రూపము మరియు నీడ)
శ్రీమతి షివరానీ విష్ణోయ్	1. భీగీ పలకేం (తడిసినకనురెప్పలు)
శ్రీమతి షీలా రఘువంశీ	1. అభాగా (అభాగ్యుడు)
సుశ్రీ ఉమాదేవి	1. ఆలింగన్
కుమారి కమలేష్ సక్సేనా	1. షాప్ ఔర్ వరదాన్ (శాపం, వరదానం)
సుశ్రీ ఆదర్శ కుమారీఆనంద్	1. ప్రేమ్ ఔర్ బలిదాన్ (ప్రేమ, త్యాగం)
	2. గరీబ్ ఘర్ అమీర్ ఇరాద్ (పేద ఇల్లు ధనిక కోర్కెలు)
శ్రీమతి సుమిత్రా గఢహోక్	1. పూనమ్ కా చాంద్ (పూర్ణిమ చంద్రుడు)
శ్రీమతి సంతోష్‌బాలా 'ప్రేమి'	1. స్నేహ్ ఔర్ స్వప్న (స్నేహం, స్వప్నం)
శ్రీమతి ప్రకాశవతి	1. చార్ పరతేం (నాలుగు తెరలు)
శ్రీమతి కృష్ణా రవికనుల్	1. భటకతే (దారితప్పిన యాత్రికుడు)
సుశ్రీ ప్రియా రాజన్	1. నందా
సుశ్రీ మహేంద్ర్‌బావా	1. ఉలజే ప్రశ్న : అధూర్ ఉత్తర్ (చిక్కు ప్రశ్నలు: సగం జవాబులు)

స్వాతంత్ర్యానంతరం వెలువడిన ఈ నవలలలో రచయిత్రులు కుటుంబాన్ని కేంద్రం చేసుకొని ప్రేమ పరమయినటువంటి కథా వస్తువును సృష్టించారు. వీరు సమాజంలో ప్రబలియున్న సంకుచిత తత్వం, వర్గభేదం కులమత భేదాలు మొదలగు సమస్యల మధ్య సతమతమవుతున్న స్త్రీ పురుషులను సృష్టించారు. ఈ నవలలలో వ్యక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడినది. కాని ఎక్కువ భాగం స్త్రీ జీవితానికి సంబంధించిన విషయాలపై దృష్టి కేంద్రీకరించబడింది. సత్యవతీ ఉషాగారు 'క్షితిజ్ కే పార్' అను నవలలో హిందూ సమాజంలో విధవల దుర్దశను చిత్రీకరించారు. సుషమా భాటే గారు 'గేట్‌కీపర్'లో మరియు మధూలికాగారు 'ప్రాణోంకీ ప్యాస్' (దప్పికగొన్న ప్రాణాలు) అను నవలలలో వేశ్యాజీవితపు కరుణా జనకమయిన చిత్రణ చేసారు. మీరా మహదేవన్ మధ్యతరగతి ప్రజల కుటుంబాలలో కట్నాల కారణంగా కాని లేక తలిదండ్రుల బాధ్యతా రహిత ప్రవర్తనవల్లగానీ, అవివాహితలుగా మిగిలిపోయే స్త్రీల స్థితిని, ఉద్యోగమార్గంలో స్త్రీలు ఎదుర్కొనే విభిన్న సమస్యలను నిశితంగా పరిశీలించారు. కువరానీ తారాదేవిగారు 'జీవన్‌దాన్' నవలలో ఒక ప్రేమకథను ఆధారంగా చేసుకొని అందులో భారతీయ సామాజిక, రాజనీతి మరియు ఆర్థిక పరిస్థితులను వర్ణిస్తూ మార్క్స్ సిద్ధాంతాలను ప్రతిపాదించారు. చారిత్రాత్మక ఆధారాలను పురస్కరించుకొని నవలా రచనలు చేసిన వారిలో సుదేష్‌రష్మి, మరియు ఉమాదేవిల పేర్లు పేర్కొనవచ్చును.

ఈ యుగపు నవలల్లో పాత్రల ఆత్మ విశ్లేషణ, వారి చేతనా ప్రవాహంయొక్క చిత్రణ విశేషంగా చెప్పుకోవచ్చును.

చారిత్రాత్మక మరియు రాజనీతి పరమయిన నవలా రచనలలోనే కాక మాండలీక నవలా రచనలలో కూడా హిందీ రచయిత్రులు ముందంజ వేయుచున్నారనుటలో సందేహంలేదు.

డా॥ కె. లీలావతి

కుబేరుని వాహనము హయమా ? నరుడా ?

ఈ విషయమై ఆంధ్ర దినపత్రికలో లేఖారూపమున నొకరిద్దరు చర్చించియున్నారు. అద్దానిని చూచి కొంత వివరము జోడించి నాకు తోచిన అభిప్రాయమును వెల్లడించుచున్నాను.

కుబేరుడు హయవాహనుడని చాలా ప్రసిద్ధి. కాని కవిరాజ శిఖామణియగు నన్నెచోడుని కుమార సంభవములోని

తన యెక్కిన మానిసి దా
ననయము నెక్కంగ మరచి యాతని దన మూ
పున నిడుకొని పఱచె భయం
బున ధనపతి తన్ను బిఱుద భూతములార్వన్

అను పద్యము వలన కుబేరుడు నరవాహనుడని తెలియుచున్నది.

దక్షాధ్వరధ్వంస సమయమున విజృంభించిన ప్రథమ గణము బారినుండి తప్పించుకొని పరుగిడు బ్రహ్మ, విష్ణు, మహేంద్ర, యమ, వరుణాదుల చేష్టలను, వారు పడిన బాధను కవి వర్ణించునట్టి ఘట్టములోనిదీ పద్యము. ఈ పద్యమును దృష్టిలో నుంచుకొనియే కుబేరుడు హయవాహనుడా? నరవాహనుడా? అను మీమాంస ప్రారంభమైనది.

నరవాహనుడన్న విషయమున కుపబలకముగా అమరసింహుడు రచించిన ఈ క్రింది శ్లోకములు కనుపట్టుచున్నవి.

కుబేరస్త్ర్యమ్బక సఖో యక్షరాడ్గుహ్యకేశ్వరః
మనుష్య ధర్మా ధనదో రాజరాజో ధనాధిపః
కిన్నరేశో వైశ్రవణః పౌలస్త్య నరవాహనః
యక్షైక పిఙ్గ ఐలబిల శ్రీదపుణ్య జనేశ్వరాః[2]

దీని ననుసరించియే కాబోలు మునునూరు వెంకటశాస్త్రి కుబేరుడు నరవాహనుడనే వ్రాసారు.[3]

''కుబేరం మనుజాసీనం సర్వగంధర్వసేవితం
స్వర్ణచ్ఛాయం గదాహస్తం ముత్తరాశాపతిం స్మరేత్''

అని కూడా ఒక శ్లోకము కుబేర ధ్యాన విషయకమైనది సోమవార వ్రతోద్యాపనమున కలదు.[4]

''మహేంద్రాగ్ని యమ నైరుతి వరుణ వాయు కుబేరే శానాభిధాన ప్రసిద్ధాః—పీతపిశంగ కృష్ణధూమ్రశ్వేతపీత తుహిన స్ఫటిక సన్నిభకాంతి సంపన్నాః—వజ్రశక్తి దండఖడ్గ పాశాంకుశ గదా త్రిశూలాది దివ్యాయుధ ధరాః— ద్విజమేష మహిష ప్రేత నక్ర కురంగ నర వృషభాది దివ్యవాహనారూఢాః ...... ప్రాగాది కలశేషు ఆగత్య సన్నిధానం కృత్వా ప్రసాదః క్రియంతాం'' అని ఆయా దిక్పాలుర నావాహనచేయుటకూడ నందే వివరించబడినది.[5]

కాని పెక్కు గ్రంథములందు కుబేరుడు హయవాహనుడే అని నిరూపితమైనది. అదెట్లో వివరింతును.

విష్ణ్వాలయమున పాంచరాత్ర శాస్త్ర ప్రకారముగా—బ్రహ్మోత్సవముజరుగునపుడు నిత్యావాహనానంతరము చండప్రచండ జయ విజయాది ద్వారపాలకులకు, అష్టదిక్పాలురకు బలిప్రదానము చేతురు. అట్టి తఱి ఆయా దిక్పాలకుల మంత్రములను, శ్లోకములను, స్తోత్రపూర్వకమైన గద్య (చూర్ణిక)లను పఠించి యా దిశాధిపతికి ప్రీతికరమైన రాగము నాలాపించుట, నృత్యమును ప్రదర్శింప చేయుట ఆచారమైయున్నది.

ఉత్తర దిశాధిపతియైన కుబేరునికి బలిప్రదానము చేయునపుడు ''సోమోధేనుశ్ం సోమో అర్వన్తమాశుం'' ''సోమో వీరం కర్మణ్యం దదాతు'' .... అను మంత్రమును

''కుబేరం చిత్రలేఖేశం యక్ష గంధర్వ నాయకం
అశ్వాసీనం కుంతపాణిం ద్విబాహుం స్వర్ణసన్నిభం''

అను శ్లోకమును

''అలకాపురాధీశ్వర! కుబేర! పరమేశ్వరస్య సఖ! ఉత్తరాశాధిపతే....... హయవాహన మారుహ్యాం జలింకుర్వన్ భగవదుత్సవసేవార్థమా గచ్ఛతు'' అను చూర్ణికను

''యక్ష గణార్చిత పుణ్యజనేశం
శ్రీకరరాగ హయాధిపయానం
శ్రీపతి పాలన దైత్య విచారం
నౌమి ఉదక్పతి పాల కుబేరం''

అను తాళమును[6, 7] పఠింతురు. చివర శ్రీరాగమున నొక కీర్తనను గాయకునిచే పాడించి సంకీర్ణ మను నృత్యమును ప్రదర్శింప చేసి ఈశాన దిశకు వెళ్ళుదురు. ఇట్లే మిగతా ఏడుగురు దిక్పాలురకు, బ్రహ్మ, గరుడ, విష్వక్సేనాదులకును మంత్ర శ్లోక చూర్ణికాదులు కలవు. అవిచట అనవసరము కాన వానిని పేర్కొనలేదు.

శ్లోకములోని ''అశ్వాసీనం'' అనునది, చూర్ణికలోని హయవాహన మారుహ్య అను వాక్యము, తాళములోని హయాధిపయానం అనుపదము, కుబేరుడు హయవాహనుడే అను విషయమును తెలుపుచున్నవి. ఇట్లుత్పన్న ప్రకరణమునందే కాక ఆంధ్ర విజ్ఞానము నందును దిక్కులు–దిక్పాలురు అను శీర్షికన

''ఉత్తర దిక్కు (ఉదీచీ దిశ) దిక్పాలుడు—కుబేరుడు
రాణి - చిత్రరేఖ=నివాసము - అలకాపురము
వాహనము—అశ్వము......ఇతడు రాక్షసుడు''

అని వ్రాయబడినది.[8] ఇట్లు వ్రాతలేకాక అశ్వము నెక్కిన కుబేరుని చిత్రములు కూడా కొన్ని కొన్ని స్థలములందు కనుపట్టుచున్నవి.[9]

శైవాగమ సిద్ధాంత నిర్ణయంబు ద్వితీయ ఖండంబున నుపన్యసించి యిప్పుడు తృతీయ ఖండంబున నజాండభువన ప్రపంచ రచనాది కౌతుకంబులు వివరించెద.........ఆగమ పురాణ సమ్మతిం గూడ చెప్పెద[10] నంటు పరమానంద తీర్థులవారు తమ గ్రంథమున పంచీకరణ వివేక, బ్రహ్మాండోత్పత్తిక్రమ, బ్రహ్మాండ భువన లక్ష

ణాదుల వివరిస్తూ ఇంద్రాద్యష్ట దిక్పాలకులు – వారి స్థానములు - పరివారములు అను శీర్షికలో

అనంతరంబున నింద్రాదిలోక పాలాష్టకు లెట్లనిన పీతరక్త కృష్ణ ధూమ్ర శుక్ల ధూమ్ర సిత శుభ్ర వర్ణంబులును, కరి, తురగ/తగరు, మహిష నర, మకర, మృగ హయ, వృషభంబు లనియెడు వాహనంబులును; వజ్ర, శక్తి, దండ, ఖడ్గ, పాశ, అంకుశ, గద, శూలంబులనియెడు నాయుధంబులునుం గలిగి యొప్పుచుందురు.[11] అని వ్రాసియున్నారు.

ఇంద్రాగ్ని యమ నిరుతి వరుణ వాయు కుబేరేశానా ద్యష్ట దిక్పాలాదుల క్రమంలో చూస్తే కుబేరుడు సిత వర్ణము, హయ వాహనము, గదాయుధము కల్గియున్నట్లు తెలియుచున్నది.

కుబేరుడు హయ వాహనుడే అని పై ఆధారములచే నిరూపించబడుచున్నపుడు నరుడు ఎవరికైనా వాహనముగ నుండెనా ఉన్నచో కుబేరునికి వాహనమన్న విపర్యాస మెట్లు తటస్థించినది ? అను సందేహములు జనించకపోవు. ఆ సందేహము తీరునట్లు కొంత వివరింతును.

నిరుతి అష్టదిక్పాలకులలో నాల్గవవాడు. ఇతడు రాక్షసుడు. యమ వరుణుల (దక్షిణ ప్రతీచీ దిశల) మధ్య నుండువాడు. ఇతనికి నరవాహన మొప్పును.

''సోమమండల స్థాపనమ్'' అను శీర్షికలో అష్టదిక్పాలకుల ఆవాహన ఏ రీతి చేయవలెనో వివరించుచు

''యోఘణం మంత్ర ముచ్చార్య తద్వత్పుద చతుష్టయే
ఖడ్గహస్తం కర్బురంచ నిర్రృతిం నరవాహనం''[12]

అని నిరుతి ఆవాహన గూర్చి తెలుపబడినది.

బలి ప్రదానమున పఠించబడు శ్లోకము

''ప్రేతారూఢం కరాళాస్యం ఖడ్గపాణిం నిశాచరం
నిరుతించ నిజాశాస్థం ధూమ్రముగ్ర దృశం భజే'' అనియు

''నిరుతే మనుజారూఢ నీలవర్ణ ద్విలోచన అస్యదేవయాగార్థ మిహాగచ్ఛ బలింహర.........యాతు ధానాధిపతే నిరుతే నరవాహన మారుహ్యాం జలిం కుర్వన్'' అని గద్యమును కలదు.[13, 14]

''నరారూఢం నీలవస్త్రం దధానమిహ భావయే
ఖడ్గచర్మ ధరం దేవం నైర్రృతిం నరవాహనం
నైర్రృతిం రక్షసాధీశం మనుష్య నిజవాహనం
తం పత్నీ సహితం లోకనాథ మావాహ యామ్యహం''[15]

అని యాగశాల యందుండు వేదికా పరివార ప్రకల్ప విషయమున పఠించబడు శ్లోకములు.

''రక్షోనాయక కృష్ణవత్యధిపుర ప్రహ్లాదనైరో చనైః
క్రవ్యాదైర్ద్వారి భక్తి సక్తహృదమైః నిస్త్రింశ ముఖ్యాయుధైః
బిభ్రాణం నరవాహనేన సహితస్స్త్రీయుతస్సేవితః
తీర్థాంతోత్సవ సేవనాంతమధునాత్వంగచ్ఛయుష్మత్పుదం''[16]

అని బ్రహోత్సవమున అవబృధస్నాన (చక్రతీర్థోత్సవ) మైన పిమ్మట తుదిని జరుపుదేవతోత్సర్జన సమయమున పఠింపబడు శ్లోకములును నిరుతి నరవాహనుడే యను విషయమును బలపరచుచున్నవి.

''నైరుతిదిశ–దిక్పాలుడు నైరుతి యను రాక్షసుడు. రాణి దీర్ఘాదేవి, ఆయుధము–కుంతము, నరవాహనము, నివాసము–కృష్ణాంగనా పురము'' అని ఆంధ్ర విజ్ఞానమునన్న విషయము.[17]

వివేక చింతామణిలోని ''కరి తురగ/తగరు మహిష, నర, మకర, మృగ, హయ వృషభంబులనియెడు వాహనంబులును''అనువాక్యము[18] నిరుతి నరవాహనుడన్న విషయమును ధృవపరచుచున్నవి.

నిరుతి ప్రక్కకు నరుని చిత్రము కూడ ''నీవు నామూపుపై నధిష్ఠించుము అందుకు సిద్ధముగా నున్నాను'' అన్నట్లు కన్పట్టుచున్నది.[19]

అమరసింహుడు తన గ్రంథమున నిరుతివాహనం గూర్చి ఏమి తెల్పకున్నా మునునూరివారు తమ గ్రంథమున [20] నిరుతి వాహనము–గుఱ్ఱము అని వ్రాసారు.

రక్తనేత్రం వృషారూఢం నీలోత్పల దళప్రభం
కృపాణపాణి మస్రౌఘం పిబంతం రాక్షసేశ్వరం''

అని నిరుతిధ్యాన శ్లోకము [21] ద్విజమేష మహిష ప్రేత నక్ర కురంగ నర వృషభాది దివ్యవాహనారూఢాః అని[22] దిక్పాలకా వాహన విషయమును వ్రతోద్యాపనమునందు కన్పట్టుచున్నవి.

''వృషము'' అనగా నానార్థము గుఱ్ఱము అనికూడ కలదు.[23] కాన నిర్వృతిధ్యాన శ్లోకము ననుసరించి హయవాహనుడా, ఆవాహన విషయమున నుపయోగించిన వాక్యము ననుసరించి ప్రేతవాహనుడా అను సందేహము పొడమక మానదు.

ఇలా పరస్పర విరుద్ధముకల వ్రతోద్యాపనము నాధారముగా ఎలా స్వీకరించారు అని అనుకొన్నా ఈ సోమవార వ్రతమునుగూర్చి లింగ పురాణమునందును, శివరహస్యమునందును, స్కాందపురాణాంతర్గత బ్రాహ్మసంహితయందును, హలాస్య ఖండ ఉపదేశ కాండాదులయందును విపులముగ వచింపబడినది.[24] అని పీఠికా కారులు వ్రాసిన వ్రాత అంత సులభముగ త్రోసిరాజను నట్టిదేనా?

నిరుతి కుబేరులకు, అధిపతియగునట్టి (నిరుతి–ఉదీచీ) దిశా విషయమున, నివసించు (కృష్ణవతీ–అలకా) నగర విషయమున ధరించు (ఖడ్గము-గద) ఆయుధ విషయమున పత్నీ (దీర్ఘాదేవి–చిత్రరేఖ) నామవిషయమున ఇంచుమించుగ నన్ని గ్రంథములోకటే

మార్గమును చూపించుచున్నను వాహన విషయమున ఎందుకు పొరపడవలసి వచ్చెనో యని ఆలోచించిన నందు కిరువురు పుణ్యజననామము, యాతుధాన నామము కల్గియుండుటయే కాబోలునని నాకు తోచుచున్నది.

"యాతుధానః పుణ్యజనో నైరృతో యాతు రక్షసీ"[25]
యక్షైకపిఙ్గలబిల శ్రీద పుణ్యజనేశ్వరాః"[26]

పుణ్యజనుడు నైరృతి అయినచో పుణ్యజనుల కీశ్వరుడు కుబేరుడు. "పుణ్యజనాః యక్షావా రాక్షసావా తేషామీశ్వరః పుణ్యజనేశ్వరః". యక్షులు గాని రాక్షసులు గాని పుణ్యజనులనబడుదురు.[27] అని వ్యాఖ్యానించుటచే రాక్షసుల కధిపతి నిర్వృతి, యక్షుల కధిపతి కుబేరుడు. ఇలా వ్యాఖ్యానించి విడదీసినపుడే రాక్షస యక్ష గణాధిపతిత్వములు నైరృతి కుబేరులకున్నట్లు తెలియును కాని పుణ్య జనేశ్వరుడన్నపుడు నైరృతి యనియైనా, కుబేరుడనియైనా చెప్ప వీలుండును గదా.

యాతుధాన పదము కుబేరునికి గలదా యన్నపుడు

"యక్షరాజం కుబేరంచ గుహ్యకేశం ధనాధిపమ్
గదాధరం యాతుధానం పదషట్కే సమర్చయేత్"[28] అన్న శ్లోకమే ఆధారము· ఇట్లు విశేషణ పదముల సామ్యముండుటచే నర వాహనము కుబేరునికి, హయము నిరుతికి తటస్థించినదేమోనని ఊహించ వీలు కలుగుచున్నది.

నిశ్చితార్థమున నరవాహనుడు నిర్వృతియని, హయవాహనుడు కుబేరుడని నా అభిప్రాయము.

మరి నన్నెచోడుని పద్యము నెట్లు సమన్వయము కావించుకొనవలెనో తెలియకున్నది. సుప్రసిద్ధ విమర్శకులు నేలటూరి వెంకట రమణయ్యగారు కుమారసంభవమున కొన్ని అపపాఠములు[29] అని వివరిస్తూ, దక్షాధ్వర ధ్వంస ఘట్టముననున్న "ఉరుతరాధీశుడయ్యును"[30] అను పద్యమును మాత్రమే విమర్శించారు. అదే ఘట్టములోని ఈ పద్యమును పరామర్శించలేదు. కాన అపపాఠము లేవైనా ఈ పద్య విషయమున యున్నవా విచారించవలసియున్నది.

ఈ పద్యమున మానిసి అనుచోట "హయమున్" అనియు రెండవపాదముననున్న "యాతనిదన"అను స్థలమున "యద్దానిని" అనియు సవరించి (ఇలా వ్రాస్తున్నందుకు క్షమించుడు) సమన్వయ పరచుకొన్నను అమరసింహుని శ్లోకార్థ మెట్లో తెలియకున్నది. అమరసింహుడు సుప్రసిద్ధ నిఘంటుకారుడు. అతని వ్రాతనంత సులభముగా త్రోసివేయ వీలులేదు. కాన అతని శ్లోకము పాఠాంతరముల కల్గియున్నదా? తాళపత్ర ప్రతుల నుండి ముద్రణ సమయమున వేరుగా పొరపాటున మార్చబడినదా? మున్నగు విషయములు విమర్శనాలోకమే గుర్తించి సందేహమును నివారించగలదని ఆశింతును. అట్లుగాకున్న నన్నెచోడుని పద్యమునకు, నిఘంటుకర్త శ్లోకమునకు అర్థాంతర మేమైన చెప్పుటకు వీలుండియుండునా ఆలోచించవలసియున్నది.

అధోజ్ఞాపికలు

1 కుమారసంభవము - 2 ఆశ్వా. 73 పద్యము.
2 అమరము, ప్ర. కాం. స్వర్గ వర్గము – 68, 69 శ్లో. పుట 61.
3 విద్యార్థి కల్పతరువు – పుట 5.
4 సోమవార వ్రతోద్యాపనము పుట 60.
5 ,, ,, పుటలు 66, 67.
6 ఉత్సవ ప్రకరణము పుటలు 90, 91.
7 దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర పుటలు 107, 108.
8 ఆంధ్ర విజ్ఞానము 3 సంపుటము పుట 1460.
9 దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర పుట 100.
10 వివేక చింతామణి పుట 134.
11 ,, ,, పుట 149.
12 శ్రీమన్నారాయణ సంహిత–యజ్ఞ వైభవ కాండ. అధ్యా. 8 శ్లోకం 48. పుట 155.
13 ఉత్సవ ప్రకరణము పుటలు 87, 88.
14 దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర పుట 106.
15 ఉత్సవ ప్రకరణము పుట 28
16 ,, ,, పుట 109.
17 ఆంధ్ర విజ్ఞానము 3 సంపుటము పుట 1460.
18 వివేక చింతామణి పుట 149.
19 దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర పుట 98.
20 విద్యార్థి కల్పతరువు పుట 5.
21 సోమవార వ్రతోద్యాపనము పుట 59.
22 ,, ,, పుట 66.
23 విద్యార్థి కల్పతరువు పుట 246.
24 సోమవార వ్రతోద్యాపనము పీఠిక పుట 4.
25 అమరకోశము ప్ర. కాం. స్వర్గ వర్గము. శ్లోకం 60. పుట 54.
26 అమరకోశము ప్ర. కాం. స్వర్గ వర్గము. శ్లోకం 69. పుట 61.
27 అమరకోశము ప్ర. కాం. స్వర్గవర్గము. పుట 61. చివరి పంక్తులు.

28 శ్రీమన్నారాయణ సంహిత యజ్ఞ వైభవకాండ అధ్యా. 8. శ్లో. 45, 46.

29 వాఙ్మయ వ్యాసమంజరి 2వ భాగం పుట 215.

30 కుమారసంభవము 2 ఆశ్వా. 72 పద్యము.

ఉపకరించిన గ్రంథములు

1 కుమారసంభవము — నన్నెచోడుడు.

2 అమరకోశము — అమరసింహుడు

3 విద్యార్థి కల్పతరువు — ముసునూరి వెంకటశాస్త్రి.

4 సోమవార వ్రతోద్యాపనము — ముదిగొండ వీరేశలింగశాస్త్రి (పరిష్కరణ) 1927 ముద్రణ.

5 ఉత్సవ ప్రకరణము — పూర్వాచార్యార్జితము — వ్రాతప్రతి.

6 దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర — నటరాజ రామకృష్ణ.

7 ఆంధ్ర విజ్ఞానము 3 సం॥ — ప్రసాదభూపాలుడు.

8 వివేక చింతామణి — పరమానందతీర్థ (పరిష్కర్త — విఠల దేవుని సుందరశర్మ).

9 శ్రీమన్నారాయణ సంహిత — శ్రీభాష్య భగవ ద్విషయాచార్య పీఠమువారి ప్రచురణ — పరిష్కర్త — న. చ. రఘునాథాచార్య.

10 వాఙ్మయ వ్యాసమంజరి — నేలటూరి వెంకట రమణయ్య.

శ్రీ కె. కోదండరామాచార్యులు

లేఖలు

కవిగారు

ప్రాతః స్మరణీయులు, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఆంధ్రుడు మహామహోపాధ్యాయ శ్రీ కవిగారు ఆంధ్ర - సంస్కృత సారస్వతములకు చేసిన సేవ మేరుతుల్యము. శ్రీ కవిగారు 20-3-1866లో మదరాసులో జన్మించిరి. తాళపత్ర గ్రన్థ గవేషణలో వీరు సంగ్రహించిన తెనుగు—సంస్కృత—ప్రాకృత గ్రన్థములు పెక్కులు. కాని చాలా వరకు ప్రకటించబడక వారితోనే కాల గర్భంలో కలిసినవి. క్షేమేన్ద్ర బిరుదాంచితుడగు లక్కాభట్టు ప్రణీత ''ముద్రామాత్యము'' వీరివద్ద ఉండెడిది. ప్రాకృత గ్రంథములలో కుతూహలుని ''లీలావతీ'' పేర్కొనతగ్గది. దీనిని గూడ ప్రచురింప దొరకొనలేదు. శ్రీ కవివద్ద పెక్కు సంస్కృత కావ్య—నాటకములు ఉండెడివి. కొన్ని పూర్తిగను, మరికొన్ని త్రుటితములుగను వీరివద్ద గలవు. ముద్రించబడక వీరితోనే అంతరించిన సంస్కృత నాటకములు ఇవి.

1. మూలదేవ చరిత
2. కృత్యారావణము
3. రామాభ్యుదయము
4. పుష్పభూషితకము
5. పద్మావతీ
6. సాగర కౌముదీ
7. చణ్డాల రామాయణము
8. తరంగ దత్తము
9. నలవిక్రమము
10. కుసుమ శేఖరము
11. స్తమ్భితరంభము
12. ఉదాత్త రాఘవం—ము॥

పై నాటకములలో చివరిది అనఙ్గ హర్ష ప్రణీతం. 1960లో డాక్టర్ రాఘవన్‌గారికి కూడ దీని ప్రతి లభించినది. కాని వారు గూడ ప్రకటించకుండుట పరిశోధనాంశము.

శ్రీ కవిగారి ప్రతిష్ఠను ఇనుమడింప చేసినది నాట్యశాస్త్ర ప్రకటన. అభినవ భారతి తోడి భరతుని కృతిని మూడు సంపుటములుగ బరోడానుంచి 1926, 1934, 1954 సం॥లో ప్రకటించిరి. నాల్గవ భాగము—విస్తృత భూమికతోడిది వెలువరించకమునుపే కవిగారు యశఃకాయులైరి. శ్రీ కవిగారిని చిరంజీవులను చేసినది ''భరతకోశము''. సంగీత—నాట్య శాస్త్రముల పారిభాషిక పదార్ణవము. అవశ్యము ముద్రింపవలసిన గొప్ప గ్రంథము. తిరుమల—తిరుపతి దేవస్థానమువారు ఆలోచింతురు గాక.

ఇట్టి మహామహునిపట్ల కృతజ్ఞత చూపుట తెలుగుల కనీస ధర్మము. ఆన్ధ్ర సాహిత్య అకాడమీ శ్రీ కవిగారి ఆంగ్లరచనలను ఒక సంపుటముగ వెలువరించుచున్నట్లు తెలుస్తున్నది. త్వరగా ప్రకటించబడగలదని ఆశిద్దాం అటులనే కవిగారి బొమ్మతోడి స్మారక తపాలా బిళ్ళ కేన్ద్ర ప్రభుత్వం త్వరగా వెలువడ చేయునట్లు తెనుగు సాంస్కృతిక సంస్థలు—రాజకీయ నాయకులు చూడవలెను. ఇప్పటికే చాల ఆలస్యం జరిగినది. శ్రీ కవిగారు గతించిన దినం 20-9-1957 పూర్ణ తెనుగు రాష్ట్రమును చూచియే గతించిరి. ఇరువది రెండు వర్షములు అయినవి. అకాడమీ అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఇందుకు పూనుకొనగలరని మనందరము ఆశిద్దాం.

శ్రీ ఇప్పగుంట స్వయంభూ

వో పి క తో...

ఆగస్టు 1979 'భారతి'లో ప్రచురింపబడిన డాక్టరు బి. ఆర్. కె. రావు రచించిన "బ్రిటీషు పాలనలో—క్షామం, నిరుద్యోగం, పేదరికం" అన్న వ్యాసం చదివాను. ఈనాటి ఆర్థిక, భౌతిక సంబంధమైన విషయాలు, ఆర్థిక పరిపాలన సంబంధమైన సూచనలు, పాశ్చాత్య సంస్కృతి, దాని ఆర్థిక పరిస్థితులు, యిటీవలి భారతీయ చేతివృత్తుల్ని, పరిశ్రమల్ని నశింపచేసి నష్టం కలిగించినవి· ఆర్థిక వ్యవస్థలు, లక్షణాలు, ఆర్థిక ప్రణాళికా రచనలు, ఆర్థిక సూత్రాలు, ఆర్థిక ఆలోచనా ధోరణులు, ఆర్థిక సమస్యలు, ఆర్థిక నిర్ణయాలు, చారిత్రక, జాతీయ, సామ్యవాద వాదనలు, రాజకీయ వాదనలు, ఆర్థిక రక్షణ విధానాలు, ఆర్థిక విషయాలకు సంబంధించిన వాదనలు, మొదలుగాగల అనేక విషయాలను చక్కగా వర్ణించారు. వోపికతో వారి భావాలను తిరుగవేయడము జరిగింది·

శ్రీ మంచికంటి వెంకటేశ్వరరావు

జీవితం

శ్రీ అలిశెట్టి ప్రభాకర్

ఈ వృక్షం
నువ్వు ఉరిపోసుకోడానికి
వినియోగింప బడ్డది కాదు

స్వయం కృషిని
శాఖోప శాఖలుగా
విస్తరింపజేసుకొమ్మని.

శాతవాహనుల నాణెములు

(65వ పేజీ తరువాయి)

149 APMC. pp. 58-9
150 ప్రా. ప్ర., ద్వి. ప., సూ 24
151 BMC, pp. 10-11
152 Ibid, P. ixxv
153 Ibid
154 JNSI, 11, p. 92
155 BPWM, p. 62, MUJ, p. 153
156 JNSI, XX. NNM, p. 7, AC. 18

సంకేతములు

AHI = A history of India
AIU = The Age of Imperial Unity
APMC = Satavahana coins in the Andhra Pradesh Government Museum.
BDCRI = Bulletin of the Deccan College Research Institute.
BMC = A catalogue of the coins in the British Museum.
BMGM = Bulletin of the Madras Government Museum.
BPWM = Bulletin of the Prince of Wales Museum
CHI = A comprehensive history of India.
CSCE = Coinage of Satavahanas and coins from excavations.
CSI = Coins of South India.
DKA = The Purana text of dynasties of the Kali Age.
EBK = Excavations at Brahmapuri (Kolhapur)
EK = Excavations at Koundinyapura.
EMN = Excavations at Maheswari and Navdatoli.
ENJ = Excavations at Nasik and Jorwe.
ET = Excavations at Tripuri.
FHPHN = From history to pre-History at Nevasa.
IAR = Indian Archaeological Survey of India.
IMC = A catalogue of the coins in the Indian Museum, Calcutta.
JDHC = Journal of Deccan Historical congress.
JMPIP = Journal of M. P. Itihas parishat.
JNSI = The journal of the Namisnatic Society of India.
MSI = Studies in Indology by Mirashi.
NNM = Numismatic notes and Monograms.
OUJ = Osmania University journal - Golden Jubilee.
PE = Pouni Excavations.
PHC = Proceedings of Indian history congress.
SI = Select inscriptions.

గ్రంథ విమర్శలు

సంస్కృత భాణ సాహిత్యము

(ఏక పాత్రాభినయ చరిత్ర — సమీక్ష)

[రచయితలు : శ్రీ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, ఎం.ఏ. పిహెచ్. డి., శ్రీ సూరం శ్రీనివాసులు, ఎం. ఏ., డెమ్మీ సైజు 260 పేజీలు. వెల : రు. 20 లు. ప్రతులకు : (1) ఆంధ్ర ప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికిందరాబాదు, మచిలీపట్నం. (2) శ్రీ టి. బాలకృష్ణమూర్తి, ఏ 58, విజయపురి సౌత్, నాగార్జున సాగర్—522439, ఆం. ప. (3) శ్రీ ఎస్. శ్రీనివాసులు, ఉపన్యాసకులు, సంస్కృత కళాశాల, పొన్నూరు — 522 124, ఆం ప.]

సంస్కృత భాషలో దృశ్య కావ్యాలు నాటికా, సట్టిక, త్రోటకాదులతో సహా చాలా ఉన్న నాటక ప్రకరణాదులైన దశ రూపకాలే ప్రసిద్ధంగా ఉన్నవి. ఆ పదింటిలోనూ నాటక ప్రకరణాలకున్న ప్రచారం తక్కిన వాటికి లేదు. నాటక, ప్రకరణాల తర్వాతిస్థానం భాణానిదే అని చెప్పవచ్చు.

సంస్కృతంలోని ఈ భాణ సాహిత్యాన్ని గురించి తెలుగులో ఇది వరకు పరిశీలన జరిగినట్లు నాకు తోచలేదు. ఆ వాఙ్మయాన్ని గురించి ఎంతో శ్రద్ధతో రచయితలు పరిశ్రమించి దీనిని రచించారు. వీరి కిట్టి అవకాశాన్ని కలిగించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారిని తొలుత అభినందించాలి. తాము చేసిన పరిశ్రమ సఫలమై దీనికి బహుమతి లభించడంవల్ల దీనిప్రాశస్త్యం వెల్లడిఅవుతున్నది.

ఇందులోని మొదటి పదిహేను శీర్షికలలో భాణాలను గురించి సమగ్రంగా తెలుపబడింది. తర్వాతి శీర్షిక అయిన అనుబంధాలలో ధనార్జానుభవ భాణం (రచయితల్లో ఒకరైన శ్రీనివాసులుగారు వ్రాసినది) కొన్ని సామెతలు — సూక్తులు, భాణముల పట్టిక, ఉపయుక్త గ్రంథాలు తెలుపబడినవి.

శ్రవ్య కావ్యాలే తొలుత వచ్చాయనీ, వాటి క్రమ పరిణామమే దృశ్య రూపం దాల్చినదనీ, దృశ్య కావ్యాలలో మొదటిది భాణమేఅనీ ఏక పాత్రాభినయానంతరమే బహు పాత్రాభినయం సహజమనీ, శ్రవ్య కావ్యాలకూ, నాటకాది దృశ్య కావ్యాలకూ నడుమ ఈ భాణ రచన సాగి ఉంటుందనీ ఇందులో చక్కగా సమర్థించబడినది.

రూపక భేదాల్లో భాణమే మొదటిదని సిద్ధాంతీకరించిన పిదప రచయితలు భాణ లక్షణాన్ని గురించీ, దాని దృశ్యత్వ యోగ్యతను గురించీ చర్చించారు. భాణచ్ఛాయలు ఎక్కడున్నదీ వివరించారు. ప్రాచీన భాణాలను గురించి చెప్పినపుడు చతుర్భాణిలోని ఉభయాభిసారిక, పద్మ ప్రాభృతకం, ధూర్తవిట సంవాదం, పాదతాడితకం అనే వాటితోపాటు కర్పూర చరితం గ్రహించబడింది. ప్రాచీన భాణాలలో వరరుచి రచించిన ఉభయాభిసారిక మొదటిదనే విషయం చెప్పబడింది.

అర్వాచీనములైన భాణాలలో ఆంధ్రులు రచించినవి కొన్ని, ఇతరులవి కొన్ని ఉన్నాయి. రచయితలు ఆంధ్రుల రచనలను ప్రత్యేకంగాను,ఇతరుల రచనలను ప్రత్యేకంగాను చూపారు. ఆ తర్వాత అధునాతన కాలంలో రచితాలయిన భాణాలను గురించీ, అజ్ఞాతంగా ఉండిపోయిన వాటిని గురించిన్నీ వివరించబడింది. ఈ దృశ్యములలో వివరించబడిన సాంఘిక పరిస్థితులు, ఆటలు, వినోదాలు తెలుపబడినవి. వర్ణనలలోని వైశిష్ట్యం వివరించబడినది. తప్పగా ఉదాహరించబడిన కొన్నిటి ప్రస్తావన కూడా ఉన్నది. ఇంతవరకూ వివరించబడిన విషయాలు సంస్కృత భాణాలకు సంబంధించినవే! ఈ సంస్కృతభాణ పద్ధతిలో కూర్చబడిన తెలుగు భాణాల విషయం తర్వాత ఇయ్యబడినది.

గ్రంథం చివర ఉన్న ఉపయుక్త గ్రంథసూచికనుబట్టి రచయితలు సంస్కృత—ఆంధ్ర—ఆంగ్ల—హిందీ భాషలలో ఉన్న నలభై గ్రంథాలకు పయిగా పరిశీలించి దీనిని రచించినట్లు తెలుస్తున్నది. మద్రాసు, తంజావూరు మున్నగు చోట్లలోని ప్రాచీన గ్రంథాలయాలలోని అముద్రితాలను పరిశోధించి గ్రంథ రచనకు కావలసిన విషయాన్ని సేకరించారు. రచయిత లిద్దరూ సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో నిష్ణాతులు కావడంవల్ల ఈ రచన ప్రశస్తంగా సాగింది. డాక్టర్ సి. మార్కండేయ శాస్త్రిగారు దీనికి 'ప్రవేశిక'ను కూర్చారు. డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు గ్రంథ ప్రాశస్త్యాన్నీ, రచయితల సామర్థ్యాన్నీ ఉగ్గడిస్తూ, గ్రంథంలోని విషయాన్ని సంగ్రహంగా, సులభంగా పాఠకులకు అందించారు.

రూపక భేదమైన భాణాన్ని గురించి తెలిసికోవాలంటే ఈ గ్రంథాన్ని తప్పక చదువవలసి ఉన్నది. దీనికి తగిన ఆదరమూ, ప్రోత్సాహమూ లభించగలవని ఆశిస్తున్నాను.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

ఎర్ర రంగస్థలం

[సాంస్కృతిక రంగ వ్యాస సంకలనం — ప్రచురణ : జన నాట్య మండలి ప్రచురణలు — హైదరాబాద్. పుటలు : 78. వెల : రూపాయిన్నర. ప్రతులకు : 1. పీస్ బుక్ సెంటర్, లింగంపల్లి చౌరస్తా, కాచీగూడా, హైదరాబాద్; 2. సృజన — హనుమకొండ — వరంగల్.]

భూస్వామ్య సంస్కృతి విష కౌగిలి నుంచి విముక్తి పొందే నిమిత్తం, జనచైనా ప్రత్యేకించి "రెడ్ థియేటర్"ను అభివృద్ధి

పర్చింది. లాంగ్‌మార్చ్ కాలంలోనే ఎర్ర సైన్యం జన సామాన్యం దగ్గరికి నాటక రంగస్థలాన్ని జీవితానికి అనుగుణంగా మలిచింది.

''కళలు ఎవరి కోసం?'' అని ప్రశ్నించి సమాధానం చెప్పిన మావో - 'కళలు జనసామాన్యం కోసం — ప్రధానంగా మొదలు కార్మికులకు, రైతులకు, సైనికులకోసం' అని విస్పష్టం చేశాడు. నాటకం, సంగీత రూపకాలు, నృత్య నాటికలు, సినిమా వంటి సాధనలన్ని ప్రజలను చైతన్యవంతులని చేయాలని, ప్రచారాన్ని కళాత్మకంగా తీర్చిదిద్ది విముక్తి పోరాటాల్లో భాగస్వాముల్ని చేయాలని ఆనాడే (1930–40) చైనాలోని ప్రజా సాంస్కృతిక దళాలు నిర్ణయించుకున్నాయి

అందువల్లనే ప్రజలకు అర్థమయ్యే విధంగా, వారి అనుభవాలను ప్రతిస్పందించే రంగస్థలం 'ఎర్ర రంగస్థలం'గా రూపొందింది.

ఎడ్గార్‌స్నో రచించిన ''చైనాపై అరుణ తార'' లాంటి మహత్తర గ్రంథంలో ఈ 'ఎర్రరంగస్థలం' గురించి ఒక అధ్యాయం వుంది. స్నో చాలా చక్కగా ఆ రంగస్థల ఆశయాన్ని యిలా వివరిస్తాడు—

''అదంతా అత్యంత తీవ్రస్థాయికి లాగబడిన కళా రూపంలోని ప్రచారం అని చెబుతూ 'అందులోకి కళ నెందుకు లాగుతారు ?' అని చాలామంది అడుగుతారుకానీ, విశాలమైన అర్థంలో అది కళే; ఎందుకంటే, ప్రేక్షకులకు జీవిత దృశ్యాలను చూపిస్తున్నది; మరి అది అతి సామాన్యమైన కళగా కనిపిస్తుందంటే — కథా వస్తువులుగ స్వీకరించిన జీవిత విశేషాలు, ఎవరి నుద్దేశించి ప్రదర్శింపబడుతూ వున్నాయో ఆ మానవ జీవితాలు జీవిత సమస్యలపట్ల అతి సామాన్యమైన దృక్పథాన్ని కలిగివుండడమే అందుకుకారణం. చైనా జన సామాన్యానికి సంబంధించిన కళకీ ప్రచారానికీ మధ్య సున్నితమైన విభజన లేదు. వున్న తేడా అల్లా మానవుని అనుభవంలో అర్థం చేసుకోగలిగిందానికి, అర్థం చేసుకోలేని దానికి మధ్యనే.''

(జన నాట్యమండలి సంకలన కర్తలు తమ పుస్తకంలో మొదటి వ్యాసం కింద 'ఎడ్గార్‌స్నో'ను పేర్కొనడం మరచిపోయారు ?)

చైనాలోని ఆనాటి విప్లవ పోరాట దశలో 'ఎర్ర రంగస్థలం' నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. అప్పుడు ప్రచారానికి — కళకు మధ్యనుండే సూక్ష్మరేఖ కనపడక పోయినా ఆశ్చర్యం లేదు. కాని విప్లవాలు ఇంకా రాని మూడో ప్రపంచపు దేశాల్లో ప్రజారంగస్థలాలు ఎలా రూపొందాలో అనుభవంతో మనం నేర్చుకోవలసిందే.

హైదరాబాద్‌లోని 'జననాట్యమండలి' తమ తొలి ప్రచురణ కింద ఈ 'ఎర్ర రంగస్థలం' అనే 'సాంస్కృతిక రంగ వ్యాస సంకలనాన్ని' వెలువరించింది. ఇందులోని తొమ్మిది వ్యాసాలు చైనాలో పోరాట దశ నుంచి విప్లవం విజయవంత మయ్యేదాకా, ఆ తర్వాత జన చైనాలోని రంగస్థల స్థితిగతులవరకు వివరిస్తున్నాయి. మిగతా వ్యాసాలు బీహార్, చండీఘర్ తదితర ప్రాంతాల్లో ఉద్యమపరంగా వచ్చిన సాంస్కృతిక రూపాల గురించి చెబుతున్నాయి. ఇవన్నీ ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పనిచేసే రచయితలకు కళాకారులకు బాగా ఉపయోగపడతాయి.

చివర 'జన నాట్య మండలితో 'సృజన ఇంటర్వ్యూ' ఒక ముఖ్యమైన వ్యాసం. ఆంధ్రప్రదేశ్‌లో గత తొమ్మిది సంవత్సరాల్లో నవోదయ, అరుణోదయ, విరసం, జన సాహితీ సాంస్కృతిక సమాఖ్యలు ప్రజల కోసం పనిచేస్తున్నాయి. వాళ్ల అనుభవాల గురించి కూడా ప్రచురించి వుంటే ఈ సంకలనం సమగ్రత్వాన్ని సంతరించుకొని వుండేది. అలాగే సాంస్కృతిక రంగంలో యథార్థ దృష్టి, విమర్శనాత్మకమైన వైఖరి కూడా చాలా అవసరం అనే విషయాన్ని ప్రజలు నేర్పుతారు.

— యన్ యల్

భీష్మ

[ఐతిహాసిక ప్రబంధము. కావూరి పూర్ణచంద్రరావు, ఎం.ఏ., బి. ఓ. ఎల్. క్రౌన్ 96 పేజీలు, మూల్యం: రు. 4/– ప్రతులకు: గ్రంథకర్త, 18–4–66, కేదారేశ్వరపేట, విజయవాడ—3.]

శాస్త్రీయ సాంప్రదాయిక కవిత్వమేగాక, భారత కథాజ్యోతి— భీష్మ పితామహుని గురించి వ్రాయడం — లఘు కావ్య వచన కవిత్వ ధోరణుల ఈ పరమటి గాలి దినాలలో ఒక కోవ చదువరులకు ఊరట కలిగిస్తుంది. ఈయన ఆంధ్ర భారతాన్ని అనుసరించి వ్రాసినట్లు చెప్పుకొన్నా, కొన్నిచోట్ల తిక్కనసారిని తప్పించి పౌరాణికుల ధోరణిలో పడినాడు. ఇందు భారత కథ అంతా సంక్షిప్తంగా చెప్పబడి ఉన్నదిగాని (ముఖ్యంగా శరతల్పగతుడైన భీష్మని ధర్మజుడు చూచిన ఘట్టం) తిక్కన చూపిన నాటకీయత, సంభాషణలలో సహజత — పాటవము ఇందు తగ్గి ఉన్నవి.

కథలో కొన్ని మార్పులు చేసినట్లు చెప్పుకొంటున్నాడు—ఈ కవి. దేశ కాల పాత్రానుగుణంగా పుట్టిన ఆ కథను నేటి సాంఘిక వ్యవస్థ — భావ పరిణామాల ప్రకారం మార్చబోవడం ఆదరింపదగినది కాదు; ఇది కమ్యూనిష్టులు మార్క్సిజం ప్రకారం భారతాన్ని మార్చి వ్రాసినట్లుంది. కాబట్టే డా. కట్టమంచి రామలింగారెడ్డి— ''మన ఆదిశేషునికి ఎన్ని నాలుకలో మన పురాణాలకు అన్ని పాఠాంతరములు'' అని గేలి పట్టించినాడు. ఇప్పటికే మన ఇతిహాసాలు గచ్చు పొదలైనవి. మారుస్తూ సమర్థిస్తూ పోతుంటే కొత్త భారతం ఏర్పడుతుంది.

ఈ కవి మంచి పండితుడు. రచనలో భాషా ప్రౌఢి, శాస్త్రీయత, ధార చిక్కగా పండిత జన హృద్యంగా ఉన్నవి. కాని, సమాసాలలో పేశలత అర్థ రమ్యత ఉండవలసినంతగా లేవు. అయినా, భీష్మ చరితకు ఇది ఒక మణిహారము.

మేం పాడుతాం

[జనం పాటలు — సంకలన. (జన సాహితీ సాంస్కృతిక సంస్థ) క్రౌన్ 48 పేజీలు; వెల : ఒక రూపాయ; ప్రతులకు :

కె. రవిబాబు, నగరం పోస్టు, రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా– 522 268].

మేము ఏడుస్తామనే కవిత కంటె, ఇది ఆహ్లాదకారి అనక తప్పదు. జీవిత యానానికి దారిబత్తెం గదా సంతోషం! "జనం కొరకే కలంబట్టు జన విముక్తి కాములం" అన్న ఆదర్శంతో వ్రాసిన కవిత లివి. కూలీల దుస్థితి – దరిద్రుల దీనగతి – హరిజనుల అన్యాయ పరిస్థితి– భూస్వాముల యజమానుల దోపిడీలను ఆక్రందనంతో వెలువరిస్తున్నది – ఈ రచన. దోపిడీలను ఎదిరించను నిప్పులు నెత్తురు కురిపించమంటారు. త్యాగబుద్ధి మంచిదే గాని, సహనశీలం సంఘశ్రేయానికి మూలం గదా!

కాని, ఈ దౌర్భాగ్యం నేటి వాస్తవిక స్థితి కాదనక తప్పదు. "గో బ్రాహ్మణభ్యాం సుఖినో భవంతు" అన్న మంత్రం పోయి "హరిజన గిరిజనాభ్యాం సుఖినో భవంతు" అనేదే నేటి రాజకీయ సూత్రం అయి ఉన్నది గదా! హరిజనాదులు నేడు పొందే ఆదరం గౌరవం ఏ అగ్రజాతి గాని ఎప్పుడూ పొంది ఎరుగదు. ఉద్యోగాలలో బహూకృతులలో అత్యధిక శాతం ఈ పీడిత జనానికే గదా కేటాయింపబడి ఉండేది. ఇదే అగ్రజాతుల పాపానికి ప్రాయశ్చిత్తం!

ఇప్పుడు కార్మికులు కర్షకులు సర్వ హక్కులతో బాధ్యతలు లేకుండా యజమానుల కంటె అదృష్టవంతులై ఉన్నారు గదా! నేటి మన వెనుకబడిన జాతుల సుఖ సంపదలు రాజకీయస్వామ్యాలు సంపన్న దేశాలతో పోటీ పెట్టుకొని ఉన్నవి గదా! దీనికి సంతోషించే వారేగాని సంతాపపడేవారు లేరు. నిరుద్యోగం, దారిద్ర్యం, క్షుద్బాధ పూర్తిగా పోలేదన్నది నిజమేగాని, ఇది సమగ్ర జాతీయపీడ. దీనికిగా దేశం తలవంచుకోవలసిన పని లేదు. కమ్యూనిష్టు దేశాల స్థితిగతులు బయటకు పొక్కకుండా ఉన్నది గదా, ఇక పోల్చడం ఎట్లా?

ఒక కవి, సమ్మెచేసే హక్కులేదంటాడు, ఇది ఎమర్జన్సీ నాటి స్థితి కావచ్చును. ఇప్పుడు సమ్మెలేని సంస్థ ఉన్నదా? అసలు కమ్యూనిజంలో సమ్మె హక్కే లేదు గదా. వెనుకబడిన జాతులు ఆత్మగౌరవంతో ముందుకు నడుస్తున్నవనక తప్పదు; ఇంకా బాగుపడాల అన్నమాటకూ తిరుగులేదు.

"అగ్ర రాజ్య సోవియట్ విస్తరణను అడ్డుకొనగ రండి" అని అంటూ కంపూచియాపై వియత్నాం దురాక్రమణను కొన్ని పాటలు గర్హిస్తున్నవి. బహుశః వీరు మాస్కో మానస పుత్రులు కారేమో! ఈనాడు ప్రతి రాజకీయ పార్టీ చీలి కొమ్మలు రెమ్మలు పెట్టి ఉన్నది గదా!

మెట్టుకు ఈ కవిత్వంలో ఉద్వేగానికి తగిన నుడికారం ఉన్నది. పాటలు కాబట్టి ప్రజలలో బాగా వ్యాపించగలవు.

శిలలు వికసిస్తున్నాయి

[కవిత – రామాచంద్రమౌళి. డెమ్మి– 48 పేజీలు; ధర: రు. 5/; ప్రతులకు : కార్యదర్శి, యువ సాహితీ సమాఖ్య; 14-1-32, మండీబజార్, వరంగల్ 506002.]

భాషకు భూషణం అలంకార ప్రాయమైన (ఫిగరటివ్) ఫణితి. విరోధాభాస అర్థాంతరము వక్రోక్తి–ఇవి సరిగా ప్రయోగింపబడితే ఒక అవ్యక్త మధుర భావం కుదురుతుంది. వక్రోక్తి తరిపి వెన్నెల సొంపుతో మనసును అలరింపజేస్తుంది. "ద్విజరాజటంచు భావించుటే గాని, నిజముగా దోషాకరుండు వీడు" (బిల్హణీయం) "రుక్మిణీశానయ్యు వలదనదాత్మ నాయకు డొరునరు క్రింద హరుల బట్ట" (వసుచరిత్ర) ఈ పాదాలలో అర్థం బోధపడగానే ఒక ఆనందం వెల్లివిరుస్తుంది.

అట్టి అలంకార ప్రాయమైన భాష ప్రయోగంగానే కవి ఈ పుస్తకమంతా నింపినాడు. భాషలో నవ్యత, వాక్యపద్ధతిలో విజ్ఞానము ఈ కవి భావాలను మెరపించి కొత్త అనిపిస్తున్నవి. అందులో రచయిత భావుకత పరిణతమై సూక్తులకు, లలిత పద విలసనంతో శిల్పగుణం అబ్బజేస్తున్నది. లోకానుభవంతో తాను చూచిన వాటికి కొత్త తొడుగు తొడిగి రచనకు సొంపు వాటింపజేస్తున్నాడు. చూడండి:—

సూర్యుని చించుకుని కిరణాలు పరుగెత్తుకొస్తున్నాయి. మెషిన్లు సంపదను పూస్తున్నాయి, నానుండి కురుస్తున్న శబ్దాల చినుకుల తాకిడికి...శిలలు వికసిస్తున్నాయి, కలల కలువలు పులకరిస్తున్నాయి; ఒక్క వీణను మీటడమే కాదు తెగిన తీగను అతికించడం గూడా తెలియాలి మనిషికి; పరిమళావర్త పవన ప్రవాహార కోసం (చక్కని పదబంధం); జీవితమంటే ఒక్క చుక్కను నాటి కోటి నక్షత్రాల నేరుకోవడమో, లోపల మండుతున్నా పైకి జిల్లేడు పువ్వులా నవ్వుతావు (జిల్లేడు బలేకాక పారసీలో ఒక గీతం ఇట్లా ఉన్నది.) సుల్తాను కొడుకు ఒక అంతఃపుర కన్యను చేయి పట్టుకొనగా, ఆమె "నేను గోరింటను" అన్నది; అంటే బయటికి పసిమి లోపల ఎరుపు–బహిష్మ అయిన నెత్తురు అని అన్యాపదేశంగా చెప్పినది. "నక్షత్రాల తీగపై రాగం" అన్న శీర్షిక కమ్మగా ఉన్నది.

కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డి

వినాయకుడి విన్యాసాలు

సాహిత్య ప్రక్రియలలో 'హాస్యాని'కి సముచితస్థానం లేదని ఎవరూ అనలేరు. సాహిత్యంలోనే గాక జీవితంలో కూడా హాస్యానికి ప్రముఖస్థానం వుందనాలి. హాస్యం అనేక విధాలుగా లాస్యం చేయగల అవకాశం వుంది. ఒకమాట, ఒకచూపు, ఒకచేష్ట, ఒకవేషం, ఒక భావం ఇలాగ ఎన్నోవిధాలుగా ఉద్భవించి కదలిక కలిగించగల శక్తి హాస్యానికి వుంది. అన్ని సందర్భాలలోను, 'రంగం'లోకి తొంగి చూడగల అవకాశమూ హాస్యానికివుంది. హాస్యం నవ్వుని పుట్టిస్తుంది. నవ్వడం చేతగాని మనిషి మనీషి కాలేడు. నవ్వులతో హృదయక్షాళన మవుతుంది. మనస్సు స్నిగ్ధమవుతుంది. శారీరకంగానే గాక, మానసికంగా కూడా నవ్వు స్వాస్థ్యాన్ని సమకూర్చగలదు.

అందువలన హాస్యాన్ని అందుకుని, నవ్వుల పువ్వుల్ని వెదజల్ల గలిగి వుండటం సార్వకాలిక, సార్వజనీన, సామాజిక అవసరం—అని చెప్పవచ్చును.

అయితే—హాస్యాన్ని సృష్టించటం అంత సులభంకాదు. అందుకు ఎంతో కృషీ శ్రమా వినియోగింపబడాలి. సున్నితంగా, అమాయకంగా కనపడే 'హాస్యరచన'లో — చురుక్కుమనిపించి ఆలోచింపచేయగల శక్తి యుక్తుల్ని ఇమడ్చటం అన్నది నైపుణ్యంగల కళాకారుడు మాత్రమే చేయగలిగిన పని. హాస్యం గంభీరమయినది.

హాస్యరచయిత దృష్టి పదునయినది. దాని శక్తి అనన్యమయినది. అందువలన జీవితపు లోతుపాతుల గురించిన పరిశోధనలో హాస్యరచయిత వెళ్ళగలిగినంతదూరం మామూలు రచయిత గమించలేడు.

ఆలోచనా, భావవ్యక్తీకరణా మనిషికే లభ్యమయిన కొన్ని సాధనాలు. అందువలన నరుడు అవతరించినప్పటినుంచీ ప్రపంచంలో హాస్యం వున్నదన్న విషయం గ్రహించబడింది. ప్రతిభ గలిగినహాస్యం సాంఘిక జీవనంలో ప్రముఖస్థానం సంపాదించుకొనగలిగింది. ఆ కారణం వలన హాస్యం సాహిత్యంలో ప్రత్యేకమయిన స్థానాన్ని సముపార్జించుకొనగలిగింది—అనాలి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో—కందుకూరి నాటినుంచీ హాస్యం చోటు చేసుకొన్నది. వీరేశలింగంగారి ప్రహసనాలు, నాటికలు ఇందుకు ఉదాహరణలు. హాస్యాన్ని సాధనంగా చేసుకునే, వారు బలవంతమయిన ఎదిరిపక్షాన్ని దెబ్బకొట్టడానికి ప్రయత్నించారు. పానుగంటివారి కంఠాభరణం నాటకంలో కావలసినంత హాస్యం వుంది. వారు అందించిన సాక్షి వ్యాసాలలోను ఆ లక్షణం వున్నది. గురజాడ 'కన్యాశుల్కం'—అమితమయిన ప్రాచుర్యం పొందటానికి, హాస్యాన్ని ఒక ప్రధానమయిన కారణంగా పేర్కొనవచ్చును. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'గణపతి' ఒక నవ్వుల పూలమాల. మొక్కపాటివారి బారిష్టరు పార్వతీశం, మునిమాణిక్యం 'కాంతం కథలూ' హాస్యపు జల్లులతో నవ్వుల్ని పండించిన రచనలు.

ఆయా కాలాలలోని — సాంఘిక, వైయక్తిక విషయాల్ని ఆలంబనంగా చేసుకుని వినోదమూ, ఆహ్లాదమూ కలిగిస్తూనే సామాజిక సంస్కరణని ధ్యేయంగా పెట్టుకుని హాస్యరచనలు సాగించి సత్ఫలితాన్ని సాధించారు ఆయా రచయితలు.

అందువలననే నేటికీ ఆ రచనలు నిలబడ్డాయి. రచయితలూ స్మరణీయులయినారు.

అయితే—ఎడనెడ తొంగి చూడటంతప్ప — పూర్తి ఆకృతి గలిగిన, ప్రతిభావంతమయిన హాస్యరచనలు ఈనాడు కరువయాయనే అనాలి. ఆ కారణంగా హాస్యానికి సాహిత్య ప్రక్రియలలో సముచిత స్థానం లేదని కొందరంటారు — అన్న రావూరు వారి మాటని కాదనాలి.

రచనారీతి అన్నది రచయితని బట్టి వుంటుంది. ప్రతిభ వ్యక్తమయేది అక్కడే. ప్రతిభగల రచన వివేచనతోపాటు వివేకాన్నీ గలిగించగలదు. అదేవిధంగా భావన కూడా వైయక్తికమే. అయితే ఉదాత్తత లేని భావనా ప్రయోజనాన్నాశించని భావనా నిరుపయోగమూ, పరిహరించదగినదీ అవుతుంది.

ఒక రచయిత ఏమి చెప్పాడు అన్న విషయంపైననేగాక, ఎలా చెప్పాడు అనే దానిపై కూడా రచయితయొక్క ప్రతిభా, రచనయొక్క సార్థకతా ఆధారపడి వుంటుంది.

అదిగాక—

హాస్యరచన అసిధారావ్రతం వంటిది. ఎటుతూలినా వ్రతం చెడి భంగపాటయే ప్రమాదముంటుంది. శ్రుతిమించితే అపశ్రుతి ఎదురయ్యే అవకాశం కలదు. అందువలన ప్రయోజనాన్నాశించిన ప్రతిభగల హాస్యరచన వస్తువుదృష్ట్యా, భావనరీత్యా, ఎన్నో జాగ్రత్తలు గమనించవలసి వుంటుంది. సన్నివేశాల కల్పనలో, సంభాషణా చాతుర్యంలో పుష్టీ, తుష్టీ కలిగిన ప్రతిభ ప్రస్ఫుట మవవలసిన అవసరం వుంది. విషయంలో వాస్తవికతా, రచనలో సారళ్యతా చాలా ముఖ్యం. హాస్యమే ప్రధానంగా వ్యంగ్యపద్ధతిలో పండిందని అనబడిన—'వినాయకుని విన్యాసాలు' అన్న ఈ పుస్తకంలో పదిహేను చిన్న చిన్న రచనలున్నాయి. నాయకురాలి ఆవు, చిల్లర దేవుళ్ళ సభ, కాటుక కంటినీరు, ఆసుపత్రిలో శారద—అన్న రచనలు ఫరవాలేదు. మిగతావన్నీ అర్థంపర్థంలేని గందరగోళంతో, అయోమయమై 'హాస్యాస్పదం'గా వున్నాయి గాని, హాస్యోత్పత్తి దాదాపు శూన్యం. ఈ పుస్తకంలోని చాలా రచనల్లో గాంభీర్యం అసలులేదు. అందువలన చాలా తేలికగా వున్నాయి.

చక్కని గ్లేజు పేపరుమీద అందంగా ముద్రించిన, బాపు బొమ్మల్ని సొమ్ములుగా పెట్టుకున్న, ఈ పుస్తకంలో చాలా ముద్రారాక్షసాలు చోటు చేసుకుని రచనకి మరింత నష్టం చేకూర్చాయి. ఏడవ పేజీలోని రావూరు వారి 'మానవతావాదం' అనుండాల్సిన మాట 'దానవతావాదం'గా మారి ఆయన్నీ ఒక గుద్దు గుద్దాడు ముద్రారాక్షసుడు! ఈ పుస్తక రచయిత శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యభట్టు.

న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్, ఏలూరు రోడ్, విజయవాడ—520002 వారు ప్రచురించిన ఈ పుస్తకం వారి వద్దనే ఖరీదు చేయవచ్చుననుకొనాలి. అయితే కేవలం 97 పేజీలున్న ఈ పుస్తకానికి అయిదు రూపాయలు ధర పెట్టటంవలన ఈ పుస్తకాన్ని మధ్యతరగతి పాఠకునికి అందుబాటులో లేకుండా చేయటానికి కొంత ప్రయత్నం జరిగిందని కొందరయినా అనుకునే అవకాశం లేకపోలేదు.

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.